# మానవ సంబంధాలు

# మాయా బంధాలు

## (ప్రశ్నలు - జవాబులు)

జ్యోతిషరత్న

**చండిక సాంబశివరావు**

M.A. Litt., M.A. Astrology

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

3-663/3, ఫ్లాట్ నెం. ఎ4, ప్రగతి ఎన్‌క్లేవ్,

ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,

గుంటూరు - 522 501

**సెల్: +91 7893930585**

E-Mail : niyaandnihal@gmail.com

ప్రథమ ముద్రణ : ఆగష్టు , 2015

ప్రతుల సంఖ్య : 5,000

ప్రచురణ : నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్

© శ్రీ చండిక సాంబశివరావు

**వెల : రూ. 200/-**

ప్రతుల కొఱకు :

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

3-663/3, ఫ్లాట్ నెం. ఎ4, ప్రగతి ఎన్‌క్లేవ్,

ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,

గుంటూరు - 522 501

**సెల్: +91 7893930585**

**నవచేతన బుక్ హౌస్**

ఆబిడ్స్, సుల్తాన్ బజార్, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి,

బండ్లగూడ(నాగోల్) హైదరాబాద్.

హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం.

**విశాలాంధ్ర బుక్ హౌస్**

విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు,

తిరుపతి, కాకినాడ, ఒంగోలు, శ్రీకాకుళం, కడప. (ఆం. ప్ర)

హెచ్చరిక : ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంత గానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణ కర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

– నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్

ముద్రణ

**కృష్ణ ప్రింటర్స్ : 9246503757**

## SPECIAL THANKS TO

**Sri Madala Sudhakar**
CMD, Janachaitanya Group of Companies

**Sri Tella Srinivasa Rao**
M.D., AIR HUB

**Sri M. Amareswara Rao**
M.D., Chalapathi Estates (P) Limited

**Sri Chivukula Sundara Parvathisam**
Director, Foursquare Homes (P) Limited

**Sri Bandi Sambasiva Rao**
Adviser, TATA Steel Limited



# కృతజ్ఞతలు

ఈ పుస్తకం నేను అమెరికాలో ఉండగా రాశాను. 2015 జూన్ 3 వ తేదీ ప్రారంభించి జూన్ 16 వ తేదీకి పూర్తి చేశాను. కేవలం రెండు వారాల సమయం పట్టింది. జూన్ 17 వ తేదీ నా 60 వ పుట్టినరోజు. నా భార్య, కుమారుడు, కోడలు, మనుమరాలు, మనవడు సమక్షంలో ఇలా నా పుట్టినరోజు అమెరికాలోని నా కుమారుని యొక్క నివాసంలో జరుపుకునే అవకాశం ఇచ్చిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తొలి కృతజ్ఞత చెప్పకుంటున్నాను. జూన్ 17 వ తేదీ నుండి జులై 3 వ తేదీ వరకు ఈ పుస్తకం ఫెయిర్ కాఫీ రాశాను. జులై 4 వ తేదీ నుండి ఆగష్టు 3 వ తేదీ వరకు మరింత ముఖ్యమైన విషయాలను రాసి ఆగష్టు 4 వ తేదీ ఇండియాకు ప్రయాణం ఉన్నందున అంతటితో ముగించాను.

ఈ పుస్తకం రాస్తున్న సమయంలో నేనురాసిన ప్రతిని చదివి నాతో చర్చించి సహకరించిన నా శ్రీమతి లక్ష్మీ ప్రసూనకు, కుమారుడు కృష్ణ చైతన్యకు, కోడలు వీణకు నా కృతజ్ఞతలు. ఈ పుస్తకం ఉత్సాహంగా రాయగలగటానికి నేను అమెరికాలో అమృతానందుడిగా ఉండటం కూడా ఒక కారణం. అప్పటికి నిండా రెండు నెలలు కూడా నిండని కవల పిల్లలైన చిన్నారులు నా మనవరాలు నియ, మనవడు నిహాల్ నన్ను సమ్మోహన పరిచి పుస్తక రచనకు పరోక్షంగా కారణమయ్యారు. వారిద్దరికి కూడా నా ఆశీస్సులతో కూడిన కృతజ్ఞతలు. ఇప్పుడు చిన్నారులైనా, వారు పెరిగి పెద్దవారై ఈ పుస్తకం చూసి, చదివి నా కృతజ్ఞతలు స్వీకరించే దృశ్యాన్ని నేను ఇప్పుడు చూస్తున్నాను.



ఈ పుస్తకం అమెరికాలో రాసినప్పటికీ, రాయాలనే తలంపు నేను ఇండియాలో ఉండగానే నా శిష్యురాలు కుమారి దివ్యస్వరూప ప్రేరణతో ఏర్పడింది. ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నాను.

ఈ పుస్తకంలో నేను ఉదహరించిన మా అమ్మకు మేనమామ స్వర్గీయ శ్రీ లోకం చంద్రమౌళి తాతయ్య గార్కి, మా అమ్మకు నాయనమ్మ స్వర్గీయ శ్రీమతి ముత్తే చందమ్మ (తాతమ్మ) గార్కి ప్రేమతో గూడిన కృతజ్ఞతలు.

నా హితుడు, సన్నిహితుడు వ్యాపార భాగస్వామి శ్రీ అమిరెడ్డి వేంకట సత్యనారాయణకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ పుస్తక రచన గురించి చెప్పగానే నన్ను ఎంతో ప్రోత్సహించిన నా బాల్య మిత్రుడు శ్రీ పురాలశెట్టి సత్యనారాయణకు, శ్రీ లోకం భాస్కర్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

పుస్తక రచనలోనే గాక, జీవితంలో నాకు సంబంధించిన అన్ని కీలక సమయాలలో నాకు తమ సహకారం అందిస్తున్న మిత్రులు శ్రీ గరికపాటి రమేష్, అనిత దంపతులకు నా ఆత్మీయ కృతజ్ఞతలు.

నేను ఇలా పుస్తకం రాయాలనుకుంటున్నాను అని మెసేజ్‌పెట్టగానే చాలా మంచి ఆలోచన అని స్పందించిన నా శ్రేయోభిలాషులు శ్రీ మిరియాల అమరేశ్వరరావుకు, శ్రీ చివుకుల సుందర పార్వతీశంకు, శ్రీ బొల్లు లలితానంద ప్రసాదుకు, శ్రీ బొల్లు చంద్రమౌళికి, పూజ్య ఆన్‌లైన్ శ్రీ రమేష్‌కు, శ్రీ మంగపతిరావుకు, శ్రీ తేళ్ల శ్రీనివాస్‌రావుకు, శ్రీ తాడి బలరాంకు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఈ సందర్భంగా జ్యోతిషంలో నాకు సలహాలందించిన డాక్టర్ శ్రీ సి. వి. బి. సుబ్రహ్మణ్యం గార్కి, శ్రీ సత్యన్నారాయణ చౌదరి గార్కి,

శ్రీ రమణ రాజు గార్కి, గ్రహవాణి శర్మ గార్కి వినయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఇంకా నాకు నా కుటుంబానికి ముఖ్యులైన నా సోదరుడు శ్రీ సూర్యప్రకాశరావు (అర్తమూరు సూరిబాబు) కు వారి కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు. నా మేనత్త బండి సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు. నాకు కావలసిన మా చండిక వారందరికీ నా కృతజ్ఞతలు. నా తల్లిదండ్రుల తరపు బంధువులు, నా భార్య తరపు బంధువులు అందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఉన్న మా బంధువులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నా పరిచయస్థులకు, బంధువులకు నా కృతజ్ఞతలు. అల్లుడు శ్రీ మాతారావుకు, కుమార్తె మాధవికి, చిన్నారి షైనీకి ఆత్మీయ ఆశీస్సులతో గూడిన కృతజ్ఞతలు. చిట్టిపాలెంలో ఉన్న మా బంధువులందరకీ నా కృతజ్ఞతలు.

మా బంధువు శ్రీ చింతల ఎలమంద గార్కి, శ్రీ బండి సాంబశివరావు (చెన్నై) గారికి మరియు స్వర్గీయ శ్రీ పురాలశెట్టి అయ్యన్న గార్కి కృతజ్ఞతలు.

శ్రీ బిట్రా వీరనారాయణ గార్కి, శ్రీ కత్తిక పూర్ణ చంద్రరావు గార్కి, స్వర్గీయ శ్రీ పిడికిటి రత్న భూషణ్ గార్కి మధుర జ్ఞాపకాలతో గూడిన కృతజ్ఞతలు.

ఇంకా నా మిత్రులు సహచరులు డాక్టర్ జి. యస్. ప్రహ్లాద్‌కు, శ్రీ గుమ్మడి వెంకటకృష్ణరావుకు (జి.వి.కె), శ్రీ మహేష్‌కు, శ్రీ మాచిరాజు పాండురంగకు, శ్రీ జి. యన్. రావుకు, శ్రీ వెనిగళ్ల శివశంకర ప్రసాద్‌కు, శ్రీమతి యార్లగడ్డ రజనికి మరియు స్వర్గీయ శ్రీ చింతల శేషగిరి రావుకు నా శతసహస్ర కృతజ్ఞతలు.



ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో వృత్తి ఉద్యోగాల రీత్యా పరిచయమైన సహోద్యోగులకు, మరియు వివిధ సమస్యలతో నా వద్దకు పరిష్కారంకోసం వచ్చి, సేవ చేసే అవకాశం కల్పించిన నా క్లయింటులు అందరికీ నా కృతజ్ఞతలు. వివిధ వ్యాపారాలలో నాకు వినియోగదారులైన వారందరికీ నా కృతజ్ఞతలు.

కళ్యాణి యాడ్స్ శ్రీ కమతం సాంబశివరావు గారికి, ఆదిత్య యాడ్ ఏజెన్సీ శ్రీ సుకుమార్ గార్కి మరియు ఆడిటర్ శ్రీహరి గార్కి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీ షేఖ్ ఆదాం (న్యూ లోటస్ టైలర్స్-గుంటూరు) గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

నాకు తమ కంపెనీలో ఉన్నతమైన ఉద్యోగ హోదా కల్పించిన కంపెనీ యజమానులందరికీ ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఇంకా ఇక్కడ నేను పేర్లు చెప్పలేకపోయిన అనేక వేలమంది బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు మరియు నా అభివృద్ధికి కారకులైన ఎందరో మహానుభావులు వారందరికీ వందనాలతో గూడిన కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

చివరగా ఈ పుస్తకాన్ని అందంగా ప్రింటు చేయించి ఇచ్చిన శ్రీ మామిడి కృష్ణ కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

విచిట, కెన్సాస్, యు.ఎస్.ఏ — ఇట్లు
తేది. 04-08-2015

**చండిక సాంబశివరావు**

# ముందుమాట

మానవ సంబంధాల మీద – స్నేహం, ప్రేమ, కామం, ఆత్మీయత, అసూయ, అహం, ఆకలి, అవసరాలు, అక్రమ సంబంధాలు, మోహం, విశ్వమానవ ప్రేమ, కోపాలు, చిరాకు, పొగరు, దర్పము, క్రోధం, చపలత్వము, కపటం, భావోద్వేగాలు, కుటుంబం, వ్యక్తిత్వ వికాసం, మార్పుకు లోనయ్యే బాంధవ్యాలు, డబ్బుతో ముడిపడిన పలకరింపులు మరియు రాకపోకలు, అవకాశవాదం, గుర్తింపుకోసం పాకులాట, కుటుంబ వ్యక్తిగత విలువల తారతమ్యాలు, హెూదా, పరపతి, వృత్తిలో విజయాలు, పరిణితి చెందే కొద్దీ ఏర్పడే అసంతృప్తి, బాధ్యతలు, స్వోత్కర్ష, పరనింద, స్వార్థం, ఊసుపోని వ్యర్థ ప్రసంగాలు, ఆధిపత్యం, ఆరోగ్యం, ఆకస్మిక కష్టాలు, దీర్ఘకాల వైరాలు, వేడుకలు, నవ్వులు, పరిహాసాలు, ఈసడింపులు, నిర్లక్ష్యం, శీలం, వ్యసనం, ఆకస్మికంగా వచ్చే మార్పులు, కోరికలు, చర్యలు, సంకల్పబలం, కృషి, పుణ్యబలం, జ్యోతిషం, సహకారాలు, ఎదురు దెబ్బలు, తులనాత్మకత, మానసిక దాస్యం, ఒంటరితనం, తెరమరుగయ్యే సన్నిహిత బంధాలు, దూరమవుతున్న బాధ్యతలు, జనసహకారం, ఆర్థికాభివృద్ధి – ***వీటి అన్నింటికి కర్మ సిద్ధాంతానికి ఉన్న సంబంధం*** గురించి తెలియజేస్తూ సంతోషంగా జీవించటానికి అనుసరించదగిన ఆలోచనాసరళిని ప్రశ్నోత్తరాల రూపంలో అందించాలనే చిరు ప్రయత్నమే ఈ పుస్తకం. ***పరిణితి చెందిన పాఠకులకు ఈ రచన సాదాసీదాగా అన్పించినప్పటికీ ఇప్పుడిప్పుడే అభివృద్ధి కేసి తల త్రిప్పి ఆశగా చూస్తూ తమవంతు ఎప్పుడెప్పుడా అని పరితపిస్తున్న ఔత్సాహిక పాఠకులకు నా పుస్తకం కనీసం ప్రాథమిక స్థాయి అవగాహన కల్గించగలుగుతుందని నన్ను నేను సమాధాన పరచుకుని ఈ పుస్తక రచనకు ఉపక్రమించాను.***

విచిట, కెన్సాస్, యు.ఎస్.ఏ — ఇట్లు

తేది. 04-08-2015 — **చండిక సాంబశివరావు**

**ప్రశ్న : ఒక మనిషి అభివృద్ధి చెందటానికి ప్రధానంగా కావలసిన ముడి సరుకు ఏది ?**

**జవాబు :** జన సహకారమే అభివృద్ధికి మూలం. మన సేవలు ఎంతమేరకు ఇతరులకు ఉపయోగపడగలవో అంతకు మించిన సహకారం మనకు వారినుండి లభిస్తుంది.

**ప్రశ్న : మనం సేవలు అందించలేనపుడు లేదా మన సేవలు వారికి అంతగా అవసరం లేనపుడు జన సహకారం పొందటం ఎలా?**

**జవాబు :** చిరునవ్వు. వినయంతో కూడిన పలకరింపు. మన మాట తీరు. ఎదుటివారికి ప్రాముఖ్యతనివ్వటం. మనం వారిని అర్ధం చేసుకుని వారినుండి సహకారం అందుకోవటం సరైన మార్గం. అయితే ఈ చర్య కపటంతోగాక నిజాయితీతో కూడుకొని ఉండాలి.

**ప్రశ్న : మనం ఏది అనుకుంటే అది జరిగి తీరుతుందని ఒక పుస్తకంలో చదివాను. నిజమేనంటారా ?**

**జవాబు :** ఖచ్చితంగా జరుగుతుంది. స్వీయ అనుభవంతో ఎవరికి వారు పరీక్షించుకుంటే ఇది నిజమని అంగీకరిస్తారు. భగవద్గీతలో కూడా మనం ఏమనుకుంటే అది జరుగుతుందని ఉంది.

**ప్రశ్న : కృషి, అదృష్టం ఈ రెండింటిలో ఏది గొప్పది? ఎంత కృషి చేసినా కలసిరాకపోతే ఏం చేయాలి ?**

**జవాబు :** కృషిని, అదృష్టాన్ని వేరుగా చూడటమే సరికాదంటాను.





కృషి అన్ని వేళలా అనుసరించదగిన ఉత్తమ మార్గం. అదృష్టం దానికి పర్యాయపదం మాత్రమే. ఒక రైతు సంక్రాంతికి 40 బస్తాల ధాన్యంతో ఇంటికి వస్తే 'కలిసొచ్చింది' అదృష్టం అంటారు. ఆ రైతు నారుపోసి, నాట్లువేసి, కోతకోసి, కుప్పనూర్చిన తొమ్మిది నెలల మొత్తం కృషి అంతా కలసి ఒక్కసారి వచ్చింది (కలసి వచ్చింది) అని దాని అర్ధం. అంటే తొమ్మిది మాసాలు ఏమీ రాలేదు. రాదు కదా ! అదృష్టం అంటే దృష్టికి కనిపించనిది. ఈ తొమ్మిది మాసాల కృషి చూసేవారికి కనిపించదు కదా! ఒకవేళ ఎవరైనా ఈ తొమ్మిది మాసాలు పనిచేయకుండా పొలాన్ని బీడుగా ఉంచితే, అసలు ధాన్యం బస్తాలు ఇంటికి వస్తాయా? అంటే అన్నింటికి కృషియే మూలం. పని చేసినప్పటికీ పంట పండటంలో హెచ్చుతగ్గులుండవచ్చునేమోగానీ, పని లేకుండా ఫలితం ఎక్కడా ఉండదు. ఎవరికైనా ఏమైనా లభించటం లేదా చాలా ఎక్కువగా లభించటం మన కళ్ళబడినట్లయితే, ఖచ్చితంగా గతంలో వారు చేసిన కృషి అంతా కలసి ఒక్కసారి వచ్చిందని అనుకోవాలి తప్ప, ఆయాచితంగా ఎవరికీ ఏమీరాదు. సర్వకాల సర్వ అవస్థలయందు 'నిరంతర కృషియే' అనుసరణీయం.

**ప్రశ్న : ఎంత కృషి చేసినా అభివృద్ధి సాధించని వారి సంగతేంటి ?**

**జవాబు :** వారు ఎలాంటి కృషి చేసారు, ఎంతకాలం చేసారు అనే విషయం వ్యక్తిగతంగా విశ్లేషించవలసి ఉంటుంది. కర్మ సిద్ధాంతం అన్నింటికి జవాబు చెబుతుంది. ఈ సిద్ధాంతం నమ్మని వారికి తర్కం, హేతువాదం ఎటూ సమాధానం చెబుతాయి. సాధారణంగా అహంకారం, అసూయ ఉన్నవారు స్వీయ లోపాలు గ్రహించక ఎదుగూ బొదుగూ లేని అత్తెసరు జీవితాలు వెళ్ళదీస్తుంటారు.

## ప్రశ్న : కర్మ సిద్ధాంతాన్ని సులభంగా అర్థం చేసుకోవటానికి ఎలా నిర్వచిస్తారు ?

**జవాబు :** మనం ఏం విత్తనం నాటితే ఆ చెట్టు, తద్వారా ఆ ఫలమే లభిస్తుందనేది యధార్ధము. మన చర్యలకు ప్రతి చర్యలుంటాయి (Action-Re action). మనకు ఎదురయ్యే సమస్త పరిణామాలకూ మూలం గతంలో ఏదో ఒకనాడు మనం సృష్టించిన కారణాలే అన్నది కర్మ సిద్దాంత మూల సూత్రం. కర్మ అంటే పని అని అర్థం. మన కర్మ అంటే మన పని అని అర్థం. అంటే మన సంతోష దుఃఖాలకూ, జయాపజయాలకూ, గౌరవ అవమానాలకూ, లాభ నష్టాలకూ ఒక్కటేమిటి మనకు జరిగే సమస్త పరిణామాలకూ మనం చేసిన కర్మలు (పనులు) కారణం అన్నదే కర్మ సిద్ధాంతం.

## ప్రశ్న : పుస్తకాల వలన ప్రయోజనం ఉంటుందంటారా?

**జవాబు :** ఖచ్చితంగా ఉంటుంది. అయితే ఒక పుస్తకం చదవగానే ఆ వ్యక్తి జీవితం సమూలంగా మారిపోతుందని అనలేము గాని, ఆ పాఠకుని మదిలో చిరు కదలిక మొదలవుతుందని చెప్పవచ్చును. ఆ చిరు కదలికను, ఆ వ్యక్తి గుర్తించి, జిజ్ఞాసతో పుస్తక పఠనం జీవితంలో ఒక భాగం చేసుకుని మేలైన అంశాలను స్వీకరించి తనను తాను మార్చుకోవటంలో నిరంతర కృషి చేసినట్లయితే ఆ వ్యక్తికి సద్యోస్ఫురణ (సకాలంలో సవ్యమైన ఆలోచన రావటం) అభివృద్ధి చెంది ఖచ్చితంగా ఉన్నత స్థితికి చేరుకుంటాడు.





## ప్రశ్న : సృష్టిలో తీయనైనది స్నేహం అంటారెందుకు? మిగిలిన బంధాల మాటేమిటి?

**జవాబు :** అన్ని బంధాలు తీయగానే ఉంటాయి. కాకపోతే కాలాను గుణంగా బాంధ్యవ్యాలు సహజ మార్పుకు లోనవుతుంటాయి. సమ వయస్కుల మధ్య సంబంధం దీర్ఘకాలం ఉంటుంది. స్నేహ సంబంధానికి ఉన్న ఆయుష్షు మిగిలిన బంధాలన్నింటికంటే ఎక్కువ ఉంటుంది. అందుకే ప్రతి వ్యక్తికీ సంపదలకన్నా అరమరికలు లేకుండా సన్నిహితంగా ఉండే నలుగురు లేదా కనీసం ఒక్కరైనా స్నేహితుడు ఉండటం మంచిది.

## ప్రశ్న : ప్రేమకు మీరు ఇచ్చే నిర్వచనం ఏమిటి?

**జవాబు :** ఈ విషయంలో వ్యక్తిగత అనుభవాల నుండి ఉద్భవించిన అనేక రకాల అభిప్రాయాలను మనం వింటూ ఉంటాం. కాని అర్థం చేసుకునే మనసుంటే విశ్వవ్యాప్తంగా ప్రేమకు ఒకటే అర్థం ఉంటుంది. ఒక కొడుకుగా, కూతురుగా, తండ్రిగా, తల్లిగా, ప్రియుడిగా, ప్రియురాలిగా, భర్తగా, భార్యగా, తాతగా, నాయనమ్మగా, స్నేహితునిగా అన్ని బంధాలలోనూ ప్రేమ ఉంటుంది. ఎదుటివారి అభిప్రాయాలను గౌరవిస్తూ, వారి బలం, బలహీనతలను అర్థం చేసుకుంటూ, స్వల్ప ఇబ్బందులను పరిగణలోకి తీసుకోకుండా వారిపట్ల బాధ్యత నిర్వర్తించటమే 'ప్రేమ' అని నా ఉద్దేశం. బాధ్యత లేని చోట బంధం నిలబడదని మీరు గమనించే ఉంటారు.

## ప్రశ్న : వయస్సులో ఉన్నవారు ప్రేమలో పడ్తుంటారు కదా! ఈ ప్రేమకు నిర్వచనం ఏమిటి?

**జవాబు :** స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ, ఒకరినొకరు కోరుకోవటం చాలా సహజమైన పరిణామం. మన సమాజంలో 'వివాహం' అనే సాంఘీక కట్టుబాటు ఒకటుంది. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా ప్రేమలో పడేముందు, పడ్తున్నదశలో, కనీసం ప్రేమించాకైనా ఆ ప్రేమ పెళ్లికి దారితీసే పరిస్థితులగురించి సంపూర్ణంగా అర్థం చేసుకుని ముందుకు వెళ్లటమో లేదా ఆదిలోనే తుంచేయటమో చేయాలి. ముందే చెప్పినట్లుగా 'బాధ్యత' నిర్వర్తించలేపుడు దాన్ని 'ప్రేమ' అనలేము.

## ప్రశ్న : ప్రేమ వివాహాలు మంచివి కావంటారా?

**జవాబు :** ప్రశ్న ఎలా సంధించినా జవాబు అక్కడికే వస్తుంది. ఒకరి పట్ల ఒకరు బాధ్యత తీసుకుని ధైర్యంగా ముందుకు సాగ గల్గితే ప్రేమ వివాహాలు మంచివే. కాని వివాహం అంటే రెండు కుటుంబాల కలయిక. కుటుంబాలలోని వ్యక్తుల మనోభావాలు ఎలా ఉన్నాయో విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది. పెద్దలను కాదని వివాహం చేసుకోవటమా, విరమించుకోవటమా అన్నది వీలైనంత త్వరగా తేల్చుకోవాలి గాని, మీమాంసలో లేదా సందేహాలతో సంవత్సరాల తరబడి ఊగిసలాట వలన ఈ ప్రేమ వ్యవహారం నలుగురి నోళ్ళలో పడి, ఇతర సంబంధాలు రాకుండా పోవటానికి ముఖ్యంగా అమ్మాయిలకు సమస్య అవుతోంది.





## ప్రశ్న : ఒకరి కోసం ఒకరు ప్రాణాలు తీసుకోవటానికి సిద్ధపడ్తుంటారు. వారి ప్రేమ మాటేమిటి?

**జవాబు :** బి. పి. (బ్లడ్ ప్రెషర్) నార్మల్‌గా ఉంటే మనిషి ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క. లో–బి. పి., హై–బి. పి. అనారోగ్యానికి సంకేతం. మందులు వాడాలి. ఈ రక్తపోటు లాగానే ప్రేమపోటు; ఎల్. పి. (లవ్ ప్రెషర్) నార్మల్‌గా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లు అర్థం. లో–ఎల్. పి., హై–ఎల్. పి. అనారోగ్యం క్రింద లెక్క. కుటుంబ సభ్యులు, స్నేహితులు అలాంటి వారిని గమనించి వారిని స్వస్థత పరచాలి. చావటం ఏమిటి? అంతగా నచ్చి ఆ వ్యక్తి కావాలనుకుంటే 'బాధ్యత' తీసుకోవాలి. లేదా నీ వల్ల కానపుడు 'సారీ' చెప్పి, వారి జీవితం నుండి తప్పుకోవాలి. అదీ ప్రేమ అంటే. ఆరోగ్యకరమైన ప్రేమ ఉండాలి ఎప్పుడైనా. దురదృష్టం ఏమంటే మానసిక బలహీనత, మోహం, పంతం – వీటిని కూడా 'ప్రేమ' గా చాలామంది భ్రమపడ్తున్నారు. ప్రేమంటే జీవిత భాగస్వామిని స్వయంగా ఎన్నుకోవటమే. ఆ తర్వాత ధైర్యంగా 'బాధ్యత' తీసుకుని వివాహం చేసుకోవాలి.

## ప్రశ్న : జీవితంలో 'సెక్స్' యొక్క ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు :** ఆహారం, నిద్ర, మైధునం సహజ అవసరాలు. స్త్రీ పురుషుల కలయిక వలన ఉద్భవించే సంతానానికి బాధ్యత వహించవలసిన పరిణామ క్రమంలో వివాహ వ్యవస్థ ఏర్పడింది. దాంపత్య జీవితమే ఏ మనిషి జీవితంలోనైనా సింహ భాగం. సంతానం కలిగాక భార్యా భర్తల బంధం మరింత బలపడ్తుంది. అంతేగాక ఆ సంతానాన్ని సజావుగా పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించే క్రమంలో ఆ బాధ్యతను ఆస్వాదిస్తూ జీవితకాలం ఒక లక్ష్యంతో బిజీగా ఉంటారు. ఈ మొత్తం ప్రక్రియ శృంగార జీవితం పునాదిగా ఏర్పడింది.

**ప్రశ్న : ఇటీవల కాలంలో స్త్రీ పురుషులు కార్యాలయాల్లో ఎక్కువ చనువుగా ఉంటూ, చాలా సందర్భాలలో వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకుంటున్నారు. దీనివలన పరిణామాలు ఎలా ఉంటాయి?**

**జవాబు :** ఎవరైనా ఒక చర్యకు పాల్పడితే, దాని పరిణామాలు ఎదుర్కోవటానికి సిద్ధపడి ఉండాలి. దురదృష్టం ఏమంటే మన ప్రభుత్వాలు వివాహేతర సంబంధంలోని ప్రాణాంతక వ్యాధి గురించి ప్రచారం చేస్తూ ముందు జాగ్రత్త చర్యగా సురక్షితంగా లైంగిక సంబంధం పెట్టుకోవడానికి కావలసిన ఒక 'వస్తువు' ను అందుబాటులోకి తీసుకురావటంలో కనబర్చిన శ్రద్ధ, అక్రమ సంబంధాల వలన జీవితాలలో ఎదురవ్వబోయే 'సునామీ' ల గురించి, 'తుఫాను' ల గురించి హెచ్చరించడంలో తీసుకోవటంలేదు. అయినా నింపాదిగా ఆలోచించి అదుపులో ఉంచుకోవడానికి 'వయసు' ఉరవడి సహకరించదు. అందుకే ప్రాయం దూకుతూ వస్తుందనే విషయం గమనించి సరైన వయస్సులో పిల్లలకు పెద్దవాళ్లు పెళ్లి చేయాలి. యువతీ యువకులు కూడా జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో మితిమీరిన జాప్యంకు చోటివ్వక, ఒక నిర్ణీత గడువు పెట్టుకొని, అవసరమైతే మరీ ముఖ్యం కాని కొన్ని విషయాలు/నిబంధనలను సడలించుకుని, రాజీపడి ప్రాయంలో వివాహానికి సిద్ధపడాలి.





**ప్రశ్న : ఫంక్షన్స్‌లో మొక్కుబడిగా హాజరవటం తప్ప, ఆత్మీయత అనుబంధాలు తగ్గిపోయాయి కదా! ఆత్మీయుల 'కొరత' ను భర్తీ చేసుకోవటం ఎలా?**

**జవాబు :** మనుషుల మధ్య ఏ సంబంధమైనా ఇచ్చి పుచ్చుకున్నంత కాలమే. అవసరాలకోసమే సంబంధాలు ఏర్పడతాయి. దీర్ఘకాలం కొనసాగే ఏ సంబంధమైనా అనుబంధమవుతుంది. ఆత్మీయత కూడా ఆయాచితంగా లభించేది కాదు. అలాగని డబ్బుతో కొనుక్కోలేము కూడా. మీరు వృద్ధులు అయితే యౌవన కాలంలో మీరు శ్రమపడి కూడబెట్టుకున్న సంపదను కొంచెం కొంచెం వాడుకున్నట్లే, వయసులో ఉన్నపుడు మీరు నెఱిపిన సంబంధ బాంధవ్యాల ద్వారా పెంపొందించుకున్న ఆత్మీయత కొంచెం కొంచెం పరిమితంగా వాడుకోవచ్చును. అదే మీరు ఇప్పుడు వయసులో ఉంటే, స్నేహితులకూ బంధువులకూ చేదోడుగా ఉంటూ ఆత్మీయులను వృద్ధి చేసుకోవచ్చును. ***ఏది ఏమైనా మనం ఇవ్వకుండా మనం ఏమీ పొందలేము.***

**ప్రశ్న : అసూయ ఉండకూడదని పదే పదే వక్తలు చెబుతుంటారు. పుస్తకాలలో కూడా అదే రాస్తారు. అసూయ ఉంటే దుర్మార్గుల కింద లెక్కా ఏమిటి?**

**జవాబు :** అసూయ ఉండకూడదు అని ఒక వ్యక్తి చెబుతున్నాడంటే ఖచ్చితంగా దాన్ని అనుభూతి చెందకుండా అసూయ గురించి చెప్పాలన్న ఆలోచనే రాదు. కాకపోతే పరిణామ క్రమంలో ఆ వ్యక్తి అసూయ వలన అనర్థాలను గ్రహించి, దాన్ని అధిగమించి తద్వారా ఆనందానుభూతిని పొంది ఉండవచ్చును. తన అనుభవాన్ని ప్రామాణికంగా తీసుకుని అసూయ అనర్థదాయకం అని బోధించి ఉండవచ్చును. నిజం చెప్పాలంటే,

ఏదైతే సర్వసాధారణంగా మనుషులలో ఉంటుందో వాటి గురించే పెద్దలు పదే పదే ప్రస్తావిస్తారు. అసూయ అదుపులో లేకుంటే దుర్మార్గానికి దారి తీయవచ్చు. అసూయ ముందుగా అది ఉన్న వ్యక్తులను దహించి వేస్తుంది.

అందరూ అసూయపడే విధంగా నీవు సక్సెస్ అవ్వాలని జనరల్‌గా విషెస్ చెబుతుంటారు. మరి దీన్నేమంటారు? అసూయను ప్రోత్సహించకూడదు కదా! ముఖ్యంగా బాంధవ్యాలలో, సహోద్యోగుల మధ్య ఈ అసూయలు తలెత్తుతాయి. అసూయ ఎంత మాత్రం మంచిది కాదు. ***ఎదుటివారి అభివృద్ధిని చూసి అసూయపడే బదులు, వారికంటే ఎక్కువ అభివృద్ధిని సాధించటం ద్వారా అసూయను అధిగమించవచ్చు. లేదా నిండుమనస్సుతో ఎదుటి వారి ఉన్నతిని మెచ్చుకోవటం ద్వారా అసూయను అధిగమించవచ్చును. ఈ రెండూ చేయకుండా అసూయను పెంచి పోషించుకుంటూ వెళితే, శారీరక మానసిక రోగాలు రావటం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు.***

## ప్రశ్న : అహం గురించి చెప్పండి? దీని వలన అనర్థాలు ఏమైనా ఉన్నాయా?

**జవాబు :** ప్రతి మనిషికీ అహం ఉంటుంది. అయితే 'అహం' ఎవరి వద్ద ఎంతవరకు వ్యక్తం చేయాలనే విచక్షణ ఉండాలి. ముందే చెప్పినట్లుగా మితిమీరినది ఏదైనా అనర్థదాయకమే. అహం ఆలంబనగా విజయం సాధించితే మంచిదే. కాని ఎందుకూ పనికి రాని అహంభావం ప్రదర్శిస్తే, చూసేవారికి ఏవగింపుగా ఉంటుంది. అహానికి కూడా ఒక అర్హత ఉండాలి. ప్రదర్శించటానికి ఒక యోగ్యత ఉండాలి. ఉచ్ఛనీచాలు తెలుసుకుని ప్రవర్తించాలి. ***నేను గొప్పవాడిని అని మీకు మీరు రాసుకుని***





***మెడలో తగిలించుకున్న అట్టముక్కను అదృశ్యంగా ఉన్నా అందరూ గమనిస్తూనే ఉంటారు.*** 'ఏం గొప్ప?' అని మీకు మీరే ప్రశ్నించుకుని ఆత్మ విమర్శ చేసుకోండి. సిగ్గుపడి మీరే ఆ అట్టముక్కను తీసేస్తారు. లేదంటే మీ కర్మను మీరే అనుభవిస్తారు.

## ప్రశ్న : వ్యక్తిగతంగా కలవటం, ఫోన్ చేసి పలకరించటం అవసరాన్ని బట్టి చేయాలా? అలా చేస్తే స్వార్థ పరుడంటున్నారు. పని లేకుండా వెళ్లి పలకరిస్తే 'డిస్టబెన్స్' అనుకుంటారు. ఏది అనుసరణీయమైన మార్గమో చెప్పండి?

**జవాబు :** మనుషులమధ్య ఏ సంబంధమైనా 'అవసరాల' ప్రాతిపదికగానే ఏర్పడుతుంది. అలా కొంచెం ఎక్కువకాలం కొనసాగే బంధాలు అనుబంధాలుగా రూపాంతరం చెందుతాయి. పనిలో బిజీగా ఉంటే, అకారణంగా ఇతరులను వెళ్లి పలకరించటం, ఫోన్ చేయటం ఉండవు. ***ఆత్మీయులను పలుకరించటానికి 'పనే' ఉండనక్కరలేదు. నిజం చెప్పాలంటే మనం పలుకరించే అందరితో మనకు పని ఏమీ ఉండదు.*** మనం అవసరం కోసం కలిసే వారిని విడి సమయాలలో ఎప్పుడూ కలవము. కలవాలని వారూ అనుకోరు. సందర్భమూ, స్వీయ అనుభవాలు కొలమానికంగా ఎవరికి వారే నిర్ణయించుకునే విషయాలివి.

## ప్రశ్న : మోహం అంటే ఏమిటి?

**జవాబు :** కేంద్రీకృతమైన కోరిక. మనసు పరవశమవటం. (పర = ఇతరుల, వశం = ఆధీనం). అనగా మనసు ఇతరుల ఆధీనంలోకి వెళ్లటం, అంటే ఇది ఒక మానసిక దౌర్బల్యం.

## ప్రశ్న : ప్రేమ, మోహం, సెక్స్ వీటికి కర్మకూ ఉన్న సంబంధ మేమిటి?

**జవాబు :** మన జీవితాలలో 'కర్మ' కు సంబంధం లేని అంశం ఏమీ లేదు.

## ప్రశ్న : అంతా ఒక నిర్ణయింపబడిన మెకానిజంతో జరిగేటప్పుడు మనం ఉద్దేశపూర్వకంగా చేసేదేముంటుంది?

**జవాబు :** గత జన్మలోగాని, ఈ జన్మలోనే గతంలో ఎప్పుడైనా గాని మనం చేసిన పనుల యొక్క పరిణామాలు మనం ఇప్పుడు ఎదుర్కొంటూ ఉంటాము. ఎప్పుడైనా సంకల్పం మనదే కదా! మనం చేసే ప్రతి పని వెనుకా ఒక ఆలోచన ఉంటుంది. భావం కలగగానే వ్యక్తం చేయకుండా, క్రియలోకి దిగకుండా పరిణామాలు ఎలా ఉంటాయో యోచించి ఆచరణలోకి దిగిన యెడల మనం భవిష్యత్తులో చింతించాల్సిన అవసరం ఉండదు. అలాగే గతంలో మనం పోగుచేసుకున్న 'ప్రారబ్ధ కర్మ' నుండి తప్పించుకోలేము. వర్తమానంలో మంచి కర్మలు చేయటం ద్వారా, గతంలో చేసిన కొన్ని కర్మఫలాలను తగ్గించేసుకోవచ్చు. కొన్నిటిని విధిగా మనం అనుభవించాల్సి ఉంటుంది.

## ప్రశ్న : విశ్వ మానవ ప్రేమ. ఇది సాధ్యమా?

**జవాబు :** మనుషులందరి పట్లా సమత్వంతో ప్రేమను ప్రదర్శించటం సాధ్యమే. ఇది చాలా మందిలో ఉంటుంది. పరిమాణంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఎంతోమంది సాటి మనుషుల పట్ల ప్రేమను కలిగి ఉంటారు. లేకుంటే ఎక్కడో భూకంపం వస్తే, అన్ని దేశాలు సహాయం ఎలా అందించగల్గుతాయి? దినపత్రికలలోనూ, టి.వి. లో చూసి తుఫాను బాధితుల





సహాయనిధికోసం లక్షలాది మంది స్పందించి తమ ఆర్థిక తోడ్పాటును విరాళం ద్వారా పంపించటం మనం చూస్తూనే ఉన్నాము కదా! అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు మనుగడ సాగిస్తున్నాయంటే, దాతల సహకారం వలనే గదా!

## ప్రశ్న : కోపం ఒక మానసిక రోగం అంటారు నిజమేనా?

**జవాబు :** మీరు చెప్పింది నిజమైతే సమాజమంతా మానసిక రోగులే ఉంటారు. అత్యున్నత స్థానంలో ఉన్న పీఠాధిపతులు కూడా ముఖం వికృతంగా పెట్టి, బహిరంగంగా తమ శిష్యుల మీద అనుచరుల మీద కోపాన్ని ప్రదర్శించటం నేను స్వయంగా చూశాను. చూడటమేకాదు ఒక వేడుకలో జరిగిన ఈ ఉదంతాన్ని వీడియోలో రికార్డు చేయటం జరిగింది. కోపం రావటం చాలా సహజమైన విషయం. ముందే చెప్పినట్లుగా మితిమీరిన కోపం అనర్థదాయకం. ప్రేమ, మంచితనం, ఉదారత్వం, కరుణ, పరోపకారం లాంటి ఉన్నత లక్షణాలు కూడా మితిమీరితే అనర్థంగా దాపురించటం, వాటిని చూపిన వ్యక్తులు పతనమవటం చరిత్రలో మనం చూసినవి, విన్నవే. తగిన సమయంలో తగినంత కోపం ప్రదర్శించకపోతే సమాజంలో సుఖంగా జీవించలేము. కోపం మానసిక రోగం కాదు. మితిమీరిన కోపం మరియు అణచుకోలేని కోపం మంచిది కాదు.

## ప్రశ్న : ప్రతి చిన్న విషయానికీ చిరాకుపడటం వలన నష్టమా?

**జవాబు :** మన చిరాకు ఎదుటి మనిషిలో మన పట్ల 'అయిష్టత' ను కలుగజేస్తుంది. అయిష్టత కలుగుతుంటే మన 'ప్రజన్సు' ను ఎవరు ఇష్టపడ్తారు?. ఎవ్వరూ దగ్గరకు రారు. ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడటం వలన

ముందుగా కుటుంబ సభ్యులతో, ఆ తర్వాత ఇతరులతోనూ సంబంధాలు దెబ్బతింటాయి. సంధర్భాన్ని బట్టి కోపం ప్రదర్శించినా ఆమోదిస్తారుగాని, ప్రతి చిన్న విషయానికీ చిరాకుపడే లక్షణాన్ని ఎవ్వరూ హర్షించరు. చిరాకు వలన ఎదుటి మనిషిలో ప్రతికూల భావనలు చోటు చేసుకుంటాయి. నిరంతరం చిరాకు పడటం వలన, రాను రాను తాను ఏమీ తప్పు చేయకుండానే, ఇతరుల మదిలో ప్రతికూల చిత్రం రిజిస్టర్ అయిన కారణంగా అందరి చేత తిరస్కరింపబడతాడు.

## ప్రశ్న : పొగరు, దర్పము, చపలత్వం, క్రోధం, కపటం- వీటి గురించి వివరించండి?

**జవాబు :** ఇవన్నీ ఖచ్చితంగా త్యజించాల్సిన అవలక్షణాలు.

## ప్రశ్న : భావోద్వేగాలకు లోనుగావటం మంచిదేనా?

**జవాబు :** భావోద్వేగాలకు లోనుగాని మనిషి ఎవ్వరూ ఉండరు. అనుకూల భావోద్వేగాలను వ్యక్తీకరించినా, ప్రతికూల భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవటం ఎల్లవేళలా మంచిది.

## ప్రశ్న : సినీ తారల మీద సెక్స్ కోరికలు కలగటం తప్పంటారా?

**జవాబు :** సినిమాలలో అర్ధనగ్నంగా కన్పించే తారలపట్ల మక్కువ చూపించటం ఆరోగ్యవంతమైన మగవాడి లక్షణం. చూసికూడా చలించక పోవటం ఉత్తముల లక్షణం. ఒకసారి ఒక పీఠాధిపతిని ఆయన అంతరంగిక మందిరంలో కలిశారట స్వర్గీయ రాజనాల (అలనాటి ప్రముఖనటుడు)





గారు. “మీరు ఎప్పుడైనా సావిత్రి (అలనాటి ప్రముఖ నటీమణి) చేయి పట్టుకున్నారా?” అని రాజనాలను అడిగారట ఆ పీఠాధిపతి. “నటించేటప్పుడు తప్పదు కదా! ‘పట్టుకున్నానని’” చెప్పాడట రాజనాలగారు. వెంటనే ఆ పీఠాధిపతి “ఆహా ఏమి అదృష్టం. సావిత్రిని పట్టుకున్న చేతులా ఇవి” – అంటూ ఆ పీఠాధిపతి రాజనాల చేతిని ముద్దు పెట్టుకున్నాడట. పీఠాధిపతుల వల్ల గానపుడు సామాన్యుల మాట చెప్పేదేముంది?

## ప్రశ్న : అబద్ధాలు చెప్పటం చెడ్డ అలవాటంటారా?

**జవాబు :** నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పేవాళ్లు ఇప్పుడు సమాజంలో కొల్లలుగా ఉన్నారు. అబద్ధాలు చెప్పటంలో ఎంతగా ఆరితేరారంటే వాళ్లను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నా తొణకరు బెణకరు సరికదా, ఆ అబద్ధానికి ఇన్‌స్టెంటుగా ఒక సమాధానం చెబుతారు.

నా కొలీగ్ ఒకతను నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతాడు. ఫోన్ చేస్తే ఎక్కడున్నాడో కూడా నిజం చెప్పడు. ఒకసారి అమీర్‌పేట ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో కనిపించాడు. నేను నాలుగ్గజాల దూరంలో ఉన్నాను. ఏం చెబుతాడా అని సెల్ నుండి కాల్ చేశాను. ఎక్కడున్నారని అడిగాను. కోఠీలో ఉన్నానని చెప్పాడు. నేను దగ్గరగా వెళ్లి ఇక్కడే ఉండి కోఠీలో ఉన్నానని చెబుతారేమిటి? అన్నాను. అబద్ధం చెప్పినందుకు ఏమాత్రం సిగ్గుపడలేదు. తొట్రుపడలేదు సరికదా, ‘ఈ ప్రదేశాన్ని నేను ‘కోఠీ’ అని ముద్దుగా పిలుచుకుంటానండీ” అని ఠక్కున బదులిచ్చాడు. ప్రాణాంతక విషయాలలో అబద్ధమాడటం క్షమార్హమేగాని, అయిన దానికి కాని దానికి అబద్ధాలు చెప్పటం వలన చాలా అనర్ధాలు జరుగుతాయి. చట్టం దృష్టిలో అబద్ధానికి

శిక్ష లేకపోయినా, కర్మ సిద్ధాంతం ప్రకారం అబద్ధాలు చెప్పే వాళ్లంతా ఖచ్చితంగా శిక్షింపబడతారు. ***అయితే ఈ శిక్ష అబద్ధం చెప్పినందుకుగాక, ఆ అబద్ధం వలన ఇతరులకు జరిగిన నష్టాన్ని బట్టి మాత్రమే శిక్ష ఉంటుంది.***

## ప్రశ్న : కుటుంబంలోని వ్యక్తులు ఒకరి వలన ఒకరు చిన్నబుచ్చుకుంటూ ఉంటారు. ఇలాంటి సందర్భాలను అధిగమించటం ఎలా? ముఖ్యంగా రెండు తరాల వారు కలిసి ఉండే సందర్భాలలో అత్తాకోడళ్ల మధ్య వచ్చే మనస్పర్థలను అధిగమించటం ఎలా?

**జవాబు :** ఏ కాలంలోనైనా తల్లీ భార్యలను సమాధాన పరచి సంతృప్తిగా ఉంచటం మగవాడికి ముఖ్యంగా 'ఎర్నింగ్ మెంబర్' కు, కత్తిమీద సాములాగే ఉంటుంది. ముఖ్యంగా పని విషయంలో అత్తాకోడళ్ల ఆలోచనా ధోరణి భిన్నంగా ఉంటుంది. అసలు ఏ బంధంలోనైనా ఎదుటివారి కోణం నుండి ఆలోచించంటం ప్రాక్టీసు చేస్తే చాలా వరకు సమస్యలే ఉండవు. అత్త అభిప్రాయాలను గౌరవిస్తూ, కోడలు వినయంగా ఉండటం అలవరుచుకోవాలి. వినయం అంటే తలవంచటం ఎంత మాత్రం కాదు.

అత్తమామలుండటం వలన ఆ కుటుంబానికి ఓ నిండు తనం, తన పిల్లలకు తాత నాయనమ్మల ఆత్మీయత ఆప్యాయతలు లభించి ఆత్మ విశ్వాసంతో పెరుగుతారనే ఓ నమ్మకం, కోడలు అభివృద్ధి చేసుకోవటం వలన సమస్యలు రావు. ఒకవేళ పరిస్థితుల వలన చిన్న చిన్న మనస్పర్థలు హఠాత్తుగా చోటుచేసుకున్నా మనసు విప్పి మాట్లాడుకోవటం వలన బంధం పెద్దగా స్టెయిన్ అవదు. అలాగే అత్తమామల ఆలోచనా విధానం అభ్యుదయ భావాలతో నిండుగా ఉండాలి. ***కొడుకు వేరు కోడలు వేరు అని భావించక, కొడుకు జీవితంలో కోడలు సగభాగం అనుకోవాలి. ఆమె మరియు ఆమె ద్వారా జన్మించిన పిల్లల వలనే కొడుకు జీవితానికి ఒక నిండు తనం వచ్చిందన్న వాస్తవం అత్తమామలు గ్రహించాలి.***





కాలనుగుణంగా బాంధవ్యాలు సహజ మార్పుకు లోనవుతుంటాయి. పెళ్లిగాక ముందు కుటుంబం అంటే తల్లి, తండ్రులతో గూడిన జీవితం కొడుకుది. కాని పెళ్లయి సంసారం ఏర్పడ్డాక కొత్తగా కొడుకు జీవితంలోకి ప్రవేశించిన భార్య ప్రధాన పాత్ర అవుతుంది. నెలలు సంవత్సరాలు గడిచేకొలదీ వారిద్దరి మధ్య దగ్గరితనం అభివృద్ధి చెంది, వారికి సంతానం కలిగాక వారిద్దరి యొక్క దాంపత్య బంధం మరింత బలపడ్డుంది. ఈ వాస్తవాన్ని గ్రహించగల్గితే ఏ అత్తకూ కోడలుతో వైషమ్యాలుండవు. అసలు ఎక్స్‌పెక్టేషన్సు ఉండకపోతే డిజప్పాయింటుమెంట్సు ఉండవు. కోడలు చేసే పనులు నచ్చని అత్తలు వారికి ఓర్పుతో సానునయంగా విడమరచి చెప్పాలి. ఈ చెప్పటంలో ఆధిపత్యం కనిపించకుండా ప్రేమ చూపించాలి. కొందరు కొన్ని పనులు వెంటనే నేర్చుకోలేరు. ఓపికగా సంయమనం పాటించాలి. అప్పటికీ పరిస్థితులు చక్కబడకపోతే, 'కర్మ' అని సరిపెట్టుకోవడం ఉత్తమమైన మార్గం.

## ప్రశ్న : పెళ్లాం బెల్లం, తల్లి అల్లం అనే సామెత గురించి మీరేమంటారు?

**జవాబు :** పెళ్లాన్ని బెల్లంగా భావించటం, తల్లిని అల్లంగా భావించటం అనే సామెతలో ఆ వ్యక్తి భార్యకు ప్రాముఖ్యత నిస్తున్నాడనే అభియోగం ఉంది. విశ్లేషించి చూస్తే భార్యకు ప్రాముఖ్యతనిచ్చి అమెతోటే లోకం అని భావించటం చాలా మంచి పరిణామం. దీన్ని ఆ వ్యక్తి తల్లిదండ్రులు

కూడా ఆమోదించి సంతోషించాలి. ఎందుకంటే తల్లిదండ్రులు ఏదో ఒకనాడు కాలం తీరి ముందుగా వెళ్లిపోతారు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా తల్లి మీద మితిమీరిన ప్రేమ పెంచుకుంటే, అతని పరిస్థితి ఏమిటి? తల్లి లేదా తండ్రి మరణం ఆ వ్యక్తిని విపరీతంగా కృంగదీస్తుంది. ఆ తరువాత వారి లోటును జీర్ణించుకోలేక, ఆ వ్యక్తి బాధ్యతలు సవ్యంగా నిర్వర్తించలేడు. కొడుకు తమ పట్ల బాధ్యతగా ఉండి, చరమదశలో లేవలేని పరిస్థితులలో కాస్త చేయూత నివ్వాలని కోరుకోవాలిగాని, అంతకు మించి తామే లోకంగా అతను ఉండాలని కోరుకోవటం ధర్మం కాదు.

## ప్రశ్న : అత్తగార్లకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు : పెళ్లయ్యాక, జీవితంలో కొంతదూరం ప్రయాణించాక మీరు మాత్రం అత్తమామల గురించి లేదా అమ్మ నాన్నలగురించి ఏమి ఆలోచించగలిగారు? మీరు మీ భర్త మీ పిల్లల గురించే కదా ఆలోచించారు. ఇదే సూత్రం మీ కొడుకూ కోడలుకు గూడా వర్తిస్తుంది. కాలానుగుణంగా సహజ మార్పుకు లోనయ్యే బాంధవ్యాలను సజావుగా అర్థం చేసుకోమని అత్తలందరికీ నా విజ్ఞప్తి. కోడలిని కూతురుగా చూసుకోగల్గితే, అత్తలకు అగచాట్లుండవు.

## ప్రశ్న : కోడళ్లకు మీరిచ్చే సలహా ఏమిటి?

**జవాబు :** భర్త అత్తమామలతోనే తన కుటుంబంగా భావించాలి. అవకాశం ఉన్నంతవరకూ అత్తమామలతో కలసి ఉండటం వలన తనకూ, భర్తకూ, పిల్లలకూ వెరశి ఇంటికి నిండుతనం వస్తుందని, ముఖ్యంగా పిల్లలు ఆత్మవిశ్వాసంతో పెరుగుతారనే వాస్తవాన్ని ఆమె అర్థం చేసుకోవాలి.





***అత్త వద్ద పని నేర్చుకుని, వయసులో ఉన్నందున పనిలో సింహ భాగం ఆమె నిర్వర్తించాలి. అవకాశం ఉంటే పనిమనిషి సేవలు పొందవచ్చుగాని, అత్తగారిని పనికి ఉపయోగపడే బాంధవ్యంగా భావించకూడదు.***

ఒకవేళ ఏ కోడలుకైనా వేరుకాపురం మీద ఆసక్తి ఉన్నయెడల ఆమె డైరెక్టుగా తన భర్త, అత్తమామల సమక్షంలో నేరుగా తన అభిప్రాయాన్ని వెల్లడించగలగాలి. పైకి ఒకటి మనస్సులో మరొకటి పెట్టుకుని ఉండటం వలన కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకుంటాయి. వేరుగా ఉండాలని ఆసక్తి చూపిన కోడలు యొక్క అభిప్రాయం ప్రకారం అత్తమామలు నడుచుకోవాలి. అయితే ఇది ఆమె వ్యక్తిగతంగా ప్రైవసీ కోరుకుని వేరు కాపురం మీద మక్కువ చూపిస్తే పర్వాలేదుగాని, తమ కుటుంబ విషయంలో ఏ కోడలైనా తన తల్లి దండ్రులతో అంటే పుట్టింటి వారితో సలహా సంప్రదింపులు జరపటం సరికాదు. తన కుటుంబం అంటే తన భర్త, అత్తమామలతో ఉన్న బాంధవ్యమేగాని, పుట్టింటి వారు ఆత్మబంధువులే గాని, తన కుటుంబం కాదనే వాస్తవం ఆమె మరువకూడదు. ఇలాంటి పరిస్థితులలో భావోద్వేగ నియంత్రణ దివ్య ఔషధంలా పనిచేస్తుంది. నిండు కుటుంబం అంటే భార్య, భర్త, పిల్లలు మరియు పెద్ద వాళ్లు అనే విషయం సదా గుర్తుంచుకోవాలి.

## ప్రశ్న : ఆర్థిక పరమైన సమస్యలు లేకుండా స్వతంత్రంగా ఉండగల్గితే అది వేరే సంగతి. కాని తిండి, బట్టలకు కూడా కొడుకుమీద ఆధారపడిన వారి సంగతేమిటి? అప్పుడు వేరే కాపురం కావాలని కోడలు కోరుకుంటే పరిస్థితి ఏమిటి?

**జవాబు :** వార్థక్యంలో పూర్తిగా కొడుకుమీద ఆధారపడ్డ వారి పరిస్థితి కొంచెం దయనీయంగానే ఉంటుంది. వేరు కాపురంకు అవకాశం

ఉండదు కావున, అలాంటి ఆలోచన కోడలుకు రాకపోవచ్చును. లేదా ఏదైనా వృద్ధాశ్రమంలో అత్తమామలను పడేసి తన లక్ష్యం నెరవేర్చుకోవచ్చును. అలాంటి పరిస్థితి ఎవరికైనా ఎదురైతే, తాము ఏ జన్మలోనో పాపం చేసి ఉంటామని ఆ కర్మ ఫలం ఇప్పుడు ఈ విధంగా చివరి రోజులలో వృద్ధాశ్రమంలో అనుభవిస్తున్నామని, కోడలు నిమిత్తమాత్రురాలని అర్థం చేసుకొని, కోడలు మీద ద్వేషం లేకుండా ఉండగల్గితే వారికి కొంత ఉపశమనం కల్గుతుంది.

## ప్రశ్న : ఒకప్పుడు మా దగ్గర బంధువుల కుటుంబం తరచుగా మా ఇంటికి వచ్చేవారు. ఇటీవల రావటం పూర్తిగా మానేశారు. మేమంటే వాళ్లకు లెక్క లేదంటారా? మా దగ్గర డబ్బు లేదని చిన్న చూపా?

**జవాబు :** ఇలా ప్రతికూల ఆలోచనలు చేసి ఎదుటి వారి గురించి మీరే ఒక నిర్ధారణకు రాకూడదు. కాలం గడిచే కొద్దీ బాంధవ్యాలు మారటం సహజం. ఒకప్పుడు మీ ఇంటికి రావటానికి వాళ్లకు వెసులుబాటుగా ఉండేదేమో! ఇప్పుడు కొత్త బాధ్యతల వలన కుదరటం లేదేమో! లేదా ఎక్కడికైనా వెళ్లాలనే ఆలోచనలకు తావు లేకుండా బిజీగా ఉన్నారేమో! మీకు డబ్బు లేదని చిన్న చూపయితే అంతకుముందు కూడా రారు కదా! అయినా మీ కంపెనీ నచ్చటం లేదేమో ! వారి ప్రాధాన్యాలు మారాఏమో! మీతో పరిమితంగా ఉండదలచారేమో! మిమ్మల్ని దూరంగా ఉంచాలనుకున్నారేమో! ఏమైనా గావచ్చును. ***మనిషి చనిపోయాక తిరిగి రానట్లే, బంధం తెగిపోయాక చేయగల్గింది ఏమీ ఉండదు.*** ఆత్మన్యూనత (Inferiority Complex) మీరు తొలగించుకోనంతకాలం మీరు ఎవ్వరితోనూ బాంధవ్యాలు సరిగా నెరపలేరు.





## ప్రశ్న : బంధువు ఒకాయన నాకు లక్షల రూపాయలు కానుకగా ఇస్తానన్నాడు. ఇప్పుడు ఇవ్వకుండా మాట తప్పాడు ఏం చేయాలి?

**జవాబు :** లక్షల రూపాయలు ఊరికనే ఎవ్వరూ ఇవ్వరు. అలాగ ఇస్తాను అని మీ బంధువు అన్నాడంటే మీకు అతను ఏదో పని అప్పగించి ఉండవచ్చు. మీరు అది నిర్వర్తించి ఉండకపోవచ్చు. ఒకవేళ మీరు ఆ పని నిర్వర్తించి ఉన్నట్లయితే, మీ బంధువులే ఎవరో ఒకరు ఆయనతో ఈ విషయం మాట్లాడగలిగి ఉండేవారు. అక్కడిదాకా ఎందుకు, మీరే డైరెక్టుగా ఆయన్ను అడగగల్గి ఉండేవారు. మీ వలన ఆయనకు జరిగిన ఇబ్బందులు నాకు తెలియవు కదా! ఆయన్ను సంతృప్తి పరచకుండా బాగా చికాకు పరచి ఉంటారు. అందుకే మీకు ముఖం చెల్లక ఆయన్ను అడగలేకపోయారు. అయినా సంబంధాలు సజావుగా నెరిపితే, ఇచ్చి పుచ్చుకోవటాలుంటాయి గాని, ఆయాచితంగా ఆశించటం చేయి జాపటం దిగజారటమే అవుతుంది. కానుకలు ఇచ్చేవారు ఇష్టంతో ఇచ్చేవి, పుచ్చుకునేవారు అభిమానంతో దక్కించుకునేవి. ఇష్టంతో ఎవరైనా లక్షలు ఇవ్వగలరేమోగాని, ఇష్టం పోయాక పదకొండు రూపాయలు ఇవ్వాలన్నా కష్టంగానే ఉంటుంది.

## ప్రశ్న : ఆర్థిక తారతమ్యాల వలనే మనుషులు అందరూ సంఘీ భావంతో ఉండలేక పోతున్నారా?

**జవాబు :** తమకు డబ్బులేక పోవటం వలన చిన్న చూపు చూస్తున్నారని ఎవరైనా అనుకుంటే, తొలుతగా అది వారి "ఆత్మన్యూనత" ను సూచిస్తుంది. మనుషుల మధ్య సంఘీభావం లేకపోవటానికి ప్రధానకారణం ఆలోచనల వ్యత్యాసం. మనందరికీ "చిన్న పిల్లలకూ – పెద్ద వారికి" మధ్య ఉన్న

వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. కాని మనుషుల మధ్య 'పరిణితి' లో గల వ్యత్యాసం కంటికి కనిపించదు. భావాలలో ఉన్న వ్యత్యాసం కంటికి కనిపించదు. వ్యక్తిగత లక్ష్యాలలో ఉన్న వ్యత్యాసం కంటికి కనిపించదు. ఈ వ్యత్యాసాలు గాక మరలా ఒక్కొక్క మనిషిలో భిన్న పార్శ్వాలు. విభిన్న భావోద్వేగాలు, అనుభవాలు; పాఠకులారా దయచేసి ఒక్కసారి నేను చెప్పబోయే దృశ్యం ఊహించండి. యు.కె.జి. చదువుతున్న పిల్లలను, యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులను ఒకే క్లాసులో కూర్చోబెట్టి చూడండి. పి.జి. చదువుతున్న విద్యార్థి యు.కె.జి. చదువుతున్న పిల్లవాడిని ప్రేమగా పలుకరించగలడు, వీలైతే చాక్లెట్లు కొనిపెట్టగలడు గాని కలసి చదువుకోవటానికి, స్నేహం చేయటానికి ఏముంటుంది? అలాగే స్కూలు విద్యార్థులను, కాలేజి విద్యార్థులను కలిసి మెలిసి ఉండమంటే ఎలా ఉండగలరు? తమ తమ కర్మ ఫలాలు అనుభవించటానికి గతంలో అనేక జన్మలు తీసుకుంటూ ఈ భూమ్మీదకు వచ్చిన జీవాత్మలు వారి వారి ఋణానుబంధాల కారణంగా ఇక్కడ సంబంధ బాంధవ్యాలు పెంచు కుంటున్నారు. ***మానవ జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం ఒక కార్యమో లేదా ఒక కారణమో తేల్చి చెప్పలేనంత సంక్లిష్ట విషయం.*** జ్ఞానం పెరిగే దశలో సవాలక్ష సందేహాలు, కోటి అనుమానాలు, తీవ్ర సంఘర్షణ. నిరంతర ప్రయత్నం లౌకిక విజయాలకే కాదు, మానవ జన్మ అంతిమ లక్ష్యమైన మోక్ష సాధనకూ ఉపయోగపడుతుంది.

సంగీతం, సాహిత్యం, తర్కం, గణితం, సాంకేతిక విద్య, వైద్యం, ఖగోళం, జ్యోతిషం – ఇలా అనేక విషయాల మీద గత జన్మల లోనే విశేషమైన కృషి చేసి పట్టు సాధించిన జీవాత్మలు, ఇప్పటి జన్మలో సహజంగానే పరిణితితో ఉంటారు గావున, ప్రాథమిక స్థాయి జ్ఞానంగల జీవాత్మలతో





స్నేహం ఎలా చేస్తాయి? 20 సంవత్సరాలు సంగీత దర్శకునిగా ఉచ్ఛస్థితికి వెళ్ళలేకపోయిన ఒక సంగీత దర్శకుడు చిన్న వయసులో దక్షిణ భారతాన్ని అబ్బుర పరచి కీర్తి గడించిన మరొక నూతన సంగీత దర్శకుని జూసి ఈర్ష్య పడటం వలన ప్రయోజనం ఉంటుందా? ***ఈ ప్రపంచంలోని మనుషులంతా వేరు వేరు కాలంలో జన్మించటం వలన వయస్సు వ్యత్యాసాలతో పాటు పరిణితి, ఆలోచన, భావాల మధ్య అనేక వ్యత్యాసాలు ఉండి, కాన్వెంటు పిల్లలు, స్కూలు విద్యార్థులు, యూనివర్సిటీ విద్యార్థులు (నిజానికి ఈ గ్రేడులు లక్షలు, కోట్లలో ఉన్నా ఆశ్చర్యం లేదు) అందరూ కలిసి ఒకే బడిలో చదువుకుంటున్నట్లుగా సమాజం ఉంటుంది.*** పరిణితి సాధించిన వారి ఆర్థిక పరిస్థితి జన సహకారంతో సహజంగానే బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి బాగుండటం కూడా అర్హతను బట్టే ఉంటుంది. హెచ్చుతగ్గుల గురించి ఆవేశంతోనూ, అసూయతోనూ ఆక్రోశించటం కూడా 'కర్మ' లో బాగమే. ఏది ఏమైనా మంచి ఆలోచనలు, సత్కర్మలు ఆచరించటం, అభివృద్ధికి, మార్పుకొఱకు నిరంతరం ప్రయత్నించాలి.

## ప్రశ్న : వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదివి మారటం నిజమేనా? ఆ పుస్తకాలకు మనుష్యులను మార్చే శక్తి ఉందా?

**జవాబు :** ఇది చాలా కీలకమైన ప్రశ్న. చాలా మంది రచయితలు తమ పుస్తకాలు చదివి పాఠకులు వారి జీవితాలను మార్చుకున్నారని గర్వంగా చెబుతుంటారు. ఇక్కడ అందరూ తెలుసుకోవలసిన నిజం ఒకటుంది. ***పుస్తకాలు చదివి ఎవ్వరూ మారలేరు. మారాలనుకున్న వారు పుస్తకాలు చదువుతారు.*** సహజంగానే ఆ జిజ్ఞాసతో ఉన్న వ్యక్తికి పుస్తకాలు ఉపయోగపడ్తాయి. కొత్త ఆలోచనలను పాఠకుడిలో రేకెత్తించగల్గుతాయి.

మారాలనుకున్న వ్యక్తి తనకు తెలియకుండానే ఆ పని స్వచ్ఛందంగా ప్రారంభిస్తాడు. ఆ క్రమంలో తోటివారిని పరిశీలించటం, కొత్త వ్యక్తుల పరిచయంతో వారి నుండి కొత్త విషయాలు తెలుసుకోవటం, తనకు ఎదురైన సంఘటనలను విశ్లేషించుకోవటం, మానవ సంబంధాల విషయంలో అవతలి వ్యక్తి కోణం నుండి ఆలోచించగల్గటం – ఇలా తనకు తాను మార్చుకునే ప్రయత్నంలో పుస్తకాల కోసం అన్వేషణ మొదలు పెడ్తాడు. అభిరుచి తోడవటం వలన అతనికి ఉపయోగపడగల పుస్తకాలు సహజంగానే అతనికి తారసపడ్తాయి. ఆ పుస్తకాలలోని ఏదో ఒక అంశం అతని ఎదుగుదలకు తోడ్పడుతుంది. ***ఒక వ్యక్తిలో నిక్షిప్తంగా సహజంగా మిణుకు మిణుకుమంటూ అతి సూక్ష్మ పరిమాణంలోనైనా 'నిప్పు' ఉంటే, అది ప్రజ్వరిల్లటానికి పుస్తకాలు దోహదపడ్తాయి.***

గత 15 సంవత్సరాల కాలంలో నేను నా పరిచయస్థులకూ, బంధువులకూ చాలా మందికి వేలాది పుస్తకాలు కొని కానుకగా ఇచ్చాను. ఇప్పటివరకు ఆ పుస్తకాలు చాలా మంది చదవలేదని వారి మాటల ద్వారానే తెలిసింది. కొంతమంది ఏదో కొంత భాగం చదివినామని చెప్పారు. ఇక్కడే నాకు ఒక పెద్ద సందేహం వచ్చింది. ***ఎలాగో ఒకలా నెత్తీ నోరు కొట్టుకుని వారిని బలవంతంగానైనా పదిపేజీలు చదివించగల్గితే, ఆ తర్వాత ఆ పుస్తకమే వారిని ఆకర్షించి మొత్తం పుస్తకాన్ని చదివేలా చేస్తుందని అపోహ పడ్డాను.*** కాని ఎక్కువ శాతం మంది ఇప్పటివరకూ పుస్తకం పూర్తి చేయలేదు. ఒక్క పుస్తకమే చదవకపోతే ఇంకా అనేక పుస్తకాలు ఏం చదువుతారు? అంటే ఎంతటి గొప్ప పుస్తకమైనా, అభిరుచి మరియు తెలుసుకోవాలనే తృష్ణ ఉన్న వారినే ఆకర్షించగలుగుతుంది గాని, అక్షర జ్ఞానం ఉన్న వారందరినీ ఆకట్టుకోలేక పోతుందని తెలిపోయింది. ఇక ఆసక్తిగా చదివేవారి విషయం పరిశీలిస్తే, వీరిలో ఎక్కువ శాతం చదవటం మీద ఉన్న ఆసక్తి ఆచరణకు



మానవ సంబంధాలు - మాయా బంధాలు ప్రశ్నలు - జవాబులు

వచ్చే సరికి ఉండటం లేదు. పుస్తకాలెన్నో చదువుతారు. చదివిన దాన్ని గురించి అనర్గళంగా ఉపన్యసిస్తారు. ఇంకా ఇంకా కొత్త పుస్తకాలు కొనుక్కొని ఆసక్తిగా చదువుతారు. కాని చదివిన దాన్ని ఆచరించరు. అందువలనే పుస్తకాలు చదివి మారే వారి సంఖ్య చాలా పరిమితమని చెప్పవచ్చును. ఆ మాటకు వస్తే పుస్తకాలు వాటంతట అవే మనుష్యులను మార్చలేవని తేలిపోయింది. కాని నిరంతరాన్వేషణతో కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తూ తనను తాను మార్చుకోవాలనుకునే వ్యక్తులకు, 'వినదగునెవ్వరు చెప్పిన...' అనే నీతి పద్యాన్ని అనుసరించి జీవితానికి అన్వయించుకునే వ్యక్తులకు పుస్తకాలు ఖచ్చితంగా తోడ్పడుతాయి.

## ప్రశ్న : ఒకప్పుడు బాగా దగ్గరగా ఉండేవారు తర్వాతి కాలంలో దూరమవ్వటానికి గల కారణం ఏమిటి?

**జవాబు :** కాలానుగుణంగా బాంధవ్యాలు సహజమార్పుకు లోనవు తుంటాయి. బాల్యంలో తాతగారితోనే గంటల తరబడి కాలక్షేపం చేసిన బాలుడు, యువకుడయ్యాక 'హాయ్' అనే చిన్న పలకరింపుతో సరిపెట్ట వచ్చును. పెళ్లిగాక ముందు తల్లి కొంగుపట్టుకుని తిరిగిన కుర్రాడు పెళ్లయ్యాక ఎమ్మా ఎలా ఉన్నావు? భోంచేసావా? మందులు వేసుకున్నావా? అనే మూడు ముక్కలతో తన బాధ్యతను కుదించుకుంటాడు. రామలక్ష్మణులలా కలిసిమెలిసి పెరిగిన అన్నదమ్ముల మధ్య, ఎవరి సంసారాలు వారికి ఏర్పడ్డాక వారి బాంధవ్యంలో ఒకప్పటి చిక్కదనం ఉండదు. ***ఒకవేళ అలాగే ఉంటే, ఖచ్చితంగా ఎంతోకొంత కొత్తగా వచ్చి తన జీవితంలో చేరిన బాంధవ్యాలకు న్యాయంచేయలేడు.***

బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ఇలా సహజ మార్పుకు లోనయ్యే

బాంధవ్యాలు, కొన్ని సార్లు ఆలోచనా సరళి, పరిణితిలో ఎదుగుదల, కొత్త స్నేహాలు అభిరుచులు, వృత్తి ద్వారా ఏర్పడే స్నేహబంధాలు – వీటి ప్రాధాన్యత వలన పాత బంధుత్వాలకు సహజంగానే చోటు తక్కువ అవుతుంది. ఏది ఏమైనా మానవ సంబంధాలలో అవసరాల ప్రాధాన్యత గుర్తించదగిన అంశం. కాలం ఎప్పుడూ ఒక రకంగా ఉండదు. ***మరుక్షణం ఎదురవ్వబోయే మార్పుకు ఏ వ్యక్తి అయినా ముందే సిద్ధపడి ఉండటం వలన మానసిక అలజడి తగ్గుతుంది.***

## ప్రశ్న : ఫోన్ కట్ చేయటం, ఫోన్ లిఫ్ట్ చేయకపోవటం, నంబరు చూసుకుని కూడా ఫోన్ చేయకపోవటం ఇలాంటి వారిని ఎలా అర్థం చేసుకోవాలి?

**జవాబు :** ఒకప్పుడు ఎవరికైనా తల్లిదండ్రులు / అత్తమామల ద్వారా ఏర్పడిన బంధుత్వాలు దగ్గర వారని భావించేవారు. వీరితో ఏదైనా తగాదాలు వస్తే తప్ప సంబంధ బాంధవ్యాలు సజావుగానే ఉండేవి. కాలక్రమంలో ప్రస్తుతం వ్యక్తి చక్రం అనంతంగా పెరిగింది.

సెల్‌ఫోన్స్, ఇంటర్‌నెట్, విదేశీ యానాలు సర్వ సాధారణమయ్యాయి. జీవన చిత్రం పూర్తిగా మారిపోయి తాను ఉన్న వేదిక (ప్లాట్ ఫామ్) బట్టి రిలేషన్స్ అభివృద్ధి చెందుతున్నాయి. వేదిక మారితే రిలేషన్స్ కూడా మారిపోతున్నాయి. పాతకాలంలో ఉన్న గాఢ స్నేహాలు, ఆత్మీయతలు ఇప్పుడు లేవు. ఇది కూడా సహజ పరిణామమే. పాతకొత్తల 'ట్రాన్సిట్' పిరియడ్ కాబట్టి ఈ ప్రశ్న అడిగారు. ఇంకా కొన్ని సంవత్సరాలుగడిస్తే అందరూ అలాగే ఉంటారు. కాబట్టి పెద్ద ఇబ్బందిగా ఉండదు.

కారణం ఏదైనా అవతలి వారికి ఆసక్తి లేనపుడు, ఆ సంబంధాన్ని





వదులుకోవటం ఉత్తమం. లేదా తామరాకు మీద నీటిబొట్టులా ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా ఉంటే మనస్థాపానికి తావుండదు. ***కాని మీరు కాల్ చేస్తే లిఫ్టు చేయకుండా, వాళ్లకు అవసరమైన సమయంలో కాల్‌చేసే సిగ్గులేని అలవాటున్న వారిని 'జాలి' పడకుండా కట్ చేయాలి.***

బాగా దగ్గర వాళ్లు, ఒక మోస్తరు దగ్గరవాళ్లు, పరిచయస్థులు ఇలా వర్గీకరణ చేసుకుని తదనుగుణంగా జీవించినట్లయితే దీర్ఘకాలం ప్రశాంతంగా మనుగడ సాగించవచ్చును.

## ప్రశ్న : మన స్నేహం మన బంధం శాశ్వతమైనది అని ముఖ్యంగా ఆడ మగ స్నేహ బంధాలలో ఒకరికొకరు చెప్పుకుంటూ ఉంటారు. అలా శాశ్వత సంబంధాలు సాధ్యమేనా?

**జవాబు :** ముందే చెప్పటం జరిగింది. ఏ బంధమైనా కాలానుగుణంగా సహజ మార్పుకు లోనయ్యి తీరుతుంది. వీటికి ఎవ్వరూ మినహాయింపుకాదు. వివాహబంధం ద్వారా వారిద్దరూ ఏకమైతే అప్పుడు దీర్ఘకాలం కలసి ఉండే అవకాశం ఉంటుంది.

## ప్రశ్న : వివాహబంధం గాకుండా ఆత్మీయబంధాలు ఉండవంటారా?

**జవాబు :** పరిణితి చెంది పరస్పర గౌరవం ఉన్న అనేక స్నేహ బంధాలు ఉంటాయి. ఇక్కడ కూడా కాలానుగుణంగా మార్పుకు లోనవ్వాల్సిందే. బంధం శాశ్వతం గాకపోయినా, ఆరోగ్యకరమైన అనుబంధాల జ్ఞాపకాలు

శాశ్వతంగా ఉంటాయి. కాని ఎవరైనా కాలంతో వచ్చే మార్పును జీర్ణించుకోవలసిందే.

## ప్రశ్న : బాంధవ్యాలన్నీ కర్మ బంధాలేనంటారా?

**జవాబు :** అన్ని సంబంధాలు కర్మ బంధాలే. వారి వారి ఋణాలు తీరగానే చాలా సహజంగా కనుమరుగవుతాయి. అప్పటి దాకా ఇంగువ కట్టిన గుడ్డలాగా ఒక పట్టాన వదలవు. ప్రతివ్యక్తి తన జీవితాన్ని పరిశీలించుకుంటే అన్నీ కర్మ బంధాలేనన్న వాస్తవం బోధపడ్తుంది.

## ప్రశ్న : డబ్బు లేని వారిని సమాజం అసలు పట్టించుకోవటం లేదు. ఇది కూడా కాలంతో వచ్చిన మార్పు అని సరి పెట్టుకోవాలా?

**జవాబు :** ఏ కాలంలో నైనా డబ్బుకు ప్రాధాన్యత ఉంది. మహాభారతంలో దుర్యోధనుడు ఇచ్చే సౌకర్యాలకు ఆశపడి కౌరవ పక్షాన తామంతా ఉన్నామని భీష్ముడు చెబుతాడు.

ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నవారు సమయమంతా వారి స్వంత కుటుంబ సంరక్షణకే ధారబోస్తారు. బంధువులకు స్నేహాలకు ప్రాధాన్యతనిచ్చి వారు ఆహ్వానించే వేడుకలకు హాజరవ్వలేరు. ఒకటి రెండు సార్లు పిలిచి మూడోసారి అవతలివారు సహజంగానే వదిలేస్తారు. ఆ తర్వాత వీరిలో క్రమంగా, 'ఆత్మన్యూనత' అభివృద్ధి చెందుతుంది. అవసరాలకు లోటు లేకుండా జీవించగల్గితే చాలు. డబ్బు సంపాదనకు మితమెక్కడ?





తమ సన్నిహిత బంధువులకంటే ఆర్థికంగా తక్కువ స్థితిలో ఉన్నవారు ముందుగా 'ఆత్మన్యూనత' ను తొలగించుకోవాలి. అందరితో కలిసిమెలిసి పోవాలి. కొంతమంది డబ్బుతో వచ్చిన దర్పంతో తమ ఆధిక్యతను ప్రదర్శిస్తారు. అలాంటి వారికి దూరంగా ఉండవచ్చును. అయినా మనిషి చనిపోయాక కూడా 'డబ్బు' తో అవసరాలు ముడిపడి ఉన్నపుడు 'డబ్బు' కు ప్రాధాన్యత ఖచ్చితంగా ఉంటుంది. డబ్బునూ డబ్బున్న వారినీ ఖచ్చితంగా గౌరవించాల్సిందే. వారికి లొంగి ఉండాల్సిన అవసరం లేదుగాని వారు సాధించిన అభివృద్ధిని హృదయపూర్వకంగా మెచ్చుకుంటే మనకు వచ్చిన నష్టమేమిటి?

## ప్రశ్న : మనుషులు అవకాశవాదంతో ప్రవర్తిస్తారెందుకు?

**జవాబు :** ప్రతి వ్యక్తిలోనూ అవకాశవాదం అంతో ఇంతో ఉంటుంది. పచ్చి స్వార్థపరులలో మోతాదు ఎక్కువ ఉండవచ్చును. అవసరాల కోసమే సంబంధాలు ఏర్పడతాయి అనేది మానవ సంబంధాలకు మూల సూత్రమయినపుడు అవకాశవాదాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన పనిలేదు. ***ఏ సంబంధంలోనైనా ఇద్దరు వ్యక్తుల మధ్య 'ఇష్టం' సమంగా లేనపుడు గాఢంగా ఇష్టం ఏర్పరుచుకున్న వ్యక్తిని అవతలి వ్యక్తి అదనంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది.*** ప్రతి బాంధవ్యంలోనూ అతిగా లేకుండా సమతుల్యత పాటించటం వలన మనం ఇతరుల అవకాశవాదానికి బలి కావలసిన పరిస్థితి ఎదురవ్వదు. అయినా ఎదుటి వ్యక్తి నుండి ఎక్కువ ఎక్స్‌పెక్టేషన్స్ లేనపుడు బాంధవ్యాలు సజావుగానే సాగుతాయి.

## ప్రశ్న : గుర్తింపు కోసం పాకులాడటాన్ని సమర్ధించవచ్చా?

**జవాబు :** పరిణితి పెరిగి చరమదశకు చేరుకున్నాక ఇవన్నీ అల్పమైన విషయాలుగా తోచవచ్చును. అలాగే వేదాంత పరంగా ఇదంతా 'మాయ' గావచ్చును. కాని జీవితం అన్నాక ప్రతీ వ్యక్తి సాటివారిలోనూ తోటివారులోనూ 'గుర్తింపు' కోసం పాకులాడుతుంటాడు. ఏదో ఒక అంశంలో తన ప్రత్యేకత చాటుకోవాలని ఎవరైనా తాపత్రయ పడతారు. ఒక ప్రశంస లభించినపుడు సంతృప్తి కలుగుతుంది. అయితే ఎదుటివారి ప్రత్యేకత గుర్తించి ప్రశంసించినపుడు మనమూ గుర్తింపబడతామనే కనీస సంస్కారం ఎవరికివారు అభివృద్ధి చేసుకోవాలి. ***'ప్రశంస' మభ్యపెట్టి పబ్బం గడుపుకునే విధంగా ఉంటే, వలవేసిన వారే కొంతకాలానికి వలలో పడ్తారు. కర్మ సిద్ధాంతంలోని అనివార్యమైన పరిణామమిది.***

## ప్రశ్న : రెండు కుటుంబాల మధ్య అరమరికలు లేని సాంగత్యం సాధ్యమేనంటారా?

**జవాబు :** పూర్తిగా సాధ్యం కాదనే చెప్పాలి. ఎందుకంటే ఒక్కొక్క కుటుంబం ఒక్కొక్క నేపధ్యం కలిగి ఉంటుంది. విద్య, సంస్కృతి, పరపతి, ఆర్ధిక పరిస్థితి, మానసిక పరిణితి ఇత్యాది అంశాలు సమీప సాంగత్యానికి అడ్డు పడ్తుంటాయి. కొన్ని సార్లు విభిన్న నేపథ్యాలుగల రెండు కుటుంబాలు కలిసి మెలిసి ఉండవలసి వస్తుంది. ఇలాంటి సందర్భాలలో అసలు విషయానికి మాత్రం ప్రాధాన్యత నిచ్చి సంబంధం లేని అనేక విషయాలను పట్టించుకోకుండా, తామరాకుమీద నీటి బొట్టులా జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది.





## ప్రశ్న : హోదా, పరపతి ఏ విధంగా లభిస్తాయి?

**జవాబు :** ఎక్కువ మందికి సేవలందించటం ద్వారా హోదా, ఆ హోదాను దర్పాన్ని ప్రదర్శించటానికి ఉపయోగించుకోకుండా అణకువతో ఆ హోదాను ఉపయోగించి మరింత మెరుగైన సేవలు అందించటం ద్వారా 'పరపతి' పెరుగుతుంది. కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే, హోదా మరియు పరపతి ఎవ్వరికీ అయాచితంగా లభించవనే వాస్తవం బోధ పడ్తుంది. హోదా పరపతిని ఉపయోగించి స్వార్ధంతో అవినీతి లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం – ఈ లక్షణాలకు లోబడితే వారంతా ఏదో ఒక సమయంలో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

## ప్రశ్న : మానవ జీవితంలో వృత్తి (పని) యొక్క ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు :** భార్యా బిడ్డలకంటే వృత్తి ముఖ్యమని నా ఉద్దేశం. భార్య ఎక్కడనుండి వచ్చింది? ఎలా వచ్చింది? మీరు చేస్తున్న ఉద్యోగ వ్యాపారాలను ముందుగా పరిశీలించి, ఇతను భార్యా బిడ్డలను పోషించగలడని, కుటుంబాన్ని ఒడిదుడుకులకు చోటివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించగలడని ఒక నమ్మకం ఏర్పడినాక ఆ తర్వాతే తన కూతురును మీకిచ్చి పెళ్లి చేస్తున్నారు. పనీ పాట లేని వాడికి పిల్లనెవ్వరూ ఇవ్వరు. ఆ విధంగా మీకు ఒక భార్య, తద్వారా సంతానం, వారికి విద్యాబుద్ధులు చెప్పించి, పెంచి పెద్ద చేయటం ద్వారా జీవితం ఒక ట్రాక్ మీద నడవటం – ఇవన్నీ వృత్తి వలనే సాధ్యమయ్యాయి.

ఈ ప్రపంచంలో అపరిచిత వ్యక్తులు ఎవరు కలుసుకున్నా

ఒకరినొకరు వేసుకునే ప్రశ్న 'మీరేం' చేస్తుంటారు? అని. అలాగే పరిచిత వ్యక్తులు ఒకరినొకరు 'బాగున్నారా' అని పలుకరించుకున్నాక, 'ఇపుడేం చేస్తున్నారు?' అని ఒకరినొకరు అడిగి వివరాలు తెలుసుకుంటారు.

ఎక్కువ డబ్బు ఉండటం కంటే నిరంతరం పని కలిగి ఉండటమే ఒక యోగం. ఒక నెల పనిచేసి ఐదు లక్షలు సంపాదించి మిగిలిన 11 నెలలు ఖాళీగా ఉండటం కంటే, నెలకు 25,000ల చొప్పున 12 నెలలు బిజీగా ఉండి మొత్తం మూడు లక్షలు వచ్చినా, ఈ జీవితమే బాగుంటుంది. అనేక మానసిక రుగ్మతలకు పనిలేకుండా ఉండటమే కారణం. పనిలేని వాని మెదడు దయ్యముల కర్మాగారమని ఇంగ్లీషు సామెతకు తెలుగు అనువాదం. కావున నిరంతరం పని, ఆ పని ద్వారా బిజీగా ఉండటం – తద్వారా జీవనోపాధి, ఒక సంతృప్తి. జీవితం సజావుగా సాగటానికి సరిపోయినంత డబ్బు ఉండటం ఒక్కటే సరిపోదు. సరిపోయినంత పని కూడా ఉండాలి.

## ప్రశ్న : అసంతృప్తి దేని వలన వస్తుంది?

**జవాబు :** చాలా సందర్భాలలో తీరని కోరికల వలన వస్తుంది. కొన్నిసార్లు కోరికలన్నీ తీరినా, ఎదుటి వ్యక్తుల మీద ఎక్కువ అంచనాలు వేసుకుని, వాళ్లు అంచనాలకు దగ్గరగా లేనపుడు వస్తుంది. పరిణితి చెందే కొద్దీ అసంతృప్తి పెరుగుతుంది. ఒక ఆనందాన్ని పదేపదే ఆనందించాక ఆ ఆనందం ఆనందాన్నివ్వదు. బాల్యంలో గోళీలు దాచుకొని వాటిని చూసి మురిసిపోయి ఆనందపడ్డాము. పరిణితి చెందాక అంటే పెద్దయ్యాక గోళీలు దాచుకోవటం నిరర్థక క్రియ అని మన బుద్ధి చెబుతుంది. ***అలాగే ఇప్పుడు మనం చేసే పనులన్నీ ఏదో ఒక రోజున గోళీలు దాచుకోవటం లాంటివని గ్రహిస్తాం.***





మాయలో ఉన్న ఆనందం మాయ తొలిగాక ఉండదు. పరిణితి చెందిన తరువాత మాయకు లోబడలేక, మాయలో ఉన్న మన తదుపరి జనరేషన్‌ను వదిలేయలేక – అసంతృప్తికి గురవుతాం. ఎందుకంటే 'మాయ' అని హఠాత్తుగా గౌతమ బుద్ధుడి లాగా అన్నీ త్యజించలేముగా. అందుకే వారిని కూడా ఆనందనించనివ్వాలి. మానవ జన్మ మోక్షం కోసమనే తెలివి ఏదో ఒకనాడు ఎవరికి వారే తెలుసుకోవాలి.

## ప్రశ్న : స్వోత్కర్ష అంటే ఏమిటి?

**జవాబు :** తన గురించి తాను పదే పదే చెప్పుకోవడం స్వోత్కర్ష. ఇది భరించటం చాలా కష్టం. ఈ వ్యసనానికి లోబడితే అందరూ దూరంగా జరుగుతారు. ఏదో గత్యంతరం లేక అవసరాలకోసం దగ్గరగా వచ్చినా, ఐదు నిమిషాలు కూడా స్వోత్కర్షను భరించలేరు. ముఖ్యంగా అడగకుండా, సమయం సందర్భం లేకుండా తమ గురించి తాము ఢాంబికంగా చెప్పుకుంటూ ఉంటారు. ***తిట్లు అయినా కొంతవరకు భరించవచ్చుగాని, స్వోత్కర్షను అసలు భరించలేరు.*** అందుకే స్నేహ సంబంధాలు కావాలనుకుంటే, అవతలివారి వ్యక్తిత్వాలకు ప్రాధాన్యత నివ్వాలి. మాట్లాడటం కంటె వినటం నేర్చుకోవాలి. ఎదుటి వారు అడిగితే తమ గురించి క్లుప్తంగా చెప్పి, అవతల వారిని ప్రశ్నించి వారికి మాట్లాడే అవకాశం కల్పించాలి. స్వోత్కర్ష ఉన్న వ్యక్తి క్రమంగా జన సమూహాలకు దూరమై ఇంటికే పరిమితమవుతాడు. ఆ ఇంటికి వచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతుంది.

## ప్రశ్న : మానవ జీవితంలో బాధ్యత యొక్క ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు :** కుటుంబంలోని ప్రతి హోదాకు ఒక బాధ్యత ఉంటుంది. ప్రతి వ్యక్తికి తొలి గురువులు తల్లిదండ్రులు, ఆ ఇంటిలో పెద్ద వారు. తమ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించిన కుటుంబాల నుండి వచ్చినవారు, వివాహమయ్యాక కూడా వివిధ కుటుంబ హోదాలలో అంటే భర్తగా, తండ్రిగా, తాతగా అదే విధంగా స్త్రీ అయితే భార్యగా, తల్లిగా, నానమ్మగా తమ బాధ్యతలను సవ్యంగా నిర్వర్తిస్తారు. ఇలాంటి కుటుంబాల నుండి వచ్చిన వారు నాయకులైతే, ప్రజల పట్ల కూడా వారి బాధ్యతలు సజావుగా నిర్వర్తిస్తారు. ప్రజలు, పాలకులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినపుడు, ఆ దేశంలో శాంతి సౌరభాలు వెల్లివిరుస్తాయి.

అమెరికా లాంటి దేశాలు అభివృద్ధి సాధించాయంటే కారణం పౌరులంతా తమ 'పని' ని మొక్కుబడిగా కాకుండా బాధ్యతగా నిర్వర్తించటమే. రాజకీయాన్ని ఒక కేరీర్‌గా వ్యాపారంగా భావించే ఇండియాలాంటి దేశాలలో అభివృద్ధి కుంటుబడటానికి పాలకుల బాధ్యతారాహిత్యమే కారణం.

## ప్రశ్న : దేశంలోని 'అవినీతి' ని లంచగొండి తనాన్ని నిర్మూలించడం సాధ్యమేనా? అన్ని రాజకీయ పార్టీలు అలాగే ఉన్నప్పుడు అవినీతి నిర్మూలన ఎప్పటికీ, 'కల' గా మిగిలిపోవాల్సిందేనా?

**జవాబు :** చట్టాలు మనమే కదా తయారు చేసేది. చట్టాలు మనల్ని ఏమి చేస్తాయి? అనే ఒక బెదురులేని తనం ఈనాటి నాయకులలో ఉంది.





అవసరమైతే అవినీతి ద్వారా సంపాదించిన సొమ్ము నుండి కొంత భాగం ఖర్చుపెట్టి తిమ్మిని బమ్మి చేసే లాయర్లను వందమందిని పెట్టుకుంటే సరి అనే కాన్ఫిడెన్సు బాగా పెరిగింది. అధికారం అంటే ఒక బాధ్యత ఒక బరువు అనే సంస్కృతి స్థానంలో 'ఇష్టారాజ్యం' గా ప్రవర్తించటానికి అధికారం, హోదా మూల సాధనాలు అనే సంస్కృతి ప్రాచుర్యంలోకి వచ్చింది. అయినా భయపడాల్సింది ఏమీలేదు. ***అవినీతి నిర్మూలన సాధ్యమే. దీనికి ఒకే ఒక శాశ్వత పరిష్కారం 'కర్మ సిద్ధాంత ప్రచారం'. తప్పు చేసిన వ్యక్తి చట్టం నుండి తప్పించుకోవచ్చునేమోగాని ప్రాకృతిక ధర్మం నుండి తప్పించుకునే ఛాన్సు ఎవ్వరికీ లేదు.***

ఈ వాస్తవాన్ని అందరికీ అర్థమయ్యేటట్లు విస్తృతంగా ప్రచారం చేయాలి. చేసిన తప్పుకు తప్పనిసరిగా శిక్ష ఉంటుంది; అది ఇండియన్ పీనల్ కోడ్ వేసే వసతులు సౌకర్యాలతో కూడిన జైలు గది లాంటిది కాదని, ఎందుకు పుట్టామురా దేవుడా అని హృదయవిదారకంగా విలపించేటంత భయంకరంగా శిక్ష ఉంటుందని అందరూ తెలుసుకున్నట్లయితే, తప్పు చేయటానికి భయపడ్తారు. ***కర్మ సిద్ధాంతాన్ని ఋజువులతో, సాక్ష్యాలతో ప్రచారంలోకి తీసుకువెళితే, ఖచ్చితంగా 'పాపభీతి' పెరిగి అవినీతి ఒక్కటే కాదు, అన్ని అవలక్షణాలు అదుపులోకి వస్తాయి.***

## ప్రశ్న : కర్మ సిద్ధాంతం, జ్యోతిషం, దేవుడు ఇవన్నీ మూఢనమ్మకాలు అంటారు కదా! మంత్రాలకు చింతకాయలు రాలనట్లే, వీటికి రాజకీయ నాయకులు భయపడ్తారా?

**జవాబు :** ఈ ప్రశ్న చాలా అమాయకంగా ఉంది. నేను వీరుడ్ని, శూరుడ్ని అంతా నేనే చేశాను. నా వలనే అంతా జరుగుతోందని

నాయకులు ప్రజలను ఊదరగొడ్తారు గాని. అంతరాలలో వారందరికీ తెలుసు – ఈ చరాచర సృష్టినంతటినీ ఏదో దివ్యశక్తి శాసిస్తుందని. ఎన్నికల ప్రచారం తిరుపతి నుండి మొదలుపెట్టటం, పదవిరాగానే తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించటం, హుండీలో కోట్లాది రూపాయలు వేయటం; ఇవన్నీ చూస్తే అర్థంగావటంలేదా? దైవధిక్కారం పేదవాడు చేయగల్గినట్లు అన్నీ ఉన్న రాజకీయ నాయకులు అసలు చేయలేరని.

## ప్రశ్న : ఇటీవల ఇతరులను దూషించటం వ్యసనంగా మారింది. పరనింద వలన ఏమిటి నష్టం?

**జవాబు :** ఆరోగ్యం కోల్పోవటం మొదటి నష్టం. దూషించినపుడు రక్త ప్రసరణ పెరిగి, చెడ్డ ఆమ్లాలు వృద్ధి చెంది రక్తాన్ని కలుషితం చేస్తాయని డాక్టర్లు అంటున్నారు. ఇదిలా ఉంచితే నువ్వు ఒకరిని తిడుతున్నావంటే అది ఆత్మన్యూనతాభావాన్ని సూచిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే అవతలి వారి ఆధిక్యతను మీరు ఒప్పుకొని, అది భరించలేక అక్కసుతో మీరు తిడుతున్నారని అర్థమైనట్లే గదా? నేరాలు ఘోరాలకే కాదు. 'తిట్టడం' కూడా పాపమే కాబట్టి కర్మ సిద్ధాంతం దీనికి కూడా శిక్ష ఉంటుందని చెబుతుంది.

## ప్రశ్న : స్వార్థం ఉండవచ్చా?

**జవాబు :** స్వార్థం లేకుండా ఎలాంటి అభివృద్ధినీ సాధించలేము. పక్కవాడికి దక్కాల్సిన దాన్ని మనం లాక్కుంటేనే, అది అన్యాయం అధర్మం. ఎలాంటి స్వార్థానికి పాల్పడితే అదే తరహా స్వార్థం ద్వారా శిక్షింపబడతారని కర్మ సిద్ధాంతం చెబుతుంది.





## ప్రశ్న : పని లేకుండా ఊసుపోని సంభాషణలు మంచివేనా?

**జవాబు :** ఆత్మీయులతో అంటే బాగా దగ్గరగా భావించిన వారితో ఊసుపోని ప్రసంగాలు హాని చేయవు గాని, ఇరుగుపొరుగు వారితో, చుట్టాలతో, కొలిగ్స్‌తో అతిగా సంభాషించటం వలన అనర్థాలు జరుగుతాయి. ఊసుపోని సంభాషణలు కూడా ఒక వ్యసనం లాంటిదే. మనసుకు ఏది అలవాటు చేస్తే అదే మళ్లీ మళ్లీ కోరుకుంటుంది. ***ఎప్పుడైనా పనిలో మాట్లాడుకోవటం వేరు, మాట్లాడటమే పనిగా పెట్టుకోవడం వేరు. అవసరం లేకుండా అధిక ప్రసంగాలు చేసేటప్పుడు 'భావాలు' అదుపులో లేకపోవటం వలన అవాకులు చెవాకులు మాట్లాడటం జరుగుతుంది.*** పెదవి దాటితే పృధ్వి దాటుతుందని సామెత. మీరు అన్న మాటలు సంబంధిత వ్యక్తులకు చేరినపుడు మీ సంబంధ బాంధవ్యాలు దెబ్బతినటం లేదా మీకు రావలసిన ప్రయోజనాలు ఆగిపోవచ్చు.

## ప్రశ్న : 'డామినేషన్' స్వభావం స్వాగతించదగినదేనా?

**జవాబు :** టాలెంట్‌లో డామినేషన్ మంచిదే గాని, రిలేషన్సులో డామినేటింగ్ నేచర్ మంచిది కాదు. డామినేటింగ్ నేచర్ ఉన్న వ్యక్తులు తమకు తెలియకుండానే ఎదుటివ్యక్తులను చిన్నబుచ్చే అవకాశం ఉంది. చిన్న బుచ్చటంతో సంబంధాలు దెబ్బతింటాయి. ఆత్మీయుల సంఖ్య బాగా తగ్గి, మరీ అవసరమైతే తప్ప ఎవ్వరూ దగ్గరకు రారు.

## ప్రశ్న : మానవ సంబంధాలలో సంపూర్ణ ఆరోగ్యం యొక్క పాత్ర ఏమిటి?

**జవాబు :** ఆరోగ్యం అనగానే అందరూ శారీరక ఆరోగ్యమనే భావిస్తారు. మానసిక ఆరోగ్యం సంబంధ బాంధవ్యాలలో కీలక పాత్ర వహిస్తుంది. ఎంతటి ఆరోగ్యవంతుడికైనా ప్రతికూల ఆలోచనలు సహజం. కోపం, చిరాకు,

ఆవేశం, తొందరపాటు, నోటి దురుసు, అహంభావం ఇవన్నీ మానసిక రోగాలే. శరీరం ఎలా మురికిపడుతుందో మనసు మీద కూడా నిత్యం దుమ్ము పేరుకుంటూనే ఉంటుంది. శరీరానికి స్నానం అవసరమైనట్లే మనసుకు కూడా స్నానం అవసరం. మంచి సంగీతం వినటం ద్వారా, సజ్జనుల సాంగత్యం ద్వారా, ఆత్మీయులతో మాట్లాడటం ద్వారా, చతుర సంభాషణల ద్వారా, పుస్తక పఠనం ద్వారా, ఎవరికైనా సహాయం చేయటం ద్వారా, ఇతరుల శ్రేయస్సు కొరుకోవటం ద్వారా, హాస్య సన్నివేశాలు టి.వి.లో చూడటం ద్వారా మనసు శుద్ధిగావింపబడుతుంది. ధ్యానం అంచలంచలుగా ప్రాక్టీసు చేసి ఆచరించవచ్చును. గానుగెద్దు తిరిగినట్లు బుర్రలో పాత ఆలోచనలు, ప్రతికూల ఆలోచనలు చేసేవారు తాజాగా కొత్త ఆలోచనలు స్వీకరించగలగాలి. లేదంటే జీవితం ఎదుగూ బొదుగూ ఉండదు. అట్టి వారి సంతానం కూడా ఆర్థికంగా, సాంఘీకంగా చాలా వెనుకబడిన స్థితిలోనే ఉంటారు. మనస్సు, శరీరం పరస్పర ఆశ్రయాలు. సుఖ సంతోషాలకు, అభివృద్ధికి సంపూర్ణ ఆరోగ్యం చాలా ముఖ్యం.

## ప్రశ్న : ఆకస్మిక కష్టాలు ఎందువలన వస్తాయి? ఎంత కృషి చేసినా విజయం ఎందుకు వరించదు?

**జవాబు :** మనిషి తలుచుకుంటే ఏమైనా సాధించవచ్చని, మనం ఏమనుకుంటే అది జరుగుతుందని నేను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. నా బాల్యం నుండి ఇప్పటివరకూ ఎన్నో అద్భుతాలు జరుగుతూనే ఉన్నాయి. అలాగని అంతా మన చేతుల్లోనే ఉందని ఘంటా పథంగా చెప్పలేము. ఎంతగింజుకున్నా పరిస్థితులు ఎదురు తిరిగి, నిస్సహాయ స్థితి లోకి వెళ్లి 'పాపం నేను' అని నా మీద నాకు జాలివేసిన అనేక సందర్భాలు





కూడా నా అనుభవంలో ఉన్నాయి. విజయానికి, ధనసంపాదనకు, కుటుంబ సౌఖ్యాలకు ఇంకా మనకు జరిగే అన్ని మంచి విషయాలకూ పుణ్యబలమే కారణం.

బిల్డర్ ఒకాయన హైదరాబాదు నిజాంపేట రోడ్డులో చాలా పెద్ద అపార్ట్‌మెంట్సు సముదాయం నిర్మాణం తలపెట్టి షుమారు 1000 ఫ్లాటులు అమ్మాడాయిన. ఆరోజుల్లో అది ఊరు చివర ప్రాంతం గావటాన, అక్కడెవరూ కొనరనే అందరూ అభిప్రాయ పడ్డారు. కాని అమ్మాక ఆయనకు అందరూ బ్రహ్మారథం పట్టారు. పెద్ద ప్రాజెక్టు కాబట్టి సహజంగానే విపరీతంగా లాభపడ్డాడాయన. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఒక మెగా ప్రాజెక్టు ప్లాన్ చేసి ముందుకు వెళ్లటం వరకే మన ప్రతిభ ఉంటుంది. దానికి జనం స్పందించటం రెస్పాన్సు రావటం అనేది మన చేతుల్లో ఉండదు. ఆ ఫ్లాటులు జనం కొనకపోతే ఆయన ఏం చేయగలిగేవాడు? అనేకమంది వైఫల్యాలు చెంది తెరమరుగవటం వలన మన దాకా వారి సంగతి రాదు. విజయం సాధించిన వారి విషయమే మన అందరికీ తెలుస్తుంది.

చేసుకున్న వారికి చేసుకున్నంత అనేది జన బాహుళ్యంలో ప్రచారంలో ఉన్న సామెత. ఇది పుణ్యబలానికి ఉద్దేశింపబడిన విషయమే! బుద్ధి కర్మానుసారిణి అని ఒక నానుడి ఉంది. అంటే మనకు ఏమి జరగాలని రాసిపెట్టిఉందో, దాని కనుగుణంగా మన బుద్ధి పనిచేస్తుందని అర్థం. మనం మంచి జరగాలని సంకల్పించినా, మన ప్రారబ్ధకర్మ బలంగా ఉన్నట్లయితే, దానికి దోహదపడే సంఘటనలు క్షణాల్లో అభివృద్ధి చెంది ఆకస్మిక కష్టాలు ఎదురవుతాయి. వాటిని స్వీకరించి ఓర్పుతో ఆ కాలాన్ని దాటటం వలన పాపకర్మలు నశించి శుభపరిణామాలకు దారి తీసే అవకాశం ఉంటుంది.

భగవద్గీతలో చెప్పినట్లుగా ఫలితం ఎలా ఉన్నప్పటికీ నిరంతరం

మన పని మనం చేసుకువెళ్లటం సదా ఆచరింపదగిన సూత్రం. ***విశ్వమానవ ప్రేమ, మానవ సంబంధాలలో ఎదుటి వారి కోణం నుండి ఆలోచించగల్గటం, మరీ నచ్చని విషయాల పట్ల ఎక్కువ స్పందించకుండా, తామరాకు మీద నీటి బొట్టు లాగా ఉండటం వలన పాపకర్మలు నశించి విజయావకాశాలు మెరుగవుతాయి.***

## ప్రశ్న : దీర్ఘకాల వైరాలు ఎందుకు ఏర్పడతాయి?

**జవాబు :** అవతలి వ్యక్తులు చేసిన పనులు బాగా వేదన కల్గించి మనసు మీద ముద్రవేస్తాయి. వేదన తాలూకు తీవ్రత వలన కొంతా, తర్వాత గొలుసు కట్టులాగా అనేక సంఘటనలు జరిగి అదే వ్యక్తి వలన పదే పదే బాధపడటం జరిగితే ఇక ఆ వైరం సమసిపోదు. అయితే అవతలి వ్యక్తులు తమ తప్పు తెలుసుకుని పశ్చాత్తాపబడి క్షమాపణ కోరితే సహజంగానే వైరం సమసిపోతుంది. ***జీవితంలో సింహభాగం అయిపోయాక వృద్ధ నారీ పతివ్రతలాగా ఇలాంటి క్షమాపణల వలన ప్రయోజనం ఏమీ ఉండదు.*** ధన, మాన, ప్రాణాలకు సంబంధించిన నష్టాల విషయంలో అసలు 'క్షమ'కు తావుండటం కూడా కష్టమే. క్షమాగుణం గొప్పదని క్షమించటం వలన పాపకర్మలు నశింపబడతాయని నీతి కోవిదులు కొందరు చెబుతారు. కాని ఇతిహాసాలలో కూడా పంతము, ప్రతిజ్ఞలే కనబడతాయి.

ద్రౌపతిని నిండు సభకు రప్పించి వలువలు విప్పించిన సంఘటన విషయంలో భీముడు దుర్యోధన దుశ్శాశనులను ఎందుకు క్షమించలేక పోయాడు? అంటే క్షమించాలనే భావన వేదన తాలూకు తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా దీర్ఘకాల వైరాలు, దగ్గర బంధుత్వాల మధ్యే ఏర్పడతాయి. గత జన్మ దోషాల వలన ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటాయి.





## ప్రశ్న : జన్మలు, కర్మ, సింగినాదం అని మీరు చెబుతున్నారు. ఇవన్నీ పాపభీతి ఉన్న వారికి పరిమిత మవుతున్నాయి. కాని వీటి మీద నమ్మకం, గౌరవం లేకుండా అనేక నేరాలు చేస్తూ తప్పించుకుని రాజభోగాలు అనుభవిస్తున్న వారిని 'కర్మ' ఫలం అంటటం లేదు. ఎందువలన?

**జవాబు :** కర్మఫలం అనుభవించటం లేదని మీరు ఎందుకు అనుకుంటారు? పైగా పాపాలు చేసిన వారికి రాజభోగాలు అనుభవించే అర్హత లేదని మీరు అనుకుంటున్నారు. ఏ రకమైన పాపం చేస్తే దానికి సంబంధించిన 'శిక్ష' అనుభవిస్తారు. వారు గతంలో అనేక పుణ్యకర్మలు చేసి ఉన్నందువలనే వారంతా రాజభోగాలు అనుభవిస్తున్నారని అర్థం చేసుకోవాలి. రోడ్డు నిర్మించకుండా రోడ్డు వేశామని పేమెంటు తీసుకున్న కంట్రాక్టరు, ఆ తర్వాత ఆ దారిలో సరైన రోడ్డు లేనందువలన జరిగే వాహన ప్రమాదాలకు కూడా కారణమవుతాడు. ఈ పాపం అతన్ని ఊరికే వదలదు. ***కర్మఫలం అనుభవంలోకి రావటానికి తగిన సమయం అవసరమవుతుంది. ఈ లోగా వీక్షకులు అనవసరంగా ఆందోళనకు గురవుతారు. తమాషా ఏమంటే ఇలా ఆందోళన పడటం కూడా కర్మ ఫలమే.***

## ప్రశ్న : కర్మ-జన్మ అనేవి హిందూ దేశంలో ఉన్న వారికేనా? అమెరికాలో ఉన్న వారంతా బాగానే ఉన్నారు?

**జవాబు :** కర్మ సిద్ధాంతం అనేది ఒక ప్రకృతి నియమం. అమెరికాలో ఉన్నప్పుడు అక్కడ జన జీవితాలను పరిశీలించాను. విద్య, ఉద్యోగాలు, వనరులు వీటికి ఏమీ లోటు లేదు. వంద కోట్ల జనాభా ఉన్న ఇండియా

భాగం కంటె అమెరికా ఎన్నో రెట్లు పెద్దది. ఇక అక్కడ జనాభా కేవలం నలభై కోట్లు. తక్కువ జనం ఎక్కువ ప్రదేశంలో ఉండటం వలన సహజంగా సమృద్ధిగా వనరులు ఉంటాయికదా? అయితే భావోద్వేగాల విషయంలో అందరూ ఒకటే. అమెరికాలో కూడా అల్పాదాయ వర్గాలవారు, వికలాంగులు, స్థూలకాయం వలన బాధపడేవారు అందరూ ఉన్నారు. కష్టం వస్తే ఇక్కడా కన్నీళ్లే వస్తున్నాయి.

## ప్రశ్న : ఇండియాలో సంకుచితత్వం పాలు ఎక్కువంటారా?

**జవాబు :** కొంతమంది సంకుచితంగా ఉండవచ్చునేమోగాని, మొత్తం దేశానికి సంకుచితత్వాన్ని అంటగట్టలేము. ***నిజం చెప్పాలంటే, జన జీవితాలను ప్రభావితం చేసే గురువులు, సత్పురుషులు, పండితులు, విజ్ఞానవేత్తలు మనకు కోకొల్లలు. తమ జీవితాలను పునీతం చేసుకుని మోక్షం కోసం ప్రయత్నించే వారికి ఇండియాలో మార్గదర్శకత్వం దొరుకుతుంది.***

ఇండియా వెనకబడటానికి అధిక జనాభాయే ప్రధాన కారణం. ఒక ఉదాహరణ చూద్దాం. బుట్ట నిండా బూరెలు ఉన్నాయి. ఆ గదిలో ఇద్దరే ఉన్నారు. ఆకలిగా ఉన్నారు. అయినా వారిలో ఏ ఒక్కరూ ఆబగా గంప మీద పడిపోవటం చేయరు. కొన్ని బూరెలు పర్సనల్‌గా దాచుకోవాలన్న ధ్యాస, ఆశ రెండూ ఉండవు. ఒకవేళ బుట్టలో నాలుగే బూరెలున్నాయి గదిలో ఎనిమిది మంది వ్యక్తులున్నారు. ఖచ్చితంగా అందరి మదిలో ముందుగా ఒక 'అభద్రతా భావం' మొదలవుతోంది. బూరెలు తమకు అందవేమోనని భయం ప్రారంభమవుతుంది. అభద్రత నుండి స్వార్థం,





స్వార్థం నుండి దోచుకుని దాచుకోవాలనుకునే దుర్బుద్ధి, తద్వారా కుయుక్తులు అవలక్షణాలన్నీ మొదలవుతాయి. ఈ పరిస్థితులలో ఆ ఎనిమిది మందిలో ఒకరికి వనరులు సమానంగా పంచమని నాయకత్వం అప్పగించితే ఏమవుతుంది? అప్పటికే అభద్రతా భావం ఉన్న జనం నుండి వచ్చిన వ్యక్తే గదా! ఇప్పుడు అధికారం ఉంది. బూరెలు స్వంతానికి దాచుకోవటానికి సులభమైన మార్గం ఏర్పడింది. దీన్ని గమనించిన మిగిలినవారు ఆ పదవికోసం బ్రతికినన్నాళ్లు పాకులాడతారు. తమ పిల్లలను ఆ కుర్చీలో కూర్చోబెట్టాలని నేలవిడిచి సాముచేస్తారు.

నిజం చెప్పాలంటే ఇక్కడ అందరికీ అన్నీ సరిపోయినంత వనరులున్నాయి. ఆర్గనైజ్ చేసే నాయకులే కరువయ్యారు. జీవితం మూన్నాళ్ల ముచ్చటనే జ్ఞానం అందరికీ ఉన్నప్పటికీ, కన్వీనియంట్‌గా మరిచిపోతున్నారు. బిడ్డలందరి ఆకలి తీరిన తర్వాతే తాను తినాలనుకుంటుంది తల్లి. అది కూడ మిగిలితేనే, లేకుంటే పస్తుంటుంది. మనకు తల్లి లాంటి నాయకుల కొరత ఉంది. అభద్రతా భావం లేని నాయకుల కొరత ఉంది. ధార్మిక చింతనగల నాయకుల కొరత ఉంది. పాపభీతి గల నాయకుల కొరత ఉంది. నిజాయితీగల నాయకుల కొరత ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుల కొరత ఉంది. అయినప్పటికీ పర్వాలేదు. వృద్ధ నాయకులు కాలం చేయకా తప్పదు. నూతన ఉత్తేజంతో బాధ్యత గల నవతరం రాకా తప్పదు. మార్పు అనివార్యం. వేచి చూడవలసిందే.

## ప్రశ్న : మెరుగైన మానవ సంబంధాలకు వేడుకలు తోడ్పడతాయా?

**జవాబు :** కారణాంతరాల వలన అయిష్టత తద్వారా విముఖత ఏర్పడిన సందర్భాలలో వేడుకల సందర్భంగా మరలా ఆ ప్రతికూల మానసిక పరిస్థితి

నుండి బయటబడి వ్యక్తులు సంతోషంగా కలిసిపోవటం మనం చూస్తూనే ఉన్నాము. అందుకే ఎవరైనా బంధువులు మనం జరుపుకునే వేడుకలకు హాజరు కానపుడు వాళ్లు రాలేదు కాబట్టి మనం వెళ్లకూడదు అని తీర్మానించుకోక, జరిగిన పరిస్థితి విశ్లేషించుకుని తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. కనీసం ఎందువలన రాలేకపోతున్నారో వాళ్లు పారదర్శకతతో కారణం తెలియజేసిన యెడల విభేదాలకు తావులేకుండా ఉంటుంది. అయినా ఒక వేడుకకు రాలేని వారు మరొక వేడుకకు వచ్చే అవకాశం ఉంటుంది. ఇవన్నీ అయినవాళ్ల మధ్య అనుబంధాలకే వర్తిస్తుంది. వృత్తిరీత్యా, లావాదేవీల రీత్యా ఏర్పడే రాకపోకల విషయంలో ఎవ్వరూ సీరియస్‌గా తీసుకోరు. ముందే చెప్పినట్లు మానవ సంబంధాలన్నీ అవసరాల ప్రాతిపదికగా ఏర్పడేవే!

## ప్రశ్న : నవ్వు యొక్క ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు :** నవ్వు నాలుగు విధాల చేటనే పాత సామెత సందర్భోచితం కాని నవ్వుకు మాత్రమే వర్తిస్తుంది. నవ్వు ఆరోగ్యకరమేకాదు, మనిషిలో నూతనోత్సాహం కల్గించి మనోవ్యాకులతను క్షణాల్లో పోగొడుతుంది. నవ్వుతూ పలకరించటం వలన అవతలి వారిలో కూడా అనుకూల భావనలు అంకురిస్తాయి. ముఖం చిరాగ్గా పెడితే చూసేవారికి కంపరం అయిష్టం కల్గుతాయి. మనం నవ్వుతూ ఆహ్లాదకరంగా ఉండటం ఒకటే సరిపోదు. ***నిరంతరం ముఖం చిరాగ్గా పెట్టి మాట్లాడే వాళ్లను దూరంగా పెట్టాలి. అలాంటివారి హావభావాల వలన నెమ్మది నెమ్మదిగా ప్రతికూల భావనలు అభివృద్ధి చెందుతాయి.*** ముఖ్యంగా తప్పనిసరిగా ముఖం చూడవలసి వచ్చే పనివాళ్ళ విషయంలో ఇలాంటి వ్యక్తులను నియమించుకోగూడదు.





చెడును పదిరూపాయలు అదనంగా ఇచ్చి తొలగించుకోవాలని ఆర్యోక్తి. అలాగే మనం వేరొక చోట పనిచేయవలసి వస్తే, ముఖం గంటు పెట్టుకొని ఉండే బాస్‌కు వీలైనంత దూరంగా ఉండటం, అలా వీలుకాని పక్షంలో నిదానంగానైనా మరో ఉద్యోగం చూసుకోవటం ఉత్తమం (ప్రొప్రైటర్ షిప్ సంస్థల విషయంలో మాత్రమే ఈ సూత్రం వర్తిస్తుంది).

## ప్రశ్న : పరిహాసాలు మంచివేనా?

**జవాబు :** ఇటీవల ఒక సినిమాలో సేవకుడు తన యాజమానితో (హీరోతో) పరిహాసంగా మాట్లాడుతాడు. హీరో అతన్ని రెండు మూడు ప్రశ్నలు అడుగుతాడు. సేవకుడు సంతృప్తికరంగా జవాబులు ఇవ్వలేకపోతాడు. ఆ సేవకుడిని తల్లకిందులుగా పట్టుకుని (ఇతర సేవకులు పట్టుకుంటారు) హీరో "జీతాలిచ్చే వాళ్ల మీద జోకు లేస్తే జీవితం తల్లకిందులవుతుంది రోయ్" అని అంటాడు. ఈ సన్నివేశం సినిమాలో పండిందనే మాట అలా ఉంచితే, పరిహాసాల విషయంలో ఒక జీవన సత్యం మరియు సందేశం ఉన్నాయి. (రచయిత త్రివిక్రమ శ్రీనివాస్‌కు అభినందనలు మరియు కృతజ్ఞతలు) పరిహాసానికి ప్రాథమికంగా సమస్థాయి లేదా సందర్భం ఉండాలి. ఎవరు ఎవరినైనా పరిహసించటం సరికాదు. ఒక స్త్రీ పరిహాసంగా నవ్వినందుకు కురుక్షేత్ర మహాసంగ్రామం జరిగింది. ఒకసారి నేను నా భార్య మా అబ్బాయి కాంచీపురం వెళ్లాము. మేము తిరిగి వస్తుండగా కంచి బస్టాండులో, నేను మా అబ్బాయి కొంచెం ముందుకు నడుస్తుండగా జనం రద్దీగా ఉండి, నా శ్రీమతి వెనకబడిపోయి కనిపించలేదు. ఐదు నిమిషాల్లో గుర్తించాము. అప్పటికే నా భార్య కళ్లలో నీళ్లు నింపుకుని "మీరిద్దరూ వెళ్ళిపోయారనుకున్నాను" అంది భావోద్వేగంతో. అప్పుడు

మా అబ్బాయి 'అలా ఎలా వెళ్తాం అమ్మా, సూటుకేసు నీ దగ్గర ఉండి పోయిందిగా' అన్నాడు. Joke should not be a fact – అనేది ఒక నియమం. హాస్య స్ఫూర్తి అందరికీ ఉండదు. సందర్భం, అవతలి వారి మనోభావాలు పరిగణనలోకి తీసుకొని ఛలోక్తులు విసరాలి. బావ బావమరిది లేదా వదినా మరదళ్ల మధ్య పరిహాసాలు కూడా శృతి మించకుండా ఉంటే మంచిది. తాను చెప్పాలనుకున్నది ఛలోక్తుల ద్వారా చెప్పటం కూడా ఒక మంచి సంస్కారం.

## ప్రశ్న : కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడటం మంచి లక్షణమేనా?

**జవాబు :** కొంత మంది ఏదో ఒక మాటతో అవతలి వారిని చిన్న బుచ్చి 'నేను మనసులో ఏదీ దాచుకోను. కుళ్ళుకుతంత్రాలు నాకు తెలియవు. కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడతాను' అని తమను తాము సమర్ధించుకుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం మంచి లక్షణం. కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడటం చెడ్డలక్షణం. రెండూ ఒక్కలా కన్పించే పరస్పర విరుద్ధ లక్షణాలు. కొంతమంది నాతో అంటూ ఉంటారు. "మీరు ఏమీ అనుకోనంటే ఒక మాట చెబుతాను" అని. నేను వెంటనే ఏమన్నా అనుకునేది అయితే చెప్పటం ఎందుకు? అని నవ్వుతాను. మన శ్రేయస్సు కోరే వారయితే అదే మాట ఈ విధంగా అంటారు. "మీరు ఏమన్నా అనుకోండి. నేను ఒక విషయం చెప్పదలచాను". ఇలా అనటంలో ఆ విషయం చెప్పటం మంచిదేనన్న వారి కాన్ఫిడెన్సు వ్యక్తమవుతోంది.

ఏది ఏమైనా కమ్యూనికేషన్‌లో అతి ముఖ్యమైనది మాట. వాక్కు అగ్ని స్వరూపం అని శాస్త్రం చెబుతుంది. మాట మృదువుగా, స్పష్టంగా





తీయగా అవతలి వారు ఇష్టంగా వినేటట్లుండాలి. అప్రియమైన సంభాషణ మంచిది కాదు. అందుకే భగవద్గీతలో 'భావం కలుగగానే వ్యక్తం చేయకూడదు' అని చెప్పబడింది. భావం కలుగగానే వివేకంతో యోచించి, ఉచితానుచితాలు గమనించి, అవసరమైతేనే ఆ భావం వ్యక్తీకరించాలని ఆ వ్యాఖ్య సారాంశం. ***'పెదవి దాటితే పృథ్వి దాటుతుందని' బాల్యంలో ఒకానొక సందర్భంలో మా చంద్రమౌళి తాతయ్య నాతో అన్నాడు. అప్పటి నుండి నేను ఆచితూచి మాట్లాడటం నేర్చుకున్నాను.*** తిండేకాదు భాషణ కూడా మితంగానే ఉండాలి. కొట్టినట్లు మాట్లాడటం, నా మాట తీరే అంతని సమర్ధించుకోవటం బాధ్యతారాహిత్యం అవుతుంది.

## ప్రశ్న : కసురుకోవటం, ఈసడించి మాట్లాడటం వలన అనర్థాలేమిటి?

**జవాబు :** కసురుకోవటం, ఈసడించటం, విదిలించటం, గదమాయించటం ఇంచుమించుగా ఒకే రకానికి చెందిన లక్షణాలు. బాల్యంలో పిల్లలను పెద్దవాళ్లు కసురుకుంటూ, విసుక్కుంటూ పెంచడం వలన ఆ పిల్లలలో ఆత్మవిశ్వాసం కొరవడుతుంది. పెద్దయ్యాక కూడా వారిని భయం వీడిపోదు. ఏం మాట్లాడితే ఏం వస్తుందోనని ఆందోళన చెందుతుంటారు. సంభాషణలో చిరాకుపడటం, మధ్య మధ్యలో విసుగు వ్యక్తం చేయటం, కసురుకోవటం వలన సంబంధాలు దెబ్బతింటాయి. ***నెలలో 29 రోజులు ఎవరితోనైనా జాగర్తగా మాట్లాడి, 30 వ రోజున కసురుకుంటూ మాట్లాడితే ఆ 29 రోజుల సంభాషణ గుర్తు ఉండదు కాని, ఈ 30 వ రోజు కసురుకున్న దృశ్యం వారి మదిలో నిలిచి పోతుంది.*** కొంతమంది అయినదానికి కాని దానికి విసుక్కొంటూ పెడర్థాలు తీస్తుంటారు. ముఖ్యంగా కుటుంబ సంబంధాలలో

కుటుంబ యజమాని ఈ తరహా వ్యక్తి అయితే, అతని భార్యబిడ్డలు ఆత్మన్యూనతతో బాధపడ్తుంటారు. అంతేకాదు ఆ యాజమాని నుండి ఇదొక అంటు వ్యాధిలాగా కుటుంబ సభ్యులందరికీ సంక్రమించి, మిగిలిన బంధువుల చేత తిరస్కరింపబడతారు. కొన్ని తప్పనిసరి బాంధవ్యాల కారణంగా రాకపోకలు తటస్థించినా హృదయపూర్వకంగా ఎవ్వరూ వారి దగ్గరకు రారు. కసురుకోవటం, విసుక్కోవటం అలవాటున్న వ్యక్తికి పెద్ద ఉద్యోగ హెూదా ఉన్నట్లయితే, అతని కింద పని చేసే సిబ్బంది అంతా అతన్ని తిట్టుకుంటూ ఉంటారు. అతనికి తెలియకుండానే శత్రువులు అభివృద్ధి చెందుతారు. జనసహకారమే అభివృద్ధికి మూలం. ప్రత్యేక ప్రతిభ వలన అధికారం హెూదా సంక్రమించినా అందరినీ తిరస్కార భావంతో చూడటం వలన మంచి బాసుగాను, మంచి నాయకుడుగాను రాణించటం కష్టం. మొత్తం మీద ఇంటా బయటా సంబంధాలు బెడిసికొడతాయి. ఇల్లయినా, ఆఫీసైనా మాటతీరు, ప్రవర్తన, అవతలి వారికిచ్చే ప్రాధాన్యత చాలా ముఖ్యం.

## ప్రశ్న : నిర్లక్ష్యం గురించి చెప్పండి?

**జవాబు :** నాకు తెలిసిన వ్యక్తి ఒకతను ఉన్నాడు. గత పాతిక సంవత్సరాలలో ఫోన్ చేయగానే అతను లిఫ్ట చేసిన సందర్భాలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చును. ఎప్పుడూ ఫోన్ తీసే వాడుకాదు. నింపాదిగా రెండు రోజులాగి "మొన్న ఎప్పుడో కాల్ చేసినట్లున్నారు' నేను ఇప్పుడే చూశాను". – అని ఏదో అతకని సమాధానం చెప్పేవాడు. లక్కీగా అతనితో నేను వ్యవహార లావాదేవీలు ఏమీ పెట్టుకోలేదు. అతని నిర్లక్ష ప్రవర్తన చిరాకన్పించి ఫోన్ చేసే వాడిని కాను. కాని అనుకోకుండా ఎక్కడైనా తారసపడేవాడు. 'కావాలని ఫోన్ ఎందుకు తీయకుండా ఉంటాను' అంటూ ఏవో ఇబ్బందులు





వ్యక్తం చేసేవాడు. మళ్లీ రిలేషన్ రెన్యువల్ అయ్యేది. కాని మరల మరల అలాగే ప్రవర్తించేవాడు. అతను చాలా నిర్లక్ష్య స్వభావం కలిగి ఉంటాడు. నాకు ఒకసారి ఫోన్ చేసి తాను ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు వద్ద ఉన్నానని, అర్జంటుగా తనకు డబ్బు అవసరమైనందున బెంగుళూరులో ఉన్న తన తమ్ముడు పంపించటానికి ఏర్పాటు చేసుకున్నానని, కాని తనకు ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకులో అకౌంటు లేనందున, నా బాంకు నంబరు చెప్పమని అడిగాడు. అతని తమ్ముడు నా అకౌంటుకు డబ్బు ట్రాన్స్‌ఫర్‌చేస్తే, అది ఎ.టి.ఎమ్. ద్వారా 'డ్రా' చేసి నేను అతనికి ఇవ్వాలి. వెంటనే నంబరు తెలియజేశాను. మనీ 'డ్రా' చేసి ఇచ్చాను.

నేను అప్పుడు చెప్పాను. "నువ్వు బ్యాంకు నుండి ఒక అర్జంటు అవసరం కోసం నేను తెలిసిన వాడినని ఫోన్ చేశావు. కాని నేను గాని మరొకరు గాని నీ కాల్ వెంటనే లిఫ్ట చేయకపోతే, నీకు పనెలాజరుగుతుంది? నేను కూడా రెండు రోజులాగి నీకు బదులిస్తే ఎలా ఉంటుందని అతన్ని ఎడ్యుకేట్ చేశాను". కానీ అతను ఏమీ మారలేదు. అతన్ని ఎంటర్ టైన్ చేసిన పరిచయస్థుల సహకారం క్రమంగా అతను కోల్పోవటం నేను కళ్లారా చూశాను. నిర్లక్ష్యం సంబంధాలను దెబ్బ తీస్తుంది. ఇది ఒక భయంకరమైన లక్షణం. యంగ్ ఏజ్‌లో కొత్త సర్కిల్సు ఏర్పడతాయి. కాబట్టి నెట్టుకు రాగల్గినా ఒక వయసు వచ్చాక కొత్త స్నేహాలు ఏర్పడక, పాత స్నేహాలు నష్టపోయి ఇబ్బందిపడవలసి వస్తుంది.

## ప్రశ్న : శీలం యొక్క ప్రాముఖ్యత ఏమిటి?

**జవాబు :** సంపూర్ణ వ్యక్తిత్వానికి శీలం ప్రధానమని స్వామి వివేకానంద చెప్పారు. శీలం అంటే శారీరకంగా పవిత్రంగా ఉండటమనుకుని

చాలామంది అపోహ పడ్తుంటారు. శీలం అంటే మొత్తం వ్యక్తిత్వానికి సంబంధించిన అంశం. ఈ పుస్తకంలో ఇప్పటి వరకు మనిషికి ఉండవలసిన మంచి లక్షణాలను కొన్ని చెప్పుకున్నాము. ఎవరికైనా ఒకటి రెండు బలహీనతలుండటం సాధారణ విషయం. కాని ఎక్కువ శాతం బలమైన వ్యక్తిత్వం ఉండాలి. ముఖ్యంగా ***ఎవరైతే ఎదుటివారిని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కించపరిచే విధంగా మాట్లాడకుండా గౌరవంగా మాట్లాడతారో, వారంతా మంచి వ్యక్తిత్వం గలవారని నా ఉద్దేశం.*** ఎదుటి వ్యక్తి కోణం నుండి ఆలోచించటం, రిలేషన్సులో అవతలి వారికి ప్రాధాన్యత నివ్వటం, క్షమాగుణం, ఓర్పు, అన్ని సమయాలలోనూ సమతుల్యతతో ప్రవర్తించటం శీలానికి కొలమానాలుగా చెప్పవచ్చును.

## ప్రశ్న : జూదం రిలేషన్సును ఏ విధంగా హాని చేస్తుంది?

**జవాబు :** మహాభారత కాలంలో జూదమంటే పాచికలాట. అదే ఈ కాలంలో అయితే పేకాట. జూదము వ్యసనాలన్నింటిలోకి నీచమైందని ఎందుకు అన్నారంటే, పేకాట గాకుండా ఇతర వ్యసనాలద్వారా మనిషి పతనమవటానికి చాలా కాలం పడ్తుంది. అదే పేకాట అయితే తక్కువ కాలంలో సర్వం పోగొట్టుకుని వీధిన పడ్తుంటారు. పెద్ద పెద్ద నగరాలలో ప్రత్యేకించి పేకాట క్లబ్బులున్నాయి. క్లబ్బుకు వెళ్లటం ఎవరో ఒకరు పరిచయం చేయటం వలన ప్రారంభమవుతుంది. ఇక ఆ తర్వాత అది ఎంతవరకు తీసుకువెళుతుంది, ఎక్కడ వరకు ఆ పతనం కొనసాగుతుందనేది మరలా 'కర్మ' మీద ఆధారపడి ఉంటుంది. బాధ్యతలు అన్నీ పూర్తి చేసిన తర్వాత పేకాట క్లబ్బుకు వెళ్లటం మరీ అంత ప్రమాదం లేదు గాని, యౌవన కాలంలో క్లబ్బులు పరిచయమైతే ఇక ఆ వ్యక్తి అభివృద్ధి ఏమి సాధించలేడు.





రాత్రి 10గంటల వరకు క్లబ్బులో పేకాట ఆడి ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరేవాళ్లు భార్యాబిడ్డలను మాత్రం ఏం పట్టించుకుంటారు? అది ఒక విషయవలయం. ఊబిలో పడ్డవాడు ఏ విధంగా బయటకు రాలేడో, ఆ విధంగా ఏ రోజుకారోజు అందులో ఇంకా ఇంకా కూరుకుపోతూనే ఉంటారు. ఇంటా బయట చిన్నచూపు, క్లబ్బు తప్ప బంధువులను, స్నేహితులను పట్టించుకోకపోవటం వలన సంబంధాలు దెబ్బతింటాయి. ఉన్నది పోయాక అప్పులు చేస్తారు కాబట్టి ఆ విధంగా తెలిసిన వారందరితో ఇబ్బందులు ఎదరవుతాయి. ఆర్థిక స్థాయి బేధం తప్ప పేకాట వ్యసన పరులందరిదీ ఒకే రకమైన విషాదపరిస్థితి. బయట పడేంతవరకు ఇది కొనసాగుతుంది.

## ప్రశ్న : అన్ని దుఃఖములకు మూల కారణం కోరికలే అన్నాడు బుద్ధుడు. కోరికలను వదిలేస్తే ప్రశాంతంగా జీవించవచ్చునా?

**జవాబు :** వేదాంతం వేరు, జీవన పోరాటం వేరు. బుద్ధుడు చెప్పింది నిజమైనప్పటికీ సంసారిక జీవితంలో బాధ్యతలు నిర్వర్తించటమే ధర్మం. ఒంటరిగా జీవించే వారికి కూడా కనీస అవసరాలు తీరాలంటే ఏదో ఒక పని, తద్వారా వచ్చే ఆదాయం కావాలి. కోరికలు లేకుంటే అసలు జన్మే ఉండదు కదా? ఒక బిడ్డగా, తండ్రిగా, భర్తగా, కన్నవారినీ, కట్టుకున్న వారినీ అందరినీ సంతోషపెట్టి సజావుగా బాధ్యతలు నిర్వర్తించాలి.

బుద్ధుడి ప్రవచనాలు నిజంగా అర్థమై, దానికి ప్రభావితమైతే మరుజన్మ లేకుండా మోక్షం కోసం ప్రయత్నించ వచ్చును. కాని అంతా మాయ అనుకుంటే నమ్ముకున్న వాళ్లు అన్యాయమైపోతారు.

కోరికలు తీరే కొద్దీ కొత్త కోరికలు పుట్టుకు వస్తాయంటారు గాని అది పూర్తి నిజం కాదు. జీవితంలో కొన్ని తప్పనిసరి. వాటిని సాధించి అనుభవిస్తేనే అందం, ఆనందం. వేదాంతం అసమర్ధత, పలాయనవాదం నుండి ఉద్భవించకూడదు.

అన్ని దుఃఖములకు మూలకారణం కోరికలు కాబట్టి కోరికలను చంపుకుంటే ప్రశాంతతరాదు. కోరికలను తీర్చుకునే స్థోమత సంపాదించి, బాధ్యతలు నిర్వర్తించి ఆ పిమ్మట కోరికల పట్ల వ్యామోహం వదులుకుని అందరి మధ్యా ఉంటూ డిటాచ్డెగా కాలం గడుపుతూ మోక్షం కోసం నిరంతరం ప్రయత్నిస్తూ సఫలీకృతుడవటానికి కృషి చేయాలి. ఇంకా అనుభవించాల్సిన కర్మ ఫలాలు ఏమైనా మిగిలి ఉంటే, మరు జన్మ తీసుకోవలసి వచ్చినా, ఆ తర్వాతైనా మోక్షం దొరుకుతుంది. ***ఈ జన్మలో బుద్ధుడి ఫిలాసఫీ అర్థమైతే చాలు, జన్మ చరితార్థమైనట్లే. ఒకేసారి కోరికలు చంపుకుని సన్యాసుల్లా మారనవసరం లేదు.***

## ప్రశ్న : సంకల్ప బలం అంటే ఏమిటి?

**జవాబు :** కోరిక యొక్క పై స్థాయి. కోరిక నేరవేర్చుకోవటానికి త్రికరణ శుద్ధిగా సిద్ధంగావటమే. ఎప్పుడైతే ఆలోచనల నిండా ఆ కోరిక, అది నేరవేరటానికి తగిన ప్రణాళిక, ఆచరణ కృషి తోడయిందో అది ఖచ్చితంగా జరిగితీరుతుంది. సంకల్పించిన వ్యక్తికి అది నెరవేరటం దృశ్యరూపంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఎంత బలంగా నమ్మకంగా అనుకుంటే అంత త్వరగా రూపకల్పన జరిగి, పిమ్మట వాస్తవ రూపం దాలుస్తుంది.





## ప్రశ్న : కృషి, పుణ్యబలం ఈ రెండింటి ఉనికి స్పష్టంగా వివరించగలరా?

**జవాబు :** ఒకసారి ఐ.ఐ.ఎమ్. బెంగుళూరులో తనకు సీటు రాలేదని, తన కంటే తక్కువ టాలెంటు ఉన్న తన క్లాస్‌మెట్‌కు సీటు వచ్చిందని ఒక స్టూడెంటు నా వద్దకు వచ్చి అయోమయంతో అడిగాడు. 10వ తరగతిలో 86%, ఇంటర్‌లో 92%, బి.టెక్‌లో 75% వచ్చిన ఆ స్టూడెంట్ ఆవేదనలో అర్థం ఉంది. అలాగని ఐ.ఐ.ఎమ్.లకు అవకతవకలు ఆపాదించలేము. కృషి వలనే ఆ స్టూడెంట్ అక్కడ వరకు వెళ్లగలిగాడన్నది నిర్వివాదాంశం. కాని తనకంటే తక్కువ టాలెంటు గల వ్యక్తికి సీటు రావటం పుణ్యబలానికి నిదర్శనం అని నేనంటాను.

ఇలా సింపుల్‌గా సమాధానం చెబితే ఏ పాఠకుడూ సంతృప్తి చెందడు. పుణ్యబలం అనే పాయింటుకు వ్యతిరేకం గాకపోయినా ఎక్కువ టాలెంటు గల వ్యక్తికి సీటు రాకుండా తక్కువ టాలెంటు గల వ్యక్తికి సీటు ఎలా వచ్చిందనేది తార్కికంగా కూడా ఋజువు కావాలి. అక్కడ ఎలా జరిగిందంటే గ్రూపు డిస్కషన్స్ పదేసి మందితో కండక్టు చేస్తారు. గ్రూపు డిస్కషన్స్‌కు పిలువబడిన వారిలో అత్యధిక టాలెంటు గల పదిమంది యాదృశ్చికంగా ఒకే గ్రూపుగా పిలువబడ్డారనుకుందాం. నా వద్దకు వచ్చిన స్టూడెంటు ఈ గ్రూపులో ఉండి, అతని క్లాస్‌మెట్ వేరొక గ్రూపులో ఉండి, అతను తనకంటె ఇంకా తక్కువ టాలెంటు గల అభ్యర్థులతో గ్రూపు డిస్కషన్స్‌లో పాల్గొనే అవకాశం లభించితే, సీటు వచ్చే విషయంలో ఫేటు మారిపోలేదా? పుణ్యబలం వలన యోగం, దానికనుగుణంగా పరిస్థితులు చిత్రంగా మారిపోతాయనటానికి ఇదొక ఉదాహరణ. ఈ పుస్తకం మొదట్లోనే చెప్పినట్లు 'కృషి' ఎల్లవేళలా అనుసరించదగిన మార్గం. నా వద్దకు వచ్చిన

స్టూడెంటు ఆ మరుసటి సంవత్సరం మరల ప్రయత్నించి ఎన్నికయ్యాడు. కృషి యొక్క ఉనికి, పుణ్యబలానికి ఋజువు ఇక్కడ స్పష్టంగా కనిపించాయి కదా!

చాలామందికి అర్థమయ్యే మరో ఉదాహరణ చూద్దాం. మా టివి–మీలో ఎవరు కోటీశ్వరుడు (ఎమ్.ఇ.కె) ప్రోగ్రాంకు లక్షలాది ధరఖాస్తులు వచ్చాయట. వడపోతలో పోయిన లక్షలాది మందిని వదిలేద్దాం. వారు కూడా పెద్దగా బాధపడరు. కాని ఇన్ని లక్షల మందిలో ఎన్నిక కాబడిన వందల మంది గురించి మాత్రం ఇక్కడ మాట్లాడుకుందాం.

ఎన్నిక కాబడిన వారితో ఆట ప్రారంభమవుతుంది. కాని అక్కడ నుండి హాట్ సీటుకు రావాలంటే మరో 3 ప్రశ్నలకు అక్కడున్న అందరికంటే వేగంగా మరియు కరెక్టుగా జవాబులు చెప్పాలి. వారికే హాట్ సీటులో ప్రవేశం దక్కుతుంది. ఇక్కడి వరకూ వచ్చి హాట్ సీటుకు రాలేక తిరిగి వెళ్లినవారు చాలా మంది ఉన్నారు. ఎంతో మంది వీక్షించిన ఈ ప్రోగ్రాంను ఉదాహరణగా ఎందుకు చెబుతున్నానంటే, అందరికీ ఋజువుగా ఉంటుందని. మనం ఏమనుకుంటాం? హాట్ సీటు వరకు వచ్చిన వారంతా ఎక్కువ టాలెంటు గల వారని. అంతే గదా! తక్కువ టాలెంటు గల వ్యక్తి పుణ్యబలంతో ఎన్నికయి హాటు సీటుకు ఎలా రాగలిగాడో, లక్షలాది వీక్షకుల సాక్షిగా ఈ మాజిక్‌ను మనం ఇప్పుడు పరిశీలిద్దాం.

పేరు గుర్తులేదు. వికలాంగుడైన అభ్యర్ధి అప్పటికి నాలుగురోజుల నుండి పోరాడుతూ హాటు సీటు వరకూ రాలేక పోయాడు. ఐదవ రోజు కూడా చాన్సుపోతే, ఇక అక్కడ నుండి వెనుదిరగాల్సిందే. ఆ రోజు కూడా అక్కడున్న అభ్యర్ధులంతా ఖచ్చితంగా ఈ అభ్యర్ధికంటె టాలెంటుగల వారేనని గేమ్ చూస్తున్న లక్షలాది ప్రేక్షకులకు అర్ధమవుతూనే ఉంది. ఆ రోజు హాట్ సీటుకు వేయబడిన రెండు ప్రశ్నల వరకు ఒక అమ్మాయి ఆధిపత్యంలోఉంది.





ఆ తర్వాత రెండవ మూడవ స్థానాలలో వేరే అభ్యర్థులున్నారు. చూసే వీక్షకులు, నాగార్జున గారు సహితం ఆ ముగ్గురిలో మొదట ఉన్న వారు మొదట హాటు సీటుకు వెళ్తారు, లేదా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు డిసైడ్ అవుతారని అందరూ అనుకున్నారు. వికలాంగ అభ్యర్ధి ఎక్కడో తరువాత స్థానంలో ఉన్నాడు. ఆ రోజు హాట్ సీటుకు వికలాంగుడైన అభ్యర్ధి ఎన్నికయ్యాడు. పుణ్యబలానికి ఇంతకంటే ఋజువు అవసరం లేదు. మాజిక్ ఎలా జరిగిందో ఇప్పుడు పరిశీలిద్దాం.

వరి పంటకు సంబంధించిన నాలుగు అంశాలను క్రమంలో గుర్తించాలి. నారుపోయుట, నాట్లువేయుట, కోతకోయుట, కుప్పనూర్చుట, ఇదీ క్రమం. ఆ రోజు నాగార్జున గారు అడిగిన ఈ మూడవ ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. ఈ వికలాంగుడొక్కడే కరెక్టు ఆన్సర్ చేశాడు. నిజానికి ఇది ఏమంత గొప్ప ప్రశ్న కాదు. మిగిలిన వారు ఎవ్వరూ చెప్పలేనంత కష్టమైనది కూడా కాదు. రాయలసీమకు సంబంధించిన అమ్మాయి ఈ కుప్పనూర్చుట అనే పదం వద్ద కొంచెం కన్‌ఫ్యూజ్ అయ్యానని చెప్పింది. ఈ ప్రశ్నకు మిగిలినవారు చెప్పలేకపోవటం కేవలం కాకతాళీయం కాదు. పుణ్యబలం, యోగం ఉంటే టాలెంటు గల వారంతా వెనకబడి అద్భుతాలు జరుగుతాయని ఈ సంఘటన నిరూపించింది. ఈ ప్రశ్నకు ఆ అమ్మాయి జవాబు ఇచ్చి ఉంటే, ఆ వికలాంగుడు ఇంటికి వెళ్ళవలసిందే. ఎందుకంటే అప్పటికే లీడర్ బోర్డులో లీడింగు పోజిషన్‌లో ఉందామె. ఆ మర్నాడు హాట్ సీటులోకి వచ్చిందా అమ్మాయి. ***కేవలం వికలాంగుడైన అభ్యర్థికి హాట్ సీటు ఇవ్వటం కోసం ఆ అమ్మాయికి 'కుప్పనూర్చుట' అనే పదం సకాలంలో గుర్తు రాలేదు.***

## ప్రశ్న : 'జ్యోతిషం' మూఢ నమ్మకమా? వాస్తవమా?

**జవాబు :** "నేను మొన్నటి వరకు అమీర్‌పేటలో అడుక్కుతినే వాడిని, ఇదిగో ఫలానా వారి షాపులో ఈ రాయి కొనుక్కొని ఉంగరంలో ధరించాక, ఈ షాపింగ్ కాంప్లెక్స్, గచ్చిబౌలిలో ఇల్లు కొనుక్కున్నాను. అంతా ఈ రాయి మహిమ" – ఇలాంటి టి.వి. ప్రకటనలు చూసి రాళ్ళు పెట్టుకుంటే పరిస్థితులు రాత్రికి రాత్రి మారిపోతాయని నమ్మటం మూఢనమ్మకం. అంతేగాని జ్యోతిష శాస్త్రం మూఢ నమ్మక మేమిటి? రెండు సంవత్సరాలు 'జ్యోతిషం'లో నిజం ఎంతుందని ప్రాక్టికల్‌గా పరిశీలించి నిజం తెలుసుకున్నాను. ముప్పై సంవత్సరాలు అనేక జాతకాలు పరిశీలించిన అనుభవం ఉంది. తెలుగు విశ్వవిద్యాలయం నుండి జ్యోతిషంలో ఎం.ఏ. పట్టా తీసుకున్నాను. తనకు తెలియనిది ఏదీ వాస్తవం కాదని నిర్ధారణకు రాకూడదు. తెలియని విషయాల మీద వ్యాఖ్యానించకుండా, నాకు తెలియని విషయాల మీద నేను ఏమీ చెప్పలేను అని మనస్సును బందీచేయకుండా విడుదల చేయాలి. అప్పుడే కొత్త ఆలోచనలను ఎవరైనా ఆహ్వానించగలరు. ***కర్మ సిద్ధాంతం పునాదిగా ఏర్పడిన జ్యోతిష శాస్త్రం సత్యమైనదే. ఎవరెవరికి ఎంత పరిజ్ఞానం ఉన్నదనే విషయం ఆయా జ్యోతిష పండితుల వ్యక్తిగత విషయం. కాని 'జ్యోతిషం' మూఢనమ్మకం అనటం సరికాదు.*** మనుషులు పాపకర్మలు చేయకుండా నిరోధించి మంచి కర్మలు చేయటానికి ప్రేరేపించే శాస్త్రం జ్యోతిష శాస్త్రం. మనుషులలో ఉన్న అజ్ఞానమనే చీకటిని తరిమివేసి జ్ఞానాన్ని ఇచ్చే కాంతిని ఇవ్వగల శాస్త్రమని దీనికి విస్తృత అర్థం ఉంది. అయితే మనకు అందుబాటులో ఉన్న పాతగ్రంథాలు తప్ప, కొత్తగా ఏమీ పరిశోధనలు జరగటం లేదు. విజ్ఞాన శాస్త్రాలన్నింటిలోకి జ్యోతిషమే ప్రాచీన శాస్త్రం. –





ఇదే పుస్తకంలో నేను రాసిన 'కొత్త జ్యోతిషం' అనే ఒక వ్యాసం ఉంది. పరిశీలించండి. ఇంకా ఏమైనా సందేహాలుంటే మెయిల్ చేయండి. లేదా వ్యక్తిగతంగా సంప్రదించండి.

## ప్రశ్న : జీవితంలో ఎదురు దెబ్బలు తగిలిన ప్రతిసారి మన కర్మ అని సరిపెట్టుకోవాలా? మన బుద్ధి వివేకం ఉపయోగించవద్దా?

**జవాబు :** మన పెద్దవాళ్లు చెబుతూ ఉంటారు. గాలిలో దీపం పెట్టి 'నీవే కాపాడు దేవుడా' అంటే ఆ దీపం ఉంటుందా అని. దైవం మీద అపారమైన విశ్వాసం, భక్తి ఉన్న వారు కూడా రోగం వచ్చినపుడు ట్రీట్‌మెంటు, మందులు తీసుకుంటూ ఆ పైన భగవంతుడ్ని ప్రార్థిస్తున్నారు. అలాగే విద్యార్థులు బాగా చదివి, పరీక్ష రాసి పాసయితే కొండకు వస్తామని మొక్కు కుంటున్నారు. కాని నిజంగా దేవుడంటూ ఉంటే, నాకు పాసయ్యే యోగం ఉంటే, నేను ఖచ్చితంగా పాసవుతాను అని పరీక్షలు రాయకుండా మొక్కుకునే సాహసం చేస్తున్నారా? అంటే పరీక్షలు రాయకపోతే ఫెయిల్ అవుతామని 'బుద్ధి' చెబుతూనే ఉంది. పరీక్షలు రాయకుండా దీనికి కర్మఫలం అని పేరు పెట్టగలమా? ఒకవేళ ర్యాంకు ఆశిస్తున్న బ్రిలియంట్ విద్యార్థికి కరెక్టుగా పరీక్షల సమయంలో తీవ్రమైన అనారోగ్యం చేసి పరీక్షలు రాయలేని నిస్సహాయ స్థితి ఏర్పడితే, ఖచ్చితంగా 'కర్మ' అని సరిపెట్టుకోవలసి ఉంటుంది. కాని అతను చదివిన జ్ఞానం ఎక్కడికీ పోదుకదా? మరొక్కసారి ప్రయత్నించి విజయం దక్కించుకుంటాడు. ***చాలామంది చిన్న సంఘటన జరిగితే చాలు జీవితంలో పెద్ద కల్లోలం జరిగినట్లు గగ్గోలు పెడ్తుంటారు. చేయవలసిన పని చేయకుండా మాకే ఇలా ఎందుకు జరుగుతుందని అందరి వద్దా విచారం వెళ్లబోస్తుంటారు.*** పరీక్షల టైమ్‌లో అనారోగ్యం, పీటల మీద పెళ్ళి ఆగిపోవటం

ఇలాంటి కొన్నింటికి ప్రారబ్ధ కర్మ కారణమైనా, అది అర్థం చేసుకుని జీవితాన్ని ఎప్పటికప్పుడు పునర్నిర్మించుకోవడానికి నిరంతర కృషి చేయవలసిందే. ఆత్మీయుల మరణం ఒక్కటే తొలగించుకోలేని నిజమైన కష్టం. మిగిలినవన్నీ కష్టాలు కావు. అయితే గతంలో చేసిన పాపకర్మల కారణంగా ఫలితం అనుభవించే విధంగా మన బుద్ధి అదుపులో లేకుండా మాయలో పడ్తుంది. శిక్షాకాలం పూర్తయ్యాక గ్రహణం విడిచిన చంద్రునిలా మరల బుద్ధి వెలుగులు చిమ్ముతుంది. ***ప్రతి మనిషి జీవితంలో ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. అందుకే స్వీయ అనుభవ ప్రామాణికతతో కర్మసిద్ధాంతాన్ని విశ్వసించవచ్చని నా మనవి.*** ఒక్కసారి జీవితంలో దెబ్బతిని కోలుకున్న వ్యక్తి సహజంగానే తన చర్యల మీద, ఆలోచనల మీద నిఘావేసి మంచి చెడుల విషయంలో అప్రమత్తంగా ఉంటాడు గదా! ఒక్కసారి హార్ట్ ఎటాక్ వచ్చాక, ఆ తర్వాత సిగరెట్లు మానేసిన వారిని మనము చూస్తూనే ఉన్నాము గదా! ఇదీ అంతే.

**ప్రశ్న : నేను సామాజిక సేవ చాలా చేసాను. కాని డబ్బు సంపాదన విషయంలో వెనకబడటం వలన బంధువులలోనూ, స్నేహితులలోనూ చులకనయ్యాను. నేనింత సేవ చేసినా నన్ను ఎవ్వరూ గౌరవించటం లేదు. డబ్బులేని వారికి ఈ సమాజంలో విలువలేదు. నిజం కాదంటారా?**

**జవాబు :** ముందుగా మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. ఇతరులు ఏదో అనుకుంటారని మీరు ఎలా నిర్ధారణకు వస్తారు? మీరు కావాలనుకుని ఒక మార్గం ఎన్నుకున్నప్పుడు, ఆ పనిలో మీకు సంతృప్తి లభించిందా లేదా అనేది ముఖ్యం గాని ఇతరుల గురించి మీరెందుకు ఆలోచిస్తారు? ఆత్మ న్యూనత అన్ని విధాలా అనర్థం. డబ్బు వలన అవసరాలు తీరతాయి అనేది అందరం ఒప్పుకుంటాం. మీరు మీ నిత్యావసరాలకు మరొకరిని





చేయి జాచనంతకాలం మీకు డబ్బు లేదని మిమ్మల్ని ఎవ్వరూ రోడ్డుమీద నిలేయరు. ఏ చట్టమూ అదేదో నేరమైనట్లు మిమ్మల్ని శిక్షించదు. ఒకవేళ ఏదో పెద్ద అవసరం వచ్చి డబ్బు అవసరమైన సందర్భాలలో కూడా 'డబ్బు లేమి' ఒక అవరోధం కాదు. స్నేహితులు, బంధువుల నుండి సహకారం అందుతూనే ఉంటుంది. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందని సామెత.

మనం చేస్తున్న పనిపట్ల ఒక గౌరవం ఉండాలి. సంతృప్తి ఉండాలి. ఈ రెండు ఉన్నప్పుడు ఇతరులు ఎవ్వరూ గుర్తించి గౌరవించటం లేదని అనుకోవాల్సిన పనిలేదు.

ఈ సందర్భంగా నా బాల్యమిత్రుడు గురించి చెబుతాను. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ నియోజక వర్గంలోని బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ, నిత్యం వారి సమస్యల పరిష్కారంలో బిజీగా ఉంటాడు. అరవై ఏళ్లు నిండినా ఇప్పటికీ బస్సులలోనే తిరుగుతుంటాడు. విలాసవంతమైన జీవితం పట్ల అతను మొగ్గు చూపలేదు. భార్యాబిడ్డలు హైదరాబాద్‌లో ఉంటే, అతను నియోజకవర్గంలోని మండల కేంద్రంలో ఉంటున్నాడు. ఒక రూమ్‌లో ఉంటూ తన వంట తానే చేసుకుంటూ, తన బట్టలు తానే ఉతుక్కుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 సంవత్సరాల తర్వాత ఇటీవల అతన్ని చూసి అతని జీవన విధానం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. ***చెప్పుకోదగిన విశేషం ఏమంటే, పైసా ఆదాయం లేని ఈ ప్రజాసేవ పట్ల అతనికి చులకన భావంలేదు. చేస్తున్న పని పట్ల సంతృప్తి ఉంది. జీవితంలో ఏదో కోల్పోయామన్న బెంగలేదు. తన నిరాడంబర జీవితం పట్ల విచారం లేదు. అలాగని ఏదో ఘనకార్యం చేస్తున్నట్లు ఢాంబికాలు ప్రదర్శించలేదు.*** మనస్తత్వ విశ్లేషణలో అనుభవం ఉన్న నేను అతను తన జీవితం పట్ల సంతృప్తిగానే ఉన్నాడని అర్థం చేసుకున్నాను.

ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానంటే, ఎవరో ఏదో అనుకుంటున్నారని ఆలోచించటం నిరర్ధకం. తాము చేస్తున్నపని పట్ల శ్రద్ధ, గౌరవం, సంతృప్తి ఉంటే చాలు. అహంకారం, ఆత్మన్యూనత అవలక్షణాలు. భగవంతుడు మనకు ఇచ్చిన జీవితం పట్ల కృతజ్ఞత చూపుతూ ఆనందిస్తూ కాలం గడపాలి.

## ప్రశ్న : మనస్సు నొచ్చుకుని కలత చెందినపుడు సులభమైన ఉపశమన మార్గాలు ఏమిటి?

**జవాబు :** వెంటనే ఏదో పనిలో నిమగ్న మవ్వటమే దీనికి విరుగుడు. మనస్సు బాగా లేనపుడు, దాన్ని ఏదో రిపేరుచేయాలని ప్రయత్నించటం వలన అది మరింత కల్లోల మవుతుంది. ఏదో చేయాలని ప్రయత్నించటం అనే ప్రక్రియలో మనస్సుమీద అదే చిత్రం కొనసాగుతుంది. పర్యవసానంగా మనస్సు మరింత వ్యాకులతకు లోనవుతుంది. యంత్రం ఏదయినా పాడయితే వెంటనే రిపేరు చేయడమే దానికి ఖచ్చితమైన పరిష్కార మార్గం. శరీరానికి గాయమైనా అంతే. ***మనసు విషయంలో కూడా మనకు అలవాటైన ఈ మార్గాన్నే అనుసరించి మనస్సును రిపేరు చేయాలని ప్రయత్నిస్తాం.*** ఏం జరిగిందో దాని పూర్వాపరాలు ఆలోచిస్తుంటాం. కాని మనస్సు విషయం పూర్తిగా వేరు. ఎప్పుడైనా మనస్సుకు గాయమైతే, రిపేరుకు ప్రయత్నించకుండా దాన్నలా వదిలేసి వేరే పనిలో నిమగ్నమవ్వటమే పరిష్కారం. ఇక్కడ పనంటే ఎంగేజ్ అయి ఉండటం. నచ్చిన పుస్తకాలు చదవటం, మంచి హాస్య సన్నివేశాలు చూడటం, ఆత్మీయులకు ఫోన్ చేయటం, హౌస్ కీపింగు లాంటి పనులైనా పర్వాలేదు. ఏదో ఒకటి చేయటం వలన మనః ఫలకం మీద చిత్రం దానంతట అదే మారిపోతుంది. విచారాన్ని విచారిస్తూ కూర్చోకుండా 'మూడ్' మార్చుకునే ప్రయత్నంలో తర్ఫీదు అయి ఉంటే ఉపశమనం సులభంగా లభిస్తుంది.





## ప్రశ్న : ఆత్మ గౌరవం, సర్దుబాటు ఈ రెండింటిలో ఏది గొప్పది?

**జవాబు :** ఈ ప్రశ్న వ్యక్తిగతంగా నాకు చాలా ఇష్టమైన ప్రశ్న. గత పాతిక సంవత్సరాలలో నేను ఇంటర్వ్యూలు చేసిన ప్రతిసారి అభ్యర్ధిని ఈ ప్రశ్న అడుగుతూనే ఉన్నాను. అందరూ-అయితే 'ఆడ' లేకుంటే 'మగ' అన్నట్లు సమాధానం చెబుతుండేవారు గాని, అద్భుతమైన సమాధానం 1996లో నాకు ఒక అమ్మాయి చెప్పింది. దురదృష్టవశాత్తు ఆమె ముఖం నాకు గుర్తు లేదు. కనీసం ఫోన్ నెంబరు కూడా రాసి పెట్టుకోలేదు. ఆ ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన సమాధానం మాత్రం స్పష్టంగా ఈ రోజు వరకు గుర్తుంది. ఎందుకంటే ఆ రోజు ఆమె ఇచ్చిన జవాబు స్ఫూర్తిగా ఉంటుందని నేను స్టాఫ్ మీటింగులలో అందరికీ చెబుతుండే వాడిని. నేను అప్పుడు ఒక కంపెనీలో జనరల్ మేనేజర్ గా పని చేసాను. సాధారణంగా ఇంటర్వ్యూలు నేను ఒక్కడినే చేయటమే అలవాటు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఆ కంపెనీ యం.డి. చిత్రంగా ఉండేవాడు. మనిషిని మించిన కోపం ఉండేది. ఆ కోపంతో సిబ్బందిని ఛండాలంగా తిడుతుండేవాడు. కనీసం ఆడపిల్లలు అని కూడా చూసేవాడు కాదు. అభ్యంతరకర భాషలో బూతులు మాట్లాడేవాడు. ఏదో పూనకం వచ్చినట్లు ఊగిపోయేవాడు. ఆ తర్వాత నా బోటివాళ్లు అతని లోపం గురించి చెప్పాలని చూసిన సందర్భాలలో ముందుగా ఆయనే ఈ విషయం ప్రస్తావించే వాడు "రావు గారూ, ఇందాక ఆ పిల్లను అలా తిట్టకుండా ఉంటే బాగుండేదని మీరనుకుని ఉండవచ్చు. కాని అలా తిట్టకపోతే వాళ్లు ఎలా బాగు పడతారు" అంటూ వాళ్లు ఎంత బాధ్యతారహితంగా ప్రవర్తించారో అని ఏ మాత్రం పొంతనలేని వివరణ ఇచ్చేవాడు. కుందేటి కొమ్ము సాధించవచ్చు గాని అతన్ని మార్చలేమని అప్పుడే

నాకు అర్థమైంది. ఆ కంపెనీలో కేవలం 13 మాసాలు పనిచేసి ఆ తర్వాత బయటపడ్డాను. యం.డి. గురించి వివరంగా ఎందుకు చెప్పానంటే, ఇంటర్వ్యూలో ఇదే కీలకమైన విషయం.

ఆరోజు ఫ్రంట్ ఆఫీసు ఎగ్జిక్యూటీవ్స్ కొరకు ఇంటర్వ్యూలు చేస్తున్నాను. పాతికేళ్లు వయసుగల గ్రాడ్యుయేట్స్ అమ్మాయిలు కావాలని పేపరులో వాక్ ఇన్ ఇంటర్వ్యూ ప్రకటించాము. అందరినీ అడిగినట్లే ఆరోజు ఆ అమ్మాయినీ అడిగాను. "ఆత్మగౌరవం ముఖ్యమా? సర్దుబాటు ముఖ్యమా? అని. ఆమె సర్దుబాటు ముఖ్యం అంది. "ఏం, నీకు ఆత్మ గౌరవం ముఖ్యం కాదా?" అని అడిగాను. ఆ అమ్మాయి దెబ్బతిన్నట్లు చూడలేదు. చిరునవ్వుతో సమాధానం చెప్పింది. "అందరిలాగే నాకూ ఆత్మగౌరవం ఉంది. బాధ్యత గల ఉద్యోగినిగా సర్దుబాటుకే ప్రాధాన్యత నిస్తాను" అంది.

ఈ కంపెనీ యం.డి. గార్కి కోపమెక్కువ. తిడితే ఏంచేస్తావని అడిగాను. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండనని, యం.డి. గారు తిట్టే ప్రసక్తే రాకుండా జాగ్రత్తగా పనిచేస్తానని చెప్పింది. ఏదో విధంగా ఉద్యోగం సంపాదించటానికి అలా చెబుతారులే అనుకుని అదేమాట అన్నాను. "ఉద్యోగంలో చేరటానికి నీవు అలా అంటున్నావు. నేను మాట వరసకు ఈ ప్రశ్న అడగలేదు. ఈ కంపెనీ యం.డి.కి ఆడపిల్లలనే ఉపేక్ష కూడా ఉండదని, నువ్వు ఎంత జాగ్రత్తగా పని చేసినా తిడతాడనీ, అపుడేం చేస్తావనీ అడిగాను. ఆ అమ్మాయి కూడా అంతే ధీటుగా స్థిరంగా చెప్పింది. "సర్ అందరి సంగతి వేరు. నా సంగతి వేరు. నా మీద మాట పడకుండా నేను చూసుకుంటాను. ఈ ఉద్యోగం నాకు ఇవ్వండి".





ఇంటర్వ్యూ ఎంతవరకు వెళ్తుందో చూద్దామనుకున్నాను. నేను ఇంకా మొండిగా "నువ్వెంత బాగా పనిచేసినా ఆయన తిడతాడు. మామూలుగా కాదు. అభ్యంతరకర భాషలో బూతులు తిడతాడు. అప్పుడేం చేస్తావు? ఉద్యోగం మానేస్తావా?" అని అడిగాను. ఒకవేళ మీరన్నట్లు యం.డి.గారు తిడితే ఉద్యోగానికి మాత్రం రాజీనామా చేయను. సర్దుబాటుకే ప్రాముఖ్యతనిస్తాను అంది.

" ఏం నీకు సిగ్గు లేదా? అంతలా తిడితే అప్పుడు కూడా ఆత్మగౌరవం ముఖ్యం కాదా? సర్దుబాటు సర్దుబాటు అంటున్నావు. రోషం, ఆత్మాభిమానం అంటే అర్థాలు తెలియవా?" అని ఆమెను రెచ్చగొట్టాను. అప్పుడు ఆ అమ్మాయి ఇచ్చిన సమాధానం నా జీవితంలో మరచిపోలేనంత గొప్పగా ఉంది.

"సర్ మీరు ఇంత స్పష్టంగా చెబుతున్నారంటే, ఇక్కడ నేను ఎంత జాగ్రత్తగా పనిచేసినా యం.డి.గారు తిట్టడం ఖాయం అని అర్థమైంది". మళ్లీ మళ్లీ ఇంటర్వ్యూలు చేయాలంటే అనవసరపుశ్రమని ఇప్పుడు అపాయింటైన అమ్మాయి వీలైనంత ఎక్కువకాలం పనిచేయాలని మీరు అనుకొని ఇంత వివరంగా అడుగుతున్నారు. మీరు ఏ ఉద్దేశంతో అడిగినా, ఈ ఉద్యోగం నాకు ఇచ్చినా ఇవ్వకున్నా ఆత్మగౌరవం కంటే సర్దుబాటే ముఖ్యమని నా సమాధానం. ఒకవేళ నేను ఈ ఉద్యోగంలో చేరి మీరన్నట్లు యం.డి. గారు నన్ను తిట్టి అవమానిస్తే వెంటనే ఉద్యోగం మాత్రం మానేయనండీ. రిజైన్ చేసినంత మాత్రాన జరిగిన అవమానం మాసిపోతుందా? అప్పుడు మాత్రం ఆత్మగౌరవం ఉన్నట్లా? ఎందుకంటే ఒకవేళ నేను ఉద్యోగం మానేసినా, మీ అందరి మనసుల్లో అదే దృశ్యం ఉంటుంది. నాకు జరిగిన అవమానం ఈ కంపెనీ ఉన్నన్ని రోజులూ

ఒకరి నుండి ఒకరికి, నాకు జరిగిన అవమానం తెలిసిపోతూనే ఉంటుంది. ఇక్కడ మానేసిన వాళ్లు కూడా రేపు వాళ్లు చేరిన కంపెనీలో ఈ ఉదంతాన్ని తమ అనుభవంగా సహ ఉద్యోగులతో షేర్ చేసుకోవచ్చు. అవమానం జరిగిన వెంటనే ఉద్యోగం మానేయటం కరెక్టు కాదని నా ఉద్దేశం. ఎక్కడైతే అవమానం జరిగిందో, అక్కడే నన్ను నేను ప్రూవ్ చేసుకొంటాను. అదే యం.డి. చేత, మీ అందరి చేత 'శభాష్' అనిపించుకుంటాను. ఆ తర్వాత మరొక ఉద్యోగం చేతిలో పెట్టుకుని అప్పుడు మానేస్తాను సర్. నా వీడ్కోలు మీ అందరి మనసులలో అయ్యో పాపం అనే సానుభూతి, జాలితోగాక, ఒక మంచి అభినందనగా ఉండాలని నా ఆకాంక్ష.

ఒకవేళ నేను అవమానం జరిగిన వెంటనే ఉద్యోగం మానేసినా సెల్ఫ్‌రెస్పెక్ట్ ఉన్నట్లు ఎలా అవుతుంది? మళ్లీ ఉద్యోగం కోసం ఆఫీసుల చుట్టూతిరగాలి. ఎందుకు మానేసారంటే ఏం చెప్పాలి? ఆ కంపెనీ యం.డి. తిట్టాడని నిజం చెబితే నన్ను నేను కించ పరుచుకున్నట్లు కాదా? ఒకవేళ నేను నిజం చెప్పకపోయినా వాళ్లు ఎంక్వైరీ చేస్తే అప్పుడైనా నిజం తెలుస్తుంది కదా? నేనే లేనపుడు నా సెల్ఫ్‌రెస్పెక్ట్ ఎక్కడ ఉంటుంది? అయినా పొగోట్టు కున్నది తిరిగి రాబట్టుకోవాలి కదా సర్, I can regain my self respect here only. అందుకే సర్దుబాటు ముఖ్యమని నా ఉద్దేశం. సర్దుబాటువలన ఆత్మగౌరవం మరల పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. సర్దుబాటు లేకుంటే మన ఉనికే ఉండదు కదా సర్. ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చున్నా సమస్య పరిష్కారం అయినట్లు కాదు కదా! అంది.

ఇదంతా ఉపన్యాసంలా ఆ అమ్మాయి నాకు వివరించింది. ఒకవేళ ఇది చదివిన పాఠకులకు ఆ అమ్మాయి సమాధానం అద్భుతంగా అనిపించకపోతే, నాకు సరిగా చెప్పటం రాలేదనుకుంటానే గాని, ఆమె విశ్లేషణ మాత్రం బాగుందని నా అంతరాత్మ ఇప్పటి వరకూ చెబుతూనే ఉంది.





"వినదగునెవ్వరు చెప్పిన" అనే పద్యం నాకు గుర్తుంది. మంచి విషయం ఎవ్వరు చెప్పినా స్వీకరిస్తాను. నేను ఆచరించని నీతి సూత్రాలు నేను ఎవ్వరికీ చెప్పను. ఆమెను బయట కూర్చోమని చెప్పి, ఛాంబర్‌లో చాలా సేపు ఆ అమ్మాయి చెప్పిన సమాధానం లోతులలోకి వెళ్లి ఆలోచిస్తుండి పోయాను. ఆ తర్వాత ఆ రోజు ఇంటర్వ్యూలు చేసేపని వేరే వ్యక్తికి అప్పగించాను. నాకు తెలిసిన రెండు మూడు కంపెనీలతో ఫోన్‌లో మాట్లాడాను ఆ అమ్మాయిని పిలిచి విషయం చెప్పాను. మంచి జీతంతో మరొకచోట ఆ అమ్మాయికి ఉద్యోగం మాట్లాడాను. థ్యాంక్సు చెప్పివెళ్లింది. అప్పట్లో సెల్ ఫోన్స్ లేవు. ఆ అమ్మాయిని ఆ తర్వాత నేను ఎప్పుడూ చూడలేదు. అప్లికేషన్ ఆమెనే తీసుకెళ్ళమన్నాను.

లాండ్ లైన్ నంబరు ఏమి ఇచ్చిందో, ఆమె పేరు ఏమిటో కూడా నాకు గుర్తు లేదు. ఆ ఇంటర్వ్యూ, ఆమె సమాధానం మాత్రం సజీవంగా గుర్తున్నాయి.

సర్దుబాటు ఆత్మగౌరవం కన్నా గొప్పది. సర్దుబాటు అంటే తలవంచటం ఎంత మాత్రం కాదు. సామాజిక జీవనంలో అనివార్యమైన చర్య సర్దుబాటు. ***ఉద్యోగాలు మానేయటానికి ఉపరీజన్స్ వెయ్యి ఉన్నా, మెయిన్ రీజన్ బెటర్ ప్రాస్పెక్ట్స్ అయి ఉండాలని ఈ సందర్భంగా పాఠకులకు నేను మనవి చేస్తున్నాను.*** (పేరు కూడా గుర్తులేని ఆమెకు నాకృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను).

## ప్రశ్న : దేవుడ్ని ప్రార్థిస్తే కోరికలు నెరవేరతాయా? ఇది మూఢ నమ్మకమేనా?

**జవాబు :** నమ్మకం అనవచ్చును మూఢ నమ్మకం అని అనలేము. మనం ఏమి అనుకుంటే అది జరుగుతూనే ఉంది. ఇది ఒకరాయి విసరి చూసి

తగిలితే తగులుతుంది, లేకపోతే లేదు అని ట్రై చేస్తే ఫలితం కూడా అలాగే ఉంటుంది. నేను ఏమి అనుకుంటే అది జరుగుతూనే ఉంది. యాదృశ్చికం కూడా కాదు. జీవితాంతం అద్భుతాలు జరుగుతూనే ఉన్నాయి. ***పల్లెటూళ్లలో వర్షాలు పడనపుడు ఊరంతా కలసి వర్షంపడాలని కోరుకుంటూ గంగానమ్మ జాతర చేస్తుంటారు. నా చిన్నతనంలో ఈ జాతర చేసిన ప్రతిసారి వర్షం పడటం నేను కళ్లారా చూశాను.*** పెరిగి పెద్దయ్యాక ఈ జాతర సంఘటనను 'కొత్త' గా అర్థం చేసుకున్నాను. ఈ భూమి మీద పుట్టిన ప్రతి మనిషి ఏమి అనుకుంటే అది జరుగుతూనే ఉంది. అయితే గ్రామస్తులకు ముఖ్యంగా అక్షరజ్ఞానం లేని వారికి ఈ విషయం అర్థంగాక పోవచ్చును. వారంతా గంగానమ్మను విశ్వసించి వర్షం పడుతుందనుకున్నారు. ఒకరు కోరుకుంటేనే జరగుతున్నపుడు సామూహికంగా అంతమంది అనుకున్నపుడు జరగకుండా ఎలా ఉంటుంది? ***డైరెక్టుగా తాము అనుకున్నా అది జరుగుతుందనే 'జ్ఞానం' దర్శించలేక 'దైవాన్ని' ఆలంబనంగా పెట్టుకుని నమ్మకంగా కోరుకుంటున్నారు.*** వారిది ఎంత నమ్మకమంటే జాతర చేసిన మర్నాడు వర్షం పడ్తుందని దుక్కిదున్ని భూమిని సిద్ధం చేసేవారు.

ఒకరి సంగతి ఎలా ఉన్నా దైవాన్ని పూర్తిగా నేను విశ్వసిస్తాను. నిరంతరం అసాధారణ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నా బాల్యంలో జరిగిన అతి ముఖ్యమైన సంఘటన దైవం మీద నాకు గల విశ్వాసానికి దైవలీలకు ఉదాహరణగా చెబుతాను.

ఇది నా 14 వ ఏట జరిగిన యదార్థ సంఘటన. వేసవి సెలవులకు గుంటూరు జిల్లా పేరకలపూడి గ్రామంలోని మా అమ్మమ్మ గారింటికి వచ్చాను. పేరెంట్సు తెనాలిలో ఉంటున్నారు. తొమ్మిదవ తరగతి తెనాలి మున్సిపల్ హైస్కూల్లో చదివాను. అప్పట్లో ప్రతి ఏటా పరీక్షలుండేవి.





పాసయితే తర్వాత పై తరగతికి పంపేవారు. ఫెయిలైతే అదే తరగతి చదవాల్సి వచ్చేది. సంవత్సరమంతా వేస్ట్. నేను 9వ తరగతి పాసయ్యాక 10వ తరగతి పేరకలపూడికి 2 కి.మీ దూరంలో ఉన్న పెదపాలెం హైస్కూలులో చదివించాలని పెద్దవాళ్లు అనుకున్నారు. అమ్మమ్మగారి ఊర్లో నాకు సావాస గాళ్లున్నారు. ఆ నలుగురూ జరిగిన యేడాది పెదపాలెం స్కూల్లోనే చదివారు. వాళ్లంతా పాసయ్యారు. తెనాలి (వైకుంఠపురం) వెళ్లి వేంకటేశ్వర స్వామికి తలనీలాలు ఇచ్చి మూడు సినిమాలు (మ్యాట్నీ, ఫస్ట్ షో, సెకండ్ షో) చూసి రావాలని వాళ్లు ప్రోగ్రాం వేసుకున్నారు. నేను కూడా వాళ్లతో తెనాలి వెళ్తానని పంపించమని పెద్దవాళ్లనడిగాను. వెంటనే మా పెద్ద మామయ్య 'నీ రిజల్ట్సు రాలేదుగా నువ్వెందుకురా?" అని అడ్డం పడ్డాడు. ముందుగా తెనాలి వెళ్ళి స్కూల్లో రిజల్టు తెలుసుకుంటాను. ఒకవేళ పాసయితే వైకుంఠపురం వెళ్లి వీళ్లతో పాటు గుండు చేయించుకుంటానని చెప్పాను. మాతాతయ్య అమ్మమ్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మామయ్య కూడా సరేననక తప్పలేదు.

ఆ విధంగా సావాసగాళ్లతో కలిసి బయలుదేరాను. అనుకున్నట్లుగానే ముందుగా స్కూలుకు వెళ్లాము. వాళ్లందరినీ వరండాలో కూర్చోమని నేను ఆఫీసు గదిలోకి వెళ్లాను. వేసవి సెలవులు అయినందు వలన ఒకరిద్దరు తప్ప సిబ్బంది కూడా ఎవ్వరూ లేరు. వాళ్లల్లో మా సోషల్ టీచరు ఉన్నాడు. రిజల్ట్సు కోసం వచ్చానని చెప్పాను. ఆయన రిజిస్టరు చూపించాడు. నేను ఫెయిలయ్యాను. ఒక్కక్షణం నాకు అంతా అయోమయంగా అన్పించింది. మరుక్షణం భయమేసింది. ఫెయిలైతే ఇంటి దగ్గర ఏమంటారోనని భయం, ఏదో చేసేస్తారని అందోళన. అప్పుడే స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చాను. చకచకా నాకేమి కావాలనుకున్నానో మొత్తం ఒక 'స్క్రీన్ ప్లే' లా మనసులోనే అనుకున్నాను. బయటకు వెళ్లి 'పాసయ్యాను'

అని చెప్పటానికి నిర్ణయించుకున్నాను. ప్రస్తుతానికి నా మాట ప్రామాణికం గదా? అలా వాళ్లతో వెళ్లి వైకుంఠపురంలో స్వామి వారికి తలనీలాలు ఇవ్వాలని నిశ్చయించుకున్నాను. మరి ఆ తర్వాత ఎలా? ఫెయిలయ్యాను కదా! దీన్ని అధిగమించటం ఎలా! వెంటనే స్వామి వారికి అప్పటికప్పుడు మొక్కుకున్నాను. "స్వామీ! నీ మీద నమ్మకంతో అందరితో పాటు వచ్చి నేను కూడా తలనీలాలు ఇస్తున్నాను. నువ్వే నన్ను పాస్ చేయాలి". అని కలియుగదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థించాను. ***ఇది 14 ఏళ్ల ప్రాయంలో ఉన్న బాలుని యొక్క అసాధారణ నమ్మకానికి నిలువెత్తు సాక్ష్యంగా నేను భావిస్తున్నాను. ఇప్పటి వరకూ లోకంలో ఎక్కడైనా పరీక్షలు రాసిన వాళ్లు పాస్ చేయమని దేవుడ్ని ప్రార్థించటం మొక్కుకోవటం ఉన్న విషయమే! పరీక్షలు రాసి, ఫలితాలు వచ్చి ఫెయిలైన విద్యార్థి కోరికను ఏ దేవుడైనా ఎలా తీర్చగలడు?*** జన్మతో వచ్చిన తార్కిక జ్ఞానం నన్ను అప్పుడే ప్రశ్నించింది. "దేవా! ఫెయిలైన విద్యార్థి పాస్ కావాలంటే దానికి ఏదైనా మార్గం కావాలి గదా! అది కూడా నేనే ఆలోచించాను. అది జరిగేటట్లు చూడు". అని దేవుడికు ఇబ్బందిలేకుండా ఒక ప్రణాళిక రచించాను. బయటకు వెళ్ళి సావాసగాళ్లతో మాట్లాడటం మొదలు, గుడికి వెళ్లటం, తలనీలాలు ఇవ్వటం, సినిమాలు చూడటం, ఊళ్లోకి వెళ్లటం, బ్రహ్మంగారి జెండా సెంటరు వద్ద మా పెద్ద మామయ్య ప్రశ్నించటం..... ఇత్యాది సన్నివేశాలు, చివరకు నేను పాసయ్యే పతాక సన్నివేశం వరకూ అన్ని దృశ్యాలూ సజీవంగా అప్పుడే నేను చూశాను. జరిగినట్లుగానే అనుభూతి చెందాను. ఇది జరిగేటట్లు చూడమని దేవుడు నాకు ఏ విధంగా సాయం చేయాలో కూడా నేనే మార్గం చూపించాను. ఇదంతా నా మనసులోనే పదే పది నిమిషాల్లో అనుకుని గుండె నిబ్బరంతో బయటకు వచ్చాను.





పైకి నవ్వు పులుముకుని పాసయ్యాను అని చెప్పాను. ఎంత కాదనుకున్నా లోపల కాస్త బెరుకు. అది నేను అనుకున్నది జరగదని మాత్రం కాదుసుమా! ఒక సాహసం చేస్తున్నప్పుడు అందరూ అనుభూతి చెందే సహజమైన బెదురు మాత్రమే. వాళ్లంతా అప్పటికే ఆలస్యమైందని నెర్వస్‌గా నా కోసం చూస్తున్నారు. మరి గుడికి వెళ్లి పని పూర్తి చేసుకుని మ్యాట్నీకి అందుకోవాలి గదా?

అందరం వైకుంఠపురం వెళ్లి దేవుడికి తలనీలాలు ఇచ్చి దర్శనం చేసుకున్నాము. అనుకున్నట్లుగానే మ్యాట్నీ, ఫస్ట్ షో, సెకండ్ షో చూసి మర్నాడు ఊళ్లోకి అడుగు పెట్టాము. బస్ దిగి మెల్లగా అడుగులు వేస్తున్నాను. బ్రహ్మంగారి జెండా సెంటరు వద్ద అరుగుల మీద మా పెద్ద మామయ్య కూర్చుని ఉన్నాడు. అమ్మమ్మ గారింటికి ఆయన్ను దాటే వెళ్లాలి. అంత దూరంలో ఉండగానే ఆయన అడగనే అడిగాడు. "ఏరా పరీక్ష ఏమయిందీ?" అని. నేను బదులు ఇచ్చేదాక కూడా ఆయన ఆగలేదు. "ఆహా! పాసయ్యా వన్నమాట" ఆయనే అనేశాడు నా గుండు చూసి. ఇదంతా నేను రూపకల్పన చేసిన దృశ్యాలు, సంభాషణలే! హమ్మయ్య, ఒక గండం గడిచింది, అనుకుంటూ ధైర్యంగా ముందుకు సాగిపోయాను.

ఆ తర్వాత జూన్ మాసం వచ్చింది. ఊళ్లోనే దూరపు బంధువు నాకు వరుసకు మామయ్య ఒకాయన ఉన్నాడు. పెదపాలెం స్కూల్లో పనిచేస్తున్నాడు. నన్ను పిలిచి తెనాలి వెళ్లి టి.సి. తీసుకురమ్మన్నాడు. మా పెద మామయ్య కూడా ఉన్నాడక్కడ. వాళ్లు నన్ను పెదపాలెం స్కూల్లో టెన్త్‌లో అడ్మిషన్ గురించి ఏర్పాట్లు చేస్తున్నారు. నేను అనుకున్న సమయం రానే వచ్చింది. తెనాలి వెళ్లాను. ఊహించి నట్లుగానే స్కూలంతా ఒకటే హడావిడి. అడ్మిషన్స్ సమయం. కోలాహలంగా సందడిగా విద్యార్థులతో వరండా,

ఆఫీసు నిండి పోయింది. ***నేను ఎప్పుడో రూపకల్పన చేసి నా మదిలో సాక్షాత్కరించుకున్న దృశ్యాలు ఇప్పుడు సజీవంగా నా కళ్లెదుట.***

వేంకటేశ్వరస్వామికి ఏమి చేయాలో మరొకసారి రిమైండ్ చేశాను. రైటర్ దగ్గరకు వెళ్లి టి.సి. కావాలని అడిగాను కాన్ఫిడెంట్‌గా. ఆయన ఊపిరిసలపనంత బిజీగా ఉన్నాడు. టేబుల్ చుట్టూ జనం. రెండు నిమిషాలలో చేస్తున్నపని పూర్తిచేసి నా వంక ఎగాదిగా చూసి పొడవాటి షీటున్న ఒక బుక్ తీశాడు. కార్బన్ కాపీ పెట్టి స్పీడుగా రాయటం మొదలుపెట్టాడు. పేరు, తండ్రి పేరు, తరగతి ఇత్యాది వివరాలు నేను చెబుతుంటే రకీమని రాసుకుంటూ ఫెయిలా, పాసా? అని అడిగాడు. నేను ఏమీ బదులు చెప్పలేదు. తలెత్తి నా వంక చూశాడు. "పాసా…." స్వగతంగా పైకే అనేసుకున్నాడు నా గుండు చూసి. 'పాస్' అని రాసి సంతకం చేసి రబ్బరు స్టాంపువేసి సర్రున ఒరిజినల్ చింపి నా చేతిలో పెట్టాడు. ఇదే నేను యాథాతథంగా ఆ రోజు అనుకున్న పతాక దృశ్యం. ఆయన రికార్డులు చూడకుండా చేయమని, అడ్మిషన్ టైమ్ హడావిడి ఉంటుందని, గుండు సాక్ష్యంగా ఆయన మైండును మెస్మరైజ్ చేస్తుందనీ స్వామి వారికి నేను ఆనాడే చెప్పాను. అదే జరిగింది. టి.సి. తీసుకుని గబగబ బయటకు వచ్చాను. మళ్లీ రికార్డు చూసుకుని వెనక్కు పిలుస్తాడేమోనని బాల్యం తాలూకు బెరుకు. నా వెనకే అటెండరు వస్తున్నాడు. నా కోసం వస్తున్నాడేమోనని సందేహం. అతను నన్ను దాటి వెళ్లాడు. నేను వరండా దాటి, స్కూల్ గేటు దాటి, స్వామి వారికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, విజయం తాలూకు ఆనందంతో బస్సెక్కాను. మొత్తం మీద పెదపాలెం స్కూల్లో నేను 10వ తరగతిలో జాయినయ్యాను. ఇది 1969లో జరిగిన యధార్థ సంఘటన.

ఆ తర్వాత ఏం జరిగిందనేది ఇక్కడ అప్రస్తుతం. ఈ సంఘటనలో కేవలం ఒక బాలుడి యొక్క అచంచలమైన విశ్వాసం గమనించమని





పాఠకులకు నా ప్రార్థన. సంకల్పం అంటే కోరిక యొక్క పై స్థాయి. మన చర్యలు మన సంకల్పం నెరవేరే దిశగా ఉండాలి. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అనేటంత వాస్తవంగా ఉండాలి. మనం విశ్వసించేదిగా ఉండాలి. మనం అనుభూతి చెందాలి. ఇవన్నీ సూక్ష్మ ప్రపంచంలో ముందే జరుగుతాయి. స్థూల ప్రపంచంలో కాస్త ఆలస్యంగా దర్శన మిస్తాయి. ఒక సంకల్పం, ఒక నమ్మకం, ప్రణాళికలు, తదనుగుణంగా చేతలు – ఏ కల నైనా నిజం చేస్తాయి – ఒకరోజు అటూ ఇటుగా. మంచి ఆలోచనలు చేసేవారికి అన్నీ శుభాలే జరుగుతాయి. ఈ విషయంలో ఇంకా ఏమైనా సందేహాలుంటే ఇ మెయిల్ చేయండి. లేదా వ్యక్తిగతంగా సంప్రదించండి.

## ప్రశ్న : ఏమోషనల్ బ్యాలెన్స్, భావోద్వేగపు నియంత్రణ గురించి వివరించండి?

**జవాబు :** తులనాత్మకత, భావోద్వేగపు నియంత్రణ ఒక్కటే. ఇది విలువైన వ్యక్తిత్వానికి కొలమానంగా చెప్పవచ్చును. ప్రతి మనిషిలోనూ బలం, బలహీనతలు రెండూ ఉంటాయి. కాని ఒక మనిషిలో ఎన్ని బలాలు ఉన్నప్పటికీ భావోద్వేగపు నియంత్రణ లేనపుడు అతను ప్రశాంతంగా జీవించలేడు. అదే విధంగా ఒక మనిషిలో అభ్యంతరకరమైన బలహీనతలున్నప్పటికీ, భావోద్వేగపు నియంత్రణ కలిగి ఉన్నట్లయితే మానవ సంబంధ బాంధవ్యాల విషయంలో నిబ్బరంగా జీవించవచ్చును. ప్రతి మనిషి మేలుకుని ఉన్న సమయమంతా ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటాడు. తెల్లవారి లేచినది మొదలు నిద్రించేవారకు అతని సమక్షంలో జరిగే ప్రతి సంఘటనకు స్పందిస్తూనే ఉంటాడు. తదనుగుణంగా అనేక భావోద్వేగాలకు గురవుతాడు. అనుకూల భావాలయితే పర్వాలేదుగాని ప్రతికూల భావాలయితే వాటిని వ్యక్తం

చేయకుండా అదుపులో ఉంచుకోవటం మంచిది. ఇద్దరి మనుషుల మధ్య ఆత్మీయత లైన, వైరమైనా మాటల వలనే ఏర్పడుతుంది. అందువలనే భావం కలగగానే వ్యక్తం చేయకుండా అవసరమైతేనే మాట్లాడాలి. నియంత్రణ లేని వారు వ్యక్తుల పట్ల వెంటనే స్పందిస్తారు. నియంత్రణ లేని వ్యక్తులు సంఘటనలను కేవలం తమ కోణంలోనే వీక్షించి నిర్ణయం తీసుకుంటారు. అదుపులేని తనం వలన వ్యక్తులతో కలహాలు పెరిగి సంబంధాలు దెబ్బతింటాయి. నియంత్రణ వలన అప్పటికి స్పందించకుండా తర్వాత నింపాదిగా జరిగిన సంఘటనలను విశ్లేషించి సమీక్షించుకునే అవకాశం దొరుకుతుంది. అప్పటికి ఆవేశం తగ్గి వివేకంతో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ***బలహీనతలున్న వారందరినీ వదిలేసుకుంటూ వెళ్లటం కూడా కరెక్టు కాదు. సంబంధం మోతాదు, సాంద్రతను తగ్గించుకుని కలహించకుండా ఉంటే సమీప భవిష్యత్తులో వారే తమ తప్పు తెలుసుకుంటారు. ఒకవేళ వారు తప్పు తెలుసుకోక పోయినా ముంచుకుపోయేదేమీ ఉండదు. మీరెటూ వారితో పరిమితంగానే ఉంటారు కదా! ఏ విధంగా చూసినా భావోద్వేగపు నియంత్రణ ఉత్తమ లక్షణమే.***

## ప్రశ్న : ఒక వ్యక్తిని ఆరాధించటం, మానసిక దాస్యం చేయటం రెండూ ఒకటేనా?

**జవాబు :** ఉప్పు కప్పురంబు ఒక పోలిక నుండు, చూడ చూడ రుచుల జాడవేరు అన్నట్లు ఒక వ్యక్తిని ఆరాధించటం మానసిక దాస్యం చేయటం రెండూ ఒక్కలా కన్పించే వేరు వేరు లక్షణాలు. ఆరాధనలో గౌరవం అభినందన, స్ఫూర్తి, అభిమానం, ప్రేమ ఉంటాయి. తాను ఆరాధించే వ్యక్తి పట్ల వినయం ఉంటుంది. ఇది కేవలం అవతలి వారి వ్యక్తిత్వానికి ఆకర్షితులై వచ్చి వినయంతో విధేయులుగా ఉండటం,





కాని మానసిక దాస్యంలో మోహం ఉంటుంది. సదా వారి ప్రాపకం కోరి తనను తాను తగ్గించుకోవడం ఉంటుంది. మానసిక దాస్యం చేసేవారి పట్ల ఆ దాస్యాన్ని ఆస్వాదిస్తున్న వారికి సహితం తేలిక భావం ఉంటుంది. ఆరాధించే వ్యక్తికీ, ఆరాధింపబడే వ్యక్తికీ మధ్య ఆరోగ్యకరమైన స్నేహ సంబంధాలుంటాయి. ఒకరిపట్ల ఒకరికి గౌరవం నమ్మకం ఉంటాయి. ఆరాధింపబడే వ్యక్తి ఒక మెట్టుపైన ఉంటే ఉండవచ్చు. కాని అది వారి మైత్రీ బంధానికి అడ్డుకాదు. ఆరాధిస్తున్న వ్యక్తి పట్ల ఎవరైనా బాధ్యతగా ఉంటారేగాని, స్వార్ధానికి ఉపయోగించుకోవాలని చూడరు. కాని మానసిక ధాస్యం చేసే వారిని అవతలి వ్యక్తి వాడుకునే అవకాశం ఉంది.

అయితే ఆరాధన, మానసిక దాస్యం రెండూ కర్మ బంధాలే! ఒకటి సవ్య బంధం, రెండవది అపసవ్య బంధం. మానసిక దాస్యం స్త్రీ పురుషుల మధ్యే కాదు. వృత్తి ఉద్యోగాలలో కూడా ఉంటుంది. ***బాస్ ప్రాపకం కోసం వ్యక్తిత్వాన్ని చంపుకుని దీర్ఘకాల మానసిక దాస్యం చేసే వారున్నారు. అతి వినయం ధూర్త లక్షణమని అవకాశం దొరికితే వెన్నుపోటు పొడవటానికి వీరు వెనుదీయరు. ఇలాంటి వారిని విశ్వాసంలోకి తీసుకోవటం మంటే ఎవరిగొయ్యి వారు తవ్వుకోవటమే.***

## ప్రశ్న : ఒంటరితనం, దిగులునూ అధిగమించటం ఎలా?

**జవాబు :** ఒంటరితనం, దిగులు అనేవి ఒక దాని కొకటి అంటి పెట్టుకుని ఉంటాయి. మానసికంగా ఏదైనా వెలితి ఏర్పడినపుడు ఈ భావాలు కలుగుతాయి. వ్యక్తిగతంగా, సామాజికంగా, కుటుంబ పరంగా వచ్చిన తప్పనిసరి మార్పులను స్వీకరించలేకపోవటం ఈ ఒంటరి తనానికి దిగులుకు ప్రధాన కారణం. కావాలనుకున్నట్లుగా, మనసుకు నచ్చినట్లుగా జీవితం కొనసాగనప్పుడు ఎవరికైనా దిగులు ఒంటరి తనం ఏర్పడతాయి.

నిజం చెప్పాలంటే మనస్సుకు నచ్చినట్లుగా వందశాతం ఎవరి జీవితం ఉండదు. ఎందుకంటే ప్రారబ్ధకర్మ అంటూ ఒకటుందిగా. స్థాయిభేదం తప్ప ఎవరికైనా ఇది ఉంటుంది కదా! దీన్ని మరొక రకంగా చెప్పాలంటే నచ్చినట్లు జరగడం పుణ్యబలం. నచ్చనట్లు జరగడం పాప ఫలం. నిజానికి వేదన సంఘటన నుండి ఉద్భవించదు. ***సంఘటనకు మనం ఏ విధంగా స్పందిస్తున్నాం. ఆ తర్వాత పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం ఏ విధంగా సిద్ధం చేసుకుంటున్నాం అనే అంశాల మీద సంతోష దుఃఖాలు ఆధారపడి ఉన్నాయి.*** భావోద్వేగాలకు సంబంధించిన వేదనలన్నీ మనస్సు చేసే గారడీనే. నిరంతర అభ్యాసంతో మనస్సును మరొక వ్యాపకం మీద మళ్లించి దానికి కాస్త కొత్తదనాన్ని అందించి అలవాటు చేయాలి. మనస్సును అదుపులో ఉంచటం ఎవరివల్లా కాదు. దాన్ని దృష్టి మళ్లించటం మాత్రమే మనము చేయగలం. దిగులు, ఒంటరితనాలకు కారణాలు కనిపెట్టాలి. పంతానికి పోయి ఎదురీదటం గాకుండా జీవితం చిన్నది కాబట్టి సర్దుబాటు మనస్తత్వంతో మనకు ఎదురైన పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం మార్చుకోవాలి. ***వీలైతే పరిస్థితులను మనం అదుపుచేయవచ్చును. రెండవది మనల్ని మనం మార్చుకోవాలి. ఈ రెండూ గాకుండా మూడో సూత్రం అంటూ ఏమీ లేదు. అదే వ్యాధిగ్రస్థ స్థితి. ఒంటరితనం, దిగులూ అప్పడే ప్రవేశిస్తాయి.***

## ప్రశ్న : సన్నిహిత బంధాలు దూరం అవటానికి గల కారణాలేంటి?

**జవాబు :** సన్నిహిత బంధాలు దూరమవ్వటమే కాదు, తెరమరుగైనా ఆశ్చర్యపోనవసరంలేదు.

ఏభై సంవత్సరాల క్రితం మనిషికి మనిషితోడు అవసరమయ్యేది. ఈ పుస్తకంలో ముందే చెప్పుకున్నట్లుగా మానవ సంబంధాలన్నీ అవసరార్థం





అభివృద్ధి చెందేవే! ఆ రోజుల్లో ఇన్ని వస్తువులు, ఇన్ని సౌకర్యాలు అందరికీ ఉండేవి కావు. గ్రామాలను ఉదాహరణ తీసుకుంటే ఒకరింట్లో పెద్ద నిచ్చెన ఉంటే, ఒకరింట్లో పెద్ద గుండిగ ఉండేది. అలాగే ఎప్పుడో గాని అవసరంరాని పనిముట్లు అందరి ఇళ్లలో అన్నీ ఉండేవికావు. ఉదాహరణకు పెద్దనిచ్చెన కావలసి వచ్చినపుడు అది ఫలానా వారింట్లో ఉందని ఊళ్లో అందరికీ తెలిసి ఉండేది. అంటే ఊరందరికీ ఒకే నిచ్చెనగా అర్థం చేసుకోనవసరంలేదు. ఇరుగు పొరుగు సంబంధాలు ఆ విధంగా ఒకరితో ఒకరికి అవసరం రీత్యా పెనవేసుకుని ఉండేవి. డబ్బు ఇంత విచ్చలవిడిగా చలామణిలో ఉండేది కాదు. వినోదం కూడా పండుగకో పబ్బానికో అన్నట్లుండేది. ఆట విడుపుగా చుట్టాల ఇళ్లకు చూసిరావటానికి వెళ్లివస్తుండేవారు. పెళ్లి సంబంధాలు కూడా దగ్గర కుటుంబాలలో, దగ్గర ఊళ్లోలోనే కుదుర్చుకునేవారు. ప్రధాన వృత్తి వ్యవసాయం అవటం వలన తండ్రీకొడుకులు మనవళ్లు అంతా ఒకే ఇంట్లో గాని, వేర్లు పడి పక్కపక్క ఇళ్లల్లోగాని ఉండి రోజంతా సందడిగా ఉండేది. మనస్పర్థలు వచ్చినా సన్నిహిత సంబంధాలు మనుగడకు అనివార్యం అయ్యేవి.

ఈనాటి జీవన చిత్రం పూర్తిగా మారిపోయింది. బందుగణమంతా వివాహవేడుకలకు వచ్చి నాలుగు అక్షింతలు వేసి, రెండు ముద్దలు తిని వెళ్లడానికి పరిమితమయ్యాయి. ఒకవేళ అక్కడ ఎవరైనా మాట్లాడుకున్నా ఉపయోగపడేవారితోనే ఆ సంభాషణలు ఉంటున్నాయి.

ప్రతి ఇంట్లోనూ అందరికీ అన్ని వస్తువులు ఉండటం, వృత్తిరీత్యా, ఉద్యోగాల రీత్యా దూరప్రాంతాలలో విసిరేసినట్లు ఉండటం, మనిషికి మనిషి తోడు స్థానంలో ఆధునిక వినోద సాధనాలు, ఇంట్లో సమస్త సౌకర్యాలు, అయిన వాళ్లతో అవసరాలు గాకుండా, అవసరాలు ఉంటేనే అయిన

వాళ్లుగా మార్పు వచ్చింది. ***ఈ పరిణామం నిందించదగింది ఏమీ కాదు. ఒక మార్పు అంతే.*** అన్నదమ్ములు ఒకరు అమెరికాలో, ఒకరు ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు, అక్క హైదరాబాదులో ఉన్నా ఆమెకు తోబుట్టువుల కంటె, తాను ఉన్న పరిసరంలోని ఇతరులే ముఖ్యం అవుతారు. తోబుట్టువులతో ఫోన్ పలకరింపులూ, ఆ తర్వాత జనరేషన్ వచ్చే సరికి మా బ్రదర్స్ అబ్రాడ్‌లో ఉంటారు అని చెప్పుకోవడానికి తప్ప పెద్దగా ఇంటరాక్షన్ ఏమీ ఉండదు.

***బాంధ్యవ్యం కేవలం రక్త సంబంధం కారణంగా అభివృద్ధి చెందదు. సన్నిహితంగా మెలగటం, నిరంతర రాక పోకలు, ఒకరి సంగతులు ఒకరు తెలుసుకుంటూ, తెలుపుకుంటూ ఒకరికొకరు అండగా ఉండటం వలన బంధాలు బలపడ్తాయి.***

ఆర్థిక అసమానతలు, విద్యా సంస్కారంలో వ్యత్యాసాలు, పరిణితి, అవసరాలు అంతగా లేకపోవటం, పంతాలు పట్టింపులు, ఆత్మన్యూనతా భావాలూ, అహంకారాలూ..... ఇలా ఎన్నో కారణాల వలన దగ్గర బంధువుల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కంటికి కనిపించనపుడు, మనసులో కూడా ఉండదనేది సామెత. ఒక నాలుగేళ్లు ఎవరి జీవితం వారిది అన్నట్లుగా ఉంటే, అదే అలవాటై రెండు దశాబ్దాలు గడిచిపోతాయి. ఒకరి పిల్లల గురించి ఒకరు ఫేస్‌బుక్కుల్లో చూసుకోవడం, మెల్లగా న్యూ జనరేషన్స్ మధ్య పరిచయమే లేకపోవటం వలన అనుబంధాలు పెళ్లిళ్లకూ, శ్రాద్ధ కర్మలకూ పరిమిత మయ్యాయి.

వీటన్నింటికీ అతీతంగా సంబంధ బాంధవ్యాలకు తగిన సమయం కేటాయించుకుంటూ, ఒకరి కష్ట సుఖాలు ఒకరు గుర్తించి సలహా సంప్రదింపులు జరుపుకుంటూ ఏవో చిన్న చిన్న వాదోపవాదాలు తప్ప అన్యోన్యంగా ఉంటున్న కుటుంబాలూ ఉన్నాయి. ఏదైనా జీవితంలో స్థిరపడి,





ఆర్థికంగా ఒడిదుడుకులు లేకుండా ఒకేరకమైన సాంఘీక హోదా ఉన్నప్పుడు సంబంధాలు పారదర్శకతతో బాగుంటాయి. లేకుంటే పగిలిన అద్దం అతికించినట్లే అసహజంగా ఉంటాయి. ఏదైనా అనుభావాలే ప్రామాణికం. పరస్పరం కోరుకుంటేనే సంబంధాలు నిలబడతాయి. ***పుణ్యబలం ఉన్న కుటుంబాలకు డబ్బుకు కొదవఉండదు. అనుబంధాలకు కొదవ ఉండదు. సవ్యమైన ఆలోచనలున్న కుటుంబాలకు అన్నీ అమరుతూనే ఉంటాయి. అపసవ్యమైన ఆలోచనలున్న కుటుంబాలకు ఉన్నవి ఊడుతూనే ఉంటాయి.***

## ప్రశ్న : అన్యాయాన్ని ఎదిరించటం, దుర్మార్గులతో పోరాడటం, సినిమాలలో హీరోగా జీవించాలనుకోవటం మంచిదేనంటారా?

**జవాబు :** సినిమా ఒక కళా రూపం. హీరో పెద్ద పెద్ద పోరాటాలు చేసి ధైర్య సాహసాలు చేయాలి. అందరికంటే తెలివిగా ఉండాలి. హీరోయిన్ ఆయన చుట్టూ తిరుగుతూ ఉండాలి. కళారూపం ఏదైనా కల్పితమే కదా! అందువలన హీరో ముష్టి బిగించి ఒక దెబ్బ కొడతే, రౌడీలు గాలిలో ఎగిరి కరెంటు స్తంభానికో, పెద్ద గోడకో గుద్దుకోవటం, అవి క్షణాల్లో కూలిపోవటం ఇవన్నీ అసహజాలు అని తెలిసినా ప్రేక్షకుడు ఆనందిస్తాడు. ఎందుకంటే కళలు మనోరంజకాలు.

కాని జీవితం వేరు. మన అపార్టుమెంట్సులో లేదా మన వీధిలో ఏదైనా అన్యాయం జరిగితే ఎవరైనా స్పందిస్తారు. మరీ కొన్ని సినిమాలలో చూపినట్లు జనం అంతా చోద్యం చూస్తూ కూర్చోరు. అయితే మన పరిధి ఎంతవరకు అని తెలుసుకోవడం విజ్ఞత. సమాజంలోని మొత్తం అన్యాయాన్ని మనమే ఎదిరించాలన్న ఆవేశం పనికిరాదు.

ఉదాహరణకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం వారు నూతన రాజధాని నిర్మాణం కొరకు, ఏడాదంతా పంటలు పండే బంగారు భూమిని సేకరించటం వ్యక్తిగతంగా నాకు ఎంత మాత్రం నచ్చలేదు. కాని దీని కోసం ఏదైనా చేయాలంటే అది నాకు సంబంధం లేని పని. అన్నింటిలో తగుదునమ్మా అని తల దూర్చటం మంచిది కాదని పెద్దలు చెబుతారు. అక్కడ భూములు సేకరించకుండా ఆపవలసిన బాధ్యత ప్రతి పక్షాలది. నిజం చెప్పాలంటే ప్రభుత్వం కూడా భిన్న వర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. కాని మనం చేయగలిగింది ఏమీ లేదు కదా! అందువలన కొన్ని అన్యాయం అన్పించినా ఆవేశపడి ప్రయోజనం లేదు. బాధపడి కూడా ప్రయోజనం లేదు. మన బాధ్యత కాని దాని గురించి పెద్దగా స్పందించకూడదు.

ఇంత వివరంగా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, సినిమాలో హీరోలాగా జీవించాలనుకోవటం ఏమిటి? గగనం అనే సినిమాలో ఫ్లైట్‌ను టెర్రరిస్టులు హైజాక్ చేస్తారు. ప్రయాణీకులందరితో పాటు ఆ విమానంలో ప్రయాణిస్తున్న ఒక సినిమా హీరో కూడా బాగా భయపడుతూ ఉంటాడు. పక్కనున్న ప్రయాణీకుడు ఈ హీరో యొక్క అభిమాని. ఏదో విధంగా హీరో టెర్రరిస్టులతో ఫైట్ చేసి ప్రయాణీకులందరినీ రక్షిస్తాడని ఆశపడ్తుంటాడు. జీవితం సినిమాకాదని దర్శకుడు చాలా చక్కగా చెప్పాడు.

ఎవరైనా సరే అన్యాయాలను ఎదిరించటం, దుర్మార్గులను అంత మొందించటం జీవిత లక్ష్యాలుగా ఏర్పరుచుకోగూడదు. పోలీసు ఇన్‌స్పెక్టర్ అయి తన పరిధిలోని అన్యాయాలను అరికట్టాలని లేదా ఎమ్.ఎల్.ఎ. అయి తన నియోజకవర్గంలో నేరాలను అరికట్టాలని లక్ష్యంగా ఏర్పరుచుకోవచ్చును. ఏది ఏమైనా లక్ష్యం స్పష్టంగా ఉండాలి తప్ప నాటకీయంగా ఉండకూడదు.





## ప్రశ్న : విజయం సాధించాలంటే 'లక్ష్యం' ఎలా ఉండాలంటారు?

**జవాబు :** జీవితం వైకుంఠపాళి ఆట లాంటిది. పాములను ఒడుపుగా తప్పించుకుంటూ, నిచ్చెనలను ఎక్కి పైకి రావాలి. ఇదీ ఆట. పాములను చంపాలనుకోగూడదు. పాములను చంపటమే లక్ష్యంగా పెట్టుకుంటే ఒక జీవిత కాలం మొత్తం వెచ్చించినా, పాములజాతి అంతం కాదనే వాస్తవం గమనించాలి. మనం పుట్టక ముందు నుండి పాములున్నాయి. ఇప్పుడూ ఉన్నాయి. మనం చనిపోయాక కూడా ఉంటాయి. కాబట్టి ఏదైనా గత్యంతరం లేని పరిస్థితులలో మన కాళ్లకు అడ్డంపడితే చంపాలేగాని, పాములను చంపడం లక్ష్యంగా పెట్టుకుంటే ఎప్పటికీ ఆ లక్ష్యం నెరవేరదు.

జీవితమనే వైకుంఠపాళీలో అప్రమత్తంగా ఉంటేనే విజయం సాధ్యమవుతుంది. పాములపటం ఆటలో కనిపించినట్లుగా పాము, నిచ్చెనలు నిజ జీవితంలో కనబడవు. వృత్తి జీవితంలో ఎవరు నిచ్చెన, ఎవరు పాము అనేది తెలుసుకునే తెలివి ఉండాలి. సమర్థత ఉంటే పాము కూడా నిచ్చెనలాగా సహాయ పడ్తుంది. అసమర్థుడిని నిచ్చెన కూడా పామై కాటువేస్తుంది. భావోద్వేగ నియంత్రణలో మానవ సంబంధాల విషయంలో అప్రమత్తంగా ఉంటే, అలాంటి వ్యక్తికి పాములంటూ ఏమీ ఎదురు కావు. అన్నీ నిచ్చెనలే ఉంటాయి. ***విజయం సాధించాలంటే 'లక్ష్యం' పైకి ఎదగాలనే ఉండాలి గాని, ఉపలక్ష్యాలు ఏర్పరుచుకుని పక్క చూపులు చూడకూడదు.***

ప్రారబ్ధ కర్మ వలన జీవితంలో ఆటంకాలు వైఫల్యాలు సంభవించినా ఓర్చుకుని నిరంతర ప్రయత్నంతో 'లక్ష్యం' సాధించటానికి మరల మరల, మరల మరల ప్రయత్నించాలేగాని ఫలితం రాలేదని నిరుత్సాహ పడకూడదు. జీవితం ఒక ఆట, ప్రాక్టీసు చేస్తుంటే దెబ్బతగిలినా తీయగా ఉండి భలే సరదాగా ఉంటుందిలే.

## ప్రశ్న : శాశ్వత అనుబంధాలు అంటూ ఏమీ ఉండవా?

**జవాబు :** దైనందిన జీవితంలో శాశ్వతంగా కలిసి ఉండటం ఒక్క వివాహబంధంలోనే సాధ్యం. మిగిలిన బంధాల విషయంలో అసాధ్యం. కాని, అనుబంధాల తాలూకు జ్ఞాపకాలు మనం ఉన్నన్నాళ్లు మనతోటే ఉంటాయి. మా తాతమ్మ చందమ్మ (అమ్మకు నాయనమ్మ) నా బాల్యంలో ఎప్పుడూ ఒక మాట చెబుతుండేది. ***దినం గడిచింది లెక్కగాదు, తనం గడవాలని. ఈరోజు మనం ఏ స్థాయిలో బ్రతుకుతున్నామో, ఇదే స్థాయిలో మనం జీవితాంతం ఉండేలా జాగ్రత్తపడాలని తాత్పర్యం.*** తనం అంటే జీవితమంతా అని అర్థం. ఆమె అన్న ఈ ఒక్క మాట నా మనస్సు మీద గాఢముద్ర వేసింది. నాకు ప్రతిరోజూ తాతమ్మ గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఆమె చెప్పిన మాటను నాకు తెలిసిన వారందరికీ నేను ఏదో ఒక సందర్భంలో చెబుతూనే ఉన్నాను. ఆమె చనిపోయి 40సం॥లు అయినా ఆమె జ్ఞాపకం ఇంకా నా మనస్సులో సజీవంగా ఉంది. అలాగే కిష్టారావు అని నా మిత్రుడు 40సం॥రాల క్రితం షుమారు సంవత్సరంపాటు రోజూ కలుసుకునే వాళ్లం. పయినించే ఓ చిలకా ఎగిరిపో పాట పాడుతుండేవాడు. సెల్‌లో పాటలు వింటూ పడుకోవడం నాకు అలవాటు. సెల్‌లో ఉందా పాట. నా జీవితం అనే పుస్తకంలో కిష్టారావుది ఒక ప్రత్యేక అధ్యాయం. మరచిపోలేని జ్ఞాపకం. బంధాలు కనుమరుగైనా జ్ఞాపకాలు శాశ్వతంగా ఉంటాయి.

## ప్రశ్న : ఏ మనిషికైనా ఆనందాన్నిచ్చే అంశాలేమిటి?

**జవాబు :** ఇది వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంది. జిహ్వాకో రుచి పుర్రెకో బుద్ధి అన్నారు పెద్దలు. ఆనందాలు అనేకం. మంచి విందు భోజనం, సుఖ నిద్ర, తాంబూలం, సిగరెట్లు, మందు, కబుర్లు, హాస్యం, సెక్స్, ప్రయాణాలు,





సంగీతం, సాహిత్యం, బట్టలు, నగలు, అలంకరణ, డబ్బు, పొలాలు, సినిమాలు, కీర్తి ప్రతిష్టలు, స్నేహం, బంధువులు, సమాజసేవ...... ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లిస్టు చేంతాడంత ఉంటుంది. ఏ మనిషికైనా ఇలా సవాలక్ష ఆనందాలు ఉండవచ్చును. కాని ఎవరెంత ఆనందించినా ఈ ఆనందాల మొత్తం పరిమాణం పరిమితంగానే ఉంటుంది. ***మనిషి యొక్క ఆనందంలోని సింహభాగం జీవిత భాగస్వామి మీద, వైవాహిక జీవితం మీద ఆధారపడి ఉంటుంది.*** సరే! ఇదంతా 'మాయ' అని భావించే సన్యాసుల గురించి నేను చెప్పటం లేదు. ప్రాయంలో పెళ్ళి చేసుకోవటం, వీలైనంత వరకు సమ ఉజ్జీని ఎన్నుకోవటం ముఖ్యం. తగిన జీవిత భాగస్వామి దొరకటం లేదని వంకలు పెడుతూ కాలహరణం చేయకుండా స్త్రీ పురుషులిరువురు కూడా 'ప్రాక్టికల్' గా ఆలోచించి అవసరమైతే మరీ అంత ప్రాధాన్యం కాని ఒకటి రెండు విషయాలలో రాజీపడి అయినా వయసు ముదరకుండా వివాహం చేసుకోవాలి.

## ప్రశ్న : సకాలంలో పెళ్లి చేసుకున్నా 'విడాకులు' తీసుకుంటున్నవారి సంగతేమిటి?

**జవాబు :** కారణం లేకుండా ఏ కార్యం జరగదు. కాళ్ల పారాణి ఆరకముందే కోర్టుకు వెళ్లే వారున్నారు. ఇరు కుటుంబాలలోని మనస్పర్ధలు, కట్న కానుకల వైరాలు, వధూవరులలో ఎవరో ఒకరికి ప్రేమ వ్యవహారాలు ఉండటం, పెద్దల మాటకు తలవంచి ఆ తర్వాత ఎదురు తిరగటం, ఒక్కటేమిటి? అనేక కారణాలు. కాని ఇవన్నీ పైకి కనిపించే కారణాలు. వీటన్నింటికీ మూలమైన అసలు కారణం, 'ప్రారబ్ధకర్మ'. ఇది అంగీకరించి పుణ్యకర్మలు చేస్తూ తర్వాత మరలా జీవితాన్ని పునర్నిర్మించుకున్న వారున్నారు.

***రెండో పెళ్లి చేసుకొని హాయిగా ఉన్న జంటలు అనేకం. దీనికంతటికీ కుటుంబ సభ్యుల సంస్కారం, పరిణితి, విడాకులు తీసుకున్న వ్యక్తి స్వీయ లోపాలు తెలుసుకుని పశ్చాత్తాప పడటం, తప్పు ఎవరినెత్తినో వేయకుండా ధైర్యంగా అంగీకరించటం, జీవితాన్ని బాగు చేసుకోవడానికి నిరంతర ప్రయత్నం, కృషి అవసరమైన అంశాలు.***

## ప్రశ్న : అన్ని విషయాలకూ 'కర్మ' ను లింకు చేస్తూన్నారేమిటి?

**జవాబు :** చిన్న పిల్లలకు కూడా తెలిసే చిన్న విషయాలు కూడా కొన్నిసార్లు కొంతమందికి తెలియకుండా పోతాయి. ఏమిటంటారు ఇది? కోట్ల రూపాయల టర్నోవరు చేస్తున్న ఒక వ్యాపారవేత్త ఒకాయన భార్యాబిడ్డలను వదిలేసి, ఏడు పదుల వయసులో మళ్లీ పెళ్ళిచేసుకున్నాడు. ఏదో వయస్సులో ఉంటే కనీసం కక్కుర్తి పడ్డాడులే అని భాష్యం చెప్పుకోవచ్చును. కానీ ఎంతో ప్రతిభావంతుడైన ఆ యం.డి. ఇలా బోల్తా పడటానికి కారణం ఏమిటి? ఇంత చిన్న విషయం ఎలా తెలియకుండా పోయింది? గతంలోని 'పాపకర్మల' ఋణం తీర్చుకోవడానికి, దానికి అనుగుణంగా 'బుద్ధి' మారిపోతుంది. ప్రారబ్ధకర్మను సాక్షాత్తు శివుడే తప్పించుకోలేక పోయాడని పురాణాలు చెబుతున్నాయి.

ప్రశాంతమైన, విజయవంతమైన, సుఖవంతమైన జీవితానికి మానవసంబంధాలు సవ్యంగా ఉంచుకోవటం అనివార్యం. అలాగాక వైఫల్యాలు చెందినపుడు, అది ఎక్కడ ఎలాంటి వైఫల్య మైనప్పటికీ, గతంలో మనం చేసిన పనుల యొక్క పర్యవసానంగా భావించాలని, 'కర్మ సిద్ధాంతం' గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, తద్వారా సమాజం లోని వ్యక్తులందరూ 'నిబద్ధత' తో జీవించాలనీ నా ఆకాంక్ష. మరో ముఖ్య విషయం ఏమంటే, కర్మను నేను లింకు చేయటం కాదు.





ఉన్న సంబంధాన్ని తెలియజెప్పాలని ఒక చిన్న ప్రయత్నం చేస్తున్నాను. ***మనం సంతోషంగా ఉంటే సరేసరి. వేదనతో ఉన్నామంటే మనమే కారణం అని బలంగా అనుకోవాలి. అది ఎలాంటి దుఃఖమైనా సరే! ఇతరులు కారణంగా పైకి కనిపిస్తున్నా, కర్మ ఫలాన్ని మనం అనుభవించడానికి, వారికి తెలియకుండానే వారు 'సాధనం' అవుతున్నారని అర్థం చేసుకోవాలి. మనం చేసే పని, చేసే ఆలోచన కర్మ పుస్తకంలో నమోదు చేయబడుతుంది.***

## ప్రశ్న : మన అభివృద్ధికి జన సహకారం కావాలా?

**జవాబు :** ఫలానా వ్యక్తి సహాయ సహకారాలుంటేనే మనం అభివృద్ధి చెందుతాం అనేదేమి ఉండదు. కాని మనం అడవిలో లేముగా. మన సంపాదన, మన అభివృద్ధికి అనేక మంది సహకారం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉంటుంది. నిజం చెప్పాలంటే తెల్లవారిలేచింది మొదలు జనసహకారంతోనే మన దినచర్య మొదలవుతోంది. మనందరం నిత్యం అనేక మంది సేవలు పొందుతూనే ఉన్నాము. అదే విధంగా మన సేవలు ఇతరులకు అందించినపుడు మనకు ప్రతిఫలంగా 'డబ్బు' వస్తుంది. ఆర్థికాభివృద్ధి కూడా మన సేవల నాణ్యత, అవసరాల ప్రాతిపదికగా ఉంటుంది. పేపరులోని ఉద్యోగ ప్రకటన గురించి చెప్పిన స్నేహితునకు 'కృతజ్ఞతలు' చెప్పటం దగర్నుంచి ప్రారంభించి, ఇంటర్వ్యూ చేసిన వ్యక్తులూ, అపాయింట్‌మెంటు ఆర్డర్ సంతకం చేసిన వ్యక్తి, అది మనకు అందించిన ఎగ్జిక్యూటీవ్, మొదటగా పనినేర్పిన సీనియర్ అందరికీ వరుసగా కృతజ్ఞతలు చెప్పవలసిందే. మీరు ఎంత ప్రతిభావంతుడైనప్పటికీ, మీ స్నేహితుడు ఆ ప్రకటన గురించి చెప్పకపోతే, మీకు ఆ ఉద్యోగం రాదు కదా! ***ఇలా సూక్ష్మంగా పరిశీలించుకుంటూపోతే, తాజ్‌మహల్‌కు రాళ్లెత్తిన కూలీలు ఎవరన్నట్లు***

***మన అభివృద్ధికి కారకులైన శ్రామికులు అనేకమంది కనబడతారు. అభివృద్ధి సాధించిన ఎవ్వరూ ఇందుకు మినహాయింపుకాదు.***

సేవలు సహకారం అనేవి విభిన్నంగా ఉంటాయి. ప్రత్యక్షంగా ఉత్పాదకతకు తోడ్పడకపోయినా, పరోక్షంగా తోడ్పడ్డా ఫలితం ఉంటుంది. మంచి పనులకు మంచి ఫలితాలు, చెడ్డ పనులకు చెడ్డ ఫలితాలు. ఏ సంస్థ అయినా అనేక శాఖలుగా విస్తరించిందీ అంటే, వారికి జన సహకారం మరింత ఎక్కువగా లభించిందని అర్థం చేసుకోవాలి. అభివృద్ధి అనేది జనసహకారంతోనే సాధ్యం.

## ప్రశ్న : తెలివి అంటే ఏమిటి.

**జవాబు :** తెలివి అంటే అసలు సిసలైన అర్థం స్పృహకలిగి ఉండటం. ఎవరైనా పడిపోయినపుడు, మన లోకంలో లేనపుడు ముఖం మీద నీళ్లు చల్లుతారు. వెంటనే అతను లేస్తాడు. తెలివి వచ్చింది అంటారు, చూసేవాళ్లు అంటే మెలకువగా ఉండటమే తెలివి. ఎవరైనా తెలివి తక్కువగా ప్రవర్తిస్తే 'నిద్రపోతున్నావా' అని తిట్టేది ఇందుకే. ***తనకు జరుగుతున్న తనచుట్టూ జరుగుతున్న విషయాలపట్ల సదాస్పృహ కలిగి ఉండటమే తెలివి.*** ప్రతిభ, నైపుణ్యాలు పనిలో ఉపయోగపడ్తాయి. ఇవన్నీ కలిస్తే సమర్థత.

## ప్రశ్న : పెద్ద చదువులు చదివి తక్కువ జీతంకు పనిచేయటం కరెక్టేనంటారా?

**జవాబు :** ఆయా సందర్భాన్ని బట్టి, అవసరాలను బట్టి సమాధానం చెప్పాలి. మంచి ఉద్యోగం వచ్చేవరకు, కేరీరుకు ఉపయోగపడే అనుబంధ





కోర్సులు చేయవచ్చును. కానీ ఖాళీగా ఉండకూడదు. కాలంపోతే తిరిగిరాదు. వృధాగా రోజులు గడిపే బదులు తక్కువ జీతంకు అయినా పని చేయాలి. ***ఎక్కువ తక్కువలతో సంబంధం లేకుండా పని 'పని కోసం' పనిచేయాలి.*** వృత్తి జీవితంలో చురుకుగా పాల్గొనటం వలన అవకాశాలు మరింత మెరుగుపడి పెద్ద జీతం వచ్చే ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది.

## ప్రశ్న : ఉచితంగా సలహాలు ఇవ్వటం మంచిదేనా?

**జవాబు :** అడిగితేనే ఇస్తేనే దేనికైనా విలువ ఉంటుంది. అడగకుండా ఇచ్చే సలహాలకు విలువ ఉండదు. మనకు కావలసిన ఆత్మీయులు బంధువుల విషయంలో అయితే వారు అడగకపోయినా, వారి శ్రేయస్సు రీత్యా ఉపయోగపడే ప్రణాళికలు, సూచనలు ఇవ్వటం మంచిదే. ***ఎందుకంటే అసలు ఏమడగాలో కూడా తెలియనపుడు ఎలా అడుగుతారు?*** అయితే ఆ తర్వాత వారు ఆచరిస్తున్నదీ లేనిదీ గమనించి, ఆచరించటం లేదని తెలిస్తే మరొక్కసారి వారు అడగకుండా సలహాలు ఇవ్వకూడదు. అహంకారులకు మంచి చెప్పినా తెగులుగానే ఉంటుంది. చేరి మూర్ఖుల మనస్సు రంజింపరాదని సామెత. పరోపకారం పేరుతో అనర్హులకి ఆసరా ఇవ్వకూడదు.

## ప్రశ్న : వ్యక్తిగత జీవితంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు సంశయంగా ఉన్న సందర్భాలలో సలహాలు తీసుకోవడానికి ఫ్యామిలీ ఆస్ట్రాలజర్ లేదా ఫ్యామిలీ కన్సల్టెంట్‌తో సంప్రదించటం సరైన అలవాటేనా?

**జవాబు :** చాలా మంచి అలవాటు. తుది నిర్ణయం ఎవరికివారే తీసుకుంటారు గావున కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు,

ముఖ్యంగా సంశయాలు సంధిగ్దాలు ఉన్న సందర్భంలో ఒక కౌన్సిలర్ ను సంప్రదించే సాంప్రదాయం మంచిదే. దీర్ఘకాల ప్రయోజనాలు ఆశించేటప్పుడు ఆవేశంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా కౌన్సిలర్‌ను సంప్రదించటం వలన అతను తన అనుభవంతో పలుకోణాల నుండి విశ్లేషిస్తాడు. అంటే టెన్నీసుకోర్టులో గుండుసూది కూడ కనిపించేటంత కాంతివంతమైన లైట్లు వేసినట్లు తనదైన శైలిలో దృశ్యంలా చూపిస్తాడు. ఆ తదుపరి నిర్ణయం తీసుకోవడంలో తర్జనబర్జనలుండవు.

## ప్రశ్న : మానవ సంబంధాలలో మనకు నచ్చని వ్యక్తులతో రాజీపడి రిలేషన్ కొనసాగించటం కరెక్టేనా?

**జవాబు :** జీవితాంతం కలిసి ఉండాల్సిన భార్యాభర్తలే నచ్చనపుడు విడాకులు తీసుకుంటున్నారు. ఇక నచ్చని వ్యక్తులతో స్నేహసంబంధాల విషయంలో రాజీ పడవలసిన అవసరం ఏముంది? దగ్గర బంధువులయితే పెళ్లీ పేరంటాలకు వెళ్తూ తామరాకు మీద నీటి బొట్టులాగా ఉంటే సరిపోతుంది. ఇతర వ్యక్తుల విషయంలో అయితే ఇది కూడా అవసరం లేదు. ఆర్థికంగా భద్రత ఉన్న కుటుంబాలకు సర్కిల్‌కు కొదువ ఏమీ ఉండదు. ***నచ్చని వారిని ఎంటర్‌టైన్ చేస్తూ 'ఎనర్జీ' ని వృధా చేసే బదులు వెంటనే వారిని దూరంగా ఉంచటం ఉత్తమం.***

## ప్రశ్న : ఉద్యోగం చేసేచోట, బయట సాంఘీక సంబంధాలలో తగాదాలు, మనస్పర్థలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి.

**జవాబు :** మనస్పర్థలు, తగాదాలనేవి ఎప్పుడైనా ఎక్కడైనా మాటలను బట్టే





వస్తాయి. మన పనేదో మనం చూసుకుంటూ, వృత్తికి సంబంధించి అవసరమైన సంభాషణలు మాత్రం చేస్తూ, అనవసర వ్యర్థ ప్రసంగాలకు పోకుండా, వీలైనంత తక్కువ పదాలతో సంభాషణ ముగించుకుంటూ కాలంగడపగల్గితే 'తగాదాలు' రమ్మన్నా రావు. వ్యర్థ ప్రసంగాల ముగ్గులోకి అనివార్యంగా లాగబడ్డ సందర్భాలలో కూడా ఎక్కువ శాతం 'శ్రోత' గా ఉండి, 'వక్త' గా మూగనోము అమలు చేయటం. అప్పుడప్పుడు చిరునవ్వే సమాధానంగా వ్యక్తం చేస్తూ భావయుక్తంగా తలాడించడం చేయగల్గితే రాను రాను పెద్ద కష్టపడకుండా భావాలను అదుపులో పెట్టుకుని మిత భాషణ చేయటం అలవాటవుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా అనవసరమైన సంభాషణలో ఎదుటివారు మాట్లాడే విషయాలలోని సమాచారం తప్పని స్పష్టంగా తెలిసినా, అది సరిచేయాలని తాపత్రయ పడకూడదు.

ఇదెలా ఉంటుందంటే బారుకు స్నేహితునితో సావాసంగా వెళ్లి, ఆ తర్వాత దానికి లోబడి మందును అలవాటు చేసుకోవటంలా ఉంటుంది.

మాట్లాడటం వెండి వంటిదయితే, మౌనం బంగారం వంటిదని సుభాషితం. ఎవరూలేని ఏకాంతంలో ఉండటం, పుస్తక పఠనానికో, సంగీతం వినటానికో, సినిమా చూడటానికో ఆ ఏకాంతాన్ని ఉపయోగించుకుంటే అదేమంత అభినందించదగిన విషయం కాదు. ***వందలాది మందితో మెసులుతూ మితంగా మాట్లాడటం చాలా మంచి విషయం.***

ఇండియాలోని మనుషులకు వ్యర్థ ప్రసంగాలెక్కువ. అందుకే సెల్‌ఫోన్ల అమ్మకాలు, టాక్ టైమ్ అమ్మకాలు ఇక్కడ ఎక్కువ. ఇలాంటి వ్యర్థ ప్రసంగాల ప్రోగ్రామ్స్ కూడా చానల్స్ పోటీపడి ప్రసారం చేస్తుంటారు.

మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది అంటూ ఆ మధ్య సినీ కవి పాటకూడా రాశాడు. వ్యర్థ ప్రసంగాలు మనకు ఎంత

ఎక్కువ అంటే, అసెంబ్లీలో యం.ఎల్.ఏ.లు. మంత్రులు అడిగిన దానికి సూటిగా జవాబివ్వకుండా, వ్యర్థప్రసంగాలు చేస్తుంటారు. ఆధ్యాత్మిక ప్రసంగాలదీ ఇదే ధోరణి. ఆ వక్త చెప్పిందే చెబుతుంటాడు. ప్రసంగంలో ఆరోహణ, అవరోహణ, మంద్రస్థాయి, ఉచ్ఛస్థాయి ఇవేమీ ఉండవు. ఒకటే బాదుడు.

కాలం మారిపోయింది. క్లుప్తంగా ఉండే ప్రసంగాలకు ప్రాధాన్యం పోయింది. కథకంటే కథనానికి, విషయం కంటే విశ్లేషణలకూ ప్రాధాన్యత పెరిగింది. అసెంబ్లీలో కూడా గుక్కతిప్పుకోకుండా ఎదుటి వారిని నోరెత్తనివ్వకుండా నోరేసుకుని పడటానికి ప్రాధాన్యత పెరిగింది. కాని ఇలాంటి వారు నిరంతరం వివాదాలలో ఉంటారు.

***ఏ కాలంలోనైనా మిత భాషులందరూ గౌరవనీయులే.***

## ప్రశ్న : ఇతరుల గురించి ఆలోచన, ఇతరులవలన బాధపడకుండా ఉండాలంటే ఏం చేయాలి?

**జవాబు :** మీరు ప్రాముఖ్యత నివ్వకుండా ఏ వ్యక్తి గాని, సంఘటన గాని మిమ్మల్ని భాదించలేదు. మరపు మనిషికి దేవుడిచ్చిన వరం. మనలను కనిపెంచిన తల్లిదండ్రులనే మరణించాక సంవత్సరం లోపే మరచిపోతున్నాం. మరో సంవత్సరం గడిచేసరికి దైనందిన జీవితంలో వాళ్ల ఆలోచనల ఊసు ఎక్కడా తారసపడదు. అలాంటిది పరిచయస్థుల బంధువుల పాత్ర ఏముంది. మరొకరిని ఇబ్బంది పెట్టకుండా ఎవరికి నచ్చినట్లు వారు జీవించవచ్చును. మీరు చేస్తున్న పనిపట్ల సంతృప్తి, మీ జీవితం సంతోషంగా గడపటం, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించటం, మీకు చేతనైతే, అదీ కూడా ఇష్టమైతేనే నలుగురికీ సహాయం చేయటం ఇంతకంటే ఎవరి జీవితానికైనా





కావలసిందేముంది? ***నిలబడిదంచినా, ఎగిరెగిరిదంచినా అదే కూలన్నట్లు, ఎవరెంత తాపత్రయపడినా జీవితం మున్నాళ్లముచ్చటని తత్వవేత్తలు చెబుతూనే ఉన్నారు గదా!*** మన పరిచయస్థులు, బంధువులూ, తెలిసినవారు ఎంత మంది మన కళ్లముందు జారిపోలేదు? ఏదో ఒకరోజు మనవంతూ వస్తుంది.– ఈలోగా స్వల్ప విషయాలకు ప్రాధాన్యత నివ్వటం అనవసరం. మీ సంతోషం మీ చేతుల్లోనే ఉంది.

## ప్రశ్న : చాలా పుస్తకాలలో చెప్పిందే చెబుతున్నట్లు ఉంటుంది. ఎందుకని?

**జవాబు :** నిజానికి మీరు చదువుతున్న ఈ పుస్తకం కూడా మీకు అలాంటి భావననే కలిగించవచ్చు. కాల్పనిక సాహిత్య మైతే కథ ముందుకు వెళ్తూ, పాత్రల మధ్య నాటకీయత చోటు చేసుకుంటూ, ఊహించని సంఘటనలు పాఠకుడిలో ఉత్కంఠను రేకెత్తిస్తూ చదవటానికి బాగానే ఉంటుంది. కాని ఒక విషయం గురించి పలు పార్శ్వాలలో చెప్పేటప్పుడు అసలు సంగతి అదే ఉంటుంది కదా! ఉదాహరణకు ఇండియా, రష్యా, చైనా, అమెరికా.... ఏ దేశం వెళ్లినా మనుషులే. రెండు కాళ్లు, రెండు కళ్లు, రెండు చేతులతో ఉంటారు. ఇది సిమిలారిటీ. అలాగని అంతా ఒకటి కాదు. భాష, సంస్కృతి, ఆహారపుటలవాట్లు ఇలా ఒక దేశానికి మరో దేశానికి ఎన్నో వ్యత్యాసాలున్నాయి. అలాగే ఒక పుస్తకం చదువుతున్నపుడు పుస్తకం అంతా ఒక ఫ్లేవర్‌లో ఉంటుంది. కాని ఒక్కొక్క అధ్యాయం లేదా పేజి ఒక్కొక్క వంటకంలా భిన్నంగానే ఉంటుంది. ఏది ఏమైనా సాహిత్యంలో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ మానసిక వికాస పుస్తకాలలో ఉండదు. ఒకసారి రుచి తెలిసి ఆస్వాధించటం మొదలు పెడితే, ఏదైనా చిన్న కదలిక

ఏర్పడితే, ఇక ఆ తర్వాత తృష్ణ తీరేవరకు ఈ తరహా పుస్తకాలు చదువుతూనే ఉంటారు.

## ప్రశ్న : మనస్సును బందీ చేయకుండా విడుదల చేయడం అంటే ఏమిటో వివరించండి?

**జవాబు :** "మనస్సును విడుదల చేయండి" అనేది నాకు చాలా ఇష్టమైన విషయం. ఈ పేరుతో ఒక పుస్తకం రాయాలనుకున్నాను. మనసును విడుదల చేస్తే జీవితం చాలా అద్భుతంగా ఉంటుంది. భయాలుండవు. సందేహాలుండవు. వేదనలుండవు. స్వేచ్ఛ పొందిన వ్యక్తి ఏ విధంగా ప్రశాంతంగా ఉంటాడో రకరకాల బంధనాలలో ఉన్న మనసును మీరు విడుదల చేయగానే స్వేచ్ఛను పొందిన మనసు ప్రశాంతంగా హాయిగా ఉంటుంది. అంటే పంజరంలోని పక్షులను బయటకు తీసి వదిలేయటం లాంటిదన్నమాట. సులభమైన ఉదాహరణ చెబుతాను. దేవుడి పూజ చేస్తుంటారు. హారతి ఇవ్వబోగానే ఆరిపోతుంది. ఇక అందోళన పడటం ప్రారంభిస్తారు. అంతకు ముందు అనేక సినిమాలలో ఇలాంటి దృశ్యం చూసి ఉంటారు. హారతి ఆరిపోతుంది. హారతి ఇస్తున్న స్త్రీ దిగ్భ్రాంతి చెందినట్లు క్లోజప్ షాట్‌లో ఆమె ముఖం చూపిస్తారు. వెంటనే ఎక్కడో హాస్పిటల్లో ఉన్న ఆమె భర్త చనిపోయినట్లు దృశ్యం చూపిస్తారు. లేదా వేగంగా పరుగెడుతున్న రైలు నదిలో పడిపోయినట్లు చూపిస్తారు. ఈ రకమైన దృశ్యాలు మనసుమీద ముద్రింపబడి, ఇంట్లో హారతి ఆరిపోగానే ఏదో కీడు జరగబోతుందని ఆలోచిస్తారు. ఇక ఆ మూడ్ నుండి బయటకు రాకపోతే ఆ రోజంతా ఆందోళనగా, దిగులుగా ఉంటుంది. ఏమనుకుంటే అది జరుగుతుంది కాబట్టి, ఏవో చిన్న చిన్న అప్రియమైన సంఘటనలు ఆ మర్నాడు జరిగితే, ఇక జీవితాంతం హారతి ఆరిపోతే మీరూ భయపడ్తుంటారు.





నిజానికి హారతి ఆరిపోవటానికి గాలికారణం. హారతి ఆరిపోతేనో, కుంకుమ గిన్నె ఒలికిపోతేనో, హఠాత్తుగా అశుభాలు ఏమీ జరుగువు. ఇది తార్కిక జ్ఞానం. హారతి ఆరిపోవటం-హాస్పిటల్లో మరణం-దర్శకుడు పోలికగా చూపించిన ఈ దృశ్యంతో తెలిసీ తెలియని మనస్సు బంధింపబడింది. తార్కిక జ్ఞానంతో మనస్సును పట్టుకున్న ఆ బంధనాలను తొలగించాలి. ***భావోద్వేగాలు ఎంత బాగా చొప్పించగల్గితే కళ అంత బాగా జనాదరణ పొందుతుంది. కళ వాస్తవం కాదనే, 'స్పృహ' ఎల్లవేళలా ఉండాలి. ఇష్టాలు, ప్రేమలు, మోహాలు, అహంకారాలు, ఆత్మ న్యూనతలు, ఉద్రేకాలు, కోపాలు, ఆశలు..... ఇలా ఎన్నో భావాలు ఇనుపగొలుసులకంటె బలంగా మనస్సును బంధిస్తున్నాయి.*** అందుకే అన్ని బంధనాల నుండి మనస్సును స్వేచ్ఛగా విడుదల చేయండి. అయితే ఇదెలా ఉండాలంటే పశువులను పచ్చిక బీడులో స్వేచ్ఛగా మేతకు వదిలేసిన పశువుల కాపరి ఏ పశువైనా పక్కచేలోకి చొరబడితే కఱ్ఱ పట్టుకొని దాన్ని అదుపులో పెట్టినట్లుగా మనస్సు మీద పశువుల కాపరిలా నిఘా పెట్టాలి, అది ఎక్కడ పడితే అక్కడ పశువు' లా ఇష్టారాజ్యంగా చొరబడకుండా. మనస్సుకు ఏది అలవాటు చేస్తే దాన్నే కోరుతుంది. విడుదల చేయాలి. నిఘా పెట్టాలి. ఇలా జీవితాంతం అప్రమత్తంగానే ఉండాలి.

## ప్రశ్న : సినిమాలో నటించటం కళ, కొంతమంది నిజ జీవితంలో నటిస్తుంటారు. మనస్సులో ఉద్దేశం వేరు, పైకి చెప్పేది వేరు, ఇలాంటి వారిని ఏం చేయాలంటారు?

**జవాబు :** ఏమీ చేయనవసరం లేదు. జీవితమే ఒక నాటకరంగం, మనం అందరం పాత్ర దారులం, అన్నాడు ఓ ఆంగ్ల కవి. సంధర్భాన్ని బట్టి,

అవసరాన్ని బట్టి మనందరం కొన్ని సార్లు తెలిసి, కొన్ని సార్లు తెలియకుండా జీవితంలో నటిస్తూనే ఉంటాం. ఇది అనివార్యమైన చర్య. ***ఏది ఏమైనా మనం చేసే పని దాని ఫలితాన్ని బట్టిగాక, ఆ క్రియ చేయటం వెనుకగల మన ఆంతర్యమే కర్మ సిద్ధాంతానికి ప్రామాణికం.*** కావున మీరు ప్రశ్నలో అడిగినట్లు నటించటం వెనక మోసం ఉందా? ఏదైనా తన ధర్మ నిర్వహణలో భాగంగా అలా నటనా చాతుర్యంతో మాట్లాడారా అనేది ప్రధాన విషయం.

ఈ సందర్భంగా బెంగాలి రచయిత్రి ఆశా పూర్ణాదేవి రాసిన 'అభినేత్రి' కథ గురించి చెబుతాను. కథ పూర్తిగా గుర్తు లేకపోయినా సారాంశం మాత్రం బాగా గుర్తుంది.

ఒక గృహిణి అత్త మామలకు సేవచేస్తూ భర్త అడుగుజాడలలో నడుస్తూ క్షణం తీరికలేక ఉంటుంది. పుట్టింటికి వెళ్లి రావాలని ఆశ ఉంటుంది. భర్తను అడిగితే అత్తమామల సంగతి ఎవరు చూస్తారు అంటాడు. సపర్యలు చేస్తున్న కోడలు ఊరెళ్లటానికి అత్తమామలు ఎందుకు ఒప్పుకుంటారు? ఆ ఉద్దేశ్యంతో వాళ్లను అడగదు. సరిగ్గా అప్పుడు వస్తాడు. ఆమె తండ్రి కూతుర్ని చూసిపోదామని.

తండ్రితో రహస్యంగా మంతనాలు జరుపుతుంది. "అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళ్తాను, ఓ పది రోజులుండి వస్తుంది" అని తండ్రి ఆమె అత్తగార్ని ముందుగా చెప్పిన కూతురి పథకం ప్రకారం అడుగుతాడు. అత్తగారు జవాబు చెప్పకుండానే కోడలు తానురాలేనని తన తండ్రితో చెబుతుంది. "ఏమనుకోకు నాన్నా. నేను నీతో వస్తే అత్తయ్యకు మందులు ఎవరిస్తారు. మామయ్య గార్కి వేళకు భోజనం అందకపోతే ఆయన అసలు





తట్టుకోలేరు". ఇలా కారణాలు చెబుతూ తనకు రావటం ఇష్టం లేదని, తనను రమ్మని బలవంతం చేయవద్దని, అత్తమామలే తనకు ముఖ్యం అని ఆ గృహిణి తండ్రి బ్రతిమిలాడినా పుట్టింటికి వెళ్లటానికి అంగీకరించదు. అప్పుడు అత్తగారు కల్పించుకుని, "అమ్మాయ్! ... ఇక్కడ పనులు ఎప్పుడూ ఉండేవే, మీ నాన్న అంతగా అడుగుతుంటే, వెళ్లనంటావేమిటి?" వెళ్ళు పర్వాలేదు" అంటుంది. చివరకు అత్తగారి బలవంతం మీద అయిష్టంగా (లోపల సంతోషపడుతూ) ఒప్పుకొని తండ్రితో పుట్టింటికి బయలు దేరుతుంది.

మాటలు యథాతథంగా గుర్తు లేవుకాని సారాంశం ఇదే. రచయిత్రి చివరలో చెప్పేదేమంటే "ఆమె నటించింది. ప్రతి గృహిణి అలా నటించగల్గితేనే, ఆ సంసారం సజావుగా నడుస్తుంది. అలాగని ఆ నటనకు మోసం అపాదించగలమా? ఆమె అభినేత్రి" అని కథకు ముగింపు చెబుతుంది. అంటే ఇక్కడ గమనించాల్సిందేమంటే, పుట్టింటికి వెళ్లటం నేరం కాదు, ఒకరిని అన్యాయం చేయటం కాదు. ఆమెది చాలా చిన్న కోరిక. ఎవరిని నొప్పించకుండా ఆమె కోరిక నెరవేరటానికి నటించింది. కావున 'ఆంతర్యం' ముఖ్యమని పాఠకులు గమనించాలి.

## ప్రశ్న : స్నేహితులతోనూ, బంధువులతోనూ, సాటి ఉద్యోగులతోనూ సత్సంబంధాలు పెంపొందించుకుంటూ, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా రూపొందించుకుంటూ జీవితం సఫలం చేసుకోవటం ఎలా?

**జవాబు :** ఈ ఆలోచన రావటమే శుభపరిణామం. ఎప్పుడైనా మంచి ఆలోచన రావాలేగాని మార్గాలు దొరకటం సులభమే. మీరు తప్పు చేస్తే క్షమాపణ చెప్పటం,

మీ పట్ల ఎవరైనా తప్పు చేస్తే వారిని క్షమించటం ముఖ్యమైన మొదటి సూత్రం. మీరు ఎవరికైనా ఉపకారం చేస్తే వారి నుండి ప్రత్యుపకారం లేదా విధేయత ఆశించకుండా ఉండటం, మీకు ఎవరైనా చిన్న సహాయం చేసినా కృతజ్ఞతలు చెప్పటం రెండో సూత్రం. ***క్షమాపణ - కృతజ్ఞతలే ఏ మనిషి జీవితాన్ని అయినా సుసంపన్నం చేస్తాయి. ఈ రెండింటినీ వ్యక్తీకరించటానికి ఏ మాత్రం కాలయాపన చేయగూడదు.***

క్షమాగుణం వలన మనిషి పరిశుద్ధుడవుతాడు. కృతజ్ఞత వలన మరింత సహకారాన్ని పొందటానికి వీలవుతుంది. ఈ రెండింటినీ పాటించిన మనిషికి ఆత్మబలం, ఆత్మ విశ్వాసం పెరిగి, తాను ఏమనుకుంటే అది జరిగి తీరుతుంది.

## ప్రశ్న : వివాహ బంధం, స్నేహ బంధం, బాంధవ్య బంధం – ఈ బంధాలలో భేదాభిప్రాయాలు లేకుండా విజయవంతం కావాలంటే ఎలా?

**జవాబు :** అది ఏ సంబంధమైనా అవతలి వారికి ప్రాముఖ్యత నివ్వాలి. “నువ్వు నాకు ముఖ్యం” అని ఎదుటి వ్యక్తికి తెలియచెప్పగలగాలి. అలాగని నాటకీయత ఉట్టిపడేలా ఒక డైలాగు కొడితే సరిపోదు. మీ ప్రవర్తనలో మీరు వారికి ఏ పాటి గౌరవం ఇస్తున్నారో తెలిసిపోతూనే ఉంటుంది. పరస్పర గౌరవమే ఏ బంధమైనా విజయవంతం గావాలంటే సులభమార్గం. ***ప్రేమ, అహంకారం రెండూ ఒకేచోట కలసి ఉండలేవు. ఆత్మగౌరవం పేరుతో తమకు తాము అత్యధిక ప్రాధాన్యతనిచ్చుకోవటం అహంకారమనే చెప్పాలి. ఆపాటి ఆత్మగౌరవం ఎదుటి వారికీ ఉంటుందనే ఇంగిత జ్ఞానం లేనపుడు ఏ బంధంలోనైనా సమరం తప్పదు.*** నిరంతర సమరం వలన సంబంధం బీటలు వారుతూ, మరల అవి కనుమరుగయ్యేలోగా కొత్త బీటలు – ఇలా కొంతకాలం గడిచాక





ధారావాహిక సంఘటనల గాయాలతో ఆ జ్ఞాపకాలతో ఆ బంధం కలుషితమైనట్లే లెక్క. ప్రేమ పరస్పర గౌరవం ఉన్న చోట ‘అహం’ తలెత్తే ప్రసక్తి లేదు. అహం తలెత్తిందంటే ప్రేమశాతం తగ్గిందనే చెప్పాలి.

వివాహబంధంలో ప్రేమ కంటె పంతానికి, సర్దుబాటు కంటె పట్టింపులకు ప్రాధాన్యతనిస్తే, అది కలహాల కాపురమే అవుతుంది. ఎంతో చిన్నదైన జీవితంలో బంధాలే సంతోషాన్నిస్తాయి. ఎంతటి విజయం సాధించినా ఆ సంతోషం పంచుకోవాలంటే బంధాలు అనివార్యం. ***కర్మ సిద్ధాంతరీత్యా బంధాలు, అనుబంధాలు ‘మాయ అయినప్పటికీ, లౌకిక ప్రపంచంలో జీవించినంతకాలం ఈ ‘మాయ’ ను ఆమోదించాల్సిందే.***

స్నేహబంధంలోని పరస్పర గౌరవానికి ఒక ఉదాహరణ చెబుతాను. నేను హైదరాబాదు నుండి గుంటూరు పనిమీద వచ్చి ఉదయం ఆరు గంటలకు ఒక హొటల్లో దిగాను. గ్రామంలో ఉన్న నా బాల్యమిత్రునికి ఫోన్ చేసి, ఇలా నేను వచ్చినట్లు చెప్పి గుంటూరు వచ్చి కలుసుకోమని ఆహ్వానించాను. మిత్రుడు పదిగంటలకు వస్తానని చెప్పాడు. కొత్తగా ప్రారంభించిన రియల్ ఏస్టేట్ కంపెనీకి సి.ఇ.ఓ కావాలంటే వారి తరపున నాకు తెలిసిన బిజినెస్ ఫ్రెండ్ ఒకాయన నన్ను ఆహ్వానించిన మీదట గుంటూరు వచ్చాను. ఉదయం 9గంటలకు ఆయన్ను కలిశాను. ఆయన స్వంత షాపింగ్ కాంప్లెక్సులో మూడవ ఫ్లోర్‌లో ఆయన ఆఫీసు ఉంటే, ఫస్టు ఫ్లోర్‌లో రియల్ ఎస్టేటు కంపెనీకి లీజుకిచ్చాడు. వారి కోసమే నన్ను పిలిచారు. రెండు మాసాలుండి అన్నీ చక్కపెట్టి వ్యాపారాన్ని ట్రాక్ మీదకు పెట్టాలని కోరాడాయన. అంటే టేకాఫ్ కోసం నన్ను ఆహ్వానించారు. రెగ్యులర్‌గా గుంటూరులో ఉండటం నాకు వీలు అయ్యేపనికాదు. ప్యాకేజీ అంతా నేను హైదరాబాద్‌లో ఉండగానే ఫోన్ చేసి చెప్పాడాయన.

డైరెక్టుగా జాయినయ్యేందుకు రమ్మన్నారు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న ఆ కంపెనీలో ఆఫీసుకు ఫోన్ చేశాడు. ఆ కంపెనీ ఛైర్మన్ రేపల్లేలో ఉంటాడట. వచ్చేసరికి 11గంటలు అవుతుందని చెప్పారు.

ఈయన హఠాత్తుగా లేచి పదండి చిన్న అర్జంటుపని ఉంది, చూసుకొద్దాం అని బయలుదేరదీశాడు. కారు గుంటూరు పొలిమేరలు దాటటం గమనించి, 'ఎక్కడకి వెళ్తున్నాం' అని అడిగాను. విజయవాడ వెళ్తున్నాం. చిన్నపని, ఆయన ఆఫీసుకు వచ్చేసరికి (రియల్ ఎస్టేట్ కంపెనీ ఛైర్మన్‌ను ఉద్దేశించి) మనం వచ్చేద్దాం అన్నాడు. నేను ఏమీ అనలేక 'మా ఫ్రెండును హోటల్‌కు రమ్మని చెప్పాను. వాడొచ్చి వెయిట్ చేస్తాడు' అన్నాను. 'అబ్బే .. గంటలో వచ్చేద్దాం..' అన్నాడు. మేము విజయవాడ వెళ్లేసరికి నా మిత్రుడు హోటల్‌కు వచ్చి నాకు ఫోన్ చేశాడు. రిసెప్షన్‌లో రూమ్ తాళం చెవి తీసుకుని రూమ్‌లో వెయిట్ చేయమన్నాను. అనుకోకుండా విజయవాడ వచ్చానని చెప్పాను. వాడు సరేనన్నాడు. గంట అనుకున్నది మధ్యహ్నం లంచ్ టైం అయింది. ఈ లోగా నా మిత్రుడికి నాలుగు సార్లు ఫోన్ చేసి చెప్పాను. 'వచ్చేస్తున్నాం' అని. వాడిని రూం సర్వీసుకు చెప్పి లంచ్ చేయమన్నాను. లంచ్ తర్వాత బయలు దేరతాం అనుకున్నాను. ఆయనకు అనివార్యమైన పని ఏర్పడి గంటగంటకు వెళ్దామనుకుంటూనే సాయంత్రం ఆరయింది. ఈ మధ్యలో గుంటూరు నుండి నా మిత్రుడు ఫోన్ చేస్తూనే ఉన్నాడు. చివరకు 7 గంటలకు ఫోన్ చేసి తాను రెండు బస్సులు మారి వెళ్లాలనీ, ఏమీ అనుకోవద్దని చెప్పి, నన్ను కలవకుండానే వెళ్లాడు. నిజం చెప్పాలంటే నాకే గిల్టీగా ఉంది. వాడిని రమ్మని ఇబ్బంది పెట్టినట్లయిందే అని బాధపడ్డాను.





ఆ రాత్రి మేము గుంటూరు వెళ్లేసరికి 9 అయింది. రియల్ ఎస్టేట్ ఆఫీసులో పని చేసుకొని హోటల్ రూమ్‌కు చేరుకునే సరికి రాత్రి 11 గంటలయింది. ఇక నా మిత్రుడికి ఫోన్ చేసే వీలు లేకపోయింది. మర్నాడు ఉదయం ఫోన్ చేద్దామని పడుకున్నాను. కానీ నాకంటే ముందుగా వాడే నాకు ఫోన్ చేశాడు, నేనింకా నిద్ర లేవకుండానే. నేను వచ్చే వరకు తాను ఉండలేకపోయినందుకు చాలా నొచ్చుకుంటూ 'సారీ' చెప్పాడు. నిజానికి వాడిని రమ్మని పిలిచి నేను లేకుండా వెళ్లానే అని నాకు గిల్టీగా ఉంది. నా తప్పు లేకపోయినా, ఉదయం 10గంటల నుండి సాయంత్రం ఆరింటి వరకు వెయింటింగంటే ఎంత చిరాగ్గా ఉంటుందో నేను ఊహించగలను. ఒకవేళ వాడు నన్ను నాలుగు మాటలన్నా ఫీలయ్యేవాడిని కాను. "నాకు తెలియదురా, విజయవాడ ప్రోగ్రాం లేదు. అతను నన్ను అనుకోకుండా తీసుకువెళ్లాడు. నిన్ను రమ్మని నేను వెళ్లినందుకు నేనేసారీ చెబుతున్నాను" అన్నాను.

ఈ సంఘటనలో విషయం ఏమంటే, నేను వచ్చేంతవరకు ఉండకుండా వెళ్తాడా అని వాడి గురించి నేను అనుకోలేదు. తనకు జరిగిన అసౌకర్యానికి నేను బాధపడ్డాను. నా మిత్రుడు కూడా "అంత ఉండలేని వాడివి నన్ను ఎందుకు రమ్మని పిలిచావు" అని నన్ను నిలదీయకుండా, తాను ఉండలేకపోయినందుకు నొచ్చుకుని 'సారీ" చెప్పాడు. పరస్పరగౌరవం అంటే అదీ! నాకు ఊహ తెలిసేనాటికి 5 సంవత్సరాల వయసనుకున్నా మా 'స్నేహబంధం' వయస్సు 55 సంవత్సరాలు.

***ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో, ఈ ఊరికి ఆ ఊరు అంతే దూరం అనే సామెత బాంధవ్యాల మధ్య ఉండవలసిన పరస్పర గౌరవాన్ని ఉద్దేశించి చెప్పబడిందే. ప్రేమ ఇద్దరు మనుషులను దగ్గర చేస్తుంది. అహం విడగొడుతుంది.***

## ప్రశ్న : బంధాలు విజయవంతం కావాలంటే ఎదుటివ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని మీరు చెప్పారు. మనం ప్రాముఖ్యత నివ్వనిదే ఏ వ్యక్తీ మనలను బాధ పెట్టలేరు - అని ఇదే పుస్తకంలో మరొక చోట చెప్పారు. ఇదెలా అన్వయించుకోవాలి?

**జవాబు :** తొందరపడి ఏ పనీ చేయరాదని ఒక సామెత. ఆలస్యం అమృతం విషమని మరొక సామెత. పరస్పర విరుద్ధంగా ఉన్నాయని సందేహించడంగాక, ఆయా సందర్భాలకు తగిన విధంగా అన్వయించు కోవాలి.

ప్రాధాన్యత ఇవ్వనిదే అది బంధమెలా అవుతుంది? జీవితాంతం కలిసుండే జీవిత భాగస్వామికి ప్రాధాన్యత నివ్వకుండా సంసారంలో సంతోషం ఎలావస్తుంది? స్నేహితుడైనా, స్నేహితురాలైనా అవతలి వారి వ్యక్తిత్వాలకు ప్రాధాన్యత నివ్వకుండా స్నేహంలోని తీయదనపురుచి ఎలా తెలుస్తుంది? ఇక బాంధవ్యం అంటారా, దూరంగా ఉంచితే అది తెరమరుగవటానికి అట్టే కాలం పట్టదు. వివాహబంధం, స్నేహ బంధం, బాంధవ్య బంధాలలో మనకు ప్రాధాన్యత నిచ్చుకోకుండా ఎదుటివారికి ప్రాధాన్యత నివ్వాలని చెప్పాను. అలాగాక పదే పదే మీరు ఎదుటి వ్యక్తుల వలన బాధపడ్తుంటే, మీరు ఆ యొక్క బంధాన్ని సమీక్షించుకోవాలని సూచించటం జరిగింది. అంటే మీరు ప్రాముఖ్యత నివ్వకుండా వారు మిమ్మల్ని నొప్పించలేరని భావం.





అయినా ఆత్మీయ బంధాలను ఎవరైనా సులభంగా గుర్తించవచ్చును. ఒక్క వివాహబంధంలోనే 'సర్దుబాటు' ఎక్కువ అవసరపడ్తుంది. జీవిత భాగస్వామిని మార్చుకుంటూ వెళ్లటం ప్రాక్టికల్‌గా కుదరదు కాబట్టి, ఇబ్బందిగా ఉన్నా 'కర్మ' అని సరిపెట్టుకుని రాజీధోరణి అవలంభించాల్సిందే. కాని బాల్యం ఆటపాటల దశనుండి, విద్యార్థి దశ, వృత్తి ఉద్యోగాల దశలో-మీ స్వభావానికి, అభిరుచికి తగిన విధంగా స్నేహాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఇక్కడ మీకు బాగున్న స్నేహాలను కాపాడుకుంటూ అక్కరలేని స్నేహాలను వదిలేసే అవకాశం మీకు ఉందికదా! అలాగే బాంధవ్యాలు చాలా ఉంటాయి. ***పాల నుండి నీరు వేరు చేయగల 'హంస' నైపుణ్యాన్ని మీరు ప్రదర్శించి, శ్రేష్ఠమైన బాంధవ్యాలను నాలుగైదు ఎంచుకుని అక్కరలేని బంధుత్వాలను వదిలేసే సదుపాయం మీకు ఉందికదా!*** అంటే పొంతన బాగున్న, పరస్పరం కావాలనుకున్న బంధాలతో జీవితాంతం సంతోషంగా జీవించవచ్చును.

## ప్రశ్న : మా అబ్బాయి చాలా సెన్సిటివ్, మా అమ్మాయి చాలా సెన్సిటివ్ అని చెప్పుకుంటూ ఉంటారు కదా! ఈ 'సున్నితత్వం' గురించి చెప్పండి?

**జవాబు :** దీన్ని సున్నితత్వపు గోలగా నేను అభివర్ణిస్తున్నాను. అదేదో టి.వి. ప్రకటనలో "నేనూ ఓ మోపెడ్ కొనుక్కున్నాను..." అని చెప్పినట్లు, ఒకరిని చూసి ఒకరు "అబ్బో మా పిల్లలు ఇంకా సెన్సిటివ్...." అని పెద్ద వాళ్లు పోటీపడి చెప్పుకుంటూ ఉండటం నేను గమనించాను. ఎక్కడ చూసినా డబ్బు, నగలు, బట్టలు ఆస్థిగా భావించి వాటిని దర్పంగా ప్రదర్శించినట్లే, ఈ 'సున్నితత్వం' అనే ఒక అంశాన్ని తమ పిల్లలకు ఆపాదించి చాలామంది

పేరెంట్సు ఆనందపడ్తున్నారు, మురిసిపోతున్నారు. నా బాల్యంలో నేను కూడా దీని బాధితుడనే! పెద్దవాళ్లు నన్ను ఉద్దేశించి 'సెన్సిటివ్' అని పరిచయం చేస్తుంటే, 'ఐసెట్‌లో గోల్డ్ మెడల్' అన్న ఫీలింగులో ఉండిపోయేవాడిని. పదే పదే అలా అందరిలో ఆ విధంగా గుర్తింపబడాలనుకునేవాడిని. బాల్యంలో అంకురించే 'ఐడింటిఫికేషన్ క్రైసిస్" తాలూకు లక్షణం ఇది. పరిణితి చెందాక నా విషయంలో మా పెద్ద వాళ్లు చేసిన తప్పునే, ఈ రోజుకూ చాలామంది పెద్దవాళ్లు చేస్తున్నారని గమనించాను. నిజానికి 'సున్నితత్వం' ఒక సుగుణం కాదు. అది ఒక మానసిక బలహీనత. మనం పిల్లలకు ధైర్యంగా ఉండటం నేర్పాలి. దృఢంగా ఉండటాన్ని అభ్యసించే తర్ఫీదు ఇవ్వాలి. పిల్లలు సున్నితంగా ఉన్నారు అన్పించిన ప్రతి సందర్భంలో, వారికి అలా ఉండటం తప్పని కరెక్ట్ చేయాలి. మొక్కలో ఉన్నప్పుడు వంచటం సాధ్యమే. ప్రతి చిన్న విషయానికీ బాధపడటమే సున్నితత్వపు లక్షణం. బాల్యంలో రూపుదిద్దుకునే ఈ అవలక్షణం పెరిగి పెద్దయ్యాక బలపడి, వీరు బాధపడ్తూ, వీరిని నమ్ముకున్న వారిని కూడా తద్వారా బాధపెడ్తుంటారు.

ఒకవేళ ఈ పుస్తకం చదువుతున్న పెద్దవాళ్లు, ఈ లక్షణం తమలో ఉందని గుర్తించిన యెడల, 'లేట్ బెటర్ దెన్ నెవర్' అనే విజయసూత్రం అన్వయించుకుని, ఇప్పటికైనా తమని తాము సరిచేసుకొనవచ్చును. అలా సాధ్యం కాదని భావించిన నిస్సహాయులు, 'సున్నితత్వం' కారణంగా తాము ఇంత కాలం బాధపడ్తున్న స్వీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పిల్లలు, పిల్లల పిల్లల (మనవలు) విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ఏది ఏమైనా 'సెన్సిటివ్‌నెస్' సున్నితత్వం ఇది మంచి లక్షణం ఎంత మాత్రం కాదు. విషయాలలో, భావాలలో కళారూపంలో సన్నితత్వపు అంశం కడు రమ్యంగా ఉంటుంది గాని, వ్యక్తిలో, 'సున్నితత్వం' ఖచ్చితంగా దుర్భరమైన లక్షణమని నిర్ద్వందంగా చెప్పవచ్చును.





మగవాళ్లలో ఈ 'సున్నితత్వం' ఉంటే మరింత ప్రమాదకరం. సిగరెట్టు, మందు, మగువ అలవాట్లున్నా భరించవచ్చుగాని, సున్నితత్వం లక్షణమున్న మగవాడిని కట్టుకున్న ఏ ఆడది సుఖపడలేదు. ***ఆర్థిక దారిద్ర్యం కంటె స్వభావ దారిద్ర్యం భయంకరమైంది.*** దృఢమైన వ్యక్తిత్వం అన్ని వేళలా అందరూ గర్వించి ఆమోదించవలసిన లక్షణం. సున్నితత్వం ముదిరితే 'రోగ' మవుతుంది. జాగ్రత్త సుమా!

**ప్రశ్న : పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో పోదంటారు. మరి మీరేమో ఇవన్నీ చెబుతున్నారు. మారటం సాధ్యమేనా?**

**జవాబు :** ఇవన్నీ కాలం చెల్లిన సామెతలు. అయినా మీ సందేహం సమంజసమైనదే. గుర్తు పెట్టుకోండి. ఒక గదిలో ఓల్టేజి తక్కువ ఉన్న ఎర్రటి బల్బు ఉన్నదనుకోండి. ఆ లైటు వేసినపుడు రూమంతా ఎర్రటి కాంతి పరుచుకుని ఉండటం మీరు గమనించి ఉంటారు. ఇప్పుడు ట్యూబ్‌లైట్ వేసారు. రూమంతా తెల్లటి కాంతి పరుచుకుంది. ఎర్రటి కాంతి మచ్చుకైనాలేదు. కాని ఎర్రటి బల్బు ఇంకా అక్కడ వెలుగుతూనే ఉంది. అంతకు ముందు ఎంత పరిమాణం కాంతి వెదజల్లిందో, ఇప్పుడూ అంతే పరిమాణం వెదజల్లుతూనే ఉంది, మార్పు లేకుండా. అంటే తెల్లటి కాంతిలో ఎర్రటి కాంతి కనిపించనంత పలుచనయిందన్నమాట. పుట్టకతో వచ్చిన బుద్ధి ఎర్రటి బల్బు అనుకుందాం. పుట్టకతో వచ్చిన బుద్ధి పోయిందేమీ లేదు. అలాగే అక్కడే శాశ్వతంగా ఉంది. కాని కొత్తగా మరింత కాంతి వంతమైన శక్తిని మనం స్వీకరించినపుడు, పుట్టుకతో వచ్చిన బుద్ధి పలుచనయి వెలవెలబోతుంది.

***మనుషులు ఒకరి వలన ఒకరు ప్రభావితమవటం అందరూ***

***అంగీకరించగల వాస్తవం. పుట్టుకతో వచ్చిన బుద్ధులు ఎలా ఉన్నప్పటికీ, ప్రోజుకారోజు నేర్చుకుంటూ కొత్త కాంతులను మనలోకి తీసుకోగల్గితే, నేర్చుకున్నది. నిరంతర సాధనతో మనం అచరించగల్గితే మార్పు అసాధ్యం ఏమీ కాదు.*** చాలామంది జీవితాలలో జీవిత భాగస్వామి యొక్క ప్రభావం ఉండి, వివాహానంతరం వారిలో మార్పు ప్రవేశిస్తుంది. మీ సంబంధీకులలో చాలామందిలో ఈ మార్పును చూడవచ్చును. అలాగే మనకు దొరికే స్నేహితులు, పరిచయస్థులు, మనలను ప్రభావితం చేయవచ్చు. మనం చూసే సినిమాలు, పుస్తకాలు కూడా చాలా చాలా కొత్త విషయాలు మనకు నేర్పించగలుగుతాయి. "వినదగు నెవ్వరు చెప్పిన..." అనే సుమతీ శతకం పద్యాన్ని ఆదర్శంగా తీసుకుంటే, మనకంటె వయస్సులో చిన్న వారి నుండి కూడా ఎంతో కొంత తీసుకోవచ్చును. పుట్టుకతో వచ్చిన నైజగుణం పోతుందని నేను చెప్పటం లేదు. కాని మనం అద్భుతంగా మారటానికి మన పుట్టుకతో వచ్చిన బుద్ధులు ఆటంకం కాదని తెలియజేస్తున్నాను.

తామస జనులంతా సాత్వికులుగా మారాలనే మన పూర్వీకులు గురుకుల వ్యవస్థ ఏర్పాటు చేసారు. బాల్యం నుండి యౌవన కాలం వరకు ధనిక, పేద తారతమ్యం లేకుండా అందరూ గురువు సంరక్షణలో ఉండి విద్య నభ్యసించేవారు. పుట్టుకతో వీరిలో కొంతమందికి తామస గుణం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో అతనికి పుట్టుకతో వచ్చిన తామసగుణ రీత్యా విధ్వంసకర ఆలోచనలు ఉదయించినప్పటికీ, షుమారు 20 సంవత్సరాలు గురువు నుండి తీసుకోబడిన కాంతి అతన్ని అదుపులో ఉంచుతుంది. తద్వారా సమాజం ఎక్కువమంది సాత్వికులతో సుభిక్షంగా ఉండాలనే మన పూర్వీకుల యోచన. ఇప్పుడు గురుకుల వ్యవస్థ అంతరించి పోయింది. మార్పు కోసం ఎవరికి వారే అన్వేషించాల్సిన అవసరమొచ్చింది.





**ప్రశ్న : మన దగ్గర డబ్బుంటే, అందరూ మన కాళ్ల దగ్గరకే వస్తారు. వాళ్లు చాటుగా ఏమనుకున్నా మనం పనులు చేయించుకుంటాము కదా! డబ్బు సంపాదిస్తే సరిపోతుంది గదా! మానవ సంబంధాల విషయంలో ఇన్ని జాగ్రత్తలు ఎందుకు?**

**జవాబు :** మానవుడు సంఘజీవి. తెల్లవారి లేస్తే ఏ మనిషీ స్వంతంగా చేసుకోగలపని ఒక్కటీ లేదు. డబ్బు ఉంటే సేవలు దొరికే మాట నిజమే. ఆ మాటకు వస్తే మనుషులందరితో సంబంధ బాంధ్యవ్యాలు సజావుగా జరిపినా 'డబ్బు' లేకుండా జరుగుబాటు ఏలా అవుతుంది? మనం చేసే చర్యలకే గాదు. ఆలోచనలకూ ఫలితాలుంటాయి. మన దగ్గరకు డబ్బు రావాలంటే ఎలా వస్తుంది? మనం సేవలందించి ప్రతి ఫలంగా డబ్బు తీసుకుంటాము. ఏమీ చేయకుండా డబ్బు ఎలా చేరుతుంది? పెద్దలు సంపాదించిన ఆస్తి తింటూ కూర్చుంటే ఎన్నాళ్లు సాగుతుంది? ఉన్న ఆస్తి మానేజ్ చేసుకోవాలన్నా ఒక నిబద్ధత తప్పనిసరిగా అవసరం. మంచి ఆలోచనలు చేసే వారికి అన్నీ శుభాలే జరుగుతాయి. ***ఎవరేమనుకున్నా పర్వాలేదనుకునే మన ప్రవర్తన నిజంగా ఆక్షేపించదగినదయితే, అది కూడా పాపమే అని అందుకు తగిన మూల్యం చెల్లించాల్సిందేనని కర్మ సిద్ధాంతం చెబుతుంది.***

**ప్రశ్న : ఆధ్యాత్మిక పుస్తకాలు చదివి, నీతి బోధలు విని ఉపకార బుద్ధితో ఉదారగుణంతో ఉదాత్తంగా జీవించటం వర్తమాన సమాజంలో సబబేనంటారా?**

**జవాబు :** ఉదాత్తంగా జీవించటం ఏ కాలంలో నైనా ఆక్షేపణ ఎలా అవుతుంది?

అయితే ఉపకార బుద్ధి, ఉదారగుణం మనం ఎవరి పట్ల చూపిస్తున్నాం. వారికి అర్హత ఉన్నదా? మన ఉదారగుణం వలన ఉపకారం పొందిన వారు ఆంతర్యంలో నిజంగా మనలను గౌరవిస్తున్నారా? లేక అమాయకులు, పిచ్చి వాళ్లు డబ్బు విలువ తెలియక మనకు ఇస్తున్నారు అని అనుకుంటున్నారా – అని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా 'ఉదారగుణం' ఒక స్వాభావిక లక్షణమని దాని వలన అనర్థం జరగకుండా ఎవరికి వారు జాగ్రత్త పడాలి. ఎందుకంటె ప్రారంభంలో ఎంతో వైభవంగా జీవించిన అనేక మంది ప్రముఖులు ఈ ఉదారగుణం వలన జీవితం చరమదశలో దుర్భరమైన బ్రతుకు అనుభవించారు. అలనాటి ప్రముఖ నటీమణి స్వర్గీయ సావిత్రి, అలనాటి ప్రముఖ నటులు స్వర్గీయ కాంతారావు, రాజానాల, రాజబాబు ఇంకా ఎందరో మహానుభావులు ఆర్థికంగా ఎంతో ఉచ్ఛస్థితిని చూసికూడా అవసాన కాలంలో దారిద్ర్యం అనుభవించారు. సీనియర్ నటుడు చిత్తూరి నాగయ్య గారిదీ అదే పరిస్థితి. ఉదాత్త జీవితం పట్ల మక్కువ, ఉపకారబుద్ధి విలువలే ఆస్థిగా జీవించాలని భావించే వారంతా వాస్తవిక దృక్పథంతో పరిస్థితులను గమనిస్తూ ఉండాలని నా సూచన.

చాలా కాలం క్రితం నేను ఒక కథ చదివాను. 'నాణానికి అటూ ఇటూ' కథ పేరు. సుమారు 40సం॥ల క్రితం ఏదో మాసపత్రికలో ఈ కథ ప్రచురింపబడింది. ఒకతనికి పర్సు దొరుకుతుంది. అందులో చాలా పెద్దమొత్తం డబ్బు ఉంటుంది. పర్సు దొరికిన వ్యక్తి నైతిక విలువలే ఆస్థిగా భావించే మనసున్నవాడు. ఆ పర్సులో ఒక విజిటింగ్ కార్డు, అందులో అడ్రసు ఉంటాయి. ఆదివారం వెళ్లి, ఆ అడ్రసులో పర్సు ఇచ్చి రావాలనుకుంటాడు. ఈలోగా అర్జంటుగా డబ్బు అవసరమై పర్సులోని





డబ్బు నుండి 500 రూపాయలు తీసి వాడుకుంటాడు. దానికే కొంపలంటుకున్నట్లు చాలా వేదనపడతాడు. ఆదివారం విజిటింగ్‌కార్డులోని అడ్రసుకెళ్లి, తనకు పర్సు దొరికిన విషయం చెప్పి, విజిటింగ్ కార్డును బట్టి అడ్రసు వెతుక్కుంటూ వచ్చాననీ చెబుతాడు. 500 రూపాయలు తప్పని సరి పరిస్థితులలో వాడుకున్నానని, జీతం రాగానే తెచ్చి ఇస్తానని 'గిల్టీ' గా చెప్పుకుంటాడు. అతను పర్సును పర్సులోని డబ్బునూ లెక్కించుకుని, తల ఎగరువేసి 'తప్పకుండా తెచ్చివ్వండి' అంటాడే గాని థాంక్సు కూడా చెప్పడు. కథలో ట్విస్టు ఏమంటే ఆ పర్సు అతనిది కాదు. విజిటింగ్ కార్డు మాత్రం అతనిదే. అంటే ఇతను ఇచ్చిన విజిటింగ్ కార్టు ఎవరో పర్సులో పెట్టుకున్నాడు. అదే పర్సు పోగొట్టుకున్నాడు. విజిటింగ్ కార్టు చూసి పర్సు అతనిదేనని భావించిన మనసున్న మనిషి అది తీసుకొచ్చి అడ్రసు ప్రకారం ఇచ్చాడు. నాణానికి అటూ ఇటూ అంటే, పర్సు దొరికిన వ్యక్తి తాను అనుభవించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ పని చేయకుండా దాన్ని స్వంత దారునికి చేర్చాలనుకున్నాడు. తనదికాదని తెలిసినా ఆయాచితంగా వచ్చిన సొమ్ము తీసుకోవటమే గాక బాలన్సు 500 కూడా అదేదో తన సోమ్మే అయినట్లు తెచ్చివ్వమని అడిగాడు విజిటింగ్ కార్డు వ్యక్తి. పర్సు దొరికిన వ్యక్తి వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తే, కాస్త విచారణ చేసి అసలు విషయం గ్రహించగలిగేవాడు. నిజంగా పర్సుపోగొట్టుకున్న స్వంతదారుడైన వ్యక్తికి అది చేరవేయడం మంచిదేగాని, ఇలా ఒక స్వార్థపరుడి ఇంటికి వెళ్ళి మరీ సొమ్ము ఇవ్వటం వలన ఏం సాధించగలిగాడు.

ఇది 40 ఏళ్ళ నాటి కథ. ఇప్పటి సమాజంలో కనురెప్పకు తెలియకుండా కనుగుడ్డును మాయం చేసేవారున్నారు. ప్రాక్టికల్ థింకింగ్ అన్నివేళలా మంచిది. పుస్తకాలు వ్రాసేవారు కూడా తమ ప్రొడక్టును

అమ్ముకోవడానికే చూస్తారుగాని, సమాజానికి మేలు చేయడానికే అని విశ్వసించనక్కరలేదు, అలాగని అనుమానించనూ అక్కరలేదు. ఆధ్యాత్మిక నీతికథలు వ్రాసే రచయితలు, అవి పదిమందీ చదివే విధంగా వాటిని కొని అందరికీ బహుమతిగా ఇవ్వమని ఉదాత్త సందేశం ఇస్తుంటారు. కాని ఇతర పబ్లికేషన్సు ధరలకంటే ఎక్కువ ధరలకు ఆ పుస్తకాలను విక్రయిస్తుంటారు. కాగితం ధర, ప్రింటింగ్ ఖర్చూ ఎవరికైనా ఒక్కటే. ఎక్కువమంది చదవాలని భావించేరచయితలు, కనీసం ఆధ్యాత్మిక పుస్తకాలైనా అసలు ధరకు ఇవ్వాలని ప్రయత్నించటం లేదు.

ఉదారగుణంతో జీవిస్తున్నవారు వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తూ ఉపకారం చేసే విషయంలో అది అనర్హులకి ధారబోయకుండా చూసుకోవాలి.

## ప్రశ్న : జనం నుండి మంచి రెస్పాన్సు అంటే స్పందన వస్తే మనం చేసిన పని విజయవంతమైనట్లేనా? విజయానికి కొలమానికం ఏమిటి ?

**జవాబు :** కేవలం జనం స్పందించినంత మాత్రాన మనం విజయం సాధించినట్లేమీ కాదు. పనీపాటలేని జనం ఎక్కువగా ఉన్న ఇండియా లాంటి దేశాలలో మీరు ఏం చేసినా రెస్పాన్సు వస్తుంది. ఉదాహరణకు స్థానిక భాషలో ప్రజాదరణ వున్న ఒక దిన పత్రికలో "మిమ్మల్ని మోసం చేస్తాం రండి" అని ఆకర్షణీయంగా ప్రకటన ఇస్తే దీనికి కూడా మంచి స్పందన వస్తుంది.

ఎలా మోసం చేస్తారో చూడాలని, మోసం చేయడంలో మెళకువలు ఏమైనా చెబుతారేమోనని ఖచ్చితంగా చాలామంది వస్తారు. మీరు నమ్మరేమోగాని, ఎంతోకొంత మోసపోవాలనే తాపత్రయంతో కూడా





కొంతమంది వస్తారు. ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, పూటగడచినా చాలని తిండి విషయంలోనేకాదు, పొద్దుబుచ్చే విషయంలో కూడా ఈ పూటకూళ్ల వాళ్లు మనకు కోకొల్లలు. రాజకీయ పార్టీల బహిరంగసభలకు లక్షలాదిమంది జనాన్ని తరలించగలుగుతున్నారంటే, ఇదేకదా ప్రధాన కారణం! అందువలన కేవలం రెస్పాన్సును బట్టి విజయాన్ని నిర్ధారించలేము. ఎన్నికల ప్రచార సభలకు జనం పోటెత్తి వచ్చిన దృశ్యాలు చూసిన మనకు అదేపార్టీ ఘోర పరాజయం పాలైన ఉదంతం కూడా తెలుసు.

పదిమందికీ ఉపయోగపడే పని ఏదైనా మీరు సంకల్పించండి. అందులో మీ ప్రయోజనాన్ని కూడా చొప్పించండి. పని అనుకున్న దగ్గర్నుండీ పూర్తి చేసేవారకు ప్రతిమజిలీలోనూ ఎదురయ్యే సమస్త అనుభవాలనూ ఆనందిస్తూ పొండి – అంతిమ ఫలితంతో సంబంధం లేకుండా. ఇలా ఒకటి పూర్తయితే మరొకటి. జయాపజయాలతో సంబంధం లేకుండా నిరంతర ప్రయత్నంతో ఉత్సాహంగా ముందుకు సాగిపోవడమే విజయవంతమైన జీవితం. జీవిత చరమాంకంలో మీరు నిల్వ చేసుకున్న మధుర జ్ఞాపకాలెన్నో, చేదు జ్ఞాపకాలెన్నో లెక్కగట్టి మరీ చెబుతుంది మీ అంతరాత్మ. ***నలుగురిని మభ్యపెట్టి చాకచక్యంగా నాలుగు డబ్బులు సంపాదించటం విజయమనే మతి భ్రమణంలో చాలామంది వున్నారు. మనసేవా సాకర్యాలు ఎంతమేరకు అవతలివారలకు ఉపయోగపడ్తున్నాయనేది కర్మ సిద్ధాంత రీత్యా చాలా ముఖ్యం.***

## ప్రశ్న : గొడవల్లో తల దూరిస్తే ఆవేశం అంటారు. పోనీలే మనకెందుకులే అనుకుంటే మెతకదనం అంటారు ఏం చేయాలి?

**జవాబు :** అనవసరంగా తొందరపడకపోవడం శాంతం. అయినదానికి

కాని దానికి తొందరపడడం ఆవేశం. అవసరమైనప్పుడు కూడా తొందరపడకపోవడం మెతకదనం. మూడింటికిగల వ్యత్యాసం జీర్ణించుకుని తదనుగుణంగా ఆచరించడమే ఉత్తమమార్గం.

## ప్రశ్న : మౌన వ్రతం గురించి చెప్పండి ?

**జవాబు :** భావం కలుగగానే వ్యక్తం చేయకుండా నోటిని అదుపులో ఉంచుకోవడం వలన జీవితంలో స్వయంకృతాపరాధం కారణంగా ఎదురయ్యే కష్టనష్టాలను పూర్తిగా అదుపులోకి తీసుకురావచ్చును. అయితే భావాన్ని అదుపులో ఉంచుకోవడం చాలామందికి సాధ్యం కాదు. మనస్సులో ఏమనిపిస్తే అది అనేసిన తర్వాత అయ్యో అని నాలిక్కరచుకోవడం వలన ఉపయోగం వుండదు. నోటి దురుసు, వ్యర్థ ప్రసంగాలు తద్వారా తగాదాలు, వ్యవహారిక నష్టాలు, అయినవాళ్ళు దూరమవడం ఇలా అనేక అనర్థాలను అరికట్టాలంటే ఎవరైనా సులభంగా ఆచరించ వీలైన అభ్యాసం మౌనవ్రతం.

మౌనవ్రతం అంటే అదేదో సత్యన్నారాయణవ్రతంలా పూజగదిలో జరిపించే తంతుకాదు. మౌనవ్రతం అనుకున్న రోజున ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రించేవరకు ఎవరితోను నోరువిప్పి మాట్లాడకుండా ఉండటమే మౌనవ్రతం. అంటే మరలా మరుసటి రోజు సూర్యోదయం వరకు ఇది కొనసాగుతుంది. నిత్య కృత్యాలకు అవసరమైనా పెదవి విప్పకూడదు. ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులతో ఏదైనా అవసరంపడితే సైగలు ద్వారా తెలియజేయవచ్చును. లేదా కాగితం మీద రాసి అవతలి వారికి తెలియజేయవచ్చును. వంటగదిలో, భోజనాల దగ్గర ఒక పలకా, బలపం ఉంచుకోవడం ఉత్తమం.

మనిషికి రోజూ వేలాది ఆలోచనలు వస్తుంటాయి. ఇందులో అనుకూల ఆలోచనలు, ప్రతికూల రెండూ ఉంటాయి. భావాలలో కూడా





మంచి, చెడూ రెండూ వుంటాయి. జాలి, కరుణ, దయ, మంచితనం, ఉపకారగుణం, ఉదారత్వం, ప్రేమ, ఆత్మీయత, గౌరవం లాంటి సాత్విక భావాలతోపాటు ఆవేశం, కోపం, చిరాకు, వెటకారం, అహం, అసూయ, అనుమానం లాంటి తామస భావాలు కూడా వెల్లువలా మెదడులో విరుచుకు పడుతుంటాయి. సాత్విక, తామస నిష్పత్తిలో వ్యత్యాసమే తప్ప అనుకూల ప్రతికూల భావోద్వేగాలు ఎవరిలోనైనా ఉంటాయి. మౌనవ్రతం చేయడం వలన ఆ రోజుకు మెదడులో కలిగిన భావాలను మాటలద్వారా బయటకు రాకుండా అదుపుచేయగల్గుతారు. ఈ మౌనవ్రతం ప్రారంభంలో కొంచెం కష్టమనిపించినా, రాను రాను సులభంగా ఆహ్లాదంగా ఉంటుంది. ఈ విధంగా వారానికి ఏదైనా ఒకరోజు మౌనవ్రతం ఆచరించవచ్చును. అవకాశం ఉన్నవారు, ఆచరణలో సులభసాధ్యం చేసుకున్నవారు వారానికి రెండు మూడు రోజులు కూడా ఈ మౌనవ్రతం ఆచరించవచ్చును.

ఈ విధంగా ఆచరించడం వలన భావం కలుగగానే వ్యక్తం చేయాలనే అలవాటు మౌనవ్రత దీక్ష రోజులలో నిరోధింపబడటంవలన మామూలుగా మాట్లాడే రోజులలో కూడా "మౌనవ్రతం దీక్షలో కొనసాగిన అభ్యాసం" ఉపయోగపడి భావాలను అదుపుచేసుకుని అవసరమైన భావాలను మాత్రమే బయటకు వ్యక్తీకరించగలుగుతారు. తద్వారా క్రమంగా విచక్షణ, వివేకం అభివృద్ధి చెంది, భావాలు కలిగే ప్రక్రియలో కూడా కొత్త మార్పు చోటుచేసుకుని, సాత్వికత శాతం మనిషిలో గణనీయంగా పెరుగుతుంది. మౌనవ్రతం సామాజిక ప్రయోజనాలకే గాదు, వ్యక్తిత్వ వికాసానికి, ఆధ్యాత్మిక ప్రగతికి కూడా సులభమార్గం. నా వద్దకు వివిధ సమస్యలతో వచ్చినవారికి ప్రత్యేక పూజలూ, అభిషేకాలు, ఉపవాసాలతోపాటు మౌనవ్రత దీక్ష గురించి పరిహారంగా చాలామందికి చెప్పాను. ప్రత్యేకించి కొన్ని సామాజిక

వర్గాలలో కుటుంబ సభ్యులందరికీ ఈ అలవాటు ఇప్పటికీ వుంది. ***నోరేసుకొని పడేవాళ్ళకు ఈ దీక్ష కొంచెం కష్టతరమన్పించినా, ఇదొక్కటే వారి నోటి దురుసును అరికట్టగల దివ్య ఔషధం.***

**ప్రశ్న : సమాజంలో ఎక్కువ శాతం మంది ఎవరికి వారు "నేను గొప్ప" అనే మానసిక భావానికి లోనయి పారదర్శకతతో ఇతరులతో సంబంధ బాంధవ్యాలు నెఱపలేకపోతున్నారు. నిజంగా " ఎవరు గొప్ప " అనేది నిర్ణయించడానికి కొలమానం ఏమిటి ?**

**జవాబు :** 'నేను గొప్ప' అనే విషయం ఎవ్వరూ బాహాటంగా ప్రకటించక పోయినప్పటికీ, ఎదుటివ్యక్తిని కించపరచి అగౌరవంగా చూసే విధానంలో ఈ 'నేను గొప్ప' అనే దృశ్యం చూస్తూనే ఉన్నాం. పలు సందర్భాలలో నిరంతరం ఎక్కడో ఒకచోట ఈ దృశ్యం మనకు కనిపిస్తూనే వుంటుంది. "నేనెవరో తెలిసే మాట్లాడుతున్నావా?", "నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? ", "నీ స్థాయి ఏమిటి? నా స్థాయి ఏమిటి?" లాంటి సంభాషణలు – 'నేను గొప్పవాడిని'. అనే భావాన్ని ప్రకటిస్తున్నాయి. సమాజంలో ఎదురయ్యే సందేహాలను మన పూర్వీకులు పరిశీలించి జవాబులను పండిత పామరులందరికీ సులభంగా అర్థమయ్యే విధంగా మనకు సామెతల రూపంలో అందించారు. "తాడిని తన్నే వాడుంటే, వాడితల దన్నేవాడుంటాడు" – అనే సామెత అలాంటిదే. జనాభా ఎక్కువ ఉన్నచోట ఇలాంటి సంవాదాలు, లుకలుకలు వుంటూనే వుంటాయి. ఇండియాలో ఉన్న మానసిక జాడ్యాలు చాలావరకు అమెరికాలో కనిపించవు. ఈ విషయంలో అమెరికా సమాజాన్ని





మనం ఆదర్శంగా తీసుకోవచ్చును.

'ఎవరుగొప్ప' అనేది నిర్ణయించడానికి ఒక కొలమానికను ఖాయం చేయడమంటే మనం ఇంకా అనాగరికంగా వున్నట్లు లెక్క. కులం వలన గొప్పవాడినని ఒకడు అనుకుంటున్నాడు. డబ్బు వలన గొప్పవాడినని మరొకడు అనుకుంటున్నాడు. అధికారం వలన గొప్పవాడినని వేరొకడు అనుకుంటున్నాడు. పాండిత్యం వలన గొప్పవాడినని ఇంకొకడు అనుకుంటున్నాడు. ఇంకా ఆటగాడిననీ, పాటగాడిననీ, పోటుగాడిననీ రకరకాలుగా గొప్పవాళ్లం అనుకుంటూ, వాళ్ళు సంఘర్షణకు గురవుతూ ఇతరులను కూడా బలవంతంగా ఘర్షణలోకి లాగుతున్నారు. తన దగ్గరకు వచ్చే విటుల సంఖ్యనుబట్టి తన బిజీ షెడ్యూలును బట్టి తాను గొప్పదాన్నని అనుకుంటుంది ఒక వ్యభిచారిణి. ***యధారాజా తథా ప్రజా అన్నట్లు రాజకీయ నాయకులు, మంత్రుల దగ్గర్నుండి నాలుగు ప్లాటులమ్మి ఒక కారు కొనుక్కున్న రియల్ ఎస్టేటు బ్రోకరు వరకు అదే ధోరణి.***

నిజం చెప్పాలంటే పాటల పోటీ పెట్టి పాల్గొన్న వారిలో గొప్పపాటగాడిని ఎన్నిక చేయవచ్చు. ఆటలపోటీ పెట్టి పాల్గొన్న వారిలో గొప్ప ఆటగాడిని ఎన్నిక చేయవచ్చు. ముగ్గుల పోటీ పెట్టి పాల్గొన్నవారిలో మంచి ముగ్గువేసిన వారిని గుర్తించవచ్చు. అందాల భామల పోటీ పెట్టి పాల్గొన్న వారిలో గొప్ప అందగత్తెను ఎన్నిక చేయవచ్చు. ఇంకా కథలు, కవితలు, పద్యాలు, పరుగుపందెం, రకరకాల పోటీలు పెట్టి పాల్గొన్న వారిలో ప్రతిభావంతుడిని గుర్తించవచ్చును. మనం ఇక్కడ అన్ని పోటీలలోను కామన్‌గా వున్న 'పాల్గొన్నవారిలో' అనే పదం గమనించాలి. అంటే అప్పుడు కూడా ఆయా వ్యక్తులు అక్కడ పాల్గొన్నవారిలో మాత్రమే ప్రతిభావంతులుగా గుర్తించబడ్డారు లేదా ఎన్నిక కాబడ్డారు అని అర్థం చేసుకోవాలి. వీరికంటే

సమర్థులు ఎంతోమంది సమాజంలో ఉండి, వారంతా వారివారి వ్యక్తిగత కారణాల వలన ఈ పోటీలలో పాల్గొని ఉండక పోవచ్చునుగదా! మరి అలాంటప్పుడు 'నేనుగొప్ప' అని గెలుపొందినవారు ఎవ్వరూ అనుకోగూడదుకదా! ఓడిపోయినవారు మరొకచోట గెలుపొందవచ్చు. గెలుపు ఓటములను బట్టికూడా 'ఎవరుగొప్ప' అనేది నిర్ణయించలేమని తేలిపోయింది. ***పోటీలను వేడుకలుగా భావించాలేగాని గొప్పతనం నిర్ణయించే కొలబద్దలు అనుకోవడానికి వీలులేదు.*** ఎన్నికలు పరిపాలనా సౌలభ్యం కోసం "స్వచ్ఛంద సేవకుల"ను గుర్తించడానికే గాని అధికారం హెూదా ఆభరణాలుగా భావించి 'నేను మరీ ఎక్కువ గొప్ప' అనుకునే అహంకారాలను తెచ్చుకోవడానికి గాదు.

***'గొప్పవాళ్లం' అనుకున్న మరుక్షణం 'మీరెలా గొప్ప' అని విరుచుకుపడే జనం ఎప్పుడూ కత్తులు నూరుతూ సిద్ధంగా ఉంటారు. ఘర్షణపడుతూ ఘర్షణను ఎదుర్కొనేవాడు గొప్పవాడు ఎలా అవుతాడు ?***

రోజుకు ఇరవై కటింగులు చేస్తూ పనిలో బిజీగా వుండే బార్బర్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒకరికొకరు ఎదురుపడితే చిరునవ్వుతో ఒకరినొకరు పలకరించుకొని "మీరు బాగా కటింగ్ చేస్తారని విన్నాం మిమ్మల్ని కలసినందుకు సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి, "మీరుకూడా బాగానే పని చేస్తున్నారు." అని బార్బరు హర్షంతో పరస్పరం గౌరవించుకొవాలి. ఎవరిపని వారు సక్రమంగా శ్రద్ధగా చేయాలి. పనులు వేరయినప్పటికీ బార్బరూ, ముఖ్యమంత్రి ఇద్దరూ సమాజానికి అవసరమైనవారే! వేతనంలో తేడాలున్నప్పటికీ గౌరవంలో అందరూ సమానమే. మరొకరిని తక్కువగా చూసి ఆధిక్యతను ప్రదర్శించే 'గొప్పతనం' ఎవ్వరూ కోరుకోకూడదు. అందరికీ అన్ని సౌకర్యాలున్న సమాజంలో 'నేనుగొప్ప' అనే భావానికీ





తావులేదు. మనం తరచూ గమనిస్తూ వుంటాం. కొంతమంది నాయకులు ప్రభుత్వ విధానాలు ఖండించటానికి వారు ఒకరోజు "రోడ్లు ఊడ్చి" తమ నిరసన వ్యక్తం చేస్తుంటారు. ఛానల్సువారు అదేదో గొప్పతనం అన్నట్లు పదేపదే ప్రసారం చేస్తుంటారు. కాని అతను తన చర్య ద్వారా రోడ్లు ఊడ్చే కార్మికులను వారి పనిని కించపరుస్తున్నాడని, వారికంటే తాను అధికుడనని చెప్పకనే చెబుతున్నాడనే విషయం పట్టించుకోరు.

జీన్స్ పదం మీరు వినే వుంటారు. జీన్స్ కారణంగా పూర్వీకుల నుండి కొన్ని లక్షణాలు సంక్రమించినట్లే సమాజానికి కూడా జీన్స్ వుంటాయి. ఆ సమాజంలో పుట్టి పెరుగుతున్నవారికి సమాజపు జీన్స్ ఉండడం వలన, కొన్ని భావాలు పుట్టుకతోనే సంక్రమిస్తాయి. అక్కడే పెరగడం వలన అవి ఇంకా బలం పుంజుకుంటాయి. ***అందువలనే చాలామంది పాఠకులకు బార్బరూ, ముఖ్యమంత్రి ఒకటెలా అవుతారు అనే సందేహం తలెత్తుతుంది. మనం వినేవి, చూసేవి, రాసుకునేవి అన్నీ తప్పులయినప్పుడు కొత్త ఆలోచనలు ఎలా వస్తాయి ?***

"ఎవరు గొప్ప" అనేది నిర్ణయించాల్సివస్తే ఒక్కటే కొలమానం. ఆధిక్యత ప్రదర్శించకుండా అభిజాత్యాలకు పోకుండా, మాటల ద్వారా చేష్టల ద్వారా ఎదుటి వ్యక్తులను కించపరచకుండా, మనకు సేవలు అందిస్తున్న అందరినీ మనతో సమానంగా చూడగల మానసిక పరిస్థితికి ఎదగడమే నిజమైన గొప్పతనం. నిజానికి ఇది కూడా గొప్పతనం ఏమీకాదు. కనీస సంస్కారం. ధర్మం. ప్రాథమిక హక్కులకు భంగం కల్గించకుండా ఉండడంకూడా గొప్పతనం అనుకోవాల్సిన దురదృష్టపు వెనుకబడిన సమాజంలో మనం ఉన్నందుకు బాధపడాలి. అయితే మనం నేర్చుకొనే ప్రాథమిక దశలో ఉన్నాం కాబట్టి, అన్నింటా అసమానతలున్న ఇండియాలాంటి దేశాలలో మార్పు రావాలంటే

ఒక్కసారిగా రాదు. “నేనుగొప్ప” అనే కిరీటం తగిలించుకున్న వారెవ్వరూ కనుచూపుమేరలో కనీసం రెండు దశాబ్దాల వరకు ఆ కిరీటాన్ని తీసెయ్యడానికి వారు అంగీకరించరు. మీరు అందరినీ గౌరవిస్తే “మీరు గొప్ప” అని కాస్త ఎంకరేజ్‌మెంటు వారికి ఇస్తే, చాక్లెట్ల కోసం ఆశపడే చిన్నారుల్లా చాలామంది ముందుకువస్తారు. (నేను గొప్ప అనే అమాయకత్వంతో గూడిన అజ్ఞానంలో ఉన్నవారు చిన్నారులేగా మరి). ఆ విధంగానైనా సమాజం ప్రక్షాళణమై సమతకు మమతకు సంకేతమైన గాంధి కలలుగన్న కొత్త సమాజం ఆలస్యంగానైనా రూపొందుతుంది. అమెరికాలో ఆహార్యాన్ని బట్టి ఆర్థిక పరిస్థితిలో హెచ్చుతగ్గులు అసలు గుర్తించలేము. చిన్నచిన్న వృత్తి ఉద్యోగాలలో ఉన్నవారు కూడా ఉన్నత వేతనం, స్వంతకారు కలిగి ఉంటారు. అందరూ తాము చేసేపనిపట్ల గౌరవం, శ్రద్ధ కలిగి వుంటారు. అలాగే ఇతరులు కూడా వారిని సమగౌరవంతో చూస్తారు. ఆధిక్యత ప్రదర్శించే సన్నివేశం ఎక్కడా కనిపించదు. ఉద్యోగరీత్యా ఇతర ఆసియాదేశాల నుండి అమెరికా వచ్చిన లక్షలాదిమంది ఈ వ్యత్యాసాన్ని గమనించి తమ మాతృదేశం వారికి ఇక్కడ పరిస్థితుల గురించి చెబుతూ వస్తున్నారు. మరో 20 సంవత్సరాలలో ఇండియాలో కూడా జీవన చిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశిద్దాం. అప్పుడు “ఎవరుగొప్ప” అనే అనాగరికమైన ఆలోచన పాతతరం వారిలో ఉందని తెలుసుకుని ఆశ్చర్యపోయినా ఆశ్చర్యంలేదు. స్త్రీ పురుషులు అందరూ సమానమే. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే. యజమాని ఉద్యోగి ఇరువురూ సమానమే. కార్మికుడు, కర్షకుడు, శ్రామికుడు, చిన్న పెద్ద వృత్తులలో ఉన్నవారంతా సమానమే. అందరూ పరస్పరం గౌరవించుకోవాలి. ప్రేమించుకోవాలి. ఆత్మీయంగా పలకరించుకోవాలి. ఎవరిపని వారు శ్రద్ధగా చేయాలి. వ్యక్తి ముఖ్యంగాక సమాజం ముఖ్యమని





అందరూ భావించాలి. అదేగొప్ప సమాజం.

డబ్బు వలన, అధికారం వలన, పాండిత్యం వలన, సృజనాత్మకత వలన గొప్పవాడినని భావించడమే సరికాదని, మనం ఇప్పుడు మాట్లాడుకుంటున్నాం. అలాంటిది ఇవేమీ లేకుండానే కొంతమంది “నేనుగొప్ప” అనే అజ్ఞానంతో “ఏమీలేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది” సామెతను గుర్తుకు తెస్తుంటారు. అహంకారం, ఆత్మన్యూనతలను పెంచి పోషించే ఆలోచనలను కుటుంబ సభ్యులందరూ కలసి “బావర్చి బిర్యాని” లాగా పంచుకుంటారు. ఇంట్లో పెద్దవాళ్లకే తెలియనప్పుడు పిల్లలకు ఏం చెప్పగలరు? ఆ విధంగా అలాంటి కుటుంబాలలో జన్మించిన పిల్లలు సాత్విక ప్రవర్తన బదులు తామసిక ప్రవర్తన అభివృద్ధి చేసుకుంటారు. ఇంక వారి జీవితాలలో అభివృద్ధి నేతి బీరకాయలో నెయ్యిలాగా ఎప్పటికీ కనిపించదు. ప్రారబ్ధ కర్మ బలంగా వుంటే సద్యోస్ఫురణ (అంటే సకాలంలో సవ్యమైన ఆలోచన రావటం) లోపిస్తుంది. కావున అన్ని అనర్థాలకూ అహం, అసూయ కారణాలనే వాస్తవం గుర్తెరిగి అందరితోనూ ప్రేమగా వుండాలి. ఎవ్వరూ గొప్పవారు కారు. ఈ సృష్టిలో అందరమూ సమానమే. అయితే వయసురీత్యా, హోదారీత్యా, పదవి అధికారం రీత్యా, డబ్బురీత్యా పాండిత్య రీత్యా మనకంటే ముందున్న వారిని గౌరవించడం మన సంస్కారం అవుతుంది. ఇందులో చిన్నతనం ఏమీ లేదు. వినయమే అన్నింటినీ మించిన స్వర్ణాభరణం. అదేవిధంగా మనకంటే చిన్నవాళ్ళ పట్ల ఆధిక్యత ప్రదర్శించకుండా ప్రేమగా ఉండడం కూడా మన విధి.

అభివృద్ధి చెందుతున్న ఇండియాలాంటి దేశాలలో ఎవరి పరిధిలోవారు అందరినీ కలుపుకు పోవడం, పెద్దలపట్ల వినయం,

చిన్నవారిపట్ల ప్రేమ కలిగి వుండడమే ప్రస్తుతానికి గొప్పతనానికి కొలమానికంగా నేను భావిస్తున్నాను.

## ప్రశ్న : మాంసాహారం తమోగుణాన్ని, శాకాహారం సాత్విక గుణాన్ని కలిగిస్తాయని అందరూ చెబుతున్నారు. మాంసాహారం తిన్నవారు అసురగుణం కలిగి ఉద్రేకం, దూకుడు స్వభావం కలిగి వుంటారా? ఇది ఎంతవరకు నిజం?

**జవాబు :** మనం వినేవి, చూసేవి, రాసుకునేవి, చదువుకునేవి అన్నీ తప్పులయినపుడు కొత్త ఆలోచనలు ఎలా వస్తాయని, ఇంతకుముందే చెప్పటం జరిగింది. ప్రజాదరణ పొందిన విషయాలు శ్రేష్ఠమైన వాటిగా భావించటం, మిగిలిన వాటిని తక్కువగా అంచనా వేయడమనే ఒక మానసిక నియంత్రణకు లోబడి మన ఆలోచనా విధానం అభివృద్ధి చెందింది. ఘంటసాలగారిని గొప్ప గాయకుడిగా, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంను ద్వితీయ శ్రేణి గాయకుడిగా నలభై ఏళ్ల క్రితం భావించే వారు. ఇప్పుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం దక్షిణ భారతదేశంలోనే గొప్ప గాయకునిగా ప్రసిద్ధి పొందారు. ఒకసారి లోతుగా ఆలోచించండి. ఒకవేళ 40 ఏళ్ల క్రితమే బాలసుబ్రహ్మణ్యం గాయకుడిగా రిటైర్మెంటు తీసుకొని ఇతర వృత్తిలోకి ప్రవేశించినట్లయితే గొప్పగాయకుడు కాదా? ఘంటసాల ఉన్నప్పుడు కూడా అదే గాయకుడు కదా! ***అంటే నా ఉద్దేశం ప్రజాదరణ తీసి పక్కనపెడితే ఎస్.పి. ఈనాడు ఎంతటి ప్రతిభావంతుడో, నలభై ఏళ్ల క్రితం కూడా అంతటి ప్రతిభావంతుడే.***

ఎక్కువ పాటలు పాడటం వలన, అప్పటినుండి ఇప్పటివరకు





పరిచయమై మరింతమందికి ఆరాధ్యుడైనాడు. అయితే బాలసుబ్రహ్మణ్యం ఒక్కడే గొప్ప గాయకుడనగలమా ? లక్షలాది మంది గాయకులుంటారు మనకు తెలియదు. మనకు పరిచయం కాలేదు. సినిమా అనే కళారూపం ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం ను గొప్ప గాయకునిగా ఆవిష్కరించింది, అంతే. సినిమాలలో పాడకుండా విడిగా పాడి ఆడియో క్యాసెట్లు, సిడిల రూపంలో బయటకు వచ్చిన మధుర గాయనీగాయకులు అనేకమంది వున్నారు.

ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే మాంసాహారం తమోగుణాన్ని పెంచుతుందనే విషయం, జనం మోసుకుతిరగడం వలన ప్రజాదరణ పొందింది. అంతేగాని కేవలం మాంసాహారం మాత్రమే ఉద్రేకం, దూకుడులను పెంచుతుందనే విశ్వాసం, విశ్వసించదగినది ఎంతమాత్రం కాదని పాఠకులందరికీ తెలియజేస్తున్నాను.

దీనికి ఋజువు ఏమంటే అమెరికాలో ఉన్నవారిలో ఎక్కువ శాతంమంది మాంసాహారులే. అదికూడా గేదె, పంది మాంసం వారంతా ఇష్టంగా తింటారు. కాని ప్రవర్తన విషయంలో అమెరికా జనం చాలా ఉన్నతంగా వుంటారు. మాంసాహారం తమోగుణాన్ని పెంచుతుందనే విషయం వాస్తవం కాదని ఇక్కడ ప్రజల సాత్విక ప్రవర్తన సంస్కారవంతమైన జీవన విధానం తెలియజేస్తున్నాయి.

దుష్టగుణాలు అభివృద్ధి చెందడానికి దృక్పథం ప్రధానం కాని, ఆహారపు అలవాట్లు కాదని నిర్ద్వందంగా చెప్పవచ్చును. ***ఒక శిశువు పుట్టినప్పటినుండి పెరిగి పెద్దయ్యేంత వరకు, ఇంటా బయటా అతను ఎలాంటి వాతావరణంలో పెరుగుతున్నాడు, ఏ విధమైన క్రమశిక్షణ నేర్చుకుంటున్నాడు? ఎటువంటి భావజాలం అతని మెదడుకు చేరవేయబడుతుంది? వీటన్నింటి మధ్య***

***అతను తన మనసును బందీ చేయకుండా స్వీయ పరిజ్ఞానంతో ఏ విధంగా పరిణామం చెందాడు? అతనికి పరిచయమయిన ఉన్నత భావాలుగల సంస్కారాలు, సత్పురుషులు, గురువులు , పెద్దవారు ఎవరు - ఇత్యాది విషయాల మీద అతని సాత్వికత లేదా తామసికత అతనిలో అభివృద్ధి చెందుతాయి. కేవలం ఆహారపు అలవాట్లు మనిషి యొక్క శీలాన్ని పవిత్రతను నిర్ణయించలేవని పాఠకులకు తెలియ జేసుకుంటున్నాను.***

## ప్రశ్న : ఆత్మహత్య మహాపాపం అంటారు ఎందుచేత? ఆ పరిస్థితిని ఏవిధంగా ఎదుర్కోవాలి?

**జవాబు :** కారణం ఏదైనా ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడంటే అతనికి ఏవో సమస్యలున్నాయని వాటిని తట్టుకోలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడని మనం అనుకోవాలి. ఏదైనా గాని మానసిక వత్తిడి ప్రధాన కారణం. కర్మ సిద్ధాంత రీత్యా లోకంలోని ప్రతి జీవి ప్రారబ్ధ కర్మ అనుభవించడానికి జన్మ తీసుకుంటుంది. ***జైలులో వున్న ఒక ఖైదీ శిక్షాకాలం పూర్తి కాకుండా జైలు నుండి పారిపోయిన యెడల, చట్టం అతనికి జైలు శిక్షా కాలం మరింత పొడిగిస్తుంది. అదే విధంగా నిర్ణీత పాపఫలం అనుభవించవలసి వున్న జీవి ఆత్మహత్య చేసుకున్నాడంటే జీవితాంతం అనుభవించాల్సిన పాపఫలం తాలూకు శిక్ష నుండి తప్పించుకునేందుకు సిద్ధపడ్డాడని ఆంతర్యం. అంటే జైలు నుండి పారిపోయిన ఖైదీలాంటి వాడన్నమాట.*** ఈ లెక్కన ఆత్మహత్య వలన ఆ వ్యక్తి అదనంగా మరింత ఎక్కువ పాపం చేశాడని మనం అర్ధం చేసుకోవాలి. మన జీవితంలో ఎదురయ్యే అన్ని సంఘటనలు తర్కానికి అందవు. ఒక్క కర్మ సిద్ధాంతం మాత్రమే అన్నింటికీ సమాధానం చెబుతుంది.





ఆత్మహత్య మహాపాపం అనే విషయం తెలుసుకున్నాం. ఇప్పుడు ఆ పరిస్థితిని ఏ విధంగా ఎదుర్కోవాలో పరిశీలిద్దాం. ముందుగా కర్మ సిద్ధాంతం గురించి పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలి. మనకే ఇలాగ ఎందుకు జరుగుతుంది అని విచారిస్తూ కూర్చోకుండా, సమస్యలను ఎదుర్కోవటం నేర్చుకోవాలి. ఈనాడు మనకు ఎదురైన పరిణామాలు, ఏదో ఒకనాడు మనం సృష్టించిన కారణాల ఫలితమే అని గుర్తెరిగి ప్రవర్తించాలి. స్వీయ లోపాలు అర్ధం చేసుకొని వాటిని అంగీకరించిన ఎడల, లోపాలను సవరించుకోవడం పెద్ద కష్టమేమీకాదు. ఒకవేళ తలకు మించిన అప్పులుచేసి వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడనుకుందాం. ఆ వ్యక్తి చనిపోయినప్పటికీ ఋణదాతలు అతని కుటుంబ సభ్యులను కలసి ఏ విధంగానైనా డబ్బు రాబట్టుకోవాలని చూస్తారు. ఆ విధంగా కుటుంబ సభ్యులకు కష్టాలు తెచ్చిపెట్టినట్లే. అప్పులిచ్చినవాళ్ళు, వారి కుటుంబ సభ్యులు అందరూ కలసి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని, అతని కుటుంబాన్ని శాపనార్ధాలు పెడతారు. వారుకూడా క్షోభకు గురవుతారు. ఇవన్నీ కలిసి మరికొంత పాపం అతని సంచిత కర్మకు కలుపబడుతుంది. చనిపోయినంత మాత్రాన అతనికి ఋణవిముక్తి కాదు సరికదా, అప్పిచ్చినవారి నుండి క్షమాపణ కూడా దొరకదు. అదే జీవించి ఉన్నయెడల ఋణదాతలను ప్రాధేయపడి ఆలస్యమైనందుకు మన్నించమని కోరవచ్చును. అప్పు చెల్లించడానికి కొంత గడువు అడగవచ్చును. సులభవాయిదాలు కోరవచ్చును. తన నిస్సహాయ పరిస్థితి వివరించవచ్చును. ఇదంతా నిజాయితీగా చేసిన యెడల ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం వుండదు. ఆత్మవిశ్వాసంతో నిరంతర ప్రయత్నం చేస్తూ, అప్పు తీర్చాలని దృఢంగా సంకల్పించిన యెడల, ఖచ్చితంగా ఆ వ్యక్తి తక్కువ కాలంలోనే ఆత్మహత్య

ఆలోచనల నుండి పూర్తిగా విముక్తుడవుతాడు.

సమస్యలొచ్చాయని 'ఆత్మహత్య' ను మార్గంగా ఎన్నుకుంటే అతను చనిపోయాక కూడా ఆ వ్యక్తి గురించి లోకులు చులకనగా మాట్లాడుకుంటారు. బ్రతికి వున్న కుటుంబ సభ్యులకు కూడా గౌరవం వుండదు. చనిపోయినవ్యక్తి అసమర్ధత గురించి అవహేళనగా మాట్లాడుకుంటారు. ఇంత వివరంగా విశ్లేషించుకుంటే, భవిష్యత్తులో ఏ వ్యక్తీ ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచించడు. అదెంతటి క్లిష్ట పరిస్థితి ఐనా ధైర్యంగా ఎదుర్కొంటాడు.

మరో ముఖ్య విషయం ఏమంటే, జీవితంలో ఎదురు దెబ్బలు తింటున్న వ్యక్తి తన సమస్యలను కుటుంబ సభ్యులతో, ఆత్మీయులతో, స్నేహితులతో పారదర్శకంగా ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. వీళ్లకు చెబితే నన్ను లోకువ చేస్తారు అని ఆత్మన్యూనత గలవారు కుడితిలో పడ్డ ఎలుకలాగా ఎప్పటికీ బయటకు రాలేరు. అసలు ఆత్మహత్య చేసుకోవాలనుకున్న మరుక్షణం, చచ్చిన తర్వాత జరగబోయే తంతును దృశ్యరూపంలో ఊహించి, దర్శించి తన చావుతో ఎవరికైనా చచ్చే చావొచ్చిందేమో గమనించాలి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు లాంటి కీలకమైన బాధ్యతలు పూర్తిచేయని వ్యక్తులు అసలు ఆత్మహత్య చేసుకోవటానికి అనర్హులు.

ఒకవేళ జ్ఞానం చేత మాయ నశించి, బంధాల నుండి మనస్సు నిజంగా విడుదలయ్యి, వేదాంతపరమైన విరక్తితో ఎవరైనా ఆత్మహత్య చేసుకోదలచిన, బరువు బాధ్యతలన్నీ పూర్తి చేసి కుటుంబ సభ్యులందరి అనుమతి తీసుకుని, నమ్మకం ఉన్న సద్గురువును ఆశ్రయించి ఆయన ఆశ్రమంలో ఉంటూ ఆహారం లేకుండా శరీరాన్ని శుష్కింపజేసుకుని ప్రాయోపవేశం చేయాలి. అంతేగాని ఆత్మహత్య ప్రయత్నం ఏ మాత్రం అభిలషణీయం కాదు.





లోకంలో అందరి జీవితాలూ కష్ట సుఖాల కలయికే గాని, సంపూర్ణ సంతోషంగా ఎవ్వరూ లేరు. ఆత్మహత్య ఆలోచన లేకపోయినా త్వరగా చనిపోతే బాగుండును అని కోరుకుంటున్న వారు అనేకులు. ఏతా వాతా తేలిందేమంటే ఏ రకమైన కష్టాలు అనే విషయం పక్కనపెడితే మనుషులంతా ఏదో రకమైన కష్టం అనునిత్యం ఎదుర్కొంటూనే ఉంటున్నారు. జ్ఞానంచేత వివేకంచేత ఆత్మహత్యను అధిగమించాలి.

## ప్రశ్న : మన సంతోష దుఃఖాలు ఇతరులతో పంచుకోవటం మంచిదేనా? తామరాకు మీద నీటి బొట్టులాగా ఉండాలంటారా?

**జవాబు :** జవాబులను సవ్యంగా అర్ధం చేసుకోకపోతే సందేహాలు ఇలాపుడ్తూనే ఉంటాయి. అవగాహనా రాహిత్యం వలనే చాలామంది. తమ జీవితాలను నిరర్ధకంగా గడిపేస్తుంటాను. ఏది, ఎక్కడ, ఎప్పుడు, ఎలా అన్వయించుకోవాలనే విచక్షణ నిరంతరం అభివృద్ధి చేసుకుంటూనే ఉండాలి.

తామరాకుమీద నీటి బొట్టులాగా ఉండగలగటం చాలా మంచి స్థితి. తీవ్రమైన భావోద్వేగాలకు గురిగాకుండా ఉండాలని చెప్పే సందర్భాలకు ఈ స్థితి చక్కగా సరిపోతుంది. కాని సంతోష దుఃఖాలు ఇతరులతో పంచుకోవటమే సబబు. ఎందుకంటే సంతోషం పంచుకున్నకొలదీ పెరుగుతుంది. దుఃఖం పంచుకున్నకొలదీ తరుగుతుంది. ఈ రెండు పరస్పర వ్యతిరేక ఉద్వేగాలు పంచుకోవటం వలన ఉపయోగపడే ఫలితాలు ఉత్పన్నమవుతున్నాయి. నీ సంతోషాలను నలుగురికీ పంచు, దుఃఖాలను నీలోనే దాచుకో అనే – కాస్త ఉదాత్తంగా ఉండాలని చెప్పే బోధలు కూడా

లోకంలో ప్రచారంలో ఉన్నాయి. ఏదో సాధారణమైన దుఃఖాల వరకు లోపల దాచుకోవటం పర్వాలేదుగాని, భరించలేని దుఃఖాలను బయటకు చెప్పేయటమే మంచి పద్ధతి. గుండె ఆరోగ్యానికి కూడా మంచిది.

అయితే ఈ పంచుకోవటం ఎవరితో అనేది ఎవరికి వారు వివేకంతో ప్రశ్నించుకోవాలి. మనం పట్టించుకోముగాని, ప్రతి సందేహానికి ఎంతో శోధించి విశ్లేషణ చేసిన మన పూర్వీకులు మనకు సులభంగా అర్థం గావాలని సామెతల రూపంలో అందించారు. తోచీ-తోచనమ్మ తోడికోడలు యొక్క పుట్టింటికెళ్లిందట - అనే సామెత ఈ సందర్భానికి చక్కగా సరిపోతుంది.

ఈ సామెతలో కాస్త వెటకారం ఉంది. అంతులేని సందేశం ఉంది. దుఃఖం పంచుకోవటానికి మనకు అన్ని విధాలా చేదోడువాదోడుగా ఉన్న ఆత్మీయులైతే ఫర్వాలేదు. కాని ఆత్మీయులు, ఆత్మబంధువులు సమయానికి దగ్గర లేనంత మాత్రాన, ఎదురైన ప్రతి వారితో దుఃఖం పంచుకోవటం వలన ప్రయోజనం ఏమీ ఉండదు. ముఖ్యంగా రక్తసంబంధీకులను దగ్గర వారుగా భావించి చాలామంది తమకు జరిగిన అవమానాలను, ఎదురైన వైఫల్యాలను తదితర కష్టాలను వారితో పంచుకుంటారు. కాని మీరంటే అసూయ ఉన్నవారితో, వారు రక్తసంబంధీకులైనాసరే, మీ దుఃఖాలను ఎంత మాత్రం వ్యక్తం చేయకూడదు. ఒకానొక సమయాన మీరు దుఃఖాన్ని అదుపుచేసుకోలేక, ఉద్వేగ నియంత్రణ కోల్పోయి మనవాళ్లే గదా అనే భ్రమలో - అసూయ, అహంకారాలతో నిరంతరం విందు భోజనం చేసే బంధువులతో మీ సంగతులన్నీ వెళ్లబోసుకుంటే, అప్పటికి నాలుగు ఉపశమన వాఖ్యాలు వారు మీకు చెప్పినా, అవతలకు వెళ్లి ఆనందపడ్తారు. అంతేగాక మరో నలుగురికి మీ దుఃఖాన్ని చెప్పి రోగంకుదిరింది అని అక్కసు తీర్చుకుంటారు. మొత్తంగా చూస్తే మీకు





ఒరిగిందేమిటి? నాలుగు తాత్కాలిక ఉపశమన వాఖ్యాలకోసం మీరు మరి కొన్ని కష్టాలు అదనంగా తెచ్చుకుంటున్నారు. ***ఆపాటి ఉపశమనం మంచి పుస్తకం చదివినా దొరుకుతుంది. టి.వి.లో హాస్యసన్నివేశం చూసినా సరిపోతుంది. తోచకపోయినంత మాత్రాన తోడికోడలు యొక్క పుట్టింటికి వెళ్లకూడదు - అని సామెత చెబుతుంది.*** తీరా అక్కడకు వెళ్లాక మీరు ఊరు కుంటారా? మీ కష్టాలను ఏకరపు పెడ్తారు. అది భవిష్యత్తులో మీరు మరింత ఉద్వేగ భారానికి గురవ్వటానికి దోహదపడ్తుంది. స్త్రీల విషయంలో ఇలా ఉంటే, పురుషుల విషయం మరొకలా ఉంటుంది. ఆఫీసులో పనిచేసే కొలీగ్సుకు, క్రింద పని చేసేవారికి వ్యక్తిగత సమస్యలు చెప్పటం, ఓదార్పు పొందాలనుకోవటం సరికాదు. వారితో సాధారణ ఇబ్బందులను చెప్పవచ్చును. ఇప్పుడున్న అద్దె ఇల్లు సౌకర్యగా లేదని, దగ్గరగా ఏదైనా ఇల్లు ఉంటే చెప్పండనీ...... ఇలాంటి చెప్పుకోదగిన విషయాలు వారికి చెప్పవచ్చును. భౌతిక విషయాలు చెప్పటం వలన వారినుండి సేవలు పొందవచ్చును. కాని మానసిక అంతరంగిక విషయాలు వ్యక్త చేయటం వలన మీరంటే చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉంది. కావున మీరు దుఃఖం పంచుకోవాలంటే మీ ఆత్మీయులూ ఆత్మబంధువులే శరణ్యం. తక్కివ వారితో హుందాగానే వ్యవహరించాలి.

సంతోషం పంచుకోవటం గురించి ఒక ఉదాహరణ చెబుతాను. ఇటీవల మా బంధువొకాయన కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి పట్టణంలో అత్యంత ఖరీదైన పెద్ద భవంతి నిర్మించుకుని 'గృహప్రవేశం' చేస్తూ తెనాలి సమీపంలో ఉన్న తమ బంధుగణానికి ఆహ్వానాలు పంపాడు. కాని అంతటితో ఊరుకోకుండా తెనాలి నుండి ఉడిపి వరకు ఎ.సి.బస్సు ఏర్పాటు చేశాడు. రాను పోను బస్సు సౌకర్యంతో పాటు, వెళ్లిన బంధువులందరికీ వసతి

ఏర్పాటు చేశాడు. ఇంక ఇబ్బందేముంది? అసలే ఎండాకాలం. వ్యవసాయం పనులు ఏమీ ఉండవు. బంధువులంతా బస్సులో ఉడిపికి వెళ్లి, అతని గృహప్రవేశ వేడుకలో పాల్గొని తిరిగివచ్చారు. ఇక్కడ ముఖ్య విషయం గమనించండి. గృహప్రవేశం వేడుకకు ఆహ్వానాలు పంపిస్తే సరిపోతుంది. కాని కార్డులు పంపినంత మాత్రాన, అంత దూరం రానుపోను ప్రయాణం ఖర్చులు, వసతి ఖర్చులూ భరించి ఎవరు హాజరువుతారు? ముఖ్యమైన వాళ్ళు నలుగురు వస్తారేమోగాని, బంధువులంతా ఎట్టి పరిస్థితులలోనూ హాజరు కాలేరు. ఈ వాస్తవం ముందుగానే గమనించిన ఆయన ఎ.సి.బస్సు ఏర్పాటు చేసి, తన బంధువులందరితో సంతోషాన్ని పంచుకుని తన ముచ్చట తీర్చుకున్నాడు.

ఆకలి, నిద్ర, మైథునం అనే ప్రధాన భౌతిక అవసరాలు తీరటం వలన ఏ మనిషికైనా తృప్తిగా ఉంటుంది. తృప్తికూడా సంతోషం తాలూకు తోబుట్టువు కావచ్చునేమోగాని, సంతోషానికి ప్రత్యేకమైన అస్తిత్వం ఉంది. సంతోషం యొక్క పుట్టుక మనస్సులో ఐతే, పెరుగుదల మనుగడ మాత్రం ఖచ్చితంగా సంబంధ బాంధవ్యాలలోనే అని చెప్పాలి. చీరలూ, నగలూ ధరించి పదిమంది ఎదుట ప్రదర్శించి ఆనంద పడ్తారని 'ఆడవాళ్ల' గురించి మగవాళ్లు వ్యంగ్యంగా మాట్లాడుతుంటారు. మరి మగవాళ్లు మాత్రం వారి వారి స్థాయిని బట్టి తాముకొనుక్కున్న కొత్త కారును, కొత్త కంప్యూటరునూ నలుగురికీ చూపించి మురిసిపోవటం లేదా? ఏదైనా నలుగురితో పంచుకుంటేనే ఆనందం అని గమనించాలి. ఇతరులకు చూపించి సంబరపడే సదుపాయం లేనపుడు ఆడవారికి నగలు చీరలతోనూ, మగవారికి కారు, బంగళాతో పెద్దగా అవసరం ఉండదు.

ఇప్పుడొక దృశ్యాన్ని ఊహించండి. జన జీవనానికి దూరంగా





ఒక పెద్ద భవంతిలో సమస్త సౌకర్యాలు ఏర్పాటు చేసి భార్యాభర్తలను జీవితాంతం ఉండమంటె సంతోషంగా ఉండగలరా? ఆవిడకు బోలెడన్ని నగలు చీరలు వార్డురోబు నిండా అమర్చుతాము. అతనికి కావలసిన సిగరెట్లు, మద్యం ఉంటాయి. వంట సామానుతోపాటు వండి పెట్టే నౌకరు కూడా ఉంటాడు. భౌతిక అవసరాలైన ఆకలి, నిద్ర మైథునాలకు ఏలోటూ లేదు. కాలక్షేపానికి టి.వి., ఇంటర్‌నెట్ కూడా ఉన్నాయి. అయినా సంతోషంగా ఎవరైనా ఉండగలరా? నలుగురికీ చూపించి పంచుకుంటేనే సంతోషం బ్రతగ్గల్గుతుంది. ***మరొకరితో సంతోషం పంచుకునే అవకాశం లేనపుడు, వందలకోట్లు ఖర్చుపెట్టి కొనుక్కున్న ఏ వస్తువుకూ స్వతంత్రంగా సంతోషం పుట్టించగల శక్తిలేదు.***

సంతోషం పలురకాలుగా ఉద్భవిస్తుంది. ముఖ్యంగా ఏదైనా సాధించినపుడు కలిగే సంతోషం నలుగురితో పంచుకుంటే మరింత సంతోషంగా ఉంటుంది. ***అందువలన సంతోషం అందరితో పంచుకోవాలి. దుఃఖం కొందరితోనే పంచుకోవాలి.***

## ప్రశ్న : విజయం సాధించటానికి, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే ఉత్తమ మార్గం ఒకటి చెప్పండి.

**జవాబు :** తట్టుకోవాలి. ఈ పదాన్ని పదే పదే వల్లె వేయండి. అవును. జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాలను చూసి తట్టుకోవాలి. కడలి కెరటాల తాకిడికి తునుకలవకుండా ఎదురొడ్డి నిలబడ్డ బండరాయిలా రాటుదేలాలి. ప్రతి చిన్న విషయానికి చలించిపోయే మానసిక బలహీనతలను అధిగమించాలి. తమకు నచ్చని పరిస్థితులను సాదరంగా అంగీకరించాలి, ఆహ్వానించాలి. జ్ఞానమంటే పుస్తక పరిజ్ఞానం, విషయ గ్రహణశక్తి, శీఘ్ర పరిష్కార ప్రకటనా ప్రతిభ,

సమ్మోహన శక్తితో గూడిన ఉపన్యాస కౌశలం ఇవి మాత్రమే కావు. వీటన్నింటనీ మించినది సంయమనం. ఆవేశాన్ని అదుపు చేసుకోగల నిబ్బరం ఉండటమే జీవితంలో కీలకమైన విషయం. పది మందికీ దూరంగా కాస్త ప్రశాంత వాతావరణంలో ఆవేశరహితంగా మనుగడ సాగించటం మాత్రమే విజయవంతమైన స్థితి అనలేము. అందరితో ఉంటూ ఏకాభిప్రాయం కుదరనపుడు అప్రియమైన సంఘటనల పట్ల వేగంగా ఆవేశంతో ఆలోచన రహితంగా స్పందించకుండా సంయమనం పాటించటం కూడా జ్ఞానమే. నిజానికి ఇది ఆచరణలో ఉపయోగపడే జ్ఞానం. కడలినైనా దాటవచ్చుగాని కంటతడి పెట్టకుండా జీవితకడలి దాటలేమని మనపూర్వీకులు చెప్పిన విషయం సదా స్మరించదగినది.

సామాజిక జీవనంలో తరతమ భేదం లేకుండా అందరమూ ఎన్నో ఆటుపోట్లను చవి చూడవలసిందే. ముఖ్యంగా భిన్న వ్యక్తిత్వాల మధ్య ఘర్షణ ఉంటుంది. ***నిబద్ధత లేని అనేక తామసిక జీవాత్మల మధ్య నిజాయితీగా వివేకంతో విచక్షణా జ్ఞానంతో పారదర్శకంగా జీవించే సాత్విక జీవాత్మల జీవనయానం అనేక ఒడిదుడుకులతోనూ, నయవంచకులు వెన్నుపోటుదార్లు కుయుక్తులతోనూ నిత్య సమరంగా ఉంటుంది. వీటన్నింటినీ సంయమనంతో తట్టుకోవాలి.*** మనం ఎలా ఉన్నామో అందరూ అలాగే ఉంటారనుకోవటం, ఉండాలనుకోవటం అవివేకం. పైకి ఎక్కించే నిచ్చెనలేకాదు. పడదోసే పాములు కూడా ఉంటాయనే కనీస జ్ఞానం ఉండాలి. జీవితంలో పైకి రావటం అంత సులువైన విషయమేమి కాదు. మానవజన్మ అంతిమ లక్ష్యమైన మోక్షం గురించి ఆలోచించేముందు, మిగిలిన మొదటి మూడు పురుషార్థాలను (ధర్మ, అర్ధ, కామ నాల్గవది మోక్ష) సాధించాలి. వీటి సాధనకు దృఢమైన మనో వైఖరి అవసరం. ఆవేశాన్ని అదుపు చేసుకోవటం, సందర్భానికి తగినట్లుగా అభివృద్ధికి తన ఆవేశాన్ని





ఉపయోగించుకోవటం వివేకవంతుని లక్షణాలు. ఆనకట్టలేని నదీ జలాలు ఉప్పు సముద్రం పాలైనట్లు ఆవేశాన్ని వృధాగా పోనివ్వకూడదు. కష్టాలంటే చాలామందికి డబ్బు ఇబ్బందులు, ఆకలి బాధలే గుర్తుకు వస్తాయి. కాని ఏ మాత్రం ఊహించని హఠాత్తు పరిణామాలు ఎదురైనపుడు ఆవేశపడకుండా ఆక్రోశపడకుండా తట్టుకోవాలి. ఇది జనజీవన స్రవంతిలో ఈదుకురావటానికి ఉపయోగపడే కవచం. ఇది బయట ఎక్కడా అమ్మకానికి లభించదు. జీవన పోరాటంలో ప్రతి ఒక్కరూ అనుభవంతో సాధించి తీరాల్సిన అనివార్యమైన మనోధైర్యమిది.

ఒకసారి స్వర్గీయ రాజనాల గారిని, స్వర్గీయ ఎన్.టి.ఆర్ గారి గురించి కుతుహలంతో, జిజ్ఞాసతోనూ అడిగాను. “రాజనాల గారూ! ఒక మనిషి కింద నుండి పైకి రావాలంటే చాలా కష్టంగదా, ఈ కుట్రలూ, కుతంత్రాలూ రామారావు గారికి ఎదురుకాలేదా” అని. ఇదే ప్రశ్న రాజనాలగారు గతంలో ఎన్.టి.ఆర్. గారిని అడిగారట. అప్పుడు ఎన్.టి.ఆర్. ఒక్క మాటలో బదులిచ్చారట. “తట్టుకున్నాను” అని.

***ఆవేశం అనర్థదాయకం. తట్టుకుంటే విజయం సాధిస్తావు. తట్టుకోలేక పోతే చెదిరిపోతావు. పతనమవుతావు అని గీతలో చెప్పబడింది. వ్యక్తిత్వ వికాసానికి, జీవితంలో విజయం సాధించటానికి వందల పుస్తకాలు చదవాల్సిన పనిలేదు. తట్టుకోవాలి. అవును జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాలను చూసి తట్టుకోవాలి.***

## పశ్న : లౌక్యం గురించి చెప్పండి ?

**జవాబు :** నా బాల్యంలో నాకు లౌక్యం గురించి అసలు ఏమీ తెలియదు. ఆ పదం గురించి కూడా నేను వినలేదు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటమే

నాకు తెలుసు. ఆ విధంగానే పెరిగాను. ఆ తర్వాత వృత్తి జీవితంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేసినప్పటికీ ఎన్నో ఒడిదుడుకులను చవి చూశాను. శ్రేయోభిలాషులు నాకు లౌక్యం లేదని చెప్పారు. అప్పుడే ఈ లౌక్యం పదం గురించి మొదటిసారిగా విన్నాను. అయితే అప్పుడు కూడా నాకు అసలు లౌక్యం అంటే ఏమిటో స్పష్టంగా అర్థం కాలేదు. ఎందుకంటె స్వార్థంతో అసత్యం ప్రచారం చేసేవాళ్లను, కుట్రలు చేసేవారిని, కంపెనీలో చాప క్రింద నీరులా యజమానికి తెలియకుండా సొమ్ము కాజేసేవారిని నాకు ఉదాహరణగా చూపించి నా శ్రేయోభిలాషులు అదే లౌక్యం అన్నారు. అవి చెడ్డ లక్షణాలని నా అంతరాత్మ చెబుతోంది. అది లౌక్యం ఎలా అవుతోందని నా బుద్ధి ప్రశ్నించింది. బహుశా నా శ్రేయోభిలాషులకు కూడా లౌక్యం గురించి పూర్తిగా తెలియకపోవచ్చని అనుకున్నాను.

కంపెనీ యం.డీ.లను వారి ఎదురుగా ఆకాశానికి ఎత్తేసి, ఇవతలకు వచ్చి వారి గురించి అవహేళనగా మాట్లాడడం–ఈ లక్షణాన్ని చాలామంది వద్ద చూశాను. వారు ఇతరత్రా ఏమి ఇబ్బందులు పడుతున్నారో నాకు తెలియదుగాని, కంపెనీ యజమానులతో మాత్రం వారికి వ్యవహారం చాలావరకు సజావుగానే నడిచేది. ఈ ద్వంద్వ ప్రవృత్తినే 'లౌక్యం' గా అభివర్ణించారు - తర్వాత కాలంలో నాకు పరిచయమైన కొత్త శ్రేయోభిలాషులు. ఇది ఆత్మవంచన అవుతుందిగాని లౌక్యం ఎలా అవుతుందని నేను ప్రశ్నించాను. నాకు సంతృప్తికరమైన సమాధానం లభించలేదు.

అయితే వృత్తి జీవితంలో అనేక ఒడిదుడుకులను చవి చూసి ఎంతో మానసిక సంఘర్షణకు గురయ్యానని నిస్సందేహంగా, ఎటువంటి భేషజం లేకుండా ప్రకటిస్తున్నాను. నా వైఫల్యాలను ఒప్పుకుంటున్నాను.





ఇలా నా అంతర్యంలో ఆనాడే నేను నా వైఫల్యాలను అంగీకరించినందువలనే, అసలు కారణాలలోకి వెళ్లి అన్వేషించగలిగాను. ***సమాజంలో లౌక్యం గా చెప్పబడుతున్న ఒకానొక ప్రత్యేక లక్షణం నాలో కొరవడిందని నా వైఫల్యాలకు కారణంగా భావించిన నా యొక్క శ్రేయోభిలాషుల అభిప్రాయంతో నేను ఏకీభవించకుండా నా అన్వేషణ ప్రారంభించాను.***

నేను కిందపడినప్పటికీ శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య ఆశీస్సులతో ఎప్పటికప్పుడు బంతిలా పైకి లేస్తూనే4 ఉన్నాను. బాల్యం నుండి నేను ఏమి అనుకుంటే అది జరుగుతూనే వుంది. సంకల్పబలం నా ప్రధాన ఆస్తి.

మనసా వాచా కర్మణా అనే సూత్రం గురించి చదివాను. ధర్మం గురించి చదివాను. కర్మసిద్ధాంతం గురించి, జ్యోతిషం గురించి తెలుసుకున్నాను. ఇంకా నిబద్ధత గురించి, నైతిక విలువల గురించి అవగాహన కలిగాక నా ప్రవర్తనలో ఒక న్యాయం కన్పించింది గాని, ఈ లౌక్యం అంటే ఏమిటో దీని ప్రయోజనం ఏమిటో నాకు నిజంగా అర్థం కాలేదు. మనం మంచి చేస్తే మంచి ఫలితాలు, చెడు చేస్తే చెడ్డ ఫలితాలు తప్పవని తెలిసింది. మనం జన్మించేటప్పుడు వెంట తెచ్చుకున్న ప్రారబ్ధ కర్మ అనేది ఒకటుందని, దాని ఫలితం అనుభవించే విధంగా మన బుద్ధి మనలను నడిపిస్తుందని, అయితే ఇది కూడా ఒకనాటి స్వయంకృతమే గావున, ఈనాటి మన జీవితంలో మనకు స్వతంత్రత లేకపోలేదని అవగతమయ్యాక లౌక్యానికి నేను అంతగా ప్రాధాన్యతనివ్వలేదు. దీనికి ప్రధాన కారణం లౌక్యం అసలు రూపం కానరాక, అవకరాలతోగూడిన లౌక్యాన్ని ఆమోదించలేకపోవడమే. జిత్తులమారితనం మేకవన్నెపులి లాగా రంగుమార్చుకుని, లౌక్యంగా చెలామణి అవుతుందేమోనని ఒక దశలో నాకు అనుమానం కూడా వచ్చింది.

ప్రాచీనకాలంలో లౌక్యం అంటే ఒక

ఉందని, సామాజిక జీవనంలో అది ఉపయోగపడేదని నేను నిరంతర పరిశీలనతో అర్ధం చేసుకున్నాను. అయితే తర్వాత కాలంలో సమాజంలో స్వార్థం పెరిగి స్వప్రయోజనాలకోసం దిగజారడం అలవాటయి, ఈ లౌక్యాన్ని ఎవరికి తోచిన విధంగా వారు అన్వయించుకొని కొన్ని అదనపు రంగులు అద్ది దీని అసలు రూపును పోగొట్టి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారు. ఒకరిని చూసి ఒకరు అనుకరిస్తూ వీలైతే మరికొన్ని రంగులు వేస్తూ సమాజం అంతా భ్రాంతికి లోనయి ఏమాత్రం అవసరంలేని నానావిధ మిశ్రమ లక్షణాన్ని లౌక్యంగా అభివర్ణించుకోవటమేగాక, దానినే చాలామంది ఆశ్రయిస్తున్నారు. కాని ఇది సత్ఫలితాలను ఇవ్వడం లేదనేది వాస్తవం. ***మహా లౌక్యులుగా సమాజం నుండి గుర్తింపుతీసుకున్న నా పరిచయస్థులు ఎంతోమంది జీవిత వైకుంఠపాళీలో బోల్తాపడ్డారు. భంగపడ్డారు.***

మనం అందరం ప్రకృతి సూత్రాలకు మాత్రమే బద్ధులం. కర్మసిద్ధాంతం గురించి వీలైనంత ఎక్కువగా ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలి. వివేకానందుడి "బలమే జీవితం" అనే సూత్రాన్ని నరనరాల్లో ఒంటబట్టించుకోవాలి. బుద్ధుడి వేదాంతం అవగతం చేసుకోవాలి. ఆంతర్యం కల్మష రహితంగా ఉండాలి. మనం ధర్మాన్ని గౌరవించి ఆచరిస్తే అదే మనలను కాపాడుతుందని విధిగా నమ్మాలి. తనకు మాలిన ధర్మం పనికి రాదనే మినహాయింపులను నిర్లక్ష్యం చేయకుండా, సమాజ హితవు కోసం పని చేయాలి. ఏ కాలంలోనైనా సంతోషంగా జీవించడానికి విజయాలు సాధించడానికి ఇవే మార్గదర్శకాలు.

మరి లౌక్యం మాటేమిటి అని ప్రశ్న మొదటికొచ్చినట్లయితే ఈ ముక్తాయింపు వ్యాఖ్యలు చదవండి. ***ఎదుటివ్యక్తిని నొప్పించకుండా ప్రియంగా మాట్లాడటమే సంస్కారం. అతనికి హాని కల్గించే నిజం చెప్పడంకంటే,***





***ఉపయోగపడే అబద్ధం చెప్పడమే శ్రేయస్కరం. అనువుగాని చోట అధికులమనరాదు. చెరి మూర్ఖుల మనసు రంజింపరాదు. స్పష్టంగా ఉన్నది ఉన్నట్లు మాట్లాడడం మంచి లక్షణమేకాని, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం చెడ్డ లక్షణం. బంధాన్ని పదిలంగా కాపాడుకునే విధంగా భాషణం ఉండాలి. ఎవరైనా ఒక మాటంటే మెతకదనంతో పడి వుండడం లేదా ఎదురుతిరగడంగాక సమయ స్ఫూర్తితో ప్రతిగా ఒక సరసమైన మాట బాణంలా విసరాలి. బహుశా ఈ రకమైన సూత్రాల నాణ్యమైన సమ్మేళనమే అసలు సిసలైన మంచి లౌక్యంగా నేను అభిప్రాయ పడుతున్నాను.***

## ప్రశ్న : సినిమాల వలన వినోదంగాక అదనంగా ఏమైనా ఉపయోగం వుందా ?

**జవాబు :** సినిమాల వలన ప్రధానంగా లేదా నేరుగా ఆశించే ప్రయోజనం వినోదం ఐనప్పటికీ ఇంకా ఇతరత్రా ఉపయోగాలు చాలా ఉన్నాయనే చెప్పాలి. సంగీత సాహిత్యాలు మనోరంజకాలు. వీటితోపాటు దృశ్య ప్రధానంగా సాగే సినిమా అనే వినోదం మన జీవితాలతో ఏనాడో మమేకమైంది. కత్తి కూరగాయలను తరగడానికే గాదు. హత్యలు చేయటానికి కూడా ఉపయోగించవచ్చు. సినిమాలు చూసి సినిమా వార్తలు చదువుతూ నిరంతరం నిరర్ధకంగా సినిమావారికి మానసిక ధాస్యం చేస్తూ కాలం వృథా చేస్తే అది ఆయా వ్యక్తుల తప్పు అవుతుందిగాని, సినిమాలకు నేరాన్ని ఆపాదించలేము. కాని సినిమాలను ఉపయోగించుకుంటే మానసిక పరిణితికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

వినోదాన్ని అందించే ఏ సాధనమైనా మనిషి మనసులో చెలరేగే ప్రతికూల ఆలోచనలను నియంత్రించి తన సమ్మోహన శక్తితో కొత్త

లోకాలకు తీసుకెళ్లగల్గుతోంది. ప్రతి మనిషిలోనూ అంతర్లీనంగా శక్తి ఉంది. సానుకూల దృక్పథం ఉన్న వ్యక్తులు విజయాలను అందుకుంటే, ప్రతికూల ఆలోచనలున్నవారు వైఫల్యాలను ఎదురుకుంటారు. ఈ ప్రతికూల ఆలోచనలను తరిమివేయగల శక్తి సంగీత సాహిత్యాలకు ఉంది. దృశ్య ప్రధానంగా రూపొందించబడిన సంగీత సాహిత్య సమ్మేళనమైన ఈ సినిమా, వ్యక్తి యొక్క కన్ను, చెవి అనే పంచేంద్రియాల ద్వారా మనస్సు మీద తన ప్రభావం చూపెడుతుంది.

మారాలనుకున్న వ్యక్తి స్వతంత్రంగానే ఆ పని మెదలెడతాడని ఇదే పుస్తకంలో మనం చెప్పుకున్నాము. తనను తాను మార్చుకునే ప్రయత్నంలో నిరంతరం అన్వేషణ జరిపే వ్యక్తులు సినిమాలను ఆ కోణంలోనే పరిశీలిస్తారు. పుస్తకాలలోని అంశాలు ఉపయోగపడిన విధంగానే, సినిమాలు వ్యక్తుల ఎదుగుదలకు ఉపయోగపడతాయి.

ఒక సినిమాలోని గుంపు దృశ్యాలలో నటించే (కనిపించే) ప్రాధాన్యం లేని పాత్రల సంగతి వదిలేస్తే, కథకు సంబంధించిన పాత్రలు చిన్నా పెద్దా అన్నీ కలిసి 50 పాత్రలుంటాయి. అంటే సినిమా చూసిన ప్రేక్షకునికి తనకు అంతకుముందు పరిచయం లేని 50 మందితో కొత్తగా ఆరోజు పరిచయం ఏర్పడిందని భావించాలి. నిజ జీవితంలో మనకు భౌతికంగా తారసపడి, పరిచయం వృద్ధి చెందిన వ్యక్తులతో లాభనష్టాలు రెండూ ఉంటాఏమోగాని, సినిమాలోని పాత్రలు మనలను భౌతికంగా కలవలేవు కాబట్టి, కలవ జాలని మానసిక బంధాలే కాబట్టి అంతా లాభమే ఉంటుంది.

మనందరి జీవితాలు భావోద్వేగాల సమాహారమే ఐనప్పటికీ ఒక్కొక్క





సినిమా ఒక్కొక్క కథ మరియు ఆ చిత్రంలోని పాత్రలు వేటికవే తమ ఉనికిని చాటుకుంటాయి కావున-తరచి చూస్తే సినిమాలు మనకు విభిన్న అనుభవాలను ఇస్తాయి. కొన్ని పాత్రలు మనలో నిరాశను రూపుమాపగల్గుతాయి. మరికొన్ని పాత్రలు మనలో ఆత్మ విశ్వాసం నింపగల్గుతాయి. మరికొన్ని పాత్రలు తమ ఉదాత్త వైఖరితో మనలోని మాలిన్యాలను తొలగించగల్గుతాయి. కొన్ని పాత్రలు కడుపుబ్బ నవ్వించి ఆరోగ్యానికి ఉపయోగపడే హార్మోన్లను ఉత్పత్తి చేయగల్గుతాయి. కొన్ని పాత్రలు కరుణ రసంతో మనలో అంతఃచేతనలో నిద్రిస్తున్న మానవత్వాన్ని తట్టి లేపగల్గుతాయి. మనోహార దృశ్యాలు మనలోని సృజనాత్మకతకు కొత్త ఊపిరి పోస్తే, పాత్రల మధ్య నాటకీయ సంభాషణలు మన బుద్ధికి పదునుపెట్టి మంచి చెడులను విశ్లేషించగల్గుతాయి. పాటలు ప్రతి మనిషిలో మెదడులో ఘనీభవించి గడ్డ కట్టుకుని ఉన్న ప్రతికూల ఆలోచనలను కరిగించగల్గుతాయి. మొత్తంగా చూస్తే సినిమా చూసిన వ్యక్తి మనో ఉల్లాసానికి గురయి మరింత ఉత్సాహంగా పని చేస్తాడు. అకారణ ఉద్రేకాన్ని పెంపొందించి ఏ మాత్రం ఉపయోగం లేని ఫార్ములా కథతో గూడిన యాక్షన్ సినిమాల వలన వినోదం తప్ప ఇతర ఉపయోగాలుండవుగాని కథాబలం ఉన్న సినిమాలు మనకు ఎంతగానో ఉపయోగపడ్తాయి.

నేను స్వీయ అనుభవంతో చెబుతున్నాను. చందమామ కథలు నా అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. ఆత్మీయులకు చందమామ పుస్తకాలు బైండింగ్ చేయించి ఇచ్చాను. సినిమా పాటలు నా మనస్సును ఎంతగానో ఆహ్లాదపరుస్తున్నాయి. ఇక సినిమాల ద్వారా నేను సాధించిన అభివృద్ధి బహుముఖంగా ఉంది.

ఆయా నటీనటులు తక్కువ స్థితి నుండి పైకి వచ్చిన విధానం చదివి

స్ఫూర్తిని పొందాను. విసుగూ విరామం లేకుండా రోజుకు రెట్టింపు పని చేయటం గురించి తెలుసుకుని పనిలోని మాధుర్యం అర్థం చేసుకున్నాను. డబ్బు దుబారా చేసుకుని తమ జీవిత చరమాంకంలో దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొన్న సీనియర్ నటీనటుల వృత్తాంతం తెలుసుకుని, తనకు మాలిన ధర్మం పనికి రాదనుకుని ఉదారత్వంలో నన్ను నేను అదుపు చేసుకుని నియంత్రించుకున్నాను. గత 50 సం॥రాల నుండి విడుదలైన సినిమాలను చూసి, భావోద్వేగాలు మారలేదని మనుషుల మధ్య సంఘర్షణ ఏ కాలంలోనైనా తప్పదనే వాస్తవం తెలుసుకున్నాను. ఇంకా కథాపరమైన అనేక సంఘటనలను బట్టి నా జీవితంలో జరుగుతున్న మార్పులను సంయమనంతో ఆమోదించి ముందుకు పయనించగలిగాను. ఇంకా కుట్రలు కుతంత్రాలు, అసూయలు, అహంకారాలు, బాగా దగ్గర వాళ్లే ద్రోహం తలపెట్టే సన్నివేశాలు చూసి, జీవితంలోని ఎదురు దెబ్బలను గుండె నిబ్బరంతో తట్టుకున్నాను. కర్మ సిద్ధాంతం, జ్యోతిషం అధ్యయనం చేసాక, ప్రతి సినిమాలోని పాత్రల తీరు తెన్నులు సంతోష దుఃఖాలను 'కర్మ' కోణంలో పరిశీలించటం ఆరంభించాను.

అన్నింటికంటే ముఖ్యంగా కడుపుబ్బ నవ్వించే బ్రహ్మానందం గారి హాస్య సన్నివేశాలు లెక్కకు మించి నా మెదడులో ఫీడ్ చేసుకున్నాను. ఏ కారణం చేతనైనా మనసు బాగోనపుడు ఆ విచారంలో కొనసాగకుండా, నా మెదడులో నిల్వ చేసుకున్న హాస్యసన్నివేశాలను రిప్లే చేసుకుంటాను. ఆ విధంగా నా మనోదృశ్యాన్ని క్షణాల్లో మార్చేసుకుంటున్నాను. (డాక్టర్ బ్రహ్మానందంగార్కి కృతజ్ఞతలు).

ఒక్క మాటలో చెప్పాలంటే, ఈనాడు నేను సంపాదించిన డబ్బు, స్థిర చరాస్థులు, జ్యోతిష రత్న అవార్డులు, రాసిన కథలు, సంబంధ





బాంధవ్యాలకు, బుద్ధికుశలతకూ, విచక్షణాజ్ఞానానికీ, వ్యక్తిత్వ వికాసానికీ, సాధించిన విజయాలకూ, సద్యోస్ఫురణకూ అన్నింటి వెనుకా తెలుగు సినిమా ఉందంటే అతిశయోక్తి కాదు. (తెలుగు సినిమాను నాటి నుండి నేటి వరకు సుసంపన్నం చేస్తున్న ఎందరో మహానుభావులు, అందరికీ కృతజ్ఞతలు).

**ప్రశ్న : జీవితం అంటేనే కష్ట సుఖాల సమ్మేళన మంటారు. కష్టాలన్నింటిలోకి ఏది పెద్ద కష్టం?**

**జవాబు :** ఏది కష్టమంటే సూత్రీకరించి ఇది ఎక్కువ కష్టమైనది, అని చెప్పటం చాలా కష్టం. ఇపుడు రాసిన వాఖ్యంలో కూడా 'కష్టం' అనే మాటను ఉపయోగించాం. ఆ రెండింటిలో ఏ సినిమా బాగుందని చెప్పమంటే, నిర్ణయం చెప్పవలసి వచ్చినపుడు తేల్చి చెప్పటం 'కష్టం' అంటున్నాం. మనసును క్షోభ పెట్టి కంటనీరు పెట్టించే దానిని 'కష్టం' అంటున్నాం. 'కష్టం' అనే మాట కామన్‌గా ఉన్నప్పటికీ మొదటి రెండు కష్టాలు కష్టపెట్టలేవు. భావానికి తగిన భాషలేక నానా చెత్త విషయాలకు కూడా మనం 'కష్టం' అనే పదాన్ని వాడుతున్నాం.

మనకు తెలుగులో జంట పదాలున్నాయి. 'కష్టాలు-కన్నీళ్లు' అనేది జగమెరిగిన జంట పదం. అంటే కన్నీళ్లు పెట్టించేవి కష్టాలు అని అర్థమవుతుంది. అంతేగాని సినిమా టికెట్టు దొరక్కపోవటం, పని మీద బ్యాంకుకెళితే బ్యాంకు సెలవని తెలియటం, మనం ఎక్కిన బస్సులో ఎ.సి. పని చేయకపోవటం లాంటి సవాలక్ష కష్టాలు అసలు కష్టాలు కావనే చెప్పాలి.

కన్నీళ్ళు పెట్టించేవి కష్టాలన్నారు గదా! వీటికి కూడా కన్నీళ్లు పెట్టుకునే వారి సంగతి ఏమిటి అని మీరు అడుగుతారు. మన సమాజంలో అభాగ్యుల జాతి అని ఒకటుంది. ఆత్మన్యూనత గలవారు,

అహంకారులు, అసూయాపరులు నోటి దురుసుగలవారు, బాధ్యత పట్టనివారు, ఇంకా ఎన్నో అసుర లక్షణాలు గలవారు అభాగ్యుల జాతిగా ఏర్పడతారు. వీరికి శ్రీరామ అంటే అదేదో బూతులాగా వినబడుతుంది. అయిన దానికి కాని దానికి నోరేసుకుని వాగుతూ వల వల ఏడుస్తుంటారు. తప్పు చేసికూడా తమని తాము సమర్ధించుకోవటానికి 'ఏడుపు' ను ఆలంబనగా తీసుకుంటారు. ఇలాంటి ఏడుపుగొట్టు కష్టాలు ఏమాత్రం కష్టాలు కావు. కష్టాలు కాని కష్టాలు అనేకం. కొంతమంది ఆడవాళ్లకైతే మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు బాగా కష్టంగా ఉంటుంది. కూతురి వైభోగం చూసి ఈర్ష్య పడే తల్లులు, అల్లుడి సొమ్ముకు ఆశపడే మామలు, కొడుకు సొమ్ము స్వాహా చేసే తండ్రులు, పెళ్లి కాని కూతురి సంపాదన తింటున్న తల్లిదండ్రులు – వీరికి భిన్నంగా జరిగితే కొంపలంటుకున్నట్లు బాధపడ్తారు. అంత మాత్రాన వీరందరివీ కష్టాలనలేము.

భౌతిక కష్టాలు తీసుకుంటే 'ఆకలి' అన్నింటికన్నా అసలు సిసలైన కష్టం. ఆ తర్వాత నిద్ర, మైధునం, ప్రధానమైనవి. మానసికమైన భావోద్వేగపు కష్టాలను పరిశీలిస్తే ఏ కష్టానికి ఆ కష్టం మరింత కష్టంగా ఉంటుంది. మరలా ఈ కష్టాలు కూడా దృక్పథాన్ని బట్టి వ్యక్తివ్యక్తికీ తేడాలుంటాయి. ఆయా సందర్భాలను బట్టి, అప్పుడున్న మానసిక పరిస్థితులను బట్టి 'కష్టం' అనే భావోద్వేగపు సాంద్రత మారుతూ ఉంటుంది. "తనువుకెన్ని గాయాలైనా మాసిపోవు నేలగైనా, మనసుకొక్క గాయమైనా మాసిపోదు చితిలోనైనా" అనే సినీగీతం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

తల్లీ కొడుకులు, అత్తాకోడళ్లు, భార్య తల్లి దండ్రులు, తల్లిదండ్రులు అత్త మామలు, యాజమాని ఉద్యోగులు, అక్కాచెల్లెల్లు, బావబావమరిది, భార్యాభర్తలు, అన్నదమ్ములు, తోడికోడళ్లు, వియ్యాలవారు – ఈ రకమైన





బాంధవ్యాలలో ఎంతో కొంత భావోద్వేగపు రగడ ఉంటుంది. అయితే ఇందులో అంటే ఇరువురిలో ఒకరు సర్దుబాటుతో వ్యవహరిస్తుంటే, రెండోవారు అంటే అవతలివారు అతి తెలివితో హద్దుమీరుతుంటే భరించటం కష్టాలన్నింటిలోకి పెద్ద కష్టంగా ఉంటుంది.

వియ్యానికైనా, కయ్యానికైనా, నెయ్యానికైనా సమఉజ్జీ ఉండాలన్నది ఆర్యోక్తి. కొన్ని సార్లు సమఉజ్జీకోసం చూడకుండా వియ్యమందుకుంటే కొన్ని కష్టాలు తప్పనిసరిగా ఉంటాయి. ఈ జన్మలో చేసిన తప్పుకు ఈ జన్మలోనే శిక్ష అన్నట్లు కన్నీళ్లు కూడా కష్టాలను అంటిపెట్టుకునే ఉంటాయి. మిత్రుడని అప్పుకు హామీ ఉంటే, వాడు కావాలని ఎగ్గొడితే అది కూడా కష్టంగానే ఉంటుంది. మనకంటే చిన్నవారితో కలహమాడితే అదొక నరకం. వారిని పరుషంగా ఒక మాటంటే చూసే జనం, పిల్లలతో మీ కేంటి వైరం అంటారని భయం. వాళ్లు అన్యాయంగా ప్రవర్తిస్తున్నా ఏమి చేయలేని నిస్సహాయత కూడా చాలా కష్టంగా ఉంటుంది. దున్నపోతుకు వడగళ్ల వాన బాధించదు. కాని సూక్ష్మ శరీరమైన మనస్సుకు అన్నీ బాధగానే ఉంటాయి.

ఎవరికి వారు తమదే అసలైన కష్టమని ముక్కు చీదుకుంటూ ఆక్రోశిస్తుంటారు. నా కష్టం నీకు వస్తే తెలుస్తుందని ఓదార్చబోయిన వారిని ఆశీర్వదిస్తారు. ఈ కష్టాల సాంద్రత కూడా మానసిక పరిణితిని బట్టి మారుతుంటుంది. కాని ఎవరిదైనా కష్టం కష్టమేగా! ఎదుటివ్యక్తి కష్టం గురించి తెలియాలంటే వారి కోణం నుండి ఆలోచించటమే సమంజసం. ఇది అసలు కష్టమే కాదని మనమే తేల్చేయటం బంధవ్యాలను నిర్లక్ష్యం చేయటమే.

పుణ్యబలం బాగుండి శుభ ఫలితాలను అనుభవిస్తున్నపుడు ఈ కష్టాల గురించి చదువుతుంటే తమాషాగా ఉంటుందిగాని, కష్టమొస్తే గాని కష్టం గురించి తెలియదు అనేది అసలు మర్మం. అందుకే ఏది ఎక్కువ కష్టం కలిగిస్తుంది అనేది తేల్చి చెప్పటం కష్టంగా ఉంటుంది(?). కాని సూక్ష్మంగా చెప్పాలంటే భౌతిక కష్టాలలో 'ఆకలి' పెద్ద కష్టం, మానసిక కష్టాలలో 'ఆత్మీయుల మరణం' అతి పెద్ద కష్టంగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఎంత ఏడ్చినా పోయినోళ్లు తిరిగిరారు.

**ప్రశ్న : విజయం సాధించటానికి ఆచరించవలసిన అనేక అభ్యాసాల గురించి ఎంతోమంది రచయితల నుండి వందల పేజీలతో గూడిన పుస్తకాలు వేల సంఖ్యలో వచ్చాయి. సింగిల్‌విండో పథకం లాగా విజయం సాధించటానికి సులభ మార్గం ఏదైనా ఉందా?**

**జవాబు :** వివిధ భాషలలో ప్రచురింపబడిన వ్యక్తిత్వ వికాస పుస్తకాలన్నింటిలోనూ విజయం సాధించటానికి రచయితలు అందరూ వెల్లడించిన సూక్తి సారాంశం ఒక్కటే. భాషలోనూ, శిల్పంలోనూ వ్యత్యాసాలున్నాయేమోగాని భావజాలం మాత్రం అందరిదీ ఒక్కటే. సానుకూల దృక్పథం, ప్రణాళిక, నిరంతర కృషి, పట్టుదల, అకుంఠిత దీక్ష, గమ్యం, క్రమశిక్షణ, వ్యాయామం, నిజాయితీ, చిత్తశుద్ధి, సమయం స్ఫూర్తి, సమయ పాలన, సమర్థత, ఏకాగ్రత, వృత్తిలో నైపుణ్యం ఇలా రాసుకుంటూపోతే ప్రాచీన కాలంలో రాజ్యం ఏలడానికి రాజుకుండవలసిన ధీరోదాత్త లక్షణాల చిట్టాలా ఈ లిస్టు కొండవీటి చేంతాడంతవుతుంది. వీటిని చూస్తే





కౌరవసేనను చూసిన ఉత్తర కుమారుడిలా బెంబేలెత్తిపోయి, బతికి ఉంటే బలుసాకు తినొచ్చుగాని విజయం వద్దే వద్దనిపిస్తుంది.

విజయం సాధించటానికి సింగిల్‌విండో పథకం లాగా సులభ మార్గం ఖచ్చితంగా ఉంది. పైగా ఇది ఏ కాలంలోనైనా దివ్యంగా పనిచేస్తుంది. ఇంకా సూటిగా చెప్పాలంటే భూమి మరియు సూర్య చంద్రాది నవగ్రహాలు ఉన్నంతకాలం ఈ సూత్రానికి తిరుగులేదు. ఇది ఎన్నటికీ వాడిపోని ఓడిపోని సుమసుగంధ సువాసనా సౌరభం. మన మనస్సే దీనికి అసలు సిసలైన జవాబు. సూక్ష్మ రూపంలో ఉండే ఈ మనస్సులోనే మర్మమంతా ఉంది.

ఒక మనిషి జీవితం మహోజ్వలంగా వెలుగొందటానికైనా, భావోద్వేగ సెగలకు భస్మీపటలం గావటానికైనా 'మనస్సే' కారణం. ఎందుకంటే సమస్త భావోద్వేగాలకు, ఆలోచనలకు, స్పందనలకు, భ్రమలకు ఔన్నత్యానికి...., ఇంకా మరెన్నో ప్రధాన, ఉపప్రధాన, అప్రాధాన్య విషయాలన్నింటి పుట్టుకా, పెరుగుదల, స్వైర విహారం, మనుగడ అన్నింటికీ 'మనస్సు' నిలయం. మన జీవితంలో తారసపడే ఉపకారులగురించి, అపకారుల గురించిన వివరాలు పూర్తిగా తెలుసుకోవాలని ఎలా ఆరాట పడతామో, మన జీవితాన్ని శాసించే ఈ మనస్సు గురించి ప్రాథమిక సమాచారం తెలుసుకోవటం మనందరి విధి. తమాషా ఏమంటే తన గురించి తెలుసుకోవాలనుకుంటున్నామని 'మనస్సు'కు తెలియగానే అది తన అసలు స్వరూపాన్ని మరుగున దాచుకుని తాత్కాలికంగా కొత్త రూపం దాల్చుకుని మన ముందు ప్రత్యక్షమయి ముసిముసినవ్వులు చిందిస్తుంది. సాధారణంగా ఈ కొత్త రూపం మనం కోరుకున్నదయి ఉంటుంది. అంటే మన గురించి మనం ఏమనుకుంటున్నామో ఆ 'రూపు' దాలుస్తుందన్న మాట. చూశారా ఎంత గడుసుదో ఈ మనస్సు! దీనికి తెలియని వన్నె

చిన్నెలు ఏమున్నాయి గనుక! అందుకే లౌక్యంగా మిమ్మల్ని 'ఇంప్రెస్' చేయాలని చూస్తుంది. మన కుటుంబ సభ్యులు మనతో లౌక్యంగా లేకుండా పారదర్శకంగా ఉండాలని కోరుకుంటాము గదా! ***మరి కుటుంబ సభ్యుల కంటె ఎక్కువైన మన మనస్సును లౌక్యం ముసుగు లేకుండా మనం పారదర్శకంగా చూడాలని గట్టిగా కోరుకోవాలి. అప్పుడు మాత్రమే మనం మనస్సును దూరంగా ఉండి ఒక 'సాక్షి' లా దర్శించగలం.*** అలా దర్శించటం వలన మనస్సు ఆడించినట్లు మనం ఆడటం గాక, మనస్సును అదుపుచేసి, దాన్ని సర్కస్ జంతువులా మార్చి, మనం కోరుకున్న విధంగా దాన్ని ఉపయోగించగలం. ***మనం మన మనస్సు నుండి వేరుపడి, ఇవతలకు వచ్చి ఒక సాక్షిగా మనస్సును చూడాలని ఆలోచన రావటమే 'విజయం' అనే గొప్ప భవంతి యొక్క 'సింహద్వారం' వద్దకు చేరుకున్నామని సంకేతం.***

మనస్సు మీద నిఘాపెట్టి నిరంతరం పరిశీలించటం వలన దాని కార్యకలాపాలు మొత్తం మనకు అర్థం అవుతాయి. మనస్సు, బుద్ధి, చిత్త అహంకారాలు వేరు వేరయినప్పటికీ, అన్నింటికీ మూల స్థావరం మనస్సే. కాకపోతే వీటికి మనస్సులో ప్రత్యేక వసతులతో గూడిన గదులున్నాయి. ఇంకా మనస్సు విషయంలో లోతుగా వెళ్లదలుచుకున్నవారికి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జ్ఞాన తృష్ణ ఉన్న వారు వాటిని పరిశీలించవచ్చును. నేను విజయానికి ఏ విధంగా 'మనస్సు'ను వాడుకోవచ్చునో అది మాత్రమే చెబుతాను.

పాఠకులు సులభంగా అర్థం చేసుకోవటానికి నా చిన్న తనంలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఉదాహరణగా చెబుతాను. అప్పట్లో సినిమా థియేటర్లు ఇప్పుడున్నంత విరివిగా లేవు. తాలూకా కేంద్రాలలో నాలుగైదు ఉంటే, కాస్త పెద్ద ఊళ్లలో సెమీ టూరింగు టాకీసులుండేవి.





ఏది ఏమైనప్పటికీ గ్రామాల వరకూ వినోదం అంటే నాటకాలదే పై చేయిగా ఉండేది. అలానేను ఉన్న గ్రామంలో ఔత్సాహిక యువ నటులందరూ ఒక సాంఘిక నాటకాన్ని ప్రదర్శించదలచారు. విజయదశమి రోజు నాటక ప్రదర్శనకు ముహూర్తం ఖరారైంది. అప్పట్లో ఒక ఊరిలో నాటక ప్రదర్శన ఉందంటే పొరుగున ఉన్న నాలుగైదు ఊళ్లలో గూడురిక్షాబండిలో మైకు పెట్టి ప్రచారం నిర్వహించేవారు. గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద స్టేజి నిర్మించి నాటకాన్ని ఆడేవారు. ఉచిత ప్రదర్శన కాబట్టి నాలుగురోడ్లు జనంతో నిండిపోయేవి. అనుకున్న రోజు రానే వచ్చింది. విజయదశమి రాత్రి నాటకం ప్రారంభమయి మంచి రసపట్టులో సాగుతోంది. ఈలోగా సన్నగా చినుకులు మొదలయ్యాయి. అయినా జనంలో ఒక్కరూ కదల్లేదు. అలాగే నాటకంలో లీనమయి తుప్పరలో తడుస్తూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. హఠాత్తుగా నాటకంలోని ఒక సన్నివేశానికి జనం వ్యతిరేకంగా రియాక్టయ్యారు. నాటకంలోని ఒక పాత్రదారుడు ఆ సన్నివేశంలో ఎదుటి వ్యక్తిని తుపాకితో కాల్చి చంపాలి. 'ఢాం। అని తుపాకి పేలగానే ఎదుటి పాత్ర దారుడు గుండెల్లో నుండి రక్తం కారుతుండగా కుప్పకూలిపోవాలి. ఇదీ అసలు సన్నివేశం. కాని తుపాకితో కాల్చవలసిన వ్యక్తికి ఏ కారణం చేతో తుపాకి అందించబడలేదు. అసలు ఆ ట్రూపు ఒక బొమ్మ తుపాకిని ఏర్పాటు చేసుకోవటం మరచి పోయిందనుకుంటాను. ఈ కాల్చేవ్యక్తి తన కుడిచేతిని తుపాకి భంగిమగా మార్చి, (అంటే చూపుడు వేలు మధ్యవేలుతో గురిపెట్టి పక్కవేలు చిటికిన వేలు వెనుక్కవంచి బొటనవేలు నిలబెట్టి తుపాకి ఆకారం అన్నమాట.) ఎదుటి వ్యక్తికి చూపిస్తూ నోటితో "డిష్యుం...డిష్యుం....డిష్యుం..." అన్నాడు. తుపాకీ లేనందువలన ప్రత్యామ్నాయంగా ఆ విధంగా చేసి చూపించాడు. అయితే అప్పుడు ఎదురుగా ఉన్న పాత్రదారుడు తుపాకి గుండు తగిలినందువలన కుప్పకూలి

పోవలసి ఉండగా, ఆ పాత్ర దారుడు తన భుజం మీద కండువా తీసి కిందపరచి, తాపీగా దాని మీద పడుకున్నాడు. అంటే చచ్చాడని ప్రేక్షకులు అర్థం చేసుకోవాలి. ఈ దృశ్యాన్ని చూసిన జనానికి ఎక్కడో కాలినట్టుంది కాబోలు, ఒక సారిగా స్టేజి మీదకు ఎగబడ్డారు. ఔత్సాహిక నట బృందాన్ని చితక బాదారు. స్టేజి విరగ్గొట్టారు. ఇదీ జరిగింది.

పాఠకులారా ఒక్కసారి ఆలోచించండి. ఒకవేళ ఆ పాత్ర దారుడు తుపాకితో కాల్చినప్పటికీ, మరో పాత్ర రక్తం కారుతుండగా కుప్పకూలిపోయినా, చూసే జనంలో ఎవ్వరూ అతను నిజంగా కాల్చాడని, మరొకతను నిజంగా చనిపోయాడని అనుకోరుగదా! అదంతా అబద్ధమని, నాటకమని అందరికీ తెలిసిన విషయమేగదా! మరి అలాంటప్పుడు చేతిని తుపాకిలా గురిపెట్టి నోటితో డిష్యుం డిష్యుం అని పేల్చిన శబ్దం చేస్తే తప్పేమిటి? వాడు టవలు కింద పరుచుకుని తాపీగా పడుకుంటే జనానికి వచ్చిన కష్టమేమిటి? తార్కికంగా ఆలోచిస్తే ఏదైనా అబద్దమైనపుడు అంగీకరించకుండా ఎందుకు తీవ్రంగా స్పందించారు?

ఇదే మనస్సు రహస్యం. దానికి అన్నీ తెలిసినప్పటికీ అబద్ధం అందంగా ఉంటే స్పందించి సంతోషపడుతుంది. జరిగిన నాటక సన్నివేశం తార్కిక దృష్టితో ఆలోచిస్తే నేరం గాకపోయినా, సన్నివేశాన్ని అపహాస్యం చేసి రసాభంగం కలుగచేసి నందువలన తట్టుకోలేక 'మనస్సు' వ్యతిరేకంగా స్పందించి నొచ్చుకుంది. అనేక మనస్సుల సామూహిక స్పందనే జనం తాలూకు ఆ రగడ.

ఇది సవ్యంగా అర్థమైతే జీవితంలో ఎదురయ్యే సవాలక్ష సందేహాల 'చిక్కుముడి' విడిపోతుంది. డైనింగు టేబులు మీద తల్లి వండి పెట్టిన విందు భోజనాన్ని మౌనంగా కడుపునిండా తినేసి ఒక్కమాట





'బాగుందమ్మా' అనలేని కొడుకు చర్యని చూసి తల్లిమనసు బాధపడ్తుంది. కొడుకు తినాలనేగా తాను చేసింది అనే తార్కిక బుద్ధి తల్లికి ఉన్నప్పటికీ, మనస్సు తన సహజ స్పందన వ్యక్తం చేసింది. భార్య అలంకరణ చూసి స్పందించని భర్త గురించి కూడా భార్య మనస్సు బాధగానే రోదిస్తుంది. ఇదంతా నాటకమని తోసిపారేస్తే అంతకంటే శోచనీయం మరొకటుండదు. ***నాటకమని తెలిసినపుడు ఎవరైనా తన పాత్రను సవ్యంగా పోషించి దేవుడి రచనకు న్యాయం చేయాలి. ఇది సవ్యంగా అర్థమైతే జీవితంలోని భావోద్వేగపు నటనను రంగస్థలం మీద ముఖానికి రంగు వేసుకుని నటించటంలా ఎవ్వరూ భావించరు.***

మనస్సు గురించి ఇంకొంచెం బాగా తెలుసుకోవాలి. ఇది ఇతని యొక్క వాస్తవ మనస్సు, ఇవి ఈ వ్యక్తి యొక్క వాస్తవ ఆలోచనలు, భావాలు అని వర్గీకరణ చేసేలోగా ఆ వ్యక్తి యొక్క 'మనస్సు' పరిసరాల నుండి, ఇతరుల నుండి, పుస్తకాల నుండి, ఇంకా సమస్త ప్రపంచం నుండి అనేకం గ్రహించి కొత్తమనస్సుగా రూపాంతరం చెందుతుంది. శబ్దం యొక్క ప్రకంపనాలు 'మనస్సు' మీద ప్రభావం చూపెడతాయి. తత్కారణంగా వివిధ రసాలు ఉత్పన్నమవుతాయి. అర్థం యొక్క భావజాలం మనస్సు మీద ప్రభావం వలన స్పందనలు కలుగుతాయి. ఇక అర్థవంతమైన శబ్దాలు, శబ్దాలతో గూడిన అర్థాలు మనిషి మనస్సు మీద ఖచ్చితంగా బలమైన ప్రభావం చూపెడతాయి. ముక్కుతో చూసే వాసన మనస్సు మీద ప్రభావం చూపెడుతుంది. కంటితో చూసే దృశ్యం, నోటితో తినే ఆహారం, మనస్సును ప్రభావితం చేస్తాయి. అన్నింటికన్నా ముఖ్యంగా శారీరక స్పర్శ 'మనస్సు' ను పూర్తిగా మార్చగలుగుతుంది. కొన్ని సార్లు ఏమార్చగలుగుతుంది. అంటే పంచేంద్రియాలైన కన్ను, ముక్కు, చెవి, నోరు, స్పర్శ ద్వారా మనలో ప్రవేశించినది ఏదైనా మంచిగావచ్చు లేదా చెడుగావచ్చు మనస్సు మీద

ప్రభావం చూపెడతాయి. మంచి విషయాలు గ్రహించటం వలన శుభ కర్మలను, చెడు విషయాలు గ్రహించటం వలన చెడు కర్మలను మనిషి ఆచరిస్తాడు.

తన అవసరం కోసం వచ్చి ఒకడు మిమ్మల్ని పొగుడుతాడు. తార్కికంగా ఆలోచించిన మీ బుద్ధి, అతను తన అవసరం కోసం మిమ్మల్ని ఆకాశానికి ఎత్తేస్తున్నాడు అని తెలిపినప్పటికీ 'మనస్సు' ఆనంద పడుతుంది. ఏ విధమైన ప్రత్యేకత లేని ఓ అల్పుడు మిమ్మల్ని ఒక మాటంటాడు. వాడి మాటలు లెక్క చేయనవసరం లేదని, మీ సహెూద్యోగులు మరియు కుటుంబ సభ్యులు చెప్పటానికి ముందే, మీ తార్కిక బుద్ధి ఆ విషయం మీకు చెబుతుంది. అయినప్పటికీ అల్పుని అవాకుల ప్రేలాపనకు మీ మనస్సు బాధపడ్తుంది. ***ఇక్కడ 'మనసు' కు ఉండే అసాధారణ లక్షణం ఒకటి మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చును. మనస్సు ప్రియమైన మాటకు సంతోషపడుతుంది. అప్రియమైన మాటకు వేదన పడుతుంది. తార్కిక బుద్ధి యొక్క 'రిపోర్టు' మనస్సుకు అర్థమైనప్పటికీ రిపోర్టును తుంగలో తొక్కి తన సహజ స్వభావాన్ని బట్టి మనస్సు నడుచుకుంటుంది.*** అలాగే బయటనుండి అనేక చెత్తా చెదారాలను లోపలకు తీసుకుని అనేక ఉద్వేగాలకు అనవసరంగా లోనయి గందరగోళపడుతుంది.

కావున ప్రియమైన పాఠకులారా! పశువుల కాపరి అదుపుతప్పి పక్క చేలో చొరపడబోతున్న పశువును ఏ విధంగా అదుపు చేస్తున్నాడో ఆ విధంగా 'మనస్సు' మీద నిఘాపెట్టి, అడ్డమైన ప్రతికూల విషయాల మీదకు అవాంఛనీయమైన భావాల జోలికి, నిరుపయోగమైన ఆలోచనల మీదకు మనస్సు పరుగెత్తకుండా ఓ కంట కనిపెడుతుండాలి. ఇది వాస్తవ రూపం దాల్చాలంటే, ప్రతి రోజూ నిద్రించేముందు ఆరోజు సంఘటనలను రిప్లే చేసుకుని రివ్యూ చేసుకోవటం అభ్యాసం చేయాలి. ***సాధన చేయుమురా***





***నరుడా, సాధ్యము కానిది లేదురా అని ఓ సినీ కవి అన్నాడు. 'జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురా, జంకు బొంకు లేక ముందు సాగిపొమ్మురా....' అని మరో సినీ గీతం. అందువలన సాధన చేసి 'మనస్సు'ను అదుపుచేయగల్గితే ప్రస్తుతం లౌకిక విషయాలలో ఆ తర్వాత ఆధ్యాత్మిక విషయాలలో 'విజయం' సులభ సాధ్యమవుతుంది. యుగాలు మారవచ్చుగాని విజయసూత్రం మాత్రం మారదు.***

## ప్రశ్న : చాలా కుటుంబాలలో తండ్రీ కొడుకుల మధ్య వైరం సర్వ సాధారణమైంది. ఎందువలన?

**జవాబు :** మీరు తప్పుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎక్కడైనా ఒకచోట ప్రబలమైన కారణాల వలన తండ్రీ కొడుకుల మధ్య వైరం నిజంగానే ఉండవచ్చును. అక్కడ 'కారణం', ఆ యొక్క తండ్రీ కొడుకులకే గాక మిగిలిన కుటుంబ సభ్యులకూ తెలిసే ఉంటుంది. కావున ఇది వారి వ్యక్తిగత కుటుంబ సమస్య అవుతుంది గాని, అన్ని కుటుంబాలలో తండ్రీ కొడుకుల మధ్య వైరం ఉంటుందని మనమే స్వతంత్రించి నిర్ణయించి తండ్రీకొడుకుల అనుబంధాన్ని అపహాస్యం చేయలేము.

అయితే బాషా దోషాన్ని సవరించుకుని తండ్రీ కొడుకుల మధ్య 'వైరం' ఉండదుగాని వైరుధ్యం ఉంటుందంటే, అది నిజమని అంగీకరించవలసి ఉంటుంది. ఈ వైరుధ్యాన్నే అనేకమంది. 'వైరం' గా భ్రమతో గూడిన భాష్యం చెప్పినా తండ్రీకొడుకుల బంధం కుటుంబ సంబంధ బాంధవ్యాలన్నిటిలోనూ విశిష్టమైనది, ఉదాత్తమైనదీ మరియు తలమానికమైనదని గుర్తించాలి.

ఎంతో విలువైన దాంపత్య బంధంలో భార్యకు భర్త, భర్తకు

భార్య సుఖదుఃఖాలు పంచుకునే జీవన సహచరులేగాని, ఒకరికొకరు పెళ్లికి పూర్వం పరాయివారనే వాస్తవం విస్మరించకూడదు. తోబుట్టువులు కూడా రోమ్ నుండి విడివడిన 'రోమన్స్'లా ఒక్కసారి తల్లిదండ్రులనే వటవృక్షం నీడ విడనాడాక అంతకుముందు వారి మధ్య ఉన్న ఆప్యాయతల సాంద్రత అంతగా ఉండదనేది కూడా జగమెరిగిన సత్యం. పిల్లల విషయంలో తల్లి 'పోషణ, శిక్షణ' బాధ్యతలు నిర్వహించినప్పటికీ, రక్షణ మరియు మొత్తం కుటుంబ పరిపాలన తండ్రి తీసుకుంటాడు. ఆ విధంగా మొదటి నుండీ కొడుకు విషయంలో తండ్రిదే బాధ్యత ఎక్కువ. తండ్రీ కూతుళ్ల మధ్య బంధం గురించి మాట్లాడవలసివస్తే, ఆడపిల్లకు సలక్షణమైన పెళ్లిసంబంధం తెచ్చి ఆమెను ఒక ఇంటి దాన్ని చేయటంతో తండ్రి యొక్క బాధ్యత మరొక ఇంటికి బదిలీ కాబడి తండ్రీ కూతుళ్ల బంధం చుట్టరికానికి పరిమితమవుతుంది. కాని కొడుకు విషయంలో తండ్రి బాధ్యత రూపం మార్చుకుని కొత్తపుంతలు తొక్కతుందేగాని ఆ బంధం అంతంగాదు. అలాగే తండ్రికి వార్ధక్యంలో చేయూతనిచ్చి, ఆసరాగా నిలబడవలసిన బాధ్యత కొడుకుదేననే విషయం మరువదగినది కాదు. ఇక్కడ అందరికీ ఒక విషయం చెప్పాలి. విధులకూ బాధ్యతలకూ మధ్య వ్యత్యాసం ఉంది. విధి నిర్వహణలో కేటాయించబడిన 'పని' ని మొక్కుబడిగా నిర్వహించటం ఉంటుంది. లేదా యాంత్రికంగా నిర్వహించటం ఉంటుంది. కాని బాధ్యతలు నిర్వహించటంలో 'ప్రేమ' మరియు బంధానికి కట్టుబడటం ఉంటుంది. తల్లిదండ్రులు కొడుకు యొక్క సంతానానికి తాత నాయనమ్మల హోదాలో ఆప్యాయతలు పంచి వారిలో ఆత్మ విశ్వాసం అభివృద్ధి చెందటానికి దోహద పడ్డారు. ఏ విధంగా చూసినా తండ్రి పాత్ర కొడుకు జీవితంలో కీలకమైనది. ఆ విధంగానే కొడుకు పాత్ర తండ్రి జీవితంలో పునరుత్తేజాన్ని నింపగల సాధన మవుతుంది. మొత్తంగా చూస్తే తండ్రీకొడుకుల బంధం అత్యున్నతమైన కుటుంబ సంబంధం. ***అయితే ఇంతటి అత్యున్నతమైన తండ్రీకొడుకుల బంధం కాలమాన***





***పరిస్థితులను బట్టి కొన్ని ఆటుపోట్లను ఏ కాలంలోనైనా తట్టుకోవలసి ఉంటుంది. దీనికి కారణం తండ్రీకొడుకుల వ్యక్తిగత వైరుధ్యంగా భావించక తండ్రీ కొడుకుల పాత్రల యొక్క వైరుధ్యంగా అర్థం చేసుకుంటే తండ్రీ కొడుకుల బంధం మరింత బలపడుతుంది.***

ఈ వైరుధ్యం గురించి వివరంగా మాట్లాడుకుందాం. పెళ్లయి తనకంటూ ఓ సంసారం ఏర్పడ్డాక కొడుకు మనసులో స్వతంత్రాభిలాష స్పష్టంగా ఒక రూపు దాలుస్తుంది. ఉద్యోగం వచ్చి ఉన్నత స్థానం ఏర్పరచుకుని వృత్తిలో తన ప్రతిభ చూపించి తనకంటూ ఓ గుర్తింపు సాధించాక స్వతంత్రాభిలాష విశ్వరూపం దాలుస్తుంది. పరిణితి పెరుగుతుంటే జీవితాన్ని కొత్త కోణంలో అధ్యయనం చేసి, భావాలు ఆలోచనలు సమూలంగా మారిపోతుంటే అంతకు ముందు చూడని ప్రపంచాన్ని అతను సందర్శిస్తాడు. సహజంగానే అతనికి తండ్రి సామాన్యుడిలా కనిపించటం ప్రారంభమవుతుంది. సామాన్యుడిలా కనిపించటమనే పదం అందరికీ రుచించక పోయినా, తండ్రుల గురించి వారి పరోక్షంగా జరిగే కొడుకుల సమావేశాలలో అందరూ కలిసి పంచుకునే 'చిన్న' అభిప్రాయాల సారాంశం మాత్రం ఇదే ఉంటుంది. ఇక తండ్రి భావాలూ ఆలోచనలూ వేరుగా ఉంటాయి. అతని వ్యక్తిత్వం, అంతరంగం, భావాలు ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ 'కొడుకు' అంటే అంతులేని ప్రేమ ఉంటుంది. అతని గురించి అతని సంసారం గురించి ఎల్లప్పుడూ ఆరా ఉంటుంది. తండ్రి తనకు తెలియకుండానే కొడుకు జీవితానికి 'సెక్యూరిటీ గార్డు' గా మారతాడు. ఒకవేళ ఇదంతా మాయ అనే సాధారణ జ్ఞానం అతనికి తెలిసినా, తాను జీవించి ఉన్నంతకాలం కొడుకు జీవితం పట్ల శ్రద్ధ ఉంటుంది. ఎవరైనా ప్రతిభతో రాణించవచ్చు. విద్యార్హతలతో రాణించవచ్చు. ఆలోచనలతో, భావాలతో పురోగమించవచ్చు. ఇంకా తండ్రి కంటే ఎక్కువగా కొడుకు అనేకం సాధించవచ్చు.

కాని అనుభవంలో కొడుకు ఎప్పుడూ తండ్రికంటే తక్కువ వాడే. ఎందుకంటే ఏ కాలంలోనైనా ఎవరికైనా అనుభవం, అనుభవం ద్వారానే వస్తుంది. దానికి ఇతరత్రా వెకేషన్ కోర్సులంటూ ఏమీ లేవు.

ఒకవేళ కొడుకు కూడా అనుభవాన్ని అనుభవం ద్వారా సంపాదించనా, అప్పుడుకూడా తండ్రి అనుభవమే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే తండ్రీ కొడుకుల మధ్య ఉన్న వయస్సు వ్యత్యాసం వారిరువురి మధ్య అనుభవ వ్యత్యాసంగా ఎల్లకాలం ఉంటుంది. ఈ అనుభవ వ్యత్యాసమే వారిరువురి మధ్యగల జీవన వైరుధ్యం. తండ్రి చనిపోయాక మాత్రమే కొడుకు తండ్రితో సరిసమానమైన అనుభవాన్ని సంపాదించగలడు. ఎందుకంటే మరణం వలన తండ్రి అనుభవం ఆగిపోయింది కాబట్టి. ఈ లోగా తండ్రి కొడుకుల మధ్య 'వైరుధ్యం' తన ఉనికిని ఎంతో కొంత కాపాడుకుంటూనే ఉంటుంది. అందువలన లోకంలోని తండ్రీకొడుకులందరూ ఒకరినొకరు సర్దుబాటు చేసుకుంటూ అర్ధం చేసుకుంటూ జీవన ప్రయాణం సాగించాలి.

## ప్రశ్న : 'శిక్షణ' వలన ప్రయోజనం ఏమైనా ఉంటుందా?

**జవాబు :** ఆది మానవుడు నుండి నేటి ఆధునిక మానవుడి వరకు లక్షల సంవత్సరాల నుండి జరిగిన చరిత్ర పరిణామ క్రమం తాలూకు మొత్తం అభివృద్ధిని ఒక్కసారి స్ఫురణకు తెచ్చుకుని స్థూలంగా పరిశీలించినట్లయితే, 'శిక్షణ' యొక్క విశ్వరూపం కళ్లు చెదిరేలా కనిపిస్తుంది. ***మానవజాతి పురోగమనం అంతా నేర్చుకోవటం, తాను నేర్చుకున్నది ఇతరులకు అందించటం ద్వారా జరిగింది.*** నేర్చుకోవటంలో అనుకరణ, అభ్యాసాలు ఉపయోగపడతాయి. నేర్పటంలో బోధన, శిక్షణ ప్రమేయం ఉంటుంది.





ప్రతి మనిషి జీవితంలో మొదటి 'శిక్షణ' తల్లి నుండే లభిస్తుంది. నిత్య కృత్యాలతో ప్రారంభమైన ఈ శిక్షణ, అనుకరణ అభ్యాసాల ద్వారా శిషువు తనకు తానుగా కొన్ని నేర్చుకుంటాడు. శిశువు స్వీయ శిక్షణ అభ్యాసాలతో నేర్చుకున్నవాటిని తల్లి తన బాధ్యతతో గూడిన బోధనల ద్వారా సరిచేస్తుంది. శిషువు కొన్ని అసంగతమైన విషయాలను కాలక్రమంలో గాలికి వదిలేస్తే, అంతగా ప్రమాదం లేని కొన్ని అలవాట్లు మరి కొంతకాలం వరకూ కొనసాగి తెరమరుగవుతాయి. ఆ విధంగా శిశువు పెరిగి పెద్దవాడవుతాడు. కాని పరిశీలన, అనుకరణ, అభ్యాసం అతని మనస్సు మీద చెరగని ముద్రవేసి స్వీయ శిక్షణ ద్వారా నేర్చుకోవటమనేది అనంతంగా కొనసాగుతుంది. 'శిక్షణ' అనేది ఎంతటి ప్రాముఖ్యతగల అంశమో ఈ చిన్న ఉపోద్ఘాతం ద్వారా పాఠకులకు గుర్తు చేయటం జరిగింది.

వ్యక్తి గాని, సంస్థ గాని, రాష్ట్రం గాని, దేశం గాని నిరంతర శిక్షణ ద్వారా మాత్రమే ఎప్పటికప్పుడు నిర్ణీత లక్ష్యాలు సాధించటం వీలవుతుంది. ఇలా లక్ష్యాలు నెరవేరి పాతవవుతుంటే మరల కొత్త లక్ష్యాలు సాధించటంలో తలమునకలవటం, – ఈ మొత్తం ప్రక్రియ అభివృద్ధిగా పిలవబడుతుంది. ఏదో ఒక లక్ష్యం సాధించి చతికిలబడిపోతే దాన్ని 'అభివృద్ధి' అనరు, అది ఎంతటి ఘన కార్యమైనా! వైఫల్యాలు ఎదురైనా నిరంతరం సరికొత్త లక్ష్య సాధనే అభివృద్ధిగా అర్థం చేసుకోవాలి. లక్ష్యం ఉన్న వ్యక్తి జీవితం సలక్షణంగా ఉంటే, ఏ లక్ష్యం లేకుండా జీవించే వారి జీవితం నిరర్ధక మవుతుంది. వ్యక్తికైనా, వ్యక్తులతో గూడిన ఏ వ్యవస్థకైనా ఇదే సూత్రం వర్తిస్తుంది.

మానవ వనరులను సమీకరించటం, వారికి తగిన శిక్షణ ఇవ్వటం, లక్ష్య సాధనలో వారిని ఉపయోగించుకోవటం. ఏ సంస్థకైనా ఇదే

కీలక అంశం. అయితే, 'శిక్షణ' కు కావలసిన విషయ సేకరణ, వస్తుసామాగ్రి, ప్రచారం, బోధన చాలా ముఖ్యం. ఈ బోధనలో మరలా శబ్దార్థాలతో కూడిన భావ వ్యక్తీకరణ ద్వారా ప్రచారం చేసి సమీకరించుకున్న మానవ వనరులను వశీకరణ చేసుకోవటం మరింత ముఖ్యం. 'శిక్షణ'లో ప్రేరణ ఒక అంతార్భగం. మరలా 'ప్రేరణ' లో ప్రేరకాలు విభిన్నంగా ఉండి అవి వ్యక్తి వ్యక్తికీ మారుతుంటాయి. డబ్బు అన్నింటికంటె ప్రధాన ప్రేరకం. ఇది అందరి మీద పనిచేస్తుంది. ఇంకా ఇతర ప్రేరకాల ద్వారా సమీకరించిన మానవ వనరులతో అనుసంధానమవటం అన్నింటికంటె ప్రధాన విషయం. విషయ వస్తు సామాగ్రితో శ్రవణ దృశ్య మాధ్యమాల ద్వారా శిక్షితుల మనోనేత్రం ముందు వారి భవిష్యత్తు 70ఎమ్ఎమ్‌లో ఆవిష్కరించటం అనివార్యమైన బృహత్తర కార్యక్రమం. సామూహిక శిక్షణ, వ్యక్తిగత శిక్షణ రెండూ అవసరమైనవే. ఉత్తేజ పరచటానికి పోటీలు, ఆశను రేకెత్తించే ప్రోత్సాహక బహుమతులు, మోహంలో పడదోసే తాయిలాలు ఇవన్నీ 'శిక్షణా కాలంలో మానవ వనరులను నిలువరించి ఉంచటానికి సాధనాలు. లక్ష్య నిర్దేశనకు స్వల్పకాలిక ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, పంచవర్ష దశ వర్ష ప్రణాళికలు – ఇలా చెప్పుకుంటూపోతే 'శిక్షణ' ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా ఉండి మానవ వనరులను సమ్మోహన పరచి ముందుకు నడిపించటంలో మహోన్నత పాత్ర పోషిస్తుందని పాఠకులకు చెప్పాలనే నా యొక్క తాపత్రయం. 'శిక్షణ'కు ప్రత్యేక విభాగం ఉండి, పరిశోధన మరియు అభివృద్ధి అనెడి మరొక విభాగం అండగా ఉన్నట్లయితే ఆ కంపెనీ శీఘ్ర పురోగతి సాధిస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చును. వ్యక్తిత్వ వికాసంలో కూడా 'శిక్షణ' దే కీలక పాత్ర.

'శిక్షణ' గురించి మీరు చిరకాలం గుర్తుంచుకునే ఒకమాట





చెప్పి ఈ జవాబును ముగిస్తాను. ప్రాణం పోతే తిరిగిరాదు. మనందరికీ ప్రాణమంటేనే తీపి. ప్రాణం వదులకోవటానికి ఎవ్వరూ సిద్ధపడరు. కాని టెర్రరిస్టు సంస్థలు విలువైన ప్రాణాన్ని సహితం వదులుకునే విధంగా 'శిక్షణ' ఇచ్చి మానవ బాంబులను తయారుచేయగల్గుతున్నాయంటే, శిక్షణ యొక్క గొప్పతనం అర్థమవుతూనే ఉంది గదా! ***ఇది చెడ్డ విషయమైనప్పటికీ 'శిక్షణ' యొక్క గరిష్ట శక్తిని తెలియజెప్పటానికి ఈ ఉదాహరణ తీసుకున్నానని పాఠకులు గమనించప్రార్థన. 'శిక్షణ' సవ్యంగా ఉపయోగించుకోగల్గితే 'అభివృద్ధికి' ఆకాశం కూడా ఒక హద్దు కాదు.***

**ప్రశ్న : కేవలం జ్యోతిషం విద్యతో భవిష్యత్తు చెప్పటం గాక, సంకల్పబలం ఆలంబనగా మీరు ఇతరుల కోసం చెప్పిన 'ఫలితం' ఏ విధంగా నిజమయ్యిందో రెండు అద్భుతమైన ఉదంతాలు చెప్పండి?**

**జవాబు :** అమీర్‌పేట ఆదిత్యా ఎన్‌క్లేవ్‌లో అప్పట్లో నాకు ఒక ఆఫీసు ఉండేది. ఎస్.ఏ.చౌదరి అనే అతను నా వద్ద మార్కెటింగ్ ఉద్యోగం చేస్తుండేవాడు. వ్యక్తి పేరు అంకమ్మ చౌదరి అనుకుంటా. తొమ్మిదవ తరగతి చదువుతున్న అతని పొరిగింటి అబ్బాయి ఇంట్లో నుండి పారిపోయాడు. తల్లిదండ్రులు ముందు కంగారుపడి తర్వాత సహజంగానే గాలింపు చర్యలు చేపట్టారు. తండ్రి ఏదో మాటన్నాడని ఇంట్లో నుండి వెళ్లిపోతున్నట్లు ఉత్తరం రాసిపెట్టి వెళ్లిపోయాడు. ఊళ్లోని స్నేహితులు బందువుల ఇళ్లలో లేదని తెలిసాక దూర ప్రాంతంలోని వాళ్ల తాలూకు బంధువలందరికి కాల్స్ చేశారు. తల్లి ఒక్కటే ఏడుపట. 24 గంటలుగడిచినా ఆచూకీ దొరక్కపోయేసరికి ఆందోళన మరింత ఎక్కువయిందట. తండ్రి కాస్త

బింకంగా ఉన్నా తల్లి మెతుకు ముట్టలేదట. ఇరుగు పొరుగు వారు ఆమెను సముదాయించలేకపోతున్నారట. ఇది జరిగిన మర్నాడు చౌదరి ఆఫీసుకు వచ్చి, తాను క్రితంరోజు రాలేకపోయినందుకు ఈ ఉదంతాన్ని కారణంగా చెప్పి, మీరే ఎలాగైనా ఆచూకీ చెప్పి ఆ తల్లి దుఃఖం పోగొట్టాలని కోరాడు.

జీవన వృత్తిగా వ్యాపారం చేస్తున్నా, 'జ్యోతిషం' గురించి నా వద్దకు వచ్చి వెళ్తున్న వారిని చౌదరి అప్పటికి రెండేళ్ల నుండి చూస్తూనే ఉన్నాడు. పైగా తన స్వీయ అనుభవంతో..... అప్పటికే నా మీద అచంచలమైన గురి కుదిరి ప్రగాఢమైన నమ్మకం పెంచుకుని ఉన్నాడు. నా అపాయింటుమెంట్ తీసుకొనివస్తానని పొరుగింటివారికి చెప్పి వచ్చాడట. ఆ తల్లిని ఓదార్చడంకోసం చౌదరి భార్య నిన్నటి నుండి ఆమెకు తోడుగా ఉందని చెప్పాడు.

ఇతరుల కష్టం గురించి స్పందించటమే గాకుండా వారి దు:ఖం పోగొట్టాలని గట్టి ప్రయత్నం చేస్తున్న చౌదరిని చూసి ముచ్చట పడ్డాను. కాని నిజం చెప్పాలంటే జాతకంలో అతను ఫలానా సమయంలో ఇంట్లో నుండి పారిపోతాడని, ఆ వ్యక్తి ఈ భూమి మీద ఫలానా పట్టణంలో ఉంటాడని చెప్పడం ఏ జ్యోతిష్కుడి వలన అవుతుంది? కాని నేను మనస్సులోనే గట్టిగా సంకల్పించాను. పారిపోయిన పిల్లవాడు దొరకాలని.

ఆ సాయంత్రం చౌదరి తన భార్యను, పారిపోయిన పిల్లవాడి తల్లిని వెంటబెట్టుకుని వచ్చాడు. పంచాంగం చూసి వారు వచ్చిన సమయ గ్రహస్థితి పరిశీలించాను. ఆ తర్వాత పిల్లవాడి తల్లిని ఉద్దేశించి చెప్పాను. సెల్‌ఫోన్ ఉందా అని అడిగాను. ఆమె ఉందని చెప్పాక చార్జింగ్ ఉందా అనడిగాను. ఆమె బ్యాగులో నుండి తీసి చేత్తో పట్టుకుని పరీక్షించి, ఫుల్ చార్జి ఉందని చెప్పింది. ఏమ్మా.... నీ సెల్‌ఫోన్‌కు కాల్ వస్తుంది. మీ అబ్బాయి మాట్లాడుతాడు. ఇప్పటి నుండి తెల్లారేలోగా ఏ క్షణమైనా ఫోన్





రావచ్చును. ఇంటికెళ్లి పూజామందిరంలో కూర్చోని లలితాసహస్రనామం చదువుకో, ఫోన్ మాత్రం పక్కనే ఉంచుకో అని ధైర్యం చెప్పి పంపించాను. నేను ఎంత కాన్ఫిడెంటుగా చెప్పానంటే, క్షణాల్లో ఆమె ముఖంలో కొత్త కాంతి ప్రవేశించింది. వాళ్లు వెళ్ళే సరికి రాత్రి ఎనిమిదయింది. నేను ఆ తల్లి గురించి, ఇంట్లో నుండి వెళ్ళిపోయిన పిల్లవాడి గురించి ఆలోచిస్తూ ఆ పిల్లవాడి నుండి ఫోన్ కాల్ వచ్చే దృశ్యం పదే పదే చూశాను. అరగంట గడిచిందో లేదో చౌదరి ఫోన్ చేశాడు. వాళ్లింకా బస్‌లోనే ఉన్నారట. ఎర్రగడ్డ దాకా వెళ్లారట పిల్లవాడు నాగపూర్‌లో ఉన్నాడట. ఒక షాప్‌కు పనికావాలని వెళ్లాడట. ఇతని వాలకం అనుమానంగా ఉండి, పిల్లవాడి నుండి విషయం రాబట్టారట. ఆ షాపు వాళ్లు ఫోన్ చేసి పిల్లవాడి చేత మాట్లాడించారట. పిల్లవాడిని అక్కడ నుండి పోనివ్వవద్దని షాపువాళ్లను రిక్వెస్టు చేసి, తెల్లవారి బయలుదేరి వస్తామని చెప్పాడట చౌదరి. వాళ్ళు చాలా ఆనందంగా ఉన్నారు. ఆ రోజు నాకు చాలా సంతృప్తిగా అన్పించింది.

ఇది ఒక ఉదంతం మాత్రమే. ఆదిత్యాఎన్‌క్లేవ్‌కు ఫర్లాంగు దూరంలో సారథీ స్టూడియో పక్కన స్వర్గీయ రాజనాల గారు చాలా కాలం ఉన్నారు. సాయంత్రం వేళ గణపతి కాంప్లెక్సు వద్ద మా ఇంటి వద్ద నుండి రాజనాల గారింటి వరకు 'వాకింగ్'గా వచ్చి ఆయనతో కొంత సమయం సంభాషించి వెళ్లే వాడిని – అప్పటికే ఆయన చాలా చితికి పోయి పూర్తిగా ఇతరుల దయాదాక్షిణ్యాలమీద బ్రతుకు బండి ఈడుస్తున్నాడు. ఈ కారణంగా అంతటి సీనియర్ నటుడూ అక్కడ అనామాకంగానే జీవించాడు. పూలు రాలిపోయాక దారపువాసనలా విజిటర్సు అంతంత మాత్రంగానే ఉండేవారు. ఆయనకు రోజూ సాయంత్రం వేళ ఒక గంట నాతో కాలక్షేపం. కొన్ని సంవత్సరాలు అలాగడిచాయి. అప్పుడు ఒకసారి ఆయన పిల్లలందరి జాతక చక్రాలు నాకు చూపించాడు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నాకు

జ్యోతిషరత్న అవార్డు ఇచ్చినపుడు ఆరోజు రాజనాలగారు స్టేజి మీద ఉన్నారు. అక్కడే రాజనాల గారితో పరిచయం ఏర్పడింది. ఈ కారణంగా ఆయన భార్య తరుచుగా వాళ్లు ఆశిస్తున్న డబ్బు ఎప్పుడు వస్తుందని అడుగుతుండేది. నేను తేదీ వారంతో సహా చెప్పే వాడిని. అన్ని సార్లు ఖచ్చితంగా నేను చెప్పినట్లే డబ్బు రావటం వలన వాళ్లకు నా మీద గురికుదిరింది.

అచంచలమైన ఆత్మ విశ్వాసంతో ఇంచుమించుగా ఏ జ్యోతిష్కుడు చెప్పలేని బహుక్లిష్టమైన ప్రశ్న ఒకటి అడిగారు. రాజనాలగారి అబ్బాయి అప్పటికి పది సంవత్సరాల క్రితమే ఇల్లు వదలి వెళ్లాడు. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఎక్కడ ఉంటున్నాడో తెలియదు. ఆరోజుల్లో సెల్‌ఫోన్స్ కూడా ఏమీ లేవు. ఈ పదేళ్ళలో ఉత్తరం కూడా రాయలేదు. అసలు ఏ మాత్రం అతని జాడ తెలిపే చిన్న 'క్లూ' కూడా వారి వద్ద లేదు. ఒకరకంగా చెప్పాలంటే అతను తిరిగిరాడనే నిర్ణయించుకుని ఆశవదలుకున్నారు. మరి పది సంవత్సరాలయిందాయె. పాపం నా జోస్యం నిజమవుతుండటం చూసి రాజనాల దంపతులకు నా మీద ఆశ కల్గినట్లుంది.

''సాంబశివరావు గారూ! వాడి మీద ఆశ ఏనాడో వదులుకున్నాం. వెళ్లిన కొత్తలో వాడి గురించి వెతికాం. పదేళ్లు గడిచాయి. అసలు నేను చచ్చేలోగా వస్తాడంటారా? అసలు బ్రతికి ఉన్నాడంటారా? ఏదో నాకు తలకొరివి పెడతాడని ఆశగా అడుగుతున్నాను." అని కళ్ల నీళ్లు పెట్టుకుని అడిగాడాయన. నాకు కడుపులో దేవినట్లయింది. అతని జాతకం చూశాను. వాళ్లు అడిగిన ప్రశ్న లగ్నం, అప్పటి గ్రహస్థితులు చూశాను. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. మీ అబ్బాయి ఖచ్చితంగా వస్తాడని చెప్పాను. ఆయన ముఖంలో ఆశ. ఆయన భార్య సంభ్రమాశ్చర్యాలతో వింటూ ఉంది. వస్తాడంటే అది స్పష్టంగా





లేదు. ఎప్పుడో రావటం కాదు. ఈ శ్రావణమాసంలో ఖచ్చితంగా వస్తాడు". అని కాన్ఫిడెంటుగా చెప్పాను. అప్పటికి రెండు మాసాల్లో శ్రావణమాసం ఉంది. రాజనాల ముఖంలో అప్పుడు నేను చూసిన సంభ్రమాశ్చర్యాలు, దిగ్భ్రాంతి నా జీవితంలో మరిచిపోలేను. స్వీటు ఏమీ లేదని రాజనాల భార్య పంచదార పెట్టింది. అద్భుతమైన విషయం ఏమంటే శ్రీవారి దివ్య ఆశీస్సులతో నా వాక్కు ఫలించింది. రాజనాల కొడుకు శ్రావణమాసంలో వచ్చాడు. పది సంవత్సరాల క్రితం వెళ్లినవాడు, దేశదిమ్మరిగా తిరుగుతున్నవాడు, ఇంటితో పూర్తిగా బంధం తెంచుకున్నవాడు, అసలు బతికి ఉన్నాడో లేదో కూడా తెలియని వాడు నేను చెప్పినట్లుగా శ్రావణమాసంలో వచ్చాడు. ఇది నేను ఒక సాధారణ జ్యోతిష ఫలితంగా భావించను. ఇది స్వామి వారి దివ్యలీలలకు ఉదాహరణగా నేను భావిస్తాను. ఆయన ఆశీస్సులు నా మీద ఉన్నాయని ధృడంగా నమ్మి నేను చెప్పటం వలనే నా వాక్కు ఫలించింది.

ఇక ఆ తర్వాత ఆ అబ్బాయి భాషాంతర స్త్రీతో వివాహం, అవన్నీ నేను చెప్పిన విధంగా జరగటం, అందంతా పెద్ద సీరియల్ కథ. ఇక్కడ రాయటానికి అవకాశం లేక ఇంతటితో సరిపెడుతున్నాను.

## ప్రశ్న : ఒక ప్రశ్నకు జవాబుగాకుండా, మీ అనుభవంతో జనరల్‌గా పాఠకులకు ఉపయోగపడే నాలుగు మంచిమాటలు చెప్పండి?

**జవాబు :** నేను ప్రధానంగా చెప్పదలచుకున్నది ఒక్కటే. మన పూర్వీకులు తమ అనుభవ సారాన్ని అనేక గ్రంథాలలో రాయటంతో ఊరుకోలేదు. జనాలకు సులభంగా అర్థంగావటానికి సామెతల రూపంలో పొందుపరచారు.

ఆ సామెతలు ఏ ఒక్కటీ సామాన్యమైంది కాదు. పైకి సామాన్య అర్థం కన్పించినా, లోతులలోకి వెళ్లేకొలదీ, అసాధారణ పాఠాలు ఆ సామెతలలో మనం చూడవచ్చును. అంటే పాఠకుని స్థాయిని బట్టి, సామెతల పట్ల ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానం చేసుకుంటారని భావించకూడదు. నిజంగా సామెతలు ఎంతో అర్థవంతమైనవి. "అంతా మన మంచికే" అనే ఈ మూడు పదాల సామెత నిజంగా నిజమైనది. నేను అందరినీ కోరేదేమంటే కొత్తగా ఆలోచించమని. దీనర్థం ఊరందరిదీ ఒకదారయితే, ఉలిపి కట్టెది మరొక దారన్నట్లుగా తేలికగా ఊహించుకోరాదు. ఎక్కడైతే వేదన ఉందో అక్కడ కొత్తగా సవ్యంగా ఆలోచించమని, జీవితంలో వైఫల్యాలంటూ ఏమీ ఉండవు. విజయ మార్గంలో వింత అనుభవం. ఫలితం ఆశించకుండా పనిచేయటమనే 'భగవద్గీత' ఉవాచ సర్వమానవాళికి శిరోధార్యం. అయితే దీని అర్థం తెలియకపోతే తెలిసిన బుద్ధిమంతులను అడగాలి. 'వైఫల్యం' అనే పదం భాషా నిఘంటువు నుండి ఏదో ఒకనాడు తొలగింపబడుతుందని నా ఆకాంక్ష. ఒక రైతు నారుపోసిన నాటి నుండి కుప్ప నూర్చే వరకు ప్రతి మజిలీలో ఆనందం పొందుతూ పతాక స్థితిలో మాత్రమే ఒకే ఒక్కసారి 'ఫలిత' స్థితి అనుభవిస్తాడు. అలాగని ఈ తొమ్మిది మాసాలు నిరర్థకం అనలేముగా. శృంగారంలో కూడా గంటల తరబడి రతిక్రీడ జరిపినా చివరి మూడు నిముషాల 'భావప్రాప్తి' మాత్రమే 'ఫలితస్థితి' గా భావించి, మిగిలిన సమయాన్ని వైఫల్యంగా భావించటం తగునా? వైఫల్యంగా భావించిన ప్రతి అనుభవం మనకు అవసరమైనదేనని 'కాలం' మనకు తెలియజేస్తుంది.

నా దృష్టిలో డబ్బు లేని వారు ఎవ్వరూ లేరు. ఇంకా డబ్బు రాని వారు మాత్రమే ఉంటారు. బుర్రలేని వారు ఎవ్వరూ లేరు. 'బుర్రను నిద్రలేపని వారు మాత్రమే ఉంటారు. చేతగాని వారు ఎవ్వరూ లేరు. వారికి





'చేతనవును' అనే విషయం తెలియని వారు మాత్రమే ఉంటారు. మనకు ఎవ్వరూ ద్రోహం చేయలేరు, చేయరు. మనం కర్మ అనుభవించటానికి తెలిసీ తెలియకుండా వారు సాధనమవుతున్నారు. మనం ఎవరినీ ఉద్ధరించనవసరంలేదు. మన పని మనం చేస్తే చాలు. జీవితంలో ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే మనకు తారసపడిన ప్రతి పాత్ర మనకేదోనేర్పాలని వచ్చినట్లు స్పష్టంగా మీకు అర్థం అవుతుంది. ఆకాశంలో సూర్య చంద్ర గ్రహాలు అలాగే ఉంటున్నాయి. పగలు సూర్యుడి డ్యూటీ, రాత్రి చంద్రుడి డ్యూటీ అనేది మన భ్రమ మాత్రమే. జ్ఞానం వచ్చాక ఈ భ్రమలు తొలగినట్లే మీ సత్యాన్వేషణ ఏదో ఒక నాడు ఫలించి తీరుతుంది.

**ప్రశ్న : 2015 సంవత్సరంలో ఈ పుస్తకం రాసిన మీకు ఇప్పటి వరకు మనిషి సాధించిన వైజ్ఞానిక అభివృద్ధి గురించి తెలుసు. రాబోయే కాలంలో ఎలాంటి వైజ్ఞానిక అభివృద్ధి మనిషి సాధించగలడని మీరు కొత్తగా ఆలోచిస్తున్నారు?**

**జవాబు :** చాలా మంచి ప్రశ్న అడిగారు. ఇప్పుడు మనకు నిద్రలో వచ్చే స్వప్నాల గురించి తెలుసు. మనకు ప్రస్తుతం 'కలల' మీద అధికారం నియంత్రణ లేవు. స్వప్న వ్యవధి మీద కూడా మనకు ఏ మాత్రం పట్టులేదు. కాని రాబోయేకాలంలో 'మనం ఎలా కావాలనుకుంటే అలా' ప్రోగ్రామింగ్ చేసుకుని పడుకుంటే మనకు నచ్చిన కలలో మనం జీవించ వచ్చును. ఇప్పుడు కూడా మన ప్రమేయ లేకుండా మనకు నచ్చినదయితే, నిద్రలేచాక ఆ రోజు మనం మరింత ఉత్సాహంగా, ఏదో నూతన ఉత్తేజంతో ఉండటం మన అందరికీ అనుభవమే. ఈ అనుభవాన్ని రాబోయేకాలంలో మనషులు ప్రతిరోజు పొందే విజ్ఞానం అభివృద్ధి చెందుతుంది.

'స్థూల శరీరంతో మనం అనుభూతి చెందుతున్న ఇప్పుడు వాస్తవంగా పిలవబడుతున్న ఈ జీవితాన్ని' అప్పుడు దీనినే స్వప్నంగా భావించగలము. అంటే అందరికీ రెండు జీవితాలు అందుబాటులోకి వస్తాయి.

సంవత్సరం క్రితం 'బాద్‌షా' అనే తెలుగు సినిమా విడుదలైంది. అందులో దర్శకుడు శ్రీనువైట్ల రాబోయే కాలంలో జరుగబోయే వైజ్ఞానిక వింతకు చాలా దగ్గరగా వెళ్లి దూరంగా జరిగాడు. కలలో మనం కోరుకున్న జీవితం మిషను ద్వారా సాధ్యమవుతుందని దర్శకుడు 'కామెడీ' గా ఆలోచించాడు. అందుకనే ఆయన చాలా దగ్గరగా వచ్చి దూరంగా జరిగాడని నేను వ్యాఖ్యనించాను. రాబోయేకాలంలో ఇది కల, ఇది ఇల అనే సరిహద్దు రేఖ జరిపి ఒక జీవితానికి మరొకటి కల గా రూపొందే వైజ్ఞానిక మహాద్భుతం జరగబోతుందని నా మనసు చెబుతుంది. పాఠకులు తికమక పడతారని ఈ జవాబు ఇంతటిలో ముగిస్తున్నాను.

## ప్రశ్న : మానవ సంబంధాలకు మీరు ఇంత ప్రాదాన్యత నిచ్చి ఈ పుస్తకం రాయటానికి గల కారణాలేమిటి?

**జవాబు :** కాలం మారుతోంది. కాలంతోపాటు ఆధునిక జీవితం సమస్త సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చింది. 50 సంవత్సరాల క్రితం ఊహకు కూడా అందని సెల్, ఇంటర్‌నెట్ లాంటి పరికరాలు నేడు అందరికీ అందుబాటులో ఉన్నాయి. పెళ్ళి సంబంధాల విషయంలో ఒకప్పుడు జిల్లా దాటితే గుండెలు బాదుకున్న తల్లిదండ్రులు ఇప్పుడు ఖండాంతర సంబంధాలకు కూడా ఏ మాత్రం సంకోచించటం లేదు. సాంఘీక కట్టుబాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. స్త్రీకి గతంలో కంటె గౌరవం పెరిగింది. కుల మతాల పట్టింపులు చాలా వరకు తగ్గాయి.





కుటుంబ వ్యవస్థలో 'భార్య'కు ప్రాధాన్యత పెరిగింది. ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ప్రయాణ సౌకర్యాలు మెరుగై, ప్రాంతాలమధ్య దూరం కి.మీ నుండి గంటలు నిముషాలలోకి బదిలీ అయింది.

మనం ఎంత వైజ్ఞానికంగా అభివృద్ధి సాధించినప్పటికీ మనిషి, మనస్సు, భావోద్వేగాలు, సంతోష దుఃఖాలు మనుషుల మధ్య సంబంధాలు ఏ కాలంలోనైనా ఒక్కలాగే ఉంటున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలో అడుగుపెట్టినా, ప్రేమలు, కోపాలు, ఆకర్షణలు, ఉద్వేగాలు, నవ్వులు, కన్నీళ్లు, ఒంటరితనాలూ అలాగే ఉన్నాయి. ***ఇప్పటికి 800 సంవత్సరాల క్రితం బద్దెన సోమనాధుడు రచించిన సుమతీశతకం ఇప్పటి సమాజానికి కూడా మార్గదర్శకమవుతోంది.*** సుమతి శతకం ఆనాటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని రచించినప్పటికీ ఈనాటి సమాజానికీ చక్కగా సరిపోతుందంటే, మానవ సంబంధాలు భావోద్వేగాలు ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా ఒకటేనని ఋజువవుతోంది.

ఇప్పటి విద్యా వ్యవస్థ మారిపోయింది. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ క్లాసస్ అని ఒక పిరయడ్ ఉండేది. పాఠ్య పుస్తకాలతో పాటు సుమతీశతకం, వేమనశతకం అనేక నీతికథలు చదివించేవారు, బోధించేవారు. చివరి పిరియడ్ వ్యాయామానికి ప్రాధాన్యత నిచ్చేవారు. బోలెడన్ని ఆటపాటలుండేవి. ఇవి తెలియకుండానే ఇప్పుడు బాల్యం దాటేస్తున్నారు. యువతరం అంతా పోటీ పరీక్షలు, నవతరమంతా కెరీర్ ఒత్తిడితో బిజీగా ఉన్నారు. చిన్నచిన్న విషయాలకే మనస్సు కష్టపెట్టుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. పెద్ద చిన్న ఆడమగ అందరిలోనూ అహంకారాలూ, డాబుసరి మాటలు, ఆత్మ న్యూనతలూ ఎక్కువయ్యాయి. అందుకే మానవ సంబంధాలమీద అందరికీ సులభంగా బోధపడేలా

ఉపయోగపడేలా ఒక చిన్న పుస్తకం రాయలనిపించింది. భగవద్గీతా సందేశం, కర్మ సిద్ధాంతం, జ్యోతిషం, బాల్యం నుండి ఇప్పటి వరకు నేను చూసిన జీవితం, శ్రీవారి దివ్య ఆశీస్సులతో నా జీవితంలో జరిగిన అద్భుతాలూ అన్నీ కలిసి ఏదో నాకు చేతనైన రీతిలో ఒక పుస్తకం రాయలాన్పించింది. అది మానవసంబంధాల మీద ముఖ్యంగా ప్రశ్నోత్తరాల రూపంలో అయితే అందరికీ ఉపయోగంగా ఉంటుందని భావించాను. నిజానికి ఈ ఆలోచన ఐదేళ్లనుండీ మనసులో నలుగుతున్నా, వివిధ కారణాల రీత్యా వాయిదాపడి ఇదిగో ఇపుడు మీ ముందుకు వచ్చింది.

**ప్రశ్న : మీరు చెప్పిన విషయాలు ఎవరికీ తెలియవంటారా? ఇంతకు ముందు లేనివి మీరు చెబుతున్నారా?**

**జవాబు :** ప్రకృతిలో లేనివి ఎప్పటికీ లేనట్లే. ఎవరైనా చెబుతున్నారంటే ఉన్నట్లే. పరిణితి చెందిన పాఠకులకు ఇది సామన్య పుస్తకం. ఔత్సాహిక పాఠకులకు ప్రాథమిక వాచకం. అందువలన తెలిసిన వారున్నప్పటికీ, వారొచ్చి తెలియని వారికి చెప్పరు కదా! నేనైనా మరొక రచయితైనా మాకు చేతనైనట్లు, మా అనుభవాన్ని బట్టి అభిరుచికి తగినట్లుగా కాఫీ కలిపి మీకు అందిస్తాం. పాలు, పంచదార, కాఫీ పొడి ప్రకృతిలో ఉన్నవే. తాగేవాళ్లు పెరుగుతుంటే కాఫీ హొటళ్లూ, ఛాయ్ బండ్లు అవసరాన్ని బట్టి కొత్తవి పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇలాంటి పుస్తకాల అవసరం కూడా బాగానే ఉంది. అందుకే రాశాను.



:: శుభం ::



# కొత్త జ్యోతిషం

# కొత్త జ్యోతిషం

రాష్ట్రంలో దేశంలో ఏ రోజుకారోజు వందలకొద్దీ, వేలకొద్దీ కొత్త జ్యోతిష్కులు జనం మీద తమ ప్రాక్టీసుకు శ్రీకారం చుడుతూనే వున్నారు. ఇది శుభపరిణామంగానే నేను భావిస్తున్నాను. కాని కొత్త జ్యోతిషం తయారుగావటం లేదు. అసలు దీని గురించి ఎవ్వరూ ఆలోచించడంలేదు. లక్షల మంది జ్యోతిష్కులు తయారవుతున్నా... అదే పాత జ్యోతిషం, అదే పాత వాసన. నిల్వనీరు, నిల్వ ఆహారం పాచిపోయి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లినట్లుగా కొన్నివేల సంవత్సరాల నుండి పాత జ్యోతిషం అనే వట వృక్షాన్ని ఆశ్రయించుకొని బ్రతుకు వెళ్లదీస్తున్న వృద్ధ జ్యోతిష పండితులు. అష్టమశని, ఏలిననాటి శని, కుజదోషం, ద్విద్వాశం, షష్ఠాష్టకం.. వంటి పడికట్టు పదాలను చిలుక పలుకులు వల్లించినట్లు పాత భావజాల ఊబిలో కూరుకుపోయిన ఔత్సాహిక కొత్త జ్యోతిష్కులు.

జ్యోతిష శాస్త్రాన్ని విమర్శించటం జ్యోతిష్కులను తప్పుబట్టడం ఈ వ్యాసకర్త ఉద్దేశం కాదు. పాత ప్రోగ్రామ్‌తో కండిషన్ చేయబడ్డ మనసుతో ఫలితాలు చెప్పే సాంప్రదాయం నుండి బయటపడి నిరంతరం హేతుబద్ధమైన కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాల్సిన తరుణం ఆసన్నమైందని జ్యోతిష్కుల బాధ్యతను ప్రస్తావించటమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. క్రీ॥శ॥ 140లో మొట్టమొదటిసారిగా క్లాడియన్ టోలమి అనే ఈజిప్టు పండితుడు భూమి విశ్వానికి కేంద్ర స్థానంలో వుందని, సూర్యుడు, చంద్రుడు తదితర నక్షత్రాలు భూమిచుట్టూ తిరుగుతున్నాయని ప్రకటించాడు. దీనినే భూ కేంద్ర సిద్ధాంతం అన్నారు. కాని ఈ సిద్ధాంతం తప్పని 14 వందల సంవత్సరాల అనంతరం

కోపర్నికస్ అనే పోలెండ్ శాస్త్రజ్ఞుడు రుజువు చేశాడు. సూర్యుడు ఈ విశ్వానికి కేంద్రంలో వున్నాడని భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని సూర్య కేంద్ర సిద్ధాంతం ప్రతిపాదించాడు. ఆ తర్వాత కాలంలో (క్రీ.శ. 1805) హెర్షెల్ మరియు ఎడివిన్‌హబుల్ (1925) విశ్వంలో సౌరకుటుంబం ఒక్కటే కాదని, అలాంటి గెలాక్సీలు లక్షలాది ఉన్నాయని కనుగొన్నారు.

భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ తిరుగుతున్నదనీ, సూర్యుడు కేంద్రంగా ఉన్నాడనీ ఇదే సత్యమని (ఇప్పటికిదే సత్యం) మనకు తెలుసు. ఇంకా వివరంగా చెప్పాలంటే కోపర్నికస్ తర్వాత కాలంలో ఉన్నాము కాబట్టి మనకు ఎక్కువ విజ్ఞానం అందుబాటులో ఉంది.

కాని రెండవ శతాబ్దం నుండి 14వ శతాబ్దం వరకు అంటే ఒకటికాదు, రెండు కాదు, వంద కాదు, ఏకంగా 1400 సంవత్సరాలు ఈ ప్రపంచంలో పుట్టి, పెరిగి జీవించి మరణించిన వారి సంగతి ఏమిటి? భూమి విశ్వానికి కేంద్రంలో ఉందని, సూర్యుడు, చంద్రుడు తదితర గ్రహాలు భూమి చుట్టూ తిరుగుతాయనే ఒక అబద్దాన్ని విశ్వసించి, నిజం తెలియకుండానే మరణించిన కోట్లాది మంది ప్రజల సంగతి ఏమిటి?

ఇప్పుడు జ్యోతిష్కులందరికీ అనుభవంలో ఎదురైన (ఎదురయ్యే) ఒక ముఖ్య విషయం ఇక్కడ ప్రస్తావిస్తాను. ప్రామాణిక సూత్రాల ఆధారంగా జ్యోతిష ఫలితాలు చెబుతూ ఉంటాము. అవి ఫలించాయని జాతకులు





తెలియజేయటంతో అదే సూత్రం ఆధారంగా ఎన్నో సంవత్సరాలు ఫలితాలు చెబుతాము. ఎంతో మందికి ఫలించినట్లుగా అనుభవంతో ఋజువయ్యాక, ఒక శుభోదయాన ఒక జాతకుడు వచ్చి మీరు చెప్పింది జరగలేదంటాడు. మరి అదే సూత్రం ఆధారంగా మనం చెప్పిన ఫలితం ఇన్ని సంవత్సరాలు, ఇంతమందికి జరిగినప్పుడు, ఈ జాతకునికి జరగకపోవటమేమిటి? అని మీమాంసలో పడతాం. అంతేకాదు సదరు ఫలితాలు జరగటానికి వేరే కారణాలున్నాయనీ, మనం నమ్మిన సూత్రం తప్పని నిర్ధారణకు వస్తాము. అంటే ఒక సూత్రం ఎంతవరకు కరెక్టు అని మనకు మనం ప్రశ్నించుకుంటే, అది తప్పని తేలేంతవరకని మనకు సమాధానం వస్తుంది.

అంటే ఇప్పుడు మనం నమ్ముకున్న ప్రామాణిక సూత్రాలు రాబోయే కాలంలో ఎన్నితప్పని ఋజువు కానున్నాయో గదా! ఎందుకంటే 1400 సంవత్సరాలు ఒక అబద్దాన్ని నమ్మి కోట్లాది మంది నిజం తెలియకుండానే మరణించారని ఋజువైంది కదా!

మరో శతాబ్దం తర్వాతైనా కుజదోషం, ఏలిననాటి శని సూత్రాలు తప్పని రేపటి తరంలోని విజ్ఞానవేత్త ఋజువు చేయదని నమ్మకమేమిటి ? (ఇప్పుడు ఒక్కసారి గడిచిపోయిన జీవితాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్లేషించకుంటే, నిర్ణీత సమయంలో నిర్ణీత సంఘటనలు మన ప్రమేయం లేకుండానే జరిగాయనీ, మనిషి తలచుకుంటే ఏ పనైనా చేయగలడని అంటారుగాని, ఆతలంపు కూడా అతని చేతిలో లేదని, ఒకవేళ ఏదైనా అనుకుని సాధించగల్గితే అది అప్పటిదశ, అంతర్దశలలో నిర్దేశింపబడిన శుభ ఫలితమేగాని, వేరొకటి కాదని స్పష్టంగా తెలుస్తూనే వుంది. కుజదోషం, ఏలిననాటిశని, ద్విర్ద్వాదశం, షష్టాష్టకం ఇవన్నీ అబద్ధమని ఎలా అనగలం?

గ్రహకారకత్వాలు, రాశికరకత్వాలు నిజమని, జ్యోతిషశాస్త్రంతో వందగ్రాముల పరిచయం ఉన్నా స్వీయ అనుభూతితో ఋజువుగావించుకోవచ్చును. కావున ఈ వ్యాసం చదువుతున్నంత సమయమూ ఇది జ్యోతిషశాస్త్ర విమర్శగా పొరపాటుగా అర్థం చేసుకోకుండా కొత్త జ్యోతిషం యొక్క ఆవశ్యకతను తార్కికదృష్టితో పరిశీలించమని మనవి.)

నా ఉద్దేశం ఏమంటే ఇప్పుడు మనం విశ్వసించి ఫాలో అవుతున్న జ్యోతిష సూత్రాలు, ఏవో కొద్దిమంది రచించినవే గదా! ఒకవేళ ఈ సూత్రాలన్నీ నిజమనుకున్నా జ్యోతిష్కులుగా చెప్పుకుంటున్న అందరికీ అన్ని సూత్రాలు తెలుసా? ఉన్న సూత్రాలు అన్నీ తెలియనపుడు తెలిసిన సూత్రాలు రాబోయే కాలంలో తప్పని ఋజువయ్యే అవకాశం వున్నప్పుడు ఫలితాలు చెప్పి జాతకుని మనసులో అలజడి సృష్టించడం ఎంతవరకు సబబు?

మనకున్న జ్యోతిషశాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించి పన్నీరు సెల్వం తమిళనాడు ముఖ్యమంత్రి కాగలడని చెప్పగలమా? హైదరాబాద్‌లో మ్యాన్‌హోల్‌లో పడి నీటి ప్రవాహవేగానికి కొట్టుకుపోయి మరణించిన బ్యాంకు ఉద్యోగిని జాతకం చూసి, ఆమె మరణాన్ని ముందుగా ఊహించి చెప్పగలమా? బోరుబావిలోపడి మరణించిన చిన్నారులు జాతకాలు పరిశీలించి ఏ ఒక్కరి మరణాన్నైనా బోరుబావిలో ఊహించగలమా? సునామీ ప్రమాదంలో నాలుగురోజులు సముద్రంలో నిస్సహాయంగా గడిపిన బాలిక జాతకం చూసి ఈ విషాదాన్ని సూచనప్రాయంగానైనా తెలుసుకోగలమా?

సాయిదేవహర్ష జాతకం చూసి చిన్నవయస్సులో గాయకునిగా ఖ్యాతి నార్జించగలడని చెప్పగలమా? అంతదాకా ఎందుకు? చిరంజీవి జాతకం





చూసి ఫలానా తేదీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తాడనిగాని, ఎట్టి పరిస్థితులలో ఇతను ముఖ్యమంత్రి కాలేడని గాని ఘంటాపథంగా చెప్పగలమా?

ఇప్పటి వరకు జ్యోతిషశాస్త్రం ఆధారంగా జ్యోతిష్కులు సాధారణ ఫలితాలు చెప్పటానికే పరిమితమయ్యారు. అంటే పెళ్లి, ఉద్యోగం, బదిలీ లాంటి సాదా విషయాలు, ఏ జ్యోతిష్కుడైనా, ఏ జాతకమైనా పరిశీలించి జరుగబోయే కీలక సంఘటన చెప్పగలరా? అక్కడి దాకా ఎందుకు జ్యోతిష్కులు ఎవరి జాతకం వారు పరిశీలించుకుని, తమ జీవితంలో భవిష్యత్తులో జరుగబోయే కీలక సంఘటన ఒక్కటి బహిరంగంగా ధైర్యంగా ప్రకటించగలరా? ఈ మాత్రం ప్రకటించే ధైర్యాన్ని ఇవ్వలేని పాత జ్యోతిష్యాన్ని ఎక్కువగా విశ్వసించటం అవసరమా? అసలు విశ్వసించవద్దు అని చెప్పటం నా ఉద్ధేశం కాదు. కాని అలాగే ఎందుకు జరుగుతోందనుకోవాలి? ఇంతకంటే బాగా జరుగుతుందని ఎందుకనుకోకూడదు అని ఫలితాలు చెప్పేముందు ప్రతి జ్యోతిష్కుడూ ఆలోచించాలి.

జాతక చక్రంలో మనఃకారకుడైన చంద్రుడు ఏ రాశిలో ఉన్నా, ఎవరిచేత చూడబడుతున్నా కించపరచే విధంగా అధముడు మాట్లాడితే బాధపడటం జరుగుతుంది. ఇది అందరికీ అనుభవమే. మరి అధముని మాటకు విలువ ఇచ్చి బాధపడటం అవివేకమని మనకు తెలియకనా? అలాగే జాతకచక్రంలో ఆత్మకారకుడైన రవి ఏ రాశిలో ఉన్నా, ఏ గ్రహం చేత చూడబడుతున్నా, తన గురించిన పొగడ్త వినగానే, పొగిడిన వ్యక్తి తన పొట్ట గడుపుకోవటానికి పొగిడనాడనే వాస్తవం తెలిసినా మనస్సు

సంతోషపడుతుంది. ఏతా వాతా తేలిందేమంటే, అధముడు తిట్టినా మనస్సు బాధపడుతుంది. స్వార్ధపరుడి పొగడ్తకు కూడా మనస్సు సంతోషపడుతుంది.

సమస్యతో బాధపడుతున్న జాతకుడు ఒక నమ్మకతో జ్యోతిష్కునికి ప్రత్యేక గౌరవమిచ్చి వచ్చినపుడు అప్రియంగా మాట్లాడితే ఆ జాతకుని మానసిక స్థైర్యం దెబ్బతినకుండా ఉంటుందా? స్థైర్యం దెబ్బతిన్న వ్యక్తి సమస్యను ఎదర్కొనగలడా? ***తమాషా ఏమంటే అసలు 'సమస్య' పుట్టుకే, మానసిక స్థైర్యం లోపించడం వలనే గదా?***

అందుకే పాత జ్యోతిష సూత్రాలలో 'బందీ' అయిన మానసిక పరిస్థితితో జాతకం పరిశీలించటమనే పద్ధతికి స్వస్తిచెప్పి, పాత సూత్రాలతో 'మనస్సు' కుదేలవకుండా ప్రశాంతంగా జాతకునికి ఏ విధంగా మేలు చేయగలమో ఆలోచించాలి. ఇదే కొత్త జ్యోతిషం.

(ప్రారబ్ధ కర్మ బలంగా ఉండి, జాతక చక్రంలో గ్రహస్థితి గతులన్నీ 'చెడు'ను బలంగా సూచిస్తున్న సమయంలో గూడా జాతకునికి జపతపాదులను చేయవలసిన పూజలను చెప్పాలే గాని నమ్మిన ఫలితం చెప్పే సాహసం చేయకూడదు).

జాతకచక్రంలో చంద్రుడున్న రాశి మరియు చంద్రస్థితికి ఇరువైపుల ఉన్న రెండు రాశులలో శని సంచరించే కాలాన్ని జ్యోతిష పరిభాషలో ఏల్నాటిశని అంటారు. శనిగ్రహ సంచారం ఒక్కరాశిలో రెండున్నర ఏళ్లుగా మొత్తం మూడు రాశులలో ఏడున్నర సంవత్సరాలు శని సంచారం ఉంటుంది. ఈ సమయంలో నానా విధమైన కష్టాలు, అశుభాలు జాతకునికి కలుగతాయని జ్యోతిష్కులు, పంచాంగకర్తలు సమాచారాన్ని సాధారణ





జనానికి సైతం అర్ధమయ్యేలా భయంకరంగా వ్యాప్తి చేశారు. ఇక చంద్రునికి అష్టమంలో శని సంచరించే కాలాన్ని అష్టమశని పేరుతో రెండున్నర సంవత్సరాలూ చంద్రునికి నాల్గవ ఇంట్లో శని సంచరించే కాలాన్ని అర్ధాష్టమ శనిపేరుతో రెండున్నర సంవత్సరాలూ దోషకాలంగా అందరూ భావిస్తున్నారు. ఇప్పుడు మరొక దృష్టితో పరిశీలిద్దాం. ఏ జాతకంలోనైనా జన్మకాల శని, మరలా అదే రాశికి చేరుకోవటానికి 30 సంవత్సరాలు పడుతుంది. అంటే ఒక మనిషి జీవితకాలం సగటున 60 సంవత్సరాలు పైనే అనుకున్నా శనీశ్వరుడు రెండు ఆవృత్తాలు సంచరించటం ఖాయమన్నమాట. అంటే ఏలిననాటి శని రెండు సార్లు కలిపి 15 సంవత్సరాలు. అష్టమశని రెండు సార్లు కలిపి 5 సంవత్సరాలు అర్ధఅష్టమ శని రెండు పర్యాయములు కలిపి 5 సంవత్సరాలు వెరసి ప్రతి మనిషి జీవితంలో 25 సంవత్సరాలు శని ప్రభావం ఉంటుందనేగా అర్ధం. ఈ లెక్కన సగం జీవితం కష్టాలు, కన్నీళ్లు, అశుభ ఫలితాలు ఉంటాయా? ఒకవేళ ఇది నిజమే అనుకున్నా అందరికీ వర్తించే ఫలితమయినపుడు ప్రత్యేకించి ఆందోళన పడవలసిన అవసరం ఏముంది? అందువలన అష్టమశని, అర్ధాష్టమ శని, ఏలిననాటి శని వీటి గురించి జ్యోతిష్కులు పదేపదే ప్రస్తావించడం సహేతుకం గాదు.

ఏ విత్తు నాటిదే ఆ ఫలమే లభిస్తుంది. ఇదే ప్రధానంగా కర్మసిద్ధాంతంలోని మౌలిక సూత్రం. కర్మ సిద్ధాంతమాధారంగా వృద్ధి చెందినదే జ్యోతిషశాస్త్రం. తాను చేసిన పనుల యొక్క ఫలితాన్ని ఈ జన్మలోనే అనుభవించటం కూడా ప్రతి మనిషి అనుభవపూర్వకంగా అర్ధం చేసుకోవచ్చును. ఈ సందర్భంగా డా॥ అనిబీసెంట్ కర్మ సిద్ధాంతాన్ని ఏ

విధంగా వ్యాఖ్యానించిందో జ్యోతిష్కులు అందరూ తెలుసుకోవాలి.

గతంలోని మన సమస్త కార్యకలాపాల రూపమే ప్రారబ్ధ కర్మగా ఈ జన్మలో మనకు ప్రతిబంధకంగా ఉన్నప్పటికీ, ఇచ్చా, జ్ఞాన, క్రియా శక్తులు మానవుడి చేతిలోనే ఉన్నాయని, తన కర్మల రూపాన్ని మానవుడు జ్ఞానంతో ఎదుర్కోవాలనీ కర్మ ప్రవాహానికి కొట్టుకొని పోకుండా, వాటిపై తేలియాడుతూ (ఈదుతూ) తాన అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చుననీ, ఏ మనిషైనా తన భవిష్యత్తు తానే నిర్మించుకోవచ్చునని బీసెంట్ వ్యాఖ్యానించింది.

జ్యోతిష్కుడు జాతకునికి ఫలితం చెప్పటమనే ప్రక్రియను కర్తవ్యబోధగా మలచుకోవాలి. ఉదాహరణకు జాతకంలో జ్యోతిషశాస్త్ర సూత్రాల ప్రకారం వివాహయోగం లేదనుకుందాం. జ్యోతిష్కుడు పాత సూత్రాలతో బందీ అయిన మానసిక స్థితిలో వివాహం అవదు అని చెప్పడం బాధ్యత అనిపించుకోదు. వివాహం ఎందుకు అవటంలేదో వాస్తవ పరిస్థితులను హేతువాద దృష్టితో పరిశీలించాలి. జాతక చక్రంలో బలహీనపడిన గ్రహాలను పరిశీలించి బలోపేతం అయ్యేందుకు సూచన ఇవ్వాలి.

జ్యోతిష్కుడు మనసా, వాచా, కర్మణా ఆ జాతకునికి వివాహం కావాలని సంకల్పించాలి. ఈ సంకల్పం దోషరహితంగా ఉంటే ఈ బలంతో జాతకునికి ఖచ్చితంగా వివాహం అవుతుంది. ఇదే కొత్త జ్యోతిషం. నిజానికి ఈ విషయాలన్నీ గూడా మన శాస్త్రాలలో ప్రస్తావించబడి ఉన్నవి. జ్యోతిష్కుడికి మంచి మనసు, తెలివి, అవగాహన ఉండి జ్యోతిషాన్ని జీవనోపాధిగా స్వీకరించకుండా సమాజ పునర్నిర్మాణం కోసం వృత్తిగా స్వీకరించినట్లయితే సత్ఫలితాలను సాధించవచ్చును. విశ్వవిద్యాలయాలు కూడా పరీక్షలు పెట్టి





కొత్త వ్యక్తులను తయారుచేయటంతో సరిపెట్టకుండా నిరంతర పరిశోధనలతో 'కొత్త జ్యోతిషం' అభివృద్ధి చెందేలా చూడాలి.

జ్యోతిషం కాంతి శాస్త్రం. కాంతికి పరావర్తనం చెందే గుణం ఉందని మనకు తెలుసు. ఈ కారణంగానే మనుషులు ఒకరివలన ఒకరు ప్రభావితమవుతున్నారు. అలాగే చదివే పుస్తకాలు, చూసే దృశ్యాలు, వినే మాటలు, పరిసరాలు మనుషులమీద ప్రభావం చూపటం కూడా తెలిసిన విషయమే. అయితే ప్రభావితం చేస్తున్న అంశం తాలూకు భావపరంపర గ్రహ కారకత్వమే. అంటే ఒక వ్యక్తి తన జాతకరీత్యా సంక్రమించిన ఒకనొక భావాన్ని కలిగి వుండాల్సింది, దీనికి అతీతంగా మరొక భావ ప్రేరణకు లోనయి తాత్కాలికంగానైనా కొత్త వ్యక్తిగా రూపాంతరం చెందుతున్నాడని అర్థం.

సుదీర్ఘమైన ఈ జీవితంలో సాధన ద్వారా, సజ్జనుల సాంగత్యం ద్వారా అనేక మార్పులకు అవకాశం ఉండగా, భవిష్యత్తు ఇలాగే ఉండి తీరుతుందని పాతసూత్రాల ఆధారంగా తేల్చి చెప్పటం సరికాదు. నుదుటిరాత మార్చలేమనే ఒక శాశ్వత స్థిర అభిప్రాయంతో మనస్సును బంధీ చేయటం వలన, నిరాశ నిస్పృహలు అభివృద్ధి చెంది జీవితం కల్లోలం అవుతుంది. ఎప్పుడైనా ఎక్కడైనా సర్వకాల సర్వ అవస్థల యందు తన భవిష్యత్తు తానే నిర్ణయించుకునే అవకాశం ప్రతి మనిషికీ ఉంది. ఇందుకు జ్యోతిష్యులు జాతకులకు సహకరించాలి. రత్నాల వర్తకులతో కమీషన్ మాట్లాడుకోవడం గాక, రత్నాలు పెట్టుకుంటే లక్షలు లక్షలు వచ్చి పడతాయనే వ్యాపారుల ప్రకటనలను ముక్తకంఠంతో ఖండించాలి. ఇందుకు భిన్నంగా

జీవించినట్లయితే అంటే ఎదిరించలేకపోయినా చెడుకు సహకరించినట్లయితే ఆయా జ్యోతిష్కులు ఫలితం అనుభవించటానికి సిద్ధంగా ఉండాలి. మహాదశానాథునికి అంతర్దశానాథునికి షష్ఠాష్టకం మరియు ఏలిననాటి శని ఉన్న జాతకుడు ఆనందంగా జీవించటం ఈ వ్యాసకర్తకు తెలుసు.

కొత్త జ్యోతిషం అంటే లేనిది చెప్పమని ఉద్దేశం కాదు. పాత సూత్రాలతో బందీ అయి మనస్సుతో జ్యోతిష్కుడు జాతకునికి చెడ్డ ఫలితం నిర్దేశించకుండా మంచి ఫలితాన్ని సాధించటానికి నూటికి నూరుశాతం సంకల్పించటమే కొత్త జ్యోతిషం. జాతకుని మనస్సు సంపూర్ణంగా ప్రక్షాళనమైతే పారదర్శకతతో వ్యవహరించినట్లయితే జాతకునికి అంతా శుభమే జరుగుతుంది. అయితే జాతకచక్రం, రాశిచక్రంలోని గ్రహస్థితులను విస్మరించమని చెప్పటం నా ఉద్దేశం కాదు. ఇలాగైతే ఇక జ్యోతిషం గురించి మాట్లాడేందుకు ఏముంటుంది? తన గురించి తాను తెలుసుకోవడమే జ్ఞానం. జాతకుడు తన పరిమితులను శక్తియుక్తులను అంచనా వేసుకోగలగాలి. ఈ విషయంలో జ్యోతిష్కుడు జాతకునికి హితోభిలాషిగా వ్యవహరించాలి.

సంకల్ప బలంతో సొరవిత్తనం నాటి ఒక గంప సొరకాయలను విజయవంతంగా పండించగలం. కాని వేపవిత్తనం నాటి పూజ పునస్కారాలు జపతపాదుల ద్వారా సొరపంటను పండించలేము గదా! జాతక పరిశీలన కూడా ఇలాంటిదే. మనిషి మనస్సు తాను తీసుకునే ఆహారం కారణంగా ఏర్పడుతుంది. పంచేంద్రియాల ద్వారా మనం లోపలికి తీసుకునే ప్రతీదీ ఆహారమే. కంటితో చూసే దృశ్యం, చెవితో వినే శబ్దాలు, సంభాషణలు, ముక్కుతో ఆఘ్రాణించే వాసన, నాలుకతో చప్పరించే పదార్థాలు, స్పర్శద్వారా కలిగే స్పందన వీటన్నింటి యొక్క కలయిక వలన మనసు ఏర్పడుతోంది.





నిరంతరం రూపాంతరం చెందటానికి అవకాశమున్న ఈ ఆధునిక సమాజంలో జన్మకాల గ్రహస్థితుల ఆధారంగా భవిష్యత్తు ఇలాగే జరుగుతోందని చెప్పటం సరికాదు. జాతకచక్రంలోని గ్రహస్థితి గతులు, గోచార గ్రహాలు, జాతకుని చుట్టూ ఉన్న పరిసరాలు ఇవన్నీ భవిష్యత్తు నిర్ణయించటంలో ప్రాధాన్యం కలిగి ఉన్న అంశాలు.

ఏదైనా జ్యోతిష్కుడు నిత్యనూతనంగా ఆలోచించటం, మెదడును కొత్త విషయాలు అందుకోవటానికి సిద్ధం చేయటం, త్రికరణ శుద్ధిగా జాతకుని శ్రేయస్సును కోరటం విధిగా చేయాలి. లేదా జ్యోతిషానికి దూరంగానైనా ఉండాలి.

—: సమాప్తం :—

గమనిక : ఈ వ్యాసము తొలిసారిగా జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ 6వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికలో ప్రచురింపబడినది.